అనుదినం... జనస్వరం

www.navatelangana.com

నవతెలంగాణ

మంగళవారం 10-10-2023

సమగ్ర తెలుగు దినపత్రిక

సంపుటి : 9 | సంచిక : 279 | Published from Hyderabad, Rangareddy, Khammam, Karimnagar | 16 పేజీలు | వెల : 6.50

సైరన్ మోగింది

నవంబర్ 30 తెలంగాణ పోలింగ్

- డిసెంబరు 3 కౌంటింగ్
- తెలంగాణ సహా 5 రాష్ట్రాల ఎన్నికల షెడ్యూల్ విడుదల చేసిన సీఈసీ
- తెలంగాణ, రాజస్థాన్, మధ్యప్రదేశ్, మిజోరాంలో ఒకే దశలో పోలింగ్
- ఛత్తీస్‌గఢ్‌లో రెండు దశలు
- వృద్ధులకు ఇంటి నుంచే ఓటు వేసే అవకాశం



న్యూఢిల్లీ : ఎన్నికల సందడి మొదలైంది. తెలంగాణ సహా ఐదు రాష్ట్రాలకు అసెంబ్లీ ఎన్నికల సైరన్ మోగింది. కేంద్ర ఎన్నికల సంఘం షెడ్యూల్ విడుదల చేసింది. ఈ మేరకు సోమవారం నాడిక్కడ ఆకాశవాణి భవన్ ఆడిటోరియంలో ఏర్పాటుచేసిన విలేఖరుల సమావేశంలో సీఈసీ చీఫ్ రాజీవ్ కుమార్ తెలంగాణ, రాజస్థాన్, మిజోరాం, మధ్యప్రదేశ్, ఛత్తీస్‌గడ్ రాష్ట్రాలకు సంబంధించిన ఎన్నికల షెడ్యూల్ వివరాలను వెల్లడించారు. ఛత్తీస్‌గఢ్‌లో రెండు దశల్లో ఎన్నికలు జరగనుండగా.. మిగిలిన నాలుగు రాష్ట్రాల్లో ఒకే దశలో జరుగుతాయని తెలిపారు. ఐదు రాష్ట్రాల్లో డిసెంబరు 3న ఓట్ల లెక్కింపు జరుగుతుందనీ, అదే రోజు ఫలితాలు వెల్లడవుతాయని చెప్పారు. 'ఎన్నికల కోసం ఆరు నెలలుగా కసరత్తు చేస్తున్నాం. వివిధ రాజకీయ పార్టీల నుంచి అభిప్రాయాలు ...15లో

5 రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికలు షెడ్యూల్

	విడతలు	నామినేషన్		పోలింగ్ తేది
ఛత్తీస్‌గఢ్	1	20 అక్టోబర్	శుక్రవారం	07 నవంబర్
II	2	30 అక్టోబర్	సోమవారం	17 నవంబర్
మధ్యప్రదేశ్	1	30 అక్టోబర్	సోమవారం	17 నవంబర్
మిజోరాం	1	20 అక్టోబర్	శుక్రవారం	07 నవంబర్
రాజస్థాన్	1	06 నవంబర్	సోమవారం	23 నవంబర్
తెలంగాణ	1	10 నవంబర్	శుక్రవారం	30 నవంబర్

డిసెంబరు 3 ఫలితాలు

తెలంగాణ షెడ్యూల్

నోటిఫికేషన్	నవంబర్ 3
నామినేషన్ల దాఖలుకు గడువు	నవంబర్ 10
నామినేషన్ల పరిశీలన	నవంబర్ 13
ఉపసంహరణకు గడువు	నవంబర్ 15
పోలింగ్	నవంబర్ 30
ఓట్ల లెక్కింపు	డిసెంబర్ 3



అమల్లోకి ఎన్నికల కోడ్



- అభ్యర్థులు, ఓటర్లకు కీలక సూచనలు
- అధికారిక వెబ్‌సైట్ల నుంచి నేతల ఫొటోల తొలగింపు
- ఫిర్యాదులకు టోల్‌ఫ్రీ నెంబరు 1950
- వృద్ధులు, వికలాంగులకు రవాణా సౌకర్యం
- ఓటర్‌కార్డుతోపాటు 12 రకాల ధృవపత్రాలకు ఓకే
- బ్యాలెట్ పత్రాలపై గుర్తులతోపాటు అభ్యర్థుల ఫొటోలు
- 31 వరకు ఓటు నమోదుకు అవకాశం : రాష్ట్ర సీఈవో వికాస్‌రాజ్

నవతెలంగాణ
ప్రత్యేక ప్రతినిధి-హైదరాబాద్

రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి వికాస్‌రాజ్ హైదరాబాద్‌లోని బీఆర్‌కేఆర్ భవన్‌లో సోమవారం రాష్ట్ర అదనపు ఎన్నికల అధికారి లోకేశ్‌కుమార్, రాష్ట్ర పోలీస్ నోడల్ అధికారి సంజయ్‌కుమార్ జైన్, డిప్యూటీ సీఈవో సత్యవాణితో కలిసి మీడియాతో మాట్లాడారు. ఎన్నికల నిర్వహణపై కీలక విషయాలను ...6లో

చైనా నుంచి ఒక్క పైసా రాలేదు

అరెస్టుకు బలమైన ఆధారాలు లేవు

- ఢిల్లీ హైకోర్టులో న్యూస్‌క్లిక్ తరఫు సీనియర్ న్యాయవాది వాదనలు
- తీర్పు రిజర్వ్ చేసిన హైకోర్టు



న్యూఢిల్లీ : న్యూస్‌క్లిక్‌కు చైనా నుంచి ఒక్క పైసా రాలేదని, అరెస్టుకు బలమైన ఆధారాలు లేవని ఢిల్లీ హైకోర్టుకు న్యూస్‌క్లిక్ తరఫు సీనియర్ న్యాయవాది కపిల్ సిబల్ తెలిపారు. యూఏపీఏ కేసులో రిమాండ్ విచారణకు వ్యతిరేకంగా న్యూస్‌క్లిక్ ఎడిటర్ ప్రబీర్ పుర్కాయస్థ, హెచ్‌ఆర్ చీఫ్ అమిత్ చక్రవర్తి దాఖలు చేసిన పిటిషన్‌లను ఢిల్లీ హైకోర్టు వాయిదా వేసింది. సోమవారం ఢిల్లీ హైకోర్టు తీర్పును రిజర్వు చేసింది. పిటిషనర్లు, ఢిల్లీ పోలీసుల వాదనలు పూర్తయిన తర్వాత జస్టిస్ తుషార్ రావు గేదెల పిటిషన్లను వాయిదా వేశారు.

ప్రబీర్ పుర్కాయస్థ, అమిత్ చక్రవర్తి తరఫు సీనియర్ న్యాయవాదులు కపిల్ సిబల్, దయాన్‌కృష్ణన్‌లు ...6లో

కులగణనకు సీడబ్ల్యూసీ ఏకగ్రీవ మద్దతు

వంద శాతం కట్టుబడి ఉన్నాం

- ఇది మా అత్యున్నత ప్రాధాన్యత
- కాంగ్రెస్ పాలిత నాలుగు రాష్ట్రాల్లో అమలుచేస్తాం : రాహుల్ గాంధీ



న్యూఢిల్లీ : దేశంలో కులగణనకు కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ (సీడబ్ల్యూసీ) ఏకగ్రీవంగా మద్దతు తెలిపింది. సీడబ్ల్యూసీ తీసుకున్న ఈ నిర్ణయాన్ని కాంగ్రెస్ సీనియర్ నేత, మాజీ అధ్యక్షుడు రాహుల్ గాంధీ ప్రకటించారు. దేశవ్యాప్తంగా కులగణన చేపట్టడమనేది ప్రగతిశీలమైన, శక్తివంతమైన అడుగుగా ఆయన అభివర్ణించారు. ఇది కీలకమైన ముందడుగుగా ఛత్తీస్‌గఢ్, హిమాచల్ ప్రదేశ్, రాజస్థాన్ ముఖ్యమంత్రులు సైతం బలంగా విశ్వసిస్తున్నారని చెప్పారు. కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే అధ్యక్షతన ఏఐసీసీ కార్యాలయంలో సోమవారం సీడబ్ల్యూసీ సమావేశం జరిగింది. నాలుగు గంటల ...15లో

వ్యూహాత్మకంగా ముందుకు..

- అభ్యర్థుల ప్రకటనపై టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్ రెడ్డి
- అధికారంలోకి వచ్చిన వెంటనే... ఆరు గ్యారెంటీలపైనే తొలి సంతకం..



వివరాలు 15లో..

ఆశాల భారీ ధర్నా

- కోఠిలోని ఆరోగ్య శాఖ కమిషనర్ ఆఫీస్ ముట్టడి
- ఫిక్స్‌డ్ వేతనం రూ.18వేలు ఇవ్వాలి
- పీఎఫ్, ఈఎస్ఐ, బీమా, రిటైర్‌మెంట్ బెనిఫిట్స్ వర్తింపజేయాలి: తెలంగాణ ఆశా వర్కర్స్ యూనియన్ (సీఐటీయూ) రాష్ట్ర అధ్యక్షులు జయలక్ష్మి
- సమ్మె తాత్కాలికంగా వాయిదా
- నేటి నుంచి విధుల్లోకి ఆశాలు



నవతెలంగాణ -సుల్తాన్ బజార్

సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ఆశా వర్కర్లు చేపట్టిన చలో హైదరాబాద్ కార్యక్రమం విజయవంతమైంది. తెలంగాణ ఆశా వర్కర్స్ యూనియన్ (సీఐటీయూ) ఆధ్వర్యంలో సోమవారం 33 జిల్లాల నుంచి ఆశా వర్కర్లు వేలాదిమంది హైదరాబాద్‌లోని ఆరోగ్య శాఖ కమిషనర్ ఆఫీస్ ముట్టడికి తరలివచ్చారు. కోఠి ఉమెన్స్ కళాశాల చౌరస్తా వద్ద రోడ్డుపై పెద్దఎత్తున బైటాయించారు. ఈ సందర్భంగా యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు పి.జయలక్ష్మి మాట్లాడుతూ.. ఆశా వర్కర్లకు ఫిక్స్‌డ్ వేతనం రూ.18 వేలు ఇవ్వాలన్నారు. పీఎఫ్, ఈఎస్ఐ, ప్రమాద బీమా, రిటైర్‌మెంట్ బెనిఫిట్స్ తదితర సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. 15 రోజుల ...15లో

ఫైట్ షురూ...



ఎన్నికల షెడ్యూల్ రాకతో రాష్ట్రంలో రాజకీయ కాక

- 50 రోజులపాటు ఎలక్షన్ హీట్
- పోటాపోటీగా బీఆర్‌ఎస్, కాంగ్రెస్ కార్యాచరణ
- ఇప్పటికే అధికార పార్టీ తొలి జాబితా
- బస్సు యాత్రల సన్నాహాలు, సమావేశాలతో హస్తం బిజీబిజీ
- అయోమయంలో కమలం-స్పష్టమైన వైఖరితో వామపక్షాలు

బి.వి.యన్.పద్మరాజు

ఎన్నికల షెడ్యూల్ రాకతో 'ఇప్పటిదాకా ఒక లెక్క.. ఇప్పటి నుంచి మరో లెక్క...' అన్నట్టుగా మారాయి రాష్ట్ర రాజకీయాలు. అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో గత ఏడాది కాలంగా విమర్శలు, ప్రతి విమర్శలు..ఆరోపణలు, ప్రత్యారోపణలు.. దూషణ, భాషణలతో తలపడిన అధికార, ప్రతిపక్ష పార్టీలు... ఇప్పుడు నేరుగా ప్రజాక్షేత్రంలో తలపడనున్నాయి. ఈ క్రమంలో దాదాపు 50 రోజులపాటు అవి ప్రచారంతో రాష్ట్రాన్ని హోరెత్తించనున్నాయి. అటు జాతీయ స్థాయి నేతలు, ఇటు రాష్ట్ర నాయకుల సభలు, సమావేశాలతో తెలంగాణ హీటెక్కనుంది. ఎన్నికల ప్రణాళికలు, హామీలు, వాగ్దానాల పరంపర కొనసాగనుంది.

అందరూ ఊహించినట్టుగానే రాష్ట్ర శాసనసభ ఎన్నికలకు షెడ్యూల్ రానే వచ్చింది. దీంతో ఇటు రాజకీయ పార్టీలతోపాటు అటు నేతల్లో టెన్షన్ మొదలైంది. అభ్యర్థుల బలాబలాలు, గెలుపోటములపై చర్చోప చర్చలు జరుగుతుండగా... ఎన్నికల సంఘం మాత్రం తన పని తాను చేసుకుపోతున్నది. అధికార బీఆర్‌ఎస్‌తో పాటు ప్రతిపక్ష కాంగ్రెస్ సైతం ఎన్నికలను ఎదుర్కొనేందుకు 'రెఢీ' అయ్యింది.

అంగబలం, అర్థబలం దండిగా ఉన్న బీఆర్‌ఎస్... 115 మంది అభ్యర్థులతో తన తొలి జాబితాను ప్రకటించిన సంగతి విదితమే. ఫలితంగా నెలకొన్న అసంతృప్తులు, బుజ్జగింపుల పర్వం ఒకవైపు కొనసాగుతుండగానే మరోవైపు ఆ పార్టీకి చెందిన అభ్యర్థులు అధికారిక, అనధికారిక కార్యక్రమాల పేరిట నియోజకవర్గాల్లో విస్తృతంగా పర్యటించారు. ఇప్పుడు ఆ పర్యటనల ఉధృతి ఎక్కువ ...6లో

కాంగ్రెస్‌లో సీఎంకు గ్యారెంటీ, వారంటీ లేదు



- మోసగాళ్లు కావాలా.. మొనగాళ్లు కావాలా..
- రైతు బంధు, పింఛన్లు పెంచుతాం : మంత్రి కేటీఆర్

వివరాలు 6లో..

15న ఎమ్మెల్యే అభ్యర్థులతో కేసీఆర్ సమావేశం..


- అక్కడే అభ్యర్థులకు బీఫామ్స్
- అదేరోజున మ్యానిఫెస్టో, హుస్నాబాద్‌లో బహిరంగసభ
- నవంబర్ 9న గజ్వేల్, కామారెడ్డిలో నామినేషన్



వివరాలు 6లో..

ఆర్థిక శాస్త్రంలో ఆమెకే నోబెల్


- కార్మిక మార్కెట్‌లో మహిళల ఉత్పాదక శక్తిపై పరిశోధన




స్టాక్‌హోమ్ : ఆర్థిక శాస్త్రంలో ప్రతిష్టాత్మక నోబెల్ పురస్కారం అమెరికాకు చెందిన మహిళా ఆర్థికవేత్త క్లాడియా గోల్డిన్‌ను వరిం చింది. కార్మిక మార్కెట్‌లో మహిళల ఉత్పాదక శక్తిపై చేసిన పరిశోధనకు గోల్డిన్‌కు ఈ పురస్కారం ప్రకటిస్తున్నా మని రాయల్ స్వీడిష్ అకాడమీ ఆఫ్ సైన్సెస్ తెలిపింది. గోల్డిన్ హార్వర్డ్ యూనివర్సిటీలో పని చేస్తున్నారు. నోబెల్ ఆర్థిక పురస్కారాన్ని 1969లో ప్రారంభించినప్పటి ...15లో

చంద్రబాబుకు దక్కని ఊరట

- బెయిల్ పిటిషన్ కొట్టేసిన ఏసీబీ కోర్టు
- సుప్రీంకోర్టులో విచారణ వాయిదా



వివరాలు 6లో..



డీఎస్సీ వాయిదా?

నవంబర్ 30న పోలింగ్..అదే రోజు ఎస్జీటీ పరీక్ష

- అన్ని పరీక్షలా? ఆ ఒక్కటే వాయిదానా
- విద్యాశాఖ సమాలోచన
- నేడు నిర్ణయం

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రాష్ట్రంలో ఉపాధ్యాయ పోస్టుల భర్తీకి సంబంధించిన రాతపరీక్షలు వాయిదా పడే అవకాశమున్నది. నవంబర్ 20 నుంచి 30 వరకు ఆన్‌లైన్‌లో ఈ రాతపరీక్షలు జరగనున్న విషయం తెలిసిందే. అయితే నవంబర్ 30న రాష్ట్రంలో అసెంబ్లీ ఎన్నికల పోలింగ్ ఉంటుందని ఎన్నికల కమిషన్ షెడ్యూల్‌ను విడుదల చేసింది. ఈ నేపథ్యంలో డీఎస్సీ రాతపరీక్షలు వాయిదా వేయడం తప్పనిసరి కానుంది. అయితే నవంబర్ 30న నిర్వహించే ఒక్కటే పరీక్షను వాయిదా వేస్తారా?, లేదంటే అన్ని పరీక్షలనూ వాయిదా వేస్తారా? అన్నది ఇప్పుడు చర్చనీయాంశంగా మారింది. దీనిపై విద్యాశాఖ అధికారులు సమాలోచన చేస్తున్నారు. విశ్వసనీయ సమాచారం ప్రకారం డీఎస్సీ రాతపరీక్షలన్నీ వాయిదా పడే అవకాశమున్నట్టు తెలుస్తున్నది. ఎందుకంటే నవంబర్ 30న పోలింగ్ ఉంటుంది. అంతకంటే వారం, పది రోజుల ముందు నుంచి ఎన్నికల కసరత్తు ప్రారంభమవుతుంది. పోలింగ్ అధికారులు, అసిస్టెంట్ పోలింగ్ అధికారులుగా ప్రభుత్వ ఉద్యోగులు, ఉపాధ్యాయులే ఉంటారు. వారంతా ఎన్నికల కమిషన్ పరిధిలోకి వెళ్లిపోతారు. పోలింగ్ కేంద్రాలకు ఈవీఎంల తరలింపు, పోలీసుల భద్రత ఇవన్నీ అదే సమయంలో జరుగుతాయి. ఇంకోవైపు రాజకీయ పార్టీలకు చెందిన అభ్యర్థులు ముమ్మరంగా ప్రచారంలో ఉంటారు. ఉపాధ్యాయ అభ్యర్థులు చదువులపై శ్రద్ధ పెట్టేందుకు ఇబ్బందులు తలెత్తుతాయి. ఇంకోవైపు డీఎస్సీ రాతపరీక్షల నిర్వహణకు ఇన్విజిలేటర్లు, పోలీసుల భద్రత వంటి సమస్యలు ఉత్పన్నమవుతాయి. ఆన్‌లైన్‌లో రాతపరీక్షలు కాబట్టి పోలింగ్ కేంద్రాలకు, ...6లో

పేదల పక్షమా..వ్యాపారుల పక్షమా..?

- ఎమ్మెల్యే శంకర్ నాయక్ తేల్చుకోవాలి : సీపీఐ(ఎం) కేంద్ర కమిటీ సభ్యులు జి.నాగయ్య



నవతెలంగాణ-మహబూబాబాద్

మహబూబాబాద్ పట్టణంలో గుడిసెలు వేసుకున్న పేదలకు పట్టాలు ఇవ్వకుండా అడ్డుకుంటున్న ఎమ్మెల్యే బానోత్ శంకర్ నాయక్ పేదల పక్షమా.. రియల్ ఎస్టేట్ వ్యాపారుల పక్షమో.. తేల్చుకోవాలని సీపీఐ(ఎం) కేంద్ర కమిటీ సభ్యులు జి.నాగయ్య తెలిపారు. మహబూబాబాద్ జిల్లా కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయం ఎదుట గుడిసెవాసులు ఇండ్ల స్థలాలు, పట్టాల కోసం చేస్తున్న పోరాట దీక్ష సోమవారం మూడో రోజూ కొనసాగింది. ఈ శిబిరాన్ని పట్టణ పేదల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డీజీ నరసింహారావు, సీపీఐ(ఎం) రాష్ట్ర నాయకులు జి.రాములుతో కలిసి నాగయ్య సందర్శించారు. అనంతరం పార్టీ పట్టణ కార్యదర్శి భాను సీతారాం నాయక్ అధ్యక్షతన జరిగిన సభలో నాగయ్య మాట్లాడారు. ఇండ్ల స్థలాల కోసం పోరాడుతున్న పేదలపై కర్కశంగా వ్యవహరిస్తూ వారి గుడిసెలు కూల్చివేస్తూ లాఠీచార్జీ చేయించి అమానుషంగా పదిమంది మహిళలపై కేసులు పెట్టి జైలుకు ...15లో

మంత్రి తలసాని, ఎమ్మెల్యేల ఆఫీస్‌ల ఎదుట ధర్నా

ఎమ్మెల్యే క్వార్టర్స్ ముట్టడికి యత్నించిన ఎస్ఎఫ్ఐ

- పోలీసులు, విద్యార్థులకు మధ్య తోపులాట..అరెస్ట్
- అరెస్టులను ఖండించిన ఎస్ఎఫ్ఐ



నవతెలంగాణ-సిటీబ్యూరో

విద్యారంగ సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో సోమవారం మంత్రి, ఎమ్మెల్యేల క్యాంపు కార్యాలయాల ఎదుట ధర్నా చేశారు. ఎమ్మెల్యేల క్వార్టర్స్ ముట్టడికి యత్నించారు. ఈ సమయంలో పోలీసులకు, విద్యార్థులకు మధ్య తోపులాట జరిగింది. పోలీసులు వారిని అరెస్టు చేశారు. సమస్యలను పరిష్కరించాలని అడిగితే అరెస్టు చేయడాన్ని ఎస్ఎఫ్ఐ రాష్ట్ర కమిటీ తీవ్రంగా ఖండించింది. రాష్ట్ర కమిటీ పిలుపులో భాగంగా సోమవారం హైదరాబాద్ జిల్లాలోని మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్, అంబర్‌పేట్ ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్ క్యాంపు ఆఫీసుల వద్ద ధర్నా చేయగా.. హిమాయత్‌నగర్‌లోని ఎమ్మెల్యేల క్వార్టర్స్ ముట్టడికి హైదరాబాద్ జిల్లా నాయకులు యత్నించారు. ఈ సందర్భంగా పోలీసులు, విద్యార్థులకు మధ్య తీవ్ర లోపులాట జరగడంతో పరిస్థితి ఉద్రిక్తంగా మారింది. అరెస్టు చేసి బేగంబజార్, అంబర్‌పేట్, ఇతర పోలీసు స్టేషన్లకు తరలించారు.

అనంతరం ఎస్ఎఫ్ఐ హైదరాబాద్ జిల్లా కార్యదర్శి కె.అశోక్ రెడ్డి మాట్లాడుతూ.. సంక్షేమ వసతి గృహ విద్యార్థులు అనేక రకాల సమస్యలతో బాధపడుతున్నారని, వారి సమస్యలను పరిష్కరించడంతో ప్రభుత్వం పూర్తిగా విఫలమైందన్నారు. మెస్, కాస్మోటిక్ చార్జీలను పెంచుతామన్న ప్రకటన కాగితాలకే పరిమితమైందన్నారు. ఇప్పటికైనా పెండింగ్‌లోని మెస్, కాస్మోటిక్ చార్జీలను విడుదల చేయాలని, నిత్యావసర వస్తువుల ధరలకు అనుగుణంగా మెస్ చార్జీలు పెంచాలని డిమాండ్ చేశారు. విద్యార్థుల అక్రమ అరెస్టులు, కేసులు నమోదు చేయడం ప్రభుత్వ పతనానికి సంకేతమన్నారు.

జిల్లా అధ్యక్షులు లెనిన్ గువేరా మాట్లాడుతూ.. అద్దె భవనాల్లో అరకొర వసతుల మధ్య విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని చెప్పారు. వసతి గృహాలకు, గురుకులాలకు పక్కా భవనాలు నిర్మించాలని డిమాండ్ చేశారు. నాలుగేండ్లుగా ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్ రూ.5,177 కోట్లు పెండింగ్‌లో ఉన్నాయని, వాటిని తక్షణమే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. మహిళా కళాశాలల్లో విద్యార్థినులకు మెడికల్ కిట్లు ఇవ్వాలన్నారు. సమస్యలను పరిష్కరించేవరకు ఎస్ఎఫ్ఐ ఉద్యమిస్తుందని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమాల్లో రాష్ట్ర కమిటీ సభ్యులు రమ్య, హైదరాబాద్ జిల్లా ఉపాధ్యక్షులు శ్రీమన్, వీరేందర్, జిల్లా సహాయ కార్యదర్శి ప్రశాంత్, స్టాలిన్, నాయకులు వేమన, శివ, గణేష్ దాసు, శ్రీధర్, ధనరాజ్, అజయ్, సహన, ప్రదీప్ తదితరులు పాల్గొన్నారు.

మేడ్చల్ మల్కాజిగిరి జిల్లాలోని ఘట్కేసర్‌లో మంత్రి మల్లారెడ్డి క్యాంప్ ఆఫీసు ముందు విద్యార్థులు ధర్నా చేశారు. పోలీసులు వారిని అరెస్టు చేసి ఘట్కేసర్ పోలీస్ స్టేషన్‌కి తరలించారు. అనంతరం ఎస్ఎఫ్ఐ జిల్లా ప్రధాన కార్యదర్శి రాథోడ్ సంతోష్ మాట్లాడుతూ.. అద్దె భవనంలో నడుపుతున్న హాస్టల్ భవనాలకు సొంత భవనాలు కేటాయించాలని డిమాండ్ చేశారు.

వాహనాల తనిఖీలు ముమ్మరం

- భారీగా నగదు పట్టివేత



నవతెలంగాణ-వనస్థలిపురం/బంజారాహిల్స్/సుల్తాన్‌బజార్

రాష్ట్రంలో ఎన్నికల కోడ్ అమల్లోకి రావడంతో పోలీసులు హైదరాబాద్‌తో పాటు నగర శివారు ప్రాంతాల్లో తనిఖీలు ముమ్మరం చేశారు. ఈ క్రమంలో పలు చోట్ల భారీగా నగదు లభ్యమవుతోంది. వనస్థలిపురం ఆటోనగర్ ప్రాంతంలో వాహనాల తనిఖీలు నిర్వహిస్తుండగా కారులో రామ్‌రెడ్డి వద్ద రూ.5,16,050కు ఎలాంటి పత్రాలూ లేకపోవడంతో పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. మరో వాహనంలో ఏడుకంట జగదీష్ గౌడ్ వద్ద రూ.1,60,000 స్వాధీనం చేసుకున్నారు. సంబంధిత పత్రాలు చూపిస్తే కేసు నమోదు చేయబోమని వనస్థలిపురం సీఐ జలంధర్ రెడ్డి తెలిపారు.

ఫిలింనగర్ పోలీసు స్టేషన్ పరిధిలో నారాయణమ్మ కాలేజీ వద్ద రూ.30 లక్షలను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. అబిడ్స్ పోలీస్ స్టేషన్ పరిధిలో 7 కిలోల బంగారం, 300 కేజీల వెండి సీజ్ చేశారు. నిజాం కళాశాల గేట్ నెం.1 వద్ద వాహనాలు తనిఖీ చేస్తుండగా ఓ వాహనంలో 7 కిలోల బంగారం, 300 కిలోల వెండి స్వాధీనం చేసుకున్నామని అబిడ్స్ ఇన్‌స్పెక్టర్ నరసింహారాజు తెలిపారు. పట్టుబడిన బంగారం, వెండి రూ. 7 కోట్లు ఉంటుందన్నారు.

నగరంలో క్యాసియో జి-షాక్ స్టోర్

హైదరాబాద్ : జపాన్ దేశంలో ఉన్న అత్యుత్తమ కంపెనీల్లో ఒకటి క్యాసియో కంప్యూటర్ కంపెనీ లిమిటెడ్ ఇండియా విభాగం తొలిసారిగా హైదరాబాద్‌లో తమ తొలి ఎక్స్‌క్లూజివ్ జి-షాక్ స్టోర్‌ను తెరిచింది. కూకట్‌పల్లిలో ఏర్పాటు చేసిన ఈ స్టోర్‌లో తమ కంపెనీకి సంబంధించిన వాచ్ ఉత్పత్తులను అందుబాటులోకి తెచ్చామని క్యాసియో ఇండియా మేనేజింగ్ డైరెక్టర్ హిడెకి ఇమై తెలిపారు.





ఉద్రిక్తంగా చలో సెక్రెటేరియేట్

ఏవీ కాలేజీ నుంచి అంబేద్కర్ విగ్రహం వరకు కాంట్రాక్ట్ ఏఎన్ఎంల ర్యాలీ

- అడ్డుకున్న పోలీసులు...అక్కడే బైటాయించిన ఉద్యమకారులు
- బలవంతంగా అరెస్ట్...వాగ్వివాదం, తోపులాటల మధ్య తరలింపు
- సర్కారుకు బుద్ధి చెప్పి తీరుతాం....కె.యాదానాయక్

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

ఇచ్చిన హామీని అమలు చేయాలని కోరినందుకు వారిని బలవంతంగా అరెస్టు చేశారు. కాంట్రాక్ట్ వ్యవస్థను రద్దు చేస్తానని ఇచ్చిన మాట నిలబెట్టుకోవాలని నినదించినందుకు పోలీసులు బలవంతంగా వారి గొంతు నొక్కే ప్రయత్నం చేశారు. సమాన పనికి సమాన వేతనమివ్వాలన్న సుప్రీంకోర్టు తీర్పును అమలు చేయాలని డిమాండ్ చేస్తూ ఛలో సెక్రెటేరియట్ చేపట్టిన కాంట్రాక్ట్ ఏఎన్ఎంలను ట్యాంక్ బండ్ అంబేద్కర్ విగ్రహం వద్దే అడ్డుకుని అరెస్టు చేసి తరలించారు. రాష్ట్రవ్యాప్తంగా వందలాదిగా తరలి వచ్చిన వారిని వరసగా ఈడ్చు కుంటూ వ్యాన్‌లలో ఎక్కించు కుని మరీ తీసుకెళ్లారు. ఈ క్రమంలో పోలీ సులు-కాంట్రాక్ట్ ఏఎన్ఎంల మధ్య వాగ్వాదం, తోపులాట చోటు చేసుకున్నాయి. గత కొన్ని నెలలుగా దశలవారీగా పోరాటాలు చేస్తున్న కాం ట్రాక్ట్ ఏఎన్ఎంలు బీఆర్ఎస్ పార్టీ చేసిన మోసానికి తగిన మూల్యం చెల్లించుకోక తప్పదని హెచ్చరించారు.

తెలంగాణ యునైటెడ్ మెడికల్, హెల్త్ ఎంప్లాయీస్ యూనియన్ (టీయుఎం హెచ్ఇయూ- సీఐటీయూ అనుబంధం) ఆధ్వర్యంలో సోమవారం ఛలో సెక్రెటేరియేట్ చేపట్టారు. ఈ నేపథ్యంలో దోమలగూడలోని ఏ.వీ.కాలేజీ నుంచి సెక్రెటేరియట్ వరకు ర్యాలీగా బయలుదేరి వెళ్లారు. ఈ సందర్భంగా కాంట్రాక్ట్ ఏఎన్ఎంలు తమ సర్వీసులను క్రమబద్ధీకరించాలనీ, పరీక్షా విధానం రద్దు చేయాలనీ, పీఆర్సీ బకాయిలను ఇవ్వాలని డిమాండ్ చేశారు. శాంతియుతంగా సచివాలయం వైపునకు వెళ్తున్న వారిని అప్పటికే అంబేద్కర్ విగ్రహం వద్ద మోహరించిన పోలీసులు అడ్డుకున్నారు. దీంతో కొద్ది సేపు పోలీసులు- కాంట్రాక్ట్ ఏఎన్ఎంల మధ్య వాగ్వాదం జరిగింది. ఎందుకు అరెస్టు చేస్తున్నారో చెప్పాలంటూ ఉద్యమకారులు నిలదీశారు. పోలీసులు అడ్డు కున్నందుకు నిరసనగా అక్కడే రోడ్డుపై బైటాయించి ప్రభుత్వ మొండి వైఖరి నశించాలంటూ నినాదాలు చేశారు. అప్పటికే చుట్టు ముట్టిన పోలీసులు టీయుఎంహెచ్ఇయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.యాదా నాయక్‌తో పాటు నాయ కులు, కాంట్రాక్ట్ ఏఎన్ఎం లను పెద్ద ఎత్తున అరెస్టు చేసి అక్కడ్నుంచి ఆయా పోలీస్ స్టేషన్లకు తరలిం చారు. అరెస్టయిన వారిలో రాష్ట్ర అధ్యక్షులు ఎండి. ఫసియుద్దిన్, రాష్ట్ర కోశాధికారి ఏ.కవిత, హైదరాబాద్ నగర అధ్యక్షులు జె.కుమార్ స్వామి,రాష్ట్ర సహాయ కార్యదర్శి కిరణ్మయి, వివిధ జిల్లాల నాయకులు మంగా, భాగ్య, పుష్పలత, స్వప్న, మంజుల, వెంకటమ్మ లక్ష్మీబాయి, రమా, షీలా, భవాని, ధనలక్ష్మి, కళావతి, రాజేశ్వరి, బాలమణి, దైవమనితో పాటు హైదరాబాదు రంగారెడ్డి, మంచిర్యాల, ములుగు, వరంగల్, కరీంనగర్ యాదాద్రి వికారాబాద్, మహబూబ్ నగర్ ,నాగర్ కర్నూల్, నల్గొండ, సూర్యాపేట, ఆదిలాబాద్, భూపాలపల్లి, హనుమకొండ తదితర జిల్లాలో కాంట్రాక్ట్ ఏఎన్ఎంలను తదితరులున్నారు. అరెస్ట్ చేసిన వారిని సాయంత్రం 5 గంటల తర్వాత విడుదల చేశారు.

పెద్ద ఎత్తున ఆందోళనా పోరాటాలు

అక్రమ అరెస్టులను టీయుఎంహెచ్ ఇయూ తీవ్రంగా ఖండించింది. కాంట్రాక్ట్ ఏఎన్ఎలు ఆగస్టు 15 నుంచి సెప్టెంబర్ 4 వరకు సమ్మె చేస్తే ప్రభుత్వం కమిటీ వేసిందని గుర్తుచేశారు. నెల రోజులైనా రెగ్యులర్ చేయలేదు. పరీక్ష రద్దు కాలేదు. ఏరియర్స్ ఇవ్వకపోవడంతో ఏఎన్ఎంలు తీవ్ర అసంతృప్తిలో ఉన్నారని తెలిపారు. కాంట్రాక్టు ఏఎన్ఎంలను యధావిధిగా రెగ్యులర్ చేయాలని డిమాండ్ చేశారు. లేకపోతే రాబోయే కాలంలో పెద్ద ఎత్తున ఆందోళ నలు నిర్వహిస్తామని హెచ్చరించారు.

డైరెక్టర్‌తో చర్చలు సఫలం

ఛలో సెక్రెటరియేట్ నేపథ్యంలో రాష్ట్ర ప్రజారోగ్య సంచాలకులు డాక్టర్ గడల శ్రీనివాసరావు టీయుఎంహెచ్ఇయూ ప్రతినిధులతో చర్చించారు. ఇప్పటికే పోరాటం ఫలితంగా సమ్మె కాలపు వేతనాలు విడుదల చేసినట్టు ఆయన చెప్పారు. పీఆర్సీ బకాయిలు సుమారు రూ.33.54 కోట్లను వారం రోజుల్లో విడుదల చేయనున్నట్టు తెలిపారు. ఈ నెల 16 లేదా 17న ఉన్నతాధికారుల కమిటీ ఉద్యోగ సంఘాలతో చర్చిస్తుందని చెప్పారు. అదే విధంగా పరీక్షను డిసెంబర్ వరకు వాయిదా వేస్తున్నట్టు తెలిపారు. దీంతో ఆందోళనలను వాయిదా వేస్తున్నట్టు యూనియన్ నాయకులు ప్రకటించారు. డీహెచ్‌తో చర్చలు జరిగిన వారిలో యూనియన్ గౌరవాధ్యక్షులు భూపాల్, రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎండీ ఫసియుద్దీన్, కె.యాదానాయక్, రాష్ట్ర కోశాధికారి కవిత, లీలావతి, పుష్పలత తదితరులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించమంటే అరెస్టు చేస్తారా? : ఎస్ఎఫ్ఐ

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

విద్యారంగ సమస్యలను పరిష్కరించాలని కోరితే అక్రమంగా అరెస్టు చేస్తారా?అని భారత విద్యార్థి ఫెడరేషన్ (ఎస్ఎఫ్ఐ) రాష్ట్ర కమిటీ రాష్ట్ర ప్రభుత్వాన్ని ప్రశ్నించింది. రాష్ట్ర వ్యాప్తంగా ఎమ్మెల్యేల క్యాంప్ కార్యాలయాల ముందు ఆందోళన చేస్తున్న విద్యార్థులపై పోలీసుల ఉక్కుపాదం మోపడాన్ని తీవ్రంగా ఖండించింది. ఈ మేరకు ఎస్ఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్షులు ఆర్ఎల్ మూర్తి, కార్యదర్శి టి నాగరాజు సోమవారం ఒక ప్రకటన విడుదల చేశారు. రాష్ట్రంలో విద్యారంగ సమస్యలను పరిష్కరించాలని సోమవారం ఎమ్మెల్యేల క్యాంపు కార్యాలయాల ముందు ఆందోళనలకు పిలుపునిచ్చామని తెలిపారు. ఈ సందర్భంగా సిద్దిపేట, మెదక్, హైదరాబాద్, నాగర్ కర్నూల్, భూపాలపల్లి, సూర్యాపేట, భువనగిరి, మంచిర్యాల, హన్మకొండ, మహబూబ్ నగర్, జనగామ, వికారాబాద్, కొమురం భీం జిల్లాల్లో విద్యార్థులపై పోలీసులు దాడి చేశారని పేర్కొన్నారు. సంక్షేమ వసతి గృహాల్లోని విద్యార్థులకు మెస్ చార్జీలను పెంచాలని డిమాండ్ చేశారు. పెండింగ్‌లో ఉన్న రూ.5,177 కోట్ల ఫీజురీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్‌లను విడుదల చేయాలని కోరారు. పెరిగిన ధరలకనుగుణంగా మెస్, కాస్మోటిక్ చార్జీలను పెంచాలని తెలిపారు. విద్యారంగ సమస్యలు పరిష్కరించలేని ప్రభుత్వం విద్యార్థులపై పోలీసులతో దాడి చేయించడం దుర్మార్గమని విమర్శించారు. సమస్యలు పరిష్కరించకుంటే వచ్చే ఎన్నికల్లో బీఆర్ఎస్ ప్రభుత్వానికి తగిన బుద్ధి చెప్తామని వారు హెచ్చరించారు.

నేషనల్ మెరిట్ స్కాలర్‌షిప్ దరఖాస్తు గడువు డిసెంబర్ 31: ఇంటర్ బోర్డు

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

జాతీయ మెరిట్ స్కాలర్‌షిప్ దరఖాస్తు గడువు డిసెంబర్ 31 వరకు ఉందని రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించింది. ఈ మేరకు ఇంటర్ బోర్డు కార్యదర్శి నవీన్ మిట్టల్ సోమవారం ఒక ప్రకటన విడుదల చేశారు. కేంద్ర ప్రభుత్వ విద్యా మంత్రిత్వ శాఖ జాతీయ మెరిట్ స్కాలర్‌షిప్‌ను విద్యార్థులకు అందిస్తున్నదని తెలిపారు. జాతీయ మెరిట్ స్కాలర్‌షిప్ కోసం తాజాగా దరఖాస్తు చేసుకోవడంతోపాటు పునరుద్ధరణ దరఖాస్తులను డిసెంబర్ 31 వరకు సమర్పించేందుకు అవకాశముందని పేర్కొన్నారు. 2023 వార్షిక పరీక్షల్లో ఉత్తీర్ణులైన విద్యార్థులు తాజాగా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. అంతకుముందు ఉత్తీర్ణులైన వారు దరఖాస్తులను పునరుద్ధరణ చేసుకోవాలని కోరారు. ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలనుకునే విద్యార్థులు **http://scholarship.gov.in** వెబ్‌సైట్‌ను సంప్రదించాలని సూచించారు. టాప్ 20 పర్సెంటైల్ సాధించి తాత్కాలికంగా ఎంపికైన 53,107 మంది విద్యార్థుల జాబితాను **tsbie.cgg.gov.in** వెబ్‌సైట్‌లో పొందుపరిచామని వివరించారు.

బీఆర్ఎస్, బీజేపీని ఓడించాలి

ఓట్ల కోసం ప్రజలను నమ్మించి మోసం చేశాయ్.. : సీపీఐ(ఎం) కేంద్ర కమిటీ సభ్యులు చెరుపల్లి సీతారాములు



నవతెలంగాణ-నల్లగొండ కలెక్టరేట్

ప్రజలను నమ్మించి మోసం చేసిన బీజేపీ, బీఆర్ఎస్ ప్రభుత్వాలను ఎన్నికల్లో ఓడించాలని సీపీఐ(ఎం) కేంద్ర కమిటీ సభ్యులు చెరుపల్లి సీతారాములు పిలుపునిచ్చారు. నల్లగొండ జిల్లా తిప్పర్తి మండలంలోని నర్రా రాఘవరెడ్డి భవన్‌లో విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. కేంద్రంలో అధికారంలోకి రావడం కోసం అనేక హామీలిచ్చి అమలు చేయకుండా మోసం చేసిన బీజేపీకి ఎన్నికల్లో తగిన బుద్ధి చెప్పాలన్నారు. కేంద్ర ప్రభుత్వమంటే కేవలం మోడీ అమిత్‌షా అనే విధంగా వ్యవహరిస్తున్నారని విమర్శించారు. ప్రజా వ్యతిరేక విధానాలపై ప్రశ్నిస్తున్న అనేక దిన పత్రికలను, న్యూస్ ఛానళ్లపై అక్రమ కేసులు పెట్టి వేధిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కేంద్రప్రభుత్వ వైఫల్యాలకు సంబంధించిన డేటా కాపీలను స్వాధీనం చేసుకోవడం కోసం మీడియా సంస్థల కార్యాలయాలు, ఉద్యోగుల ఇండ్లపై దాడులు చేయిస్తోందని విమర్శించారు. పైగా చైనా ఏజెంట్లనే ముద్ర వేస్తోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. బీజేపీ ఎన్నికల్లో గట్టెక్కడం కోసం.. ప్రజలను రెచ్చగొట్టేందుకు సనాతన ధర్మాన్ని వాడుకుంటూ.. మూఢనమ్మకాలను పెంపొందించి, కుల మతాల మధ్య చిచ్చు పెట్టి ఓటు బ్యాంక్ రాజకీయాలు చేస్తోందన్నారు. వీటన్నింటినీ ప్రజలు గమనించి వచ్చే ఎన్నికల్లో బీజేపీకి తగిన బుద్ధి చెప్పాలని కోరారు.

రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు జూలకంటి రంగారెడ్డి మాట్లాడుతూ.. తెలంగాణ రాష్ట్రం ఏర్పడ్డాక నీళ్ళు, నిధులు, నియామకాల ఎజెండాతో అధికారంలోకి వచ్చిన బీఆర్ఎస్ ఇచ్చిన హామీలను విస్మరించిందన్నారు. ఒంటెద్దు పోకడపోతూ ప్రజల ఇబ్బందులను పట్టించుకోకుండా తలా తోకలేని నిర్ణయాలతో ఓట్ల రాజకీయం చేస్తోందని విమర్శించారు. రైతులకు రుణమాఫీ చేస్తానని చెప్పి ఐదేండ్లకు కూడా పూర్తిస్థాయిలో చేయకపోవడంతో పాటు అప్పు కంటే వడ్డీ రెట్టింపు కావడం ద్వారా రైతుల మీద భారం పడిందన్నారు. యాంత్రిక పరికరాలు, ఫెర్టిలైజర్స్‌పై సబ్సిడీ ఎత్తేసి రైతులపై ఆర్థిక భారం మోపిందన్నారు. యువతకు ఉద్యోగాలు లేక.. నోటిఫికేషన్లు వేసి వాటిని భర్తీ చేయకపోవడం ద్వారా నిరుద్యోగ యువత ట్రైనింగ్ సెంటర్లో అనేక ఇబ్బందులు పడుతున్నారన్నారు. నిర్వహించిన పోటీ పరీక్షల్లోనే అనేక అవకతవకలు జరగడం వల్ల నిరుద్యోగులు తీవ్రంగా నష్టపోయారని చెప్పారు. దళిత బంధు, బీసీ బంధు, గృహలక్ష్మి అనేక పథకాల అమల్లో అవినీతికి పాల్పడుతున్నారని, అధికార పార్టీకి తొత్తులుగా ఉన్న వారికే ఇస్తున్నారని ఆరోపించారు. రానున్న ఎన్నికల్లో బీఆర్ఎస్ ప్రభుత్వానికి తగిన బుద్ధి చెప్పాలని పిలుపునిచ్చారు. ఈ సమావే శంలో సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి ముదిరెడ్డి సుధాకర్‌రెడ్డి, కార్యదర్శివర్గ సభ్యులు తుమ్మల వీరారెడ్డి, నారి ఐలయ్య, పాలడుగు నాగార్జున తదితరులు ఉన్నారు.

సాగర్‌లో కేంద్ర బలగాల కవాతు

నవతెలంగాణ-నల్లగొండ డెస్క్

రానున్న అసెంబ్లీ ఎన్నికల బందోబస్తు, శాంతి భద్రతల దృష్ట్యా సోమవారం నల్లగొండ జిల్లా నాగార్జునసాగర్‌లోని పైలాన్ కాలనీలో కేంద్ర బలగాల కవాతు జరిగింది.

సాగర్ సర్కిల్ సీఐ బిసన్న ఆధ్వర్యంలో జెన్కో సర్కిల్ కార్యాలయం నుంచి పిల్లర్ వరకు కేంద్ర బలగాల (ఆర్ఏఎఫ్) రాపిడ్ యాక్షన్ ఫోర్స్ దళాల కవాతు నిర్వహించారు. ఎన్నికల సమయంలో చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడే వారిపై పోలీస్ నిఘా ఉంటుందని సీఐ తెలిపారు. వచ్చే ఎన్నికల్లో ప్రజలు ప్రశాంత వాతావ రణంలో ఓటు హక్కును వినియోగిం చుకోవడానికి కేంద్ర, రాష్ట్ర, ప్రభుత్వాల ఆధ్వర్యంలో తగిన భద్రతాచర్యలు తీసుకుంటున్నాయన్నారు.

ఈ కార్యక్రమంలో విజయపురి టౌన్ ఎస్ఐ సంపత్‌గౌడ్, ఆర్ఏఎఫ్, డిప్యూటీ కమాండెంట్ టీపీ.బగేల్, ఏకే.శర్మ, జాత శంకర్‌యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

నగదు బదిలీ ఇవ్వకుంటే

బీఆర్ఎస్‌ను ఓడిస్తాం

గొర్రెల పంపిణీకి సరిపడా నిధులివ్వాలి
50 ఏండ్లు దాటిన వారికి రూ.5 వేల పెన్షన్ ఇవ్వాలి

- ప్రమాదాల్లో మరణిస్తే రూ.10 లక్షల ఎక్స్‌గ్రేషియా చెల్లించాలి : జీఎంపీఎస్ ప్రధాన కార్యదర్శి ఉడుత రవీందర్ డిమాండ్
- పశుసంవర్ధక శాఖ డైరెక్టరేట్ ముట్టడి
- గేటుపైకి ఎక్కి లోపలికి వెళ్లిన గొల్లకుర్మలు

సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తా అసిస్టెంట్ డైరెక్టర్



నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

గొర్రెల పంపిణీకి సరిపడా నిధులను రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేయాలని గొర్రెలు, మేకల పెంపకం దార్ల సంఘం (జీఎంపీఎస్) ప్రధాన కార్యదర్శి ఉడుత రవీందర్ డిమాండ్ చేశారు. గొల్లకురుమలకు నగదు బదిలీ ఇవ్వకుంటే ఈ ఎన్నికల్లో బీఆర్ఎస్‌ను ఓడిస్తామని హెచ్చరించారు. అధికార పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థులు, నాయకులు గ్రామాల్లో ప్రచారం చేయనివ్వబోమనీ, ఎక్కడా తిరగనివ్వబోమని అన్నారు. నగదు బదిలీ ఇస్తే పరిస్థితిని అర్థం చేసుకుంటామన్నారు. జీఎంపీఎస్ రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో 'గొర్రెల పంపిణీకి సరిపడా నిధులు విడుదల చేసి నగదు బదిలీ చేయాలి'అని డిమాండ్ చేస్తూ పశుసంవర్ధక శాఖ డైరెక్టరేట్‌ను గొల్లకురుమలు ముట్టడించారు. ప్రదర్శనగా వచ్చి ప్రభుత్వానికి వ్యతిరేకంగా పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. డైరెక్టరేట్ ప్రధాన గేట్ వద్దకు చేరుకుని డైరెక్టర్ బయటకి రావాలంటూ నినదించారు. అధికారులెవరూ రాకపోవ డంతో వారు పోలీసులు ఏర్పాటు చేసిన బారికేడ్లను తోసు కుని గేటుపైకి ఎక్కి లోపలికి వెళ్లారు. దీంతో కొద్దిసేపు ఉద్రిక్త వాతావరణం నెలకొంది. ఈ సందర్భంగా పోలీసు లకు జీఎంపీఎస్ నాయకులు, కార్యకర్తలకు మధ్య వాగ్వాదం, తోపులాట జరిగింది. ఈ సందర్భంగా ఉడుత రవీందర్ మాట్లాడుతూ ప్రభుత్వం గొల్ల, కురుమలను కోటీశ్వరులను చేస్తానని చెప్పి అప్పులపాలు చేసిందని విమర్శించారు. గొర్రెల పంపిణీ వల్ల దళారులే లాభపడ్డారని అన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా 1,16,370 మంది గొల్లకురుమలతో డీడీలు కట్టించి ఇప్పటి వరకు 28 వేల మందికి మాత్రమే గొర్రెలను పంపిణీ చేశారని వివరించారు. ఐదు రోజుల కింద ప్రభుత్వం రూ.50 కోట్లు విడుదల చేసిందన్నారు. ఈ డబ్బులతో కేవలం 3,800 మందికి మాత్రమే ఇవ్వొచ్చునీ, మిగిలిన 88 వేల మందికి ఎప్పుడిస్తారని ప్రశ్నించారు. కొన్ని జిల్లాల్లో అధికార పార్టీ నాయకులు కమీషన్లు ఇవ్వాలనీ, పార్టీ కండువా కప్పుకోవాలని ఒత్తిడి చేస్తున్నారని విమర్శించారు. ప్రభుత్వం వద్ద సరిపడా నిధుల్లేకుండా ఎందుకు డీడీలు కట్టించుకున్నారని అడిగారు. ఎన్నికల షెడ్యూల్ రావడంతో గొర్రెలు వస్తాయా? రావా? అనే ఆందోళనలో గొల్లకురుమలున్నారని చెప్పారు. ప్రభుత్వం ఇప్పటికైనా స్పందించి మిగిలిన వారందరికీ సరిపడా నిధులు విడుదల చేయాలని డిమాండ్ చేశారు.

దళారుల ప్రమేయం లేకుండా గొల్ల కురుమల అకౌంట్లలోకి నగదుబదిలీ చేయాలనీ, రాజకీయ జోక్యం లేకుండా డీడీలు కట్టిన వారికి ముందు పంపిణీ చేయాలని కోరారు. 50 ఏండ్లు దాటిన గొర్లకాపరులకు నెలకు రూ.ఐదు వేల పెన్షన్ ఇవ్వాలనీ, ప్రమాదాల్లో మరణించిన వారికి రూ.10 లక్షల ఎక్స్‌గ్రేషియా చెల్లించాలని డిమాండ్ చేశారు. అన్ని గొర్లకూ ఇన్సూరెన్స్ చేయాలని సూచించారు. జీఎంపీఎస్ రాష్ట్ర అధ్యక్షులు కిల్లె గోపాల్ మాట్లాడుతూ ఎంత మంది గొల్లకురుమలున్నారు, ఏటా ఎంత మందికి గొర్రెలు పంపిణీ చేస్తారో సంఘాల నాయకులతో చర్చిస్తే బాగుండేదని అన్నారు. ప్రణాళిక లేకుండా ఏకపక్షంగా నిర్ణయాలు తీసుకుంటున్నారని చెప్పారు. సమస్య వస్తే పిలిచి మాట్లాడే పరిస్థితి లేదన్నారు. ప్రభుత్వం ప్రకటించిన ఈ పథకం అమల్లో లోపాలు న్నాయనీ, వాటిని సరిదిద్దుకోవాలని డిమాండ్ చేశారు. డీడీలు కట్టిన ప్రతిఒక్కరికీ నగదు బదిలీ చేయాలని కోరారు.

డైరెక్టర్‌తో సమావేశం ఏర్పాటు చేస్తాం : అసిస్టెంట్ డైరెక్టర్

పోలీసులు జోక్యం చేసుకుని పశుసంవర్ధక శాఖ డైరెక్టర్ అందుబాటులో లేనందున ఆ శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ శ్రీనివాసులును బయటికి తీసుకొచ్చారు. ఆయనకు జీఎంపీఎస్ నాయకులు వినతి పత్రం ఇప్పించారు. ఈ సందర్భంగా శ్రీనివాసులు మాట్లాడుతూ రాజకీయ జోక్యం లేకుండా గొర్రెల పంపిణీ చేస్తామని హామీ ఇచ్చారు. మిగిలిన అన్ని డిమాండ్లనూ ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తామని చెప్పారు. డైరెక్టర్‌తో జీఎంపీఎస్ నాయకుల ఉమ్మడి సమావేశాన్ని ఏర్పాటు చేసి సమస్యలపై చర్చిస్తామని అన్నారు. అసిస్టెంట్ డైరెక్టర్ హామీతో ధర్నాను విరమించారు. ఈ కార్యక్రమంలో జీఎంపీఎస్ రాష్ట్ర నాయకులు ఎ శంకరయ్య, కె లింగయ్య, బి అశోక్, సాదం రమేష్, టి లింగయ్య, పి మధుకర్, కాల్ల సురేష్, పాలమూరు కురుమ సంఘం మహబూబ్‌నగర్ జిల్లా అధ్యక్షులు మాదారం కృష్ణ, శ్రీకాంత్, ఓయూ విద్యార్థి నాయకులు కొంగల పాండు, గట్టయ్య, జీఎంపీఎస్ నాయకులు ఏ కొమురయ్య దయ్యాల నర్సింహ్మ, దేవేందర్, మల్లయ్య, మహేష్, మల్లేష్ పాల్గొన్నారు.

బీఆర్ఎస్‌కు షాకుల మీద షాకులు

- తిరుగుబాటు జెండా ఎగిరేస్తున్న ఆశావహులు
- పార్టీని వీడిన ఢిల్లీ వసంత్
- తాడోపేడో అంటున్న నీలం మధు

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

ఎన్నికలు దగ్గరికొస్తున్న తరుణంలో అధికార బీఆర్ఎస్‌కు షాకుల మీద షాకులు తగులుతున్నాయి. సీఎం కేసీఆర్‌తో ఎన్నో ఏండ్ల పాటు కలిసి నడిచిన ఆయన అనుయాయులు, సన్నిహితులు ఇప్పుడు టికెట్ దక్కకపోవడంతో ఒక్కొక్కరిగా పార్టీని వీడుతున్నారు. ఎమ్మెల్యే టికెట్టే లక్ష్యంగా ముందుకెళ్తూ గులాబీ పార్టీకి గుడ్ బై చెబుతున్నారు. తాజాగా జహీరాబాద్ నియోజకవర్గం నుంచి కీలకనేతగా ఉన్న ఢిల్లీ వసంత్ కుమార్ పార్టీని వీడారు. బీజేపీ రాష్ట్ర అధ్యక్షులు కిషన్ రెడ్డి సమక్షంలో కమలం గూటికి చేరిపోయారు. పటానుచెరు నుంచి టికెట్ ఆశించి భంగపడ్డ నీలం మధు ముదిరాజ్ కూడా త్వరలోనే పార్టీని వీడనున్నారని సమాచారం. ఇప్పటికే ఆయన కాంగ్రెస్ అగ్రనేతలతో సమాలోచనలు జరిపారు. గత కొద్ది సంవత్సరాలుగా బీఆర్ఎస్‌కు అన్ని రకాలుగా సహాయ, సహకారాలు అందిస్తూ సీఎం కేసీఆర్‌కు అత్యంత విశ్వాసపాత్రునిగా ఉంటున్న తనకు టికెట్ నిరాకరించటాన్ని జీర్ణించుకోలేకపోతున్నట్టు మధు తన సన్నిహితుల వద్ద వాపోతున్నారు. ప్రభుత్వం, పార్టీపైన గౌరవమున్నప్పటికీ టికెట్ దక్కలేదనే మనస్థాపంతోటే పార్టీని వీడేందుకు ఆయన రంగం సిద్ధం చేసుకున్నట్టు తెలిసింది. పైకి ఢిల్లీ వసంత్, నీలం మధు లాంటి అసంతృప్త నేతలు కనిపిస్తున్నా.. లోపల ఇలా మదన పడుతున్న నేతలు పదుల సంఖ్యలోనే ఉన్నారు. వీరందరూ ఎన్నికల్లో బీఆర్ఎస్‌కు నష్టం చేకూర్చటం ఖాయంగా కనిపిస్తున్నది.

శంషాబాద్ ఎయిర్‌పోర్టుకు బెదిరింపు మెయిల్

- 'జాగ్రత్తగా ఉండండి' అంటూ హెచ్చరిక
- అప్రమత్తమైన సెక్యూరిటీ, ఆర్‌జీఐఏ పోలీసులకు ఫిర్యాదు

నవతెలంగాణ-శంషాబాద్

శంషాబాద్ ఎయిర్‌పోర్టుకు ఐఏఎస్ఐ ఏజెంట్ వల్ల ముప్పు వాటిల్లే అవకాశం ఉందని, దుబాయ్ వెళ్తున్న విమానంను హైజాక్ చేయబోతున్నారని, జాగ్రత్తగా ఉండాలంటూ ఒక బెదిరింపు మెయిల్ కాల్ వచ్చింది. ఈ ఘటన రంగారెడ్డి జిల్లా శంషాబాద్‌లోని రాజీవ్ గాంధీ అంతర్జాతీయ విమానాశ్రయంలో ఆదివారం రాత్రి చోటుచేసుకుంది. దాంతో అప్రమత్తమైన ఎయిర్‌పోర్టు సెక్యూరిటీ చీఫ్ బీఎస్ఎన్‌రెడ్డి ఆర్‌జీఐఏ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఇన్‌స్పెక్టర్ ఆర్.శ్రీనివాస్ తెలిపిన వివరాల ప్రకారం.. శంషాబాద్ ఎయిర్‌పోర్టుకు 'జాగ్రత్తగా ఉండండి' అంటూ అగంతకుల నుంచి బెదిరింపు మెయిల్ కాల్ వచ్చింది. డయల్ ఏవోసీసీ నుంచి ఆర్జీఐఏ ఏవో సీసీకి బెదిరింపు మెయిల్ పంపించారు. ఎయిర్‌పోర్టు నుంచి దుబాయ్ వెళ్తున్న విమానంను హైజాక్ చేయబోతున్నట్టు మెయిల్ సారాంశం. దాంతో అప్రమత్తమైన సెక్యూరిటీ అధికారులు మొబైల్ బీఏసీఎస్ నిబంధనల ప్రకారం థ్రెట్ అసైస్‌మెంట్ కమిటీ బెదిరింపు సందేశాన్ని అంచనా వేయడానికి సమావేశం నిర్వహించారు. బెదిరింపు కాల్‌కు సంబంధించిన అన్ని అంశాలను పరిశీలించారు. వెంటనే దుబాయ్‌కి వెళ్లేందుకు సిద్ధంగా ఉన్న విమానాన్ని నిలిపివేశారు. అందులోని ప్రయాణికులను క్షుణ్ణంగా తనిఖీ చేశారు. పూర్తి విచారణ అనంతరం తిరుపతి బాదినేని, ఎల్.వినోద్‌కుమార్, రాకేష్‌కుమార్ అనే ముగ్గురు వ్యక్తులను అదుపులోకి తీసుకున్నారు. ఈ ముగ్గురు దుబాయ్ మీదుగా ఇరాక్ వెళ్తున్నట్టు గుర్తించారు. ఈ ముగ్గురిని పోలీసులు విచారిస్తున్నారు. దుబాయ్‌కి వెళ్లాల్సిన విమానాన్ని పూర్తిగా రద్దు చేసి, మరో విమానంలో 111 మంది ప్రయాణికులను సురక్షితంగా దుబాయ్‌కి పంపించారు.

ఎన్నికల కోడ్ అమలు..

- వాహనాల తనిఖీల్లో.. రూ.8 లక్షలు పట్టివేత


నవతెలంగాణ-వైరా/బోనకల్

ఎన్నికల కోడ్ నేపథ్యంలో పోలీసులు వాహన తనిఖీ చేస్తుండగా రూ.8లక్షలు పట్టుబడిన ఘటన ఖమ్మం జిల్లా వైరా, బోనకల్‌లో సోమవారం చోటుచేసుకుంది. వైరా నియోజకవర్గ కేంద్రంలో ఎన్నికల కోడ్ అమలులోకి వచ్చిన మొదటి గంటలోనే లక్షలు పట్టుబడటం చర్చనీయాంశంగా మారింది. వివరాల్లోకి వెళితే.. ఆంధ్రప్రదేశ్‌లోని పశ్చిమ గోదావరి జిల్లా కొయ్యలగూడెం మండలం డిప్పకాయలపాడుకు చెందిన తెలుగుదేశం పార్టీ నాయకురాలు, జిల్లా పరిషత్ మాజీ చైర్‌పర్సన్ ఇమ్మణి రాజేశ్వరి తన వ్యవసాయ భూమికి సంబంధించిన నగదును రూ.5 లక్షలను తీసుకొని కారులో హైదరాబాద్ వెళుతుంది. వైరా రింగ్ రోడ్ సెంటర్‌లో ఎస్ఐ మేడా ప్రసాద్ వాహనాలు చెకింగ్ చేస్తుండగా పట్టుబడ్డారు. ఎలాంటి అనుమతి పత్రాలు లేకపోవడంతో నగదు స్వాధీనం చేసుకున్నారు. పట్టుకున్న రూ.5 లక్షలను ఐటీ అధికారులకు అప్పగిస్తామని తెలిపారు. ఈ సందర్భంగా రాజేశ్వరి మాట్లాడుతూ.. తన వ్యవసాయ భూమిలో పంటకు వచ్చిన నగదును హైదరాబాద్ తీసుకు వెళుతున్నానని తెలిపారు.

రియల్టర్ల నుంచి ప్రభుత్వ భూములను కాపాడుతాం

- ఎల్ఆర్ఎస్ చేసుకున్న వారికి రిజిస్ట్రేషన్ పత్రాలివ్వాలి : వ్యకాస

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్



రియల్ ఎస్టేట్ వ్యాపారుల కబంధ హస్తాల్లోని పేదల భూములు, కాలువులు, చెరువుల కబ్జాల భూములను కాపాడేందుకు తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో పోరాటం చేయనున్నట్టు ఆ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆర్.వెంకట్రాములు తెలిపారు. పడావుబడ్డ భూముల రక్షణ కోసం పనిచేయాలని పిలుపునిచ్చారు. సోమవారం హైదరాబాద్‌లో హెచ్ఎండీఏ పరిధిలోని ఆయా జిల్లాల నాయకులతో బి.రామచందర్ అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వెంకట్రాములు మాట్లాడుతూ..రియల్టర్లు పేరున్న ప్రముఖులు, హీరోలతో తప్పుడు ప్రకటనలు ఇప్పిస్తూ ప్రజల్ని మోసం చేస్తున్నారని విమర్శించారు. లక్షల ఎకరాల పచ్చని పంట పొలాలను రియల్టర్లు బీడు భూములుగా మార్చారన్నారు. డీటీపీసీ లేఅవుట్లు లేకుండా అసైన్డ్, కాలువలు, చెరువుల పక్కన భూములను కబ్జా చేసి ప్రజలను మభ్యపెట్టి కట్టబెడుతున్నారని విమర్శించారు. మైనింగ్ పర్మిషన్ లేకుండా వెంచర్లలోకి మట్టిని తరలిస్తున్నారన్నారు. పచ్చని పంటలు పండే భూములకు రిజిస్ట్రేషన్ ఫీజు కడితే చాలు నాలాలోకి కన్వర్షన్ చేయడం సరైందికాదన్నారు. హైవేల పక్కన అనేక వెంచర్లు వేసి ప్రభుత్వ భూములను కబ్జా చేస్తున్నారనీ, వాటిని వెంటనే ప్రభుత్వం స్వాధీనం చేసుకోవాలని డిమాండ్ చేశారు. ఎల్ఆర్ఎస్ పేరుతో మూడు లక్షల మంది లబ్దిదారులు డబ్బులు చెల్లించారనీ, వాటిని రియల్ ఎస్టేట్ వ్యాపారులే చెల్లించేలా ఆదేశాలు జారీ చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. ధరణి నుంచి కాస్తు కాలం 16 తొలగింపు వల్ల పేదలు తమ భూములను కోల్పోతున్నారనీ, ఆ కాలాన్ని పునరుద్ధరించాలని విన్నవించారు. డిటిసిపీ, హెచ్ఎండీఏ, వైటిడిఏ పర్మిషన్లు లేనటువంటి వాటిపై రియల్ ఎస్టేట్ రిజిస్ట్రేషన్ అథారిటీలో రాబోయే రోజుల్లో ఫిర్యాదు చేస్తామన్నారు. రియల్టర్ల నుంచి ప్రభుత్వ, కబ్జా భూములను కాపాడేందుకు తమ సంఘం ఆధ్వర్యంలో ఉద్యమాలు చేస్తామన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎం. నర్సిములు, రాష్ట్ర సహాయ కార్యదర్శి కందుకూరి జగన్, మెదక్ జిల్లా కార్యదర్శి కె.మల్లేశం, రాష్ట్ర కమిటీ సభ్యులు ఆంజనేయులు, నాగమణి తదితరులు పాల్గొన్నారు.

సంపాదకీయం

క్రీడా భారతి

వంద పతకాలు లక్ష్యంగా ప్రతిష్టాత్మక ఆసియా క్రీడల బరిలో దిగిన మన క్రీడాకారులు... దానిని చేరుకోవడమేకాదు.. డెబ్బై రెండేండ్ల ఈ క్రీడల చరిత్రలో 28 స్వర్ణాలు సహా 107 పతకాలు సాధించడం ఇదే తొలిసారి. అనేక ప్రతికూల పరిస్థితుల్లోనూ ఇంతటి ఘనవిజయం సాధించడం మన క్రీడాకారుల కఠోర శ్రమ, సాధనతోనే సాధ్యమైంది. ఆ పట్టుదలే పతకాల పట్టికలో ఇండియాను నాలుగో స్థానంలో నిలబెట్టింది. మూడు ప్రధాన క్రీడా సంరంభాలను గమనిస్తే భారత క్రీడారంగం అమోఘంగా పురోగమించిందనేది నిర్వివాదాంశం. 1951లో తొలి ఆసియా క్రీడల ఆతిథ్య దేశంగా రెండో ర్యాంకు పొందిన దరిమిలా 5-11 స్థానాలకే పరిమితమైన భారత క్రీడాకారులు ఈ సారి మెరుగైన ర్యాంకుతోపాటు వందకుపైగా పతకాలు సాధించడం పట్ల దేశవ్యాప్తంగా హర్షాతిరేకాలు వ్యక్తమవుతున్నాయి.

బ్రిజ్‌భూషణ్ లాంటి నేతలను భారత క్రీడా సమాఖ్యలకు రెజ్లింగ్ సమాఖ్య అధ్యక్షులుగా పెట్టుకున్నాక 'మన బేటీ బచావో, బేటీ పడావో' వంటివి కేవలం నినాదాలే అనేది స్పష్టం అవుతోంది. క్రీడల పట్ల ఆసక్తి ఉండి, ప్రతిభ ఉండి అవకాశాలు లేక, ప్రధానంగా ఆర్థిక ఇబ్బందుల కారణంగా రాణించలేకపోతున్న లక్షలాది మంది క్రీడాకారులకు సరైన వనరులు, వసతులు కల్పించే క్రీడా విధానం మనకుందా? అది లేదు కాబట్టే ఒలింపిక్స్‌లో ఒకటి, రెండు పతకాలతోనే సరిపెట్టుకుంటున్నాం.

గురితప్పకుండా మూడేసి స్వర్ణాలు గెలుపొందిన జ్యోతి, ఓజస్ ప్రవీణ్‌ల ప్రదర్శన చిరస్మరణీయం. బ్యాడ్మింటన్‌లో సాత్విక్ జోడీ చారిత్రక పసిడిని ఒడిసి పట్టింది. ఆర్చరీ, కబడ్డీ, క్రికెట్, బ్యాడ్మింటన్, షూటింగ్, అథ్లెటిక్స్ తదితరాల్లో క్రీడాకారులు ప్రదర్శించిన దూకుడే భారత్‌కు పతకాల పంట పండించింది. వ్యవస్థాగత తోడ్పాటు లభించకపోయినా ఏటికి ఎదురీదుతూ గొప్ప విజయాన్ని దేశానికి అందించారు. ఎప్పటిలాగే చైనా 383 పతకాలతో అగ్రపీఠాన్ని నిలబెట్టుకుంది. మన దేశ జనాభాలో పదోవంతు కూడా లేని జపాన్ 52 స్వర్ణాలతో 188 పతకాలతో ద్వితీయ స్థానంలో, దక్షిణ కొరియా 42 స్వర్ణాలతో మొత్తం 190 పతకాలతో తృతీయ స్థానంలో నిలిచాయి. వాటితో పోల్చినపుడు 140 కోట్లకు పైబడిన జనాభాతో తులతూగుతున్న ఇండియా క్రీడరంగంలో నేర్వాల్సింది, సాధించాల్సింది ఎంతో ఉందన్న యథార్థం ప్రస్ఫుటమవుతోంది. కానీ, పాలకులు ఆ వాస్తవాన్ని పట్టించుకోవడం లేదు.



నాలుగు దశాబ్దాలుగా ఆసియా క్రీడల్లో అగ్రస్థానంతో నిలుస్తుంది చైనా. ఏ క్రీడలైనా ఇదే పరిస్థితి. అక్కడి ప్రభుత్వాలు క్రీడలకు అంతటి ప్రాధాన్యత ఇవ్వడమే ఈ ఘనతకు కారణం. దేశవ్యాప్తంగా లక్షల సంఖ్యలో వ్యాయామశాలలు నెలకొల్పిన చైనా పసిప్రాయంలోనే ప్రతిభావంతుల్ని గుర్తించి విస్తృత శిక్షణతో రాటుతేలుస్తోంది. దాదాపు ప్రతి బడిలోనూ మైదానం ఉండేట్టు జపాన్ తీసుకున్న జాగ్రత్త పాఠశాలలోనే పిల్లల్లో క్రీడాభినివేశాన్ని పెంపొందిస్తోంది. ముడి వజ్రాల్లాంటి యువ క్రీడాకారులను పసిగట్టి శాస్త్రీయ శిక్షణ ఇవ్వడంలో 'చైనా మోడల్' అనుసరిస్తున్న దక్షిణకొరియా జాతీయ అథ్లెట్లకు తోడ్పాటు కోసం ప్రత్యేక యంత్రాంగాన్ని తీర్చిదిద్దింది. దక్షిణ కొరియాలో పురుషులు 28 ఏండ్లు వచ్చేలోగా 18 నెలల పాటు సైన్యంలో విధిగా సేవలందించాల్సి ఉంటుంది. ఒలింపిక్ పతకంగాని, ఆసియా క్రీడల్లో గోల్డ్ మెడల్‌గాని సాధించిన వారికి ఆ నిబంధన నుంచి మినహాయింపు ఉంటుంది. ఆత్మవిశ్వాసానికి రెక్కలు తొడిగి, జాతి చేవకు పుష్టికి దర్పణం పట్టే క్రీడల ప్రాముఖ్యాన్ని గుర్తెరిగిన దేశాలు పునాది నుంచే మౌలిక వసతుల కల్పనకు విశేష ప్రాధాన్యమిస్తున్నాయి. ఆ ఒరవడే ఆయా దేశాలకు ప్రతిష్టాత్మక వేదికలపై పతకాల పంట పండిస్తోంది.

కానీ, మన దేశంలో తత్భిన్నమైన పరిస్థితి. క్రీడాకారులు స్వశక్తితో పోరాడి పతకాలు సాధించుకొస్తే, అప్పుడు మాత్రమే వారిని గుర్తించి పోటీలు పడి నగదు బహుమతులు ప్రకటించి, క్రీడలను మేమే ప్రోత్సహిస్తున్నామని చెప్పుకోవడం మినహా మన ప్రభుత్వాలు ఏం చేస్తున్నాయ్? మనకు సరైన క్రీడా విధానం లేదు కాబట్టే అంతర్జాతీయ క్రీడా వీధుల్లో నగుబాటు తప్పడం లేదు. క్రీడల పట్ల, వాటి అభివఅద్ధి పట్లా నిజాయితీ, చిత్తశుద్ధీ లేని పరిస్థితి దేశమంతా ఉంది.

బ్రిజ్‌భూషణ్ లాంటి నేతలను భారత క్రీడా సమాఖ్యలకు రెజ్లింగ్ సమాఖ్య అధ్యక్షులుగా పెట్టుకున్నాక 'మన బేటీ బచావో, బేటీ పడావో' వంటివి కేవలం నినాదాలే అనేది స్పష్టం అవుతోంది. క్రీడల పట్ల ఆసక్తి ఉండి, ప్రతిభ ఉండి అవకాశాలు లేక, ప్రధానంగా ఆర్థిక ఇబ్బందుల కారణంగా రాణించలేకపోతున్న లక్షలాది మంది క్రీడాకారులకు సరైన వనరులు, వసతులు కల్పించే క్రీడా విధానం మనకుందా? అది లేదు కాబట్టే ఒలింపిక్స్‌లో ఒకటి, రెండు పతకాలతోనే సరిపెట్టుకుంటున్నాం. వాటితోనే రాజకీయ పబ్బం గడుపుకోవాలని మన నేతలు రాజకీయ క్రీడలు ఆడుతున్నారు. దేశీయంగానూ అందరికీ అందుబాటులో ఉండేలా ప్రతి రాష్ట్రంలో క్రీడా మైదానాలు, మౌలిక వసతుల కల్పన, ప్రతిభావంతులకు సరైన ప్రోత్సాహకాలు అందించే వ్యవస్థ సాకారం కావాలి. సహజ ప్రతిభకు కొదవలేని దేశంలో ఇతోధికంగా ప్రభుత్వాలు తోడ్పాటు సమకూరితే తప్ప ఇది సాధ్యం కాదు. అప్పుడే మన పతకాల దాహార్తి తీరుతుంది! క్రీడాకారులు ఇదే స్ఫూర్తి, ఉత్సాహంతో ముందుకుసాగితే వచ్చే ఏడాది పారిస్ ఒలింపిక్స్‌లో మనకు మరిన్ని పతకాలు లభించడం ఖాయం. •

మెయిల్ @ నవతెంగాణ


నిర్లక్ష్యపు నీడలో 'ఉన్నతవిద్య'

గత పదేండ్ల నుంచి తెలంగాణ రాష్ట్రంలో విద్యావ్యవస్థ ఛిన్నాభిన్నంగా తయారైంది. దీనికి తెలంగాణ ప్రభుత్వం విద్య పట్ల చూపిస్తున్న వివక్షాయే కారణం. నాడు రాష్ట్ర సాధనలో విద్యార్థులు, అధ్యాపకులు, మేధావులు పోరాటాల్లో పాల్గొన్నారు. ఉద్యమానికి ఒక వెన్నుదన్నుగా నిలిచారు. ప్రత్యేక రాష్ట్రం వస్తే తెలంగాణ విద్యావ్యవస్థ నిర్మాణాత్మకంగా తయారవుతుందని అందరూ భావించారు, కానీ దానికి భిన్నంగా ఎన్నో ప్రయివేటు జూనియర్, డిగ్రీ కళాశాలలు మూతబడ్డాయి, సుమారు 2860 జూనియర్ కళాశాలలు, 1080 డిగ్రీ కళాశాలు మూతబడ్డాయి అందులో పని చేస్తున్న సుమారు 50 వేల నుంచి 60 వేల మంది ఉద్యోగులు రోడ్డునపడ్డారు, దీనికి తోడు గ్రామీణ ప్రాంతాల్లో ఉన్నత విద్య అందని ద్రాక్షల తయారైంది. అందుకు ప్రభుత్వం కార్పొరేటు విద్యాసంస్థలను ప్రోత్సహించడమే. నిరుద్యోగ పట్టభద్రులు ఏర్పాటు చేసుకున్న విద్యాసంస్థలు చాలావరకు మూతపడ్డాయి. కనీసం ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ, బీసీ, ఈబీసీ విద్యార్థులకు అందించాల్సిన స్కాలర్‌షిప్‌లు, ట్యూషన్ ఫీజులు చెల్లించక విద్యార్థులను విద్యకు దూరం చేస్తున్న పరిస్థితి ప్రత్యక్షంగా కనిపిస్తుంది. గత రెండేండ్లనుంచి విద్యార్థుల జీవితాలతో పాలకులు చెలగాటమాడుతున్నారు. ప్రతి ఏడాది సుమారు 12లక్షల50వేల మంది విద్యార్థులు స్కాలర్‌షిప్‌లకు దరఖాస్తు చేసుకుంటున్నారు. వారికీ కావాల్సిన బడ్జెట్ సుమారు రూ.2350 కోట్లు మాత్రమే. అంటే రాష్ట్రం ప్రవేశపెట్టే వార్షిక బడ్జెట్‌లో కేవలం ఒక శాతం. అయినా అ డబ్బు విద్యా ర్థులకు చేరడం లేదు ప్రభుత్వ నిర్లక్ష్యం ఈ విధంగా ఉంటే విద్యార్థులు ఏ విధంగా పైచదువులకు వెళ్లగలుగుతారు. ఉన్నత విద్యతో పాటు పాఠశాల విద్య అగమ్యగోచరంగా తయారైంది. పాఠశాలలో అధ్యాపకులు లేక విద్యార్థులు పడుతున్న అవస్థలు అన్నీ ఇన్నీ కావు. విద్య, వైద్యం సమాజానికి రెండు కండ్లలాంటివని చెబుతారు. కానీ వాటిని మాత్రం ప్రభుత్వ పెద్దలు పట్టించుకోరు. విద్యార్థులకు ఇంటర్ ఫీజు కేవలం రూ.1740, రూ.1940 చెల్లిస్తే కళాశాలల్లో బోధన ఏ విధంగా చేస్తారు. వారి చదువులకు ఈ ఫీజులు సరిపోతాయా? జీవో 114 ప్రకారం పెంచాల్సిన పది శాతం గత తొమ్మిదేండ్ల నుంచి అసలు పెంచనేలేదు. కార్పొరేట్ ఫీజులు మాత్రం రూ.30వేల నుంచి 3లక్షల వరకు పెరిగాయి. ఎలాంటి అడ్డూ అదుపు లేకుండా యాజమాన్యాలు పెంచుకుంటు న్నాయి. కార్పొరేట్ సంస్థలకే ప్రభుత్వం అండగా నిలవడం సరి కాదు విద్యార్థులు చేసిన తప్పేంటి? అనాడు తెలంగాణ ఉద్యమంలో విద్యార్థులు ముందువరసలో ఉన్నారు. పాలకులు అనుసరిస్తున్న విధానాల వల్ల విద్యార్థులు, నిరుద్యోగులు నేడు రోడ్ల మీదకు వస్తున్నారు. దయచేసి ప్రజలంతా ఆలోచించాల్సిన సమయం వచ్చింది. విద్యా, వైద్య రంగాలకు ప్రాధాన్యతనిచ్చే వారిని గుర్తించి ఎన్నుకుంటే విద్యార్థుల జీవితాలు బాగుపడతాయి.

- గౌరి సతీష్, 9989021453

అంతర్జాతీయ పెట్టుబడి- జాతీయ నాయకత్వం

యూరప్ దేశాల ఆర్థిక వ్యవస్థల్ని దెబ్బతీసే ప్రయత్నాలకు అమెరికా పూనుకుంటోంది. అయినప్పటికీ, యూరప్‌లోని రాజకీయ నాయకత్వం ఇందుకు సహకరిస్తోంది. దీని వెనుక ఉన్న కుట్ర ఏమిటన్నది ప్రస్తుతం ఒక ప్రశ్నగా ఉంది. నార్డ్ స్ట్రీమ్ గ్యాస్ పైప్‌లైన్‌ను (రష్యా నుండి యూరప్‌కు రవాణా చేసే) పేల్చివేసింది అమెరికాయేనని ప్రఖ్యాత పరిశోధనాత్మక జర్నలిస్టు సైమోర్ హెర్ష్ (అమెరి కాకు చెందినవాడు) అందుకు అవసరమైన సాక్ష్యాధారాలను అందించాడు. ఈ పేల్చివేతకు ఉక్రెయిన్ యుద్ధంతో సంబంధం లేదని, అమెరికన్ గ్యాస్ సరఫరాలపై యూరప్ ఆధారపడవలసిన పరిస్థితిని కల్పించడమే బైడెన్ ప్రభుత్వ ఉద్దేశ్యమని హెర్ష్ తాజాగా వెల్లడించాడు. రష్యన్ గ్యాస్ కన్నా అమెరికన్ గ్యాస్ చాలా ఎక్కువ ఖరీదు. అయినా రష్యన్ గ్యాస్‌ను కాకుండా అమెరికన్ గ్యాస్ సరఫరాలపై మాత్రమే యూరప్ ఆధారపడాల న్నది అమెరికా ఆలోచన. ఈ చర్య కేవలం యూరోపియన్ యూనియన్ దేశాల ఆర్థిక వ్యవస్థల మీద, ప్రత్యేకించి జర్మనీ ఆర్థిక వ్యవస్థ మీద దాడి. రష్యా నుండి గ్యాస్ కొనుగోలు చేసే విధానాన్ని రూపొందించింది జర్మనీయే. ఆ విధంగా చూస్తే అమెరికా నేరుగా జర్మనీ విధానాన్ని దెబ్బ తీసినట్టే ఔతుంది. అమెరికా తలపెట్టిన ఈ ఆర్థిక విద్రోహానికి జర్మనీ లోని రాజకీయ నాయకత్వం వైపు నుండి రాజకీయ దౌత్య పరి భాషలోనైనా ఏ మాత్రమూ విమర్శ గాని, అభ్యంతరంగాని వ్యక్తం కాలేదు.



ప్రభాత్ పట్నాయక్

ఇప్పుడు జర్మనీలో అధికంగా ఉన్న గ్యాస్ ధరను అక్కడి పరిశ్రమలు భరించడం కష్టం గనుక జర్మన్ ప్రభుత్వం కొంత కాలం సబ్సిడీ ప్రకటించింది. త్వరలో ఆ సబ్సిడీకి గడువు తీరిపోనుంది. ఆ తర్వాత పెరగబోయే గ్యాస్‌ధరల గురించి ముందస్తుగానే ఆంచనాకు వచ్చిన గ్యాస్ ఆధారిత ఉత్పత్తులు ఇప్పుడు జర్మనీ నుండి అమెరికాకు తరలిపోతున్నాయి. ఇంత అడ్డగోలుగా జర్మనీ ఆర్థిక వ్యవస్థను అమెరికా దెబ్బతీస్తున్నా, జర్మన్ రాజకీయ వేత్తల నుండి ఒక్క స్పందన కూడా లేదెందుకని? దీనికి సమాధానం పూర్తిగా రావాలంటే ఇంకా కొంత లోతుల్లోకి పోవ లసి వుంటుంది. ప్రస్తుతానికి ఒక విషయం మాత్రం స్పష్టం. చాలా మంది యూరోపియన్ రాజకీయవేత్తలకు అమెరికన్ బహుళజాతి దిగ్గజ కంపెనీల నుండి సొమ్ము ముడుతోంది. అంతర్జాతీయ ద్రవ్య పెట్టుబడి మీద ఆధిపత్యం చెలాయించే ఆ కంపెనీలకు జాతీయ ప్రయోజనాల పట్ల ఏ మాత్రమూ ఖాతరు లేదు.

ప్రస్తుతం నయా ఉదారవాద విధానాలు తీవ్ర సంక్షోభంలో పడ్డాయి. అందుచేత సామ్రాజ్యవాద శక్తుల నడుమ ఐక్యత బలంగా ఉండడం కొత్త తరహా నాయకులకి అత్యవసరంగా మారింది. సంపన్న పెట్టుబడిదారీ దేశాల ఆధిపత్యాన్ని సవాలు చేసే బహుళధృవ స్వభావం ఎక్కడ వ్యక్తమైన అది వీళ్ళకి పెనుముప్పుగానే కనిపిస్తుంది. దానినుండి తమ ఆధిపత్యాన్ని కాపాడు కోవడానికి అత్యంత ప్రాధాన్యతనిస్తారు. తమ తమ దేశాల్లో కాని, మూడవ ప్రపంచ దేశాల్లో కాని కార్మికవర్గ ఉద్యమాల నుండి ఎదురయే సవాలు వారి దృష్టిలో ఎంత ప్రమాదకరమో, ఈ సంక్షోభ కాలంలో సామ్రాజ్యవాద దేశాల నడుమ ఏ పొరపొచ్చాలూ లేకుండా చూసుకోవడం కూడా వాళ్ళకి అంతే ముఖ్యం.

ద్రవ్య పెట్టుబడి అనే గ్రంథాన్ని రచించిన రుడాల్ఫ్ హిల్ఫర్‌డింగ్ బడా బ్యాంకుల అధిపతు లకు, బడా పరిశ్రమల అధిపతులకు నడుమ ఏర్ప డిన వ్యక్తిగత సంబంధాలే ద్రవ్య పెట్టుబడి మీద వారికి ఆధిపత్యాన్ని చెలాయించే శక్తినిస్తాయని వివరించాడు. ద్రవ్య పెట్టుబడి మీద పెత్తనం చేసే శక్తులకు, రాజకీయ అధికారాన్ని చెలాయించే వ్యక్తులకు నడుమ కూడా ఈ మాదిరిగానే వ్యక్తిగత సంబంధాలు ఉంటాయని తెలిపాడు. ఈ సంబంధాల కారణంగానే ఆ వ్యక్తులు రాజకీయాల నుండి పరిశ్రమల్లోకి, మళ్ళీ పరిశ్రమల నుండి రాజకీయాల్లోకి, లేదా బ్యాంకుల్లోకి చాలా సులువుగా మా రుతూ వుంటారు. అందువలన ప్రభుత్వం అమలు చేసే విధానం ఎప్పుడూ ద్రవ్య పెట్టుబడిని అదుపు చేసే ముఠా ప్రయోజనా లను నెరవేర్చేదిగానే ఉంటుంది.

ద్రవ్య పెట్టుబడి ఇంకా జాతీయ స్వభావాన్ని కలిగివున్న కాలంలో హిల్ఫర్‌డింగ్ తన గ్రంథాన్ని రచించాడు. ప్రస్తుత ప్రపంచీకరణయుగంలో ద్రవ్య పెట్టుబడి అంతర్జాతీయతను సంతరించుకుంది. కాని రాజ్యం ఇంకా జాతీయ స్వభావాన్నే కొనసాగిస్తోంది. ఇటువంటి పరిస్థితుల్లో అధికారం చెలాయించే రాజకీయ నాయకులకు, అంతర్జాతీయ ద్రవ్య పెట్టుబడికి నడుమ ఏర్పడిన వ్యక్తిగత సాన్నిహిత్యం ఆ అంతర్జాతీయ ద్రవ్య పెట్టుబడి ప్రయోజనాలనే నెరవేర్చుతుంది తప్ప దేశపు ప్రయోజనాలు పట్టవు. దేశపు ప్రయోజనాలు అంటే ఆ దేశంలో ఉన్న శ్రామిక జనావళి ప్రయోజనాలే. ఆ శ్రామిక జనాన్ని, వాళ్ళ సమస్యల్ని రాజకీయ నాయకులు పట్టించుకోరు.

గ్లోబల్ కార్పొరేట్లకు, యూరోపియన్ రాజకీయవేత్తలకు మధ్య వ్యక్తిగత సాన్నిహిత్యానికి సంబంధించి కొట్టొచ్చినట్టు కనిపించే ఉదాహరణలు చాలానే ఉన్నాయి. జర్మనీలో క్రిస్టియన్ డెమొక్రాట్ల నాయకుడు ఫ్రెడరిక్ మెర్జ్. ఆ పార్టీ తరఫున ప్రధాన ప్రతిపక్ష నేతగా వ్యవహరిస్తున్నాడు. ఇతగాడు ఒక శతకోటీశ్వరుడు. అమెరికాలో ఇతడికి చాలా వ్యాపార లావాదేవీలున్నాయి. అమెరికన్ బ్లాక్ రాక్ ఇన్వెస్ట్‌మెంట్ కంపెనీతో సహా చాలా అమెరికన్ కంపెనీల బోర్డుల్లో డైరెక్టర్‌గా ఉన్నాడు. ప్రస్తుతం ఫ్రాన్స్ దేశాధ్యక్షుడిగా ఉన్న ఇమ్మాన్యుయెల్ మాక్రాన్ అంతకు మునుపు ఒక ఇన్వెస్ట్‌మెంట్ బ్యాంకర్. రాథ్‌షైల్డ్ ఫైనాన్షియల్ గ్రూప్‌లో భాగస్వామి. నెస్లే, ఫైజర్ (ఈ రెండూ బహుళజాతి దిగ్గజాలు)ల మధ్య ఒక డీల్ కుదరడానికి మధ్యవర్తిగా వ్యవహరించి ఫైజర్‌కు చెందిన బేబీ ఫుడ్స్ విభాగాన్ని నెస్లే స్వాధీనం చేసుకోడానికి తోడ్పడ్డాడు మాక్రాన్.

ఇటీవల ఈ సాన్నిహిత్యం గ్రీస్‌లో బట్టబయలైంది. అక్కడ సిరిజా పార్టీ గతంలో అధికారంలోకి వచ్చింది. వామపక్ష పార్టీగా దానికి పేరు. ప్రస్తుతం అది గ్రీస్‌లో అతి పెద్ద ప్రతిపక్షం. గోల్డ్‌మాన్ సాక్స్ ఒక పెద్ద అమెరికన్ ఇన్వెస్ట్‌మెంట్ బ్యాంక్. దానిలో అధికారిగా పని చేసిన స్టెఫానోస్ కాస్సెలెకిస్ ఇప్పుడు సిరిజా పార్టీ నాయకుడిగా ఎన్నికయ్యాడు. ఈ కాస్సెలెకిస్‌కి గతంలోఎటువంటి రాజకీయ అనుభవమూ లేదు. గ్రీస్ దేశపు సమస్యలేవీ అతగాడికి తెలియవు. వామపక్ష సిద్ధాంత భావ జాలంతో అతడికేమాత్రమూ పరిచయం లేదు. ఎన్నిక సమయంలో అతడు ఏ సమస్యనూ ముట్టుకోలేదు. ఇతగాడిని ఎన్ను కోడానికి వీలుగా సిరిజా పార్టీ నిబంధనావళినే సవరించారు. స్వల్పకాల వ్యవధిలోనే ఎవరైనా సిరిజా పార్టీ సభ్యత్వం తీసుకోవచ్చునని, ఏ పదవికైనా పోటీ చేయవచ్చునన్నది ఆ సవరణ సారాంశం. ఇక కాస్సెలెకిస్ గ్రీస్ దేశానికి ఎప్పుడైనా ప్రధాని అయే వీలుంది. అసలు ఆ పాయింటు మీదే సిరిజా పార్టీ నాయకత్వ ఎన్నికలు జరిగాయి.

యూరోపియన్ రాజకీయవేత్తలుగా ముందుకొస్తున్న కొత్త తరహా నాయకులు అమెరికన్ కంపెనీలలో కార్యనిర్వాహక బాధ్యతలను నిర్వహించినవారు కావడం, తమ మాతృ సంస్థల ప్రయోజనాలను కాపాడడం కోసం వాళ్ళు తమ రాజ కీయ పదవులను ఉప యోగించడం, ఆ క్రమం లో తమ దేశ ప్రయోజనా లను సైతం బలి చేయ డం కనిపిస్తోంది. అంత కన్నా కీలకం ఏమంటే, వాళ్ళకి అసలు జాతీయ ప్రయోజనాలు అన్నవే పట్టకపోవడం. జాతీయ ప్రయోజనాల గురించి ఏ మాత్రమూ పట్టించుకోకుండా, కేవలం అంతర్జాతీయ ద్రవ్య పెట్టుబడి ప్రయో జనాలను నెరవేర్చడమే తమ పనిగా వాళ్లు భావిస్తున్నారు. అంతర్జాతీయ ద్రవ్య పెట్టుబడి పెత్తనాన్ని రాజకీయంగా సమర్థించే పనిలో వాళ్ళున్నారు. ఆ పెత్తనం కొనసాగాలంటే సామ్రాజ్యవాద దేశాల నడుమ ఐక్యత కొనసాగడం ముఖ్యం అని వాళ్లు భావిస్తు న్నారు. అందుచేత తమ తమ దేశాల ప్రయోజనాల కన్నా అట్లాంటిక్ మహా సముద్రానికి రెండువైపులా ఉన్న దేశాల మధ్య (సామ్రాజ్యవాద దేశాల మధ్య) ఐక్యతకు వాళ్ళిస్తున్న ప్రాధాన్యత అంతకు ముందటి తరం యూరోపియన్ దేశాల నాయకులిచ్చిన ప్రాధాన్యతకన్నా చాలా ఎక్కువ.



ఇప్పుడు సామ్రాజ్యవాద దేశాలలో కొత్త రకం రాజకీయ నాయకులు ముందుకొస్తున్నారు. వీళ్ల ఫాసిస్టు శక్తుల పరిధికి వెలుపలే ఉంటారు. ఈ తరహా నాయకులలో టోనీ బ్లెయిర్ తొలితరం వాడు. ఇలాంటివాళ్ల అటు కార్పొరేట్ ప్రపంచానికి, ఇటు రాజకీయ ప్రపంచానికి మధ్య అటు, ఇటు మారుతూ ఉంటారు. నయా ఉదారవాదానికి పూర్తిగా కట్టుబడి వుండడం, శ్రామికవర్గం పట్ల తీవ్ర శత్రుత్వం ప్రదర్శించడం-ఇదే వీళ్ళ సిద్ధాంతం. వాళ్లు వామపక్ష పార్టీలో ఉన్నా, వామపక్ష-మధ్యేవాద పార్టీలో ఉన్నా, వాళ్ళ తీరు అదే. టోనీ బ్లెయిర్ "లేబర్ పార్టీ" ప్రధానమంత్రి. ఇమ్మాన్యుయెల్ మాక్రాన్ ఒక "సోషలిస్టు" ప్రభుత్వంలో ఆర్థిక మంత్రిగా గతంలో పని చేశాడు. ఇప్పుడు కాస్సెలెక్కిస్ ఒక వామపక్ష పార్టీకి నాయకుడిగా ఎన్నికయ్యాడు. వీళ్ళెవరికీ, తమ తమ దేశాల ప్రయోజనాలు ఏ మాత్రమూ పట్టవు.

గతంలో దేశాధినేతలుగా వ్యవహరించిన డిగాల్, విల్లీ బ్రాండ్ట్. వంటివారికి, వీళ్ళకి ఏ మాత్రమూ పోలిక లేదు. గత కాలపు నేతలు వారి వారి సైద్ధాంతిక భావజాలం ఏమైనప్పటికీ, అమెరికాకు అనుకూలంగా ఉన్నప్పటికీ, తమ దేశ ప్రయోజనాలకే మొదటి ప్రాధాన్యతనిచ్చారు. వాళ్లు పూర్తిగా రాజకీయ నేపథ్యం నుండి వచ్చినవాళ్లు. వాళ్లున్న కాలంలో ద్రవ్య పెట్టుబడి ఇంకా అంతర్జాతీయ స్వభావాన్ని సంతరించుకోలేదు.

ప్రస్తుతం నయా ఉదారవాద విధానాలు తీవ్ర సంక్షోభంలో పడ్డాయి. అందుచేత సామ్రాజ్యవాద శక్తుల నడుమ ఐక్యత బలంగా ఉండడం కొత్త తరహా నాయకులకి అత్యవసరంగా మారింది. సంపన్న పెట్టుబడిదారీ దేశాల ఆధిపత్యాన్ని సవాలు చేసే బహుళధ్రువ స్వభావం ఎక్కడ వ్యక్తమైన అది వీళ్ళకి పెనుముప్పుగానే కనిపిస్తుంది. దానినుండి తమ ఆధిపత్యాన్ని కాపాడుకోవడానికి అత్యంత ప్రాధాన్యతనిస్తారు. తమ తమ దేశాల్లో కాని, మూడవ ప్రపంచ దేశాల్లో కాని కార్మికవర్గ ఉద్యమాల నుండి ఎదురయే సవాలు వారి దృష్టిలో ఎంత ప్రమాద కరమో, ఈ సంక్షోభ కాలంలో సామ్రాజ్యవాద దేశాల నడుమ ఏ పొరపొచ్చాలూ లేకుండా చూసుకోవడం కూడా వాళ్ళకి అంతే ముఖ్యం.

ఈ తరహా నాయకులు ఆయా దేశాల ప్రయోజనాలను పట్టించుకోకపోవడం వలన ఆ సంపన్న దేశాలలో ఫాసిస్టు శక్తులు బలపడడానికి అవకాశాలు పెరుగుతాయి. ఫాసిస్టు శక్తులు ఇప్పుడు కూడా 'జాతీయ ప్రయోజనాలు' అంటూ నే మాట్లాడతాయి. ఆ మాటల ముసుగులో కార్మిక వర్గాన్ని ఆకర్షిస్తాయి. ఒకసారి అధికారంలోకి వచ్చాక వాళ్లు అనుసరించే ఆర్థిక విధానాలు, విదేశాంగ విధానాలు జాతీయ, అంతర్జాతీయ కార్పొరేట్లకు అనుగుణంగానే ఉంటాయి. ఇప్పుడు ఇటలీలో మెలొనీ చేస్తున్నదిదే. ప్రతిపక్షంలో ఉన్నప్పుడు మాత్రం పెద్దగా గోలచేస్తూ తామే దేశ రక్షకుల మన్నట్టు ఫోజు పెడతారు.

ఈ పరిస్థితి అంతర్జాతీయ ద్రవ్య పెట్టుబడికి ఎటునుంచి చూసినా, అనుకూలమే అయింది. అటు ఉదారవాద బూర్జువా పార్టీలు అధికారంలోకి వచ్చినా, ఇటు ఫాసిస్టు పార్టీలు అధికారంలోకి వచ్చినా అంతర్జాతీయ ద్రవ్య పెట్టుబడికి ఢోకా ఏమీ ఉండదు. జాతీయ ప్రయోజనాలను పట్టించుకోకుండా వదిలేసే ఉదారవాద బూర్జువా పార్టీలనో, లేకపోతే, ఫాసిస్టు పార్టీలనో- ఈ రెండు కూటములలో ఏదో ఒకదానిని ఎంచుకోవడం వినా ప్రజలకు వేరే మరో ప్రత్యామ్నాయం లేకుండాపోయింది. ఇప్పుడు యూరప్ లో ఫాసిస్టు పార్టీలు తమ తమ దేశాల్లోకి వలసలు వస్తున్న ఇతర దేశాల శరణార్థుల్ని లక్ష్యంగా చేసుకుని జాతీయ దురభిమానాన్ని రెచ్చగొడుతున్నారు. ఆ దేశాల్లోని శ్రామిక ప్రజలు తమ కష్టాలకు కారణం ఆ శరణార్థులే అని భావించేలా ప్రచారం సాగిస్తున్నారు.

అటు కార్పొరేట్-రాజకీయ నేతల నుండి, ఇటు ఫాసిస్టు పార్టీల నుండి తమ దేశ ప్రయోజనాలను, శ్రామిక వర్గ ప్రయోజనాలను కాపాడుకుంటూ అంతర్జాతీయ ద్రవ్య పెట్టుబడి ఆధిపత్యాన్ని సవాలు చేయడం ఇప్పుడు సిసలైన వామపక్ష పార్టీల ముందున్న కర్తవ్యం. •

(స్వేచ్ఛానుసరణ)

పోరాటం ధ్వనించే వాక్యమతడు

'సుద్దాల హనుమంతు' అనే పేరు తలవగానే మనసు లో ఓ వైబ్రేషన్ మొదలవుతుంది. అది ఒక నామవాచకం మాత్రమే కాదు. ఉద్యమ క్రియాపదం. పోరాటం ప్రతి ధ్వనించే వాక్యం. పల్లెటూరి పిల్లగాని వేదనా భరిత జీవన దృశ్యాన్ని జ్ఞప్తికి తెచ్చే పాట. అంతేకాదు నేటి కవులకు, కళాకారులకు దిశను నిర్దేశం చేసే విశేషణ ధ్వని. సుద్దాల సామాన్యుడే, కానీ ఆయన జీవన గమనం, నిర్వర్తించిన కార్యం మహోన్నతం. ప్రేరణా త్మకం. అసామాన్యం. చైతన్యయుత స్ఫూర్తి. అందుకే మళ్లీ మళ్లీ ఆ పేరును తలవాలి. జీవితాన్ని చదవాలి. ఆయన సృజనాత్మక గీతోపదేశాల్ని పుణికిపు చ్చుకోవాలి. ఎందుకంటే అవి నేటికీ అత్యంత ఆవశ్యకమయిన చైతన్యాన్ని నింపుతూనే వున్నాయి. మనుషులకు మరణముంటుంది. కానీ వాళ్ల బతికిన కాలాలలో చేసిన ఆలోచనలు, జనం కోసం చేసిన పనులు, ఉన్నతాశయంతో నడిచిన అడుగులు, నిరంతరం వెలుగులు పంచుతూనే ఉంటాయి. అదీ ముఖ్యంగా ఒక కళా కారుని సృజన జనహృదయాలను కదిలిస్తూనే వుంటుంది. చైతన్య జ్వాలను రగిలిస్తూనే వుంటది. అనర్గళం, అనితర సాధ్యమైన మార్గాన ప్రజా శ్రేయస్సు కోసం పయనించిన హనుమంతు జీవితం సజీవ స్ఫూర్తిని అందిస్తూనే వుంటుంది. అందుకే ఈ మననం, ఈ స్మరణం.




కె. ఆనందాచారి
9948787660

తీగలాగితే డొంకంతా కదిలినట్టు, సుద్దాల హనుమంతు జీవితాన్ని, సాహిత్యాన్ని పరామర్శించి చూస్తే, గతంలోని ప్రజల వాస్తవిక చరిత్ర తవ్విపోసినట్టుగా కనిపిస్తుంది. ఇప్పుడు అలా తవ్విపోయటం మరింత అవసరమవుతున్నది. ఎందుకంటే చరిత్రను కూడా వక్రీకరిస్తూ, మనుషుల మధ్య అగాధాలను సృష్టిస్తున్న శక్తులు కళా సాహిత్యరంగంలోకి వచ్చి మసిపూసి మారేడుకాయ చేస్తున్న సందర్భం ఇది. వాస్తవిక చరిత్రను, ఆయన పాట ప్రతిధ్వనిస్తూనే వుంది. వక్రబుద్ధుల గుండెలపై తూటాలా పేలుతుంది. ప్రగతిశీల శక్తులందరికీ ఆయన కవిత్వం ఆయుధం లాంటిది. నేటి యువతకు మరింత పదునుపెట్టే సాధనమది. అందుకే సుద్దాల హనుమంతు జీవితాన్ని, సాహిత్యాన్ని అధ్యయనం చేయాలి. మరోమారు జనకళను, జన కవనాన్ని సానపెట్టుకోవాలి. విచ్ఛిన్నకర శక్తుల అసత్య వాదాలను తిప్పికొట్టాలి.

చరిత్ర నిర్మాతలు ప్రజలే అన్నది నిత్యం రుజువయ్యే సత్యం. తెలంగాణ వీరోచిత సాయుధ పోరాటమూ అదే రుజువు చేసింది. తిరుగుబాటును సృజించేది అణచివేతనే. దోపిడీ మూలంగానే విప్లవం చెలరేగుతుంది. పీడనలోంచే ధిక్కారం పెల్లుబుకుతుంది. అందుకు నిలువెత్తు ఉదాహరణ తెలంగాణ నేల. సామాన్యులయిన మట్టి మనుషులు సాయుధులై పోరాడారు. నీ బాంచను కాల్మొక్తా అన్నవాడు, నీ గోరీ కడ్తం కొడకా! అని నినదిం చాడు. నాలుగు వేల మంది వీరులు పోరాడి ప్రాణాలను అర్పించారు. ఇదేదో భావోద్వేగంతోనో, మత విద్వేషంతోనో చేసింది కాదు. తన బతుక్కు ఆధారమైన భూమి కోసం, వెట్టి పీడన విముక్తి కోసం చేసింది. జమీందారులు, జాగీర్దారులూ, నైజాము పాలకులూ ప్రాణాలు తీసింది కూడా అందు కోసమే. భారతదేశ రాజకీయ, ఆర్థిక దిశను కూడా ప్రభావితం చేసిన పోరాటం ఇది. దేశంలో భూసంస్కరణలను, సామ్యవాద విధానాల నినాదాన్ని పాలక వర్గాలు సైతం తలకెత్తుకోక తప్పని పరిస్థితులను సృష్టించిందీ సమరం. అంతటి మహా సమరంలో తెలంగాణ నేల మహావీరులను సృష్టించింది. చరిత్ర మరచిపోని యోధులుగా వారు నిలిచారు. వీరులేకాదు, మహాకవులూ, కళాయోధులూ ఉద్భవించారు. జానపద కళలను ప్రజాకళలుగా తీర్చి విముక్తి యుద్ధంలో స్వరాలను ఎక్కుపెట్టారు. అట్లా ప్రజా కళా సైనికునిగా జీవితాన్ని చరితాత్మకం చేసుకున్నాడు సుద్దాల హనుమంతు. అందుకే ఆయన జీవితం సార్థకం, అమరం.

ఒక కళాత్మక హృదయం ప్రజాకళకు, ఉద్యమానికి ఎలా పరిణామం చెందుతుందో హనుమంతు జీవితం మనకు తేటతెల్లపరుస్తుంది. అతిసామాన్యులను సైతం మహా రచయితలుగా మలచగల స్ఫూర్తి ప్రజల నుండే వస్తుంది. అతి మామూలు పోరాట యోధుడు బండి యాదగిరి **'బండెనక బండి కట్టి...'** పాట ఇప్పటికీ మనందరినీ ఉర్రూతలూగిస్తూనే ఉండటం అందుకు ఉదాహరణ. సుద్దాల హనుమంతు అనే పేరు వినపడగానే **'పల్లెటూరు పిల్లగాడా, పశులగాసే మొనగాడా'** పల్లవి సజీవదృశ్యమై కనుల ముందు నిలుస్తుంది కదా! అంతేకాదు, హనుమంతు పాటలను అధ్యయనం చేస్తే, ఆ సామాజిక, రాజకీయ, ఆర్థిక జీవన చరిత్ర అంతా నిండి వుంటుంది. నైజాము పరిపాలనలో ప్రజల జీవనము, నైజాం అనంతరం కాంగ్రెసు పాలన ఏ విధంగా వున్నది, ప్రజలెన్ని అగచాట్లకు, వేదనలకు గురవుతున్నది తెలుస్తుంది. ప్రపంచంలో సామ్రాజ్యవాదం చేస్తున్న దురాక్రమణలు, దురాగతాలు కూడా విశదమవుతాయి. అంటే ఒక కవికి, కళాకారునికి స్థానిక విషయావగాహన మాత్రమే గాక ప్రపంచ పరిణామాలపై అవగాహన అవసరమని హనుమంతు సాహిత్యం గుర్తు చేస్తుంది. ప్రపంచ దృక్పథం కలిగిన ప్రజాకళాకారుడు సుద్దాల. **'వా వారెవా వహ్వారె రేవా.... తెలంగాణ పోరాటము / తెరచి కనులు చూచింది'** అనే పాటను రాయాలంటే ప్రపంచ గమనం ఎంత తెలిసుండాలి. **'మహా విప్లవం సాగునులే / మహినంతట జ్వాలలు లేచునులే'** అని స్థిరంగా చెప్పగలిగిన కళాపథికుడు. ఒక పాటకు, కళారూపానికి కావలసిన వస్తువు ఎంపికకు ప్రపంచ అవగాహన ఎంత ముఖ్యమో మనం ఆయన నుండి తెలుసుకోవాలి. సాహిత్య సృజనలో ప్రజల భాషను ఎలా పట్టు కోవాలో కూడా సుద్దాల పాటల ద్వారా నేర్చుకోవచ్చు. **'వేయ్ వేయ్ వేయర దెబ్బ, దెబ్బకు దెబ్బ వేయ్ వేయ్'** అనే పల్లవి, సభపై దాడి చేస్తున్న రౌడీమూకను చూసి ఒక ముసలమ్మ అన్న మాటను తీసుకునే పాటను కట్టటం ప్రజా కవులకు ఓ పాఠం లాంటిది. ఉద్యమంలో ప్రతి మాటా ఓ నినాదమవుతుంది. నినాదమే పాటకు పల్లవిగా మారుతుంది. ఎన్ని విషయాలనో తన పాటకు వస్తువు చేసుకున్నాడు. పిల్లల గురించి, తల్లుల గురించి, రైతుల బాధలు, కూలివాని గోసను, మతం చిచ్చును, కుల పీడనను, సాంఘిక దురాచారాలను, దురలవాట్లను, భూస్వాముల దౌర్జన్యాలను, ఎన్నికల సమయంలో పాలకుల పన్నాగాలను, ప్రణాళికల భాగోతాన్ని, ఎర్రజెండా రెపరెపలను, ఆశయ పతాకను, అమరుల త్యాగాలను ఎన్నో ఎన్నెన్నో అతని కలం కవాతు చేస్తూ కదిలింది. ఏ ఒక్కటీ వదిలిపెట్టలేదు. అన్నిట్లోనూ ఆశయంపై ఆశను కొనసాగించాడు. సమాజంలో వున్న సహస్ర వృత్తుల సమస్త జనుల బాధలను గాథలను గానం చేశాడు. **'వెట్టి చాకిరి విధానమోరన్నా, ఎంత జెప్పినా తీరదో కూలన్న, మాదిగన్న, మాలన్న, వడ్రంగి వడ్డెరన్న బేగరన్న, కుమ్మరన్న, కమ్మరన్న, కూలన్న, రైతన్న, చాకలన్న వెట్టిచేత చాలగలదురోరన్న ! వేకువనే లేవాలి వాకిలూకి చల్లాలి / మేదంతా కడగాలి / తడినంతా తుడవాలి'** అంటూ వెట్టి పనులన్నీ ఏకరువు పెడతాడు. సుద్దాల పాటలు చదవండి, ఎంత దోపిడి ఎలా జరిగిందో తెలుస్తుంది. అంతేకాదు సాధు వేషధారణలో తత్వగీతాలను ప్రజా సమస్యల కలబోతగా మలిచిన తీరు, ప్రజా కళాకారులకు, రచయితలకు ఉపయోగ పడుతుంది. గొల్ల సుద్దులు కళారూపాన్ని తీసుకుని తెలంగాణ సాయుధ పోరాట చరిత్రను ఎంతో సరళంగా వివరిస్తారు. నైజాము కుటలను, కాంగ్రెస్ అసలు రూపాన్ని అన్నీ పల్లె పదాలలో నింపి విని పించడం చూడగలము. పోరాట చరిత్రను, సంఘటనలను ప్రేరణాత్మకంగా కళ్లకుగట్టడం సుద్దాల ప్రతిభకు, నిబద్ధతకు నిదర్శనం. అంటే పీడితుల పక్షాన నిలబడి రాసే కవికి ఉండాల్సిన ఎరుక, పరిజ్ఞానం, అవగాహన సుద్దాల నుండి మనం నేర్చుకోవాలి. ఇక యక్షగానం ప్రక్రియను ఎంచుకుని శ్రీలక్ష్మిని వేడుకుం టూనే భూస్వాముల ఆగడాలను వివరించి, వారి నుండి కాపాడమని వేడు కోవడం చూస్తే, ప్రజలలోకి ప్రజా కళాకారుడు ఎలా పోవాలో అర్థమవుతుంది.



సుద్దాల హనుమంతు అనే పేరు వినపడగానే 'పల్లెటూరు పిల్లగాడా, పశులగాసే మొనగాడా' పల్లవి సజీవదశ్యమై కనుల ముందు నిలుస్తుంది కదా! అంతేకాదు, హనుమంతు పాటలను అధ్యయనం చేస్తే, ఆ సామాజిక, రాజకీయ, ఆర్థిక జీవన చరిత్ర అంతా నిండి వుంటుంది. నైజాము పరిపాలనలో ప్రజల జీవనము, నైజాం అనంతరం కాంగ్రెసు పాలన ఏ విధంగా వున్నది, ప్రజలెన్ని అగచాట్లకు, వేదనలకు గురవుతున్నది తెలుస్తుంది. ప్రపంచంలో సామ్రాజ్యవాదం చేస్తున్న దురాక్రమణలు, దురాగతాలు కూడా విశదమవుతాయి. అంటే ఒక కవికి, కళాకారునికి స్థానిక విషయావగాహన మాత్రమే గాక ప్రపంచ పరిణామాలపై అవగాహన అవసరమని హనుమంతు సాహిత్యం గుర్తుచేస్తుంది. ప్రపంచ దృక్పథం కలిగిన ప్రజాకళాకారుడు సుద్దాల.

తెలంగాణ సాయుధ పోరాటకాలంలోనే కాదు. పోలీస్ యాక్షన్ తర్వాత, కాంగ్రెసు ప్రభుత్వం ఎవరి పక్షం వహించిందో స్పష్టంగా తెలిసిన హనుమంతు అప్పుడు కూడా ప్రజలు పడుతున్న బాధలపై పాటలు కట్టాడు. **'మంటలు మంటలు దేశమంతట ఆకలి మంటలు, ఇంకెన్నాళ్లో ఈ నరకం / ఇంకెందులకీ చెలగాటం'** అన్న పాదం చదివితే పాలకులు వ్యా పార వర్గాలకు ఎలా మేలు చేశారో విశదమవుతుంది. ఇక **'జై యనరా జైజై అనరా! అరుణ పతాకకు జై జై అనరా!'** అన్న ఆత్మ విశ్వాసాన్ని నిండుగా గల కవి సుద్దాల. అటు జానపద బాణీలను, పల్లె పదాలను అనుసరిస్తూ ప్రజా ఉద్యమానికి నూతనోత్తేజాన్ని అందిస్తూ, గేయ నడకలో కొత్తగా వస్తున్న లయాత్మక కవనరీతినీ పట్టుకుని పాటలల్లాడు. "ప్రజా ప్రభుత్వం, ప్రజా ప్రభుత్వం /ప్రజా ప్రభుత్వం సాధిస్తాం / నిజాములో ప్రతి బజారులో మా ధ్వజం ఎర్రనిది ఎగరేస్తాం" పాట శ్రీశ్రీ మరో ప్రపంచం మరో ప్రపంచం గేయాన్ని గుర్తు కు తెస్తుంది. తన రచనా నైపుణ్యాన్ని ప్రతి పాదంలోనూ ప్రజా దృక్పథం వీడకుండా సాగిపోతుంది. సామాజిక అధ్యయనం, ఉద్యమంలో భాగస్వామ్యం, నిబద్ధ రాజకీయ అవగాహన, కవన నైపుణ్యం అన్నీ కలిపిన ప్రజాయుద్ధ కళాగొంతు మన సుద్దాల హనుమంతు. ఆనాటి ప్రజాకళాకారులు, సాహితీకా రులు ప్రజా రాజకీయాలలో ఉద్యమాలలో భాగస్వాములుగానే వున్నారు. సుద్దాల కూడా ధైర్యంగా ముందు నిలిచాడు. అరణ్యవాసమూ, అజ్ఞాతవాసమూ అనుభవించాడు. గుండెనిండా ఆశయం, కళాతపన నిండుగా వున్న సంపద్వంతుడు. ఒక్క 'పాల బుగ్గల జీతగాడా'... పాటను పరిశీలిస్తే చాలు ఎంత గొప్ప కవో అర్థమవుతుంది. భావి పౌరుల దు:ఖమయ జీవనాన్ని అక్షరాల్లోకి వంచిన పాటది. కేవలం జీవ నాన్ని వెల్లడించడమే కాదు. "కష్టజీవుల కడుపునిండ / కనికరించే ఎర్రజెండ /ఎర్ర కోటపై ఎగరాలంటావా ఓ పాల బుగ్గల జీతగాడా... దోపిడీ దొరల రాజ్యం పోవాలంటావా/" అని ముగించడంలో చిగురించే ఆశను సూచిస్తాడు. అదీ హనుమంతు ఆశయం. నేటి ప్రజా కళాకారులకు, కవులకు ఆయన సాహిత్యం ఒక దిక్సూచి. తెలంగాణ నేలలో అనేక మంది ప్రజాకళాకారులకు ఆయన మార్గదర్శి. ఒక స్ఫూర్తి, ప్రేరణ, నింపుకునే చైతన్యం. •

(నేడు సుద్దాల హనుమంతు 41వ వర్ధంతి)

కనీస వేతనాల జీవోలను గెజిట్ చేయాలి

లేకుంటే కేసీఆర్‌కు కోటి మంది కార్మికులు బుద్ధి చెబుతారు

- యాజమాన్యాలకు లాభాల కోసం కార్మికుల పొట్టగొట్టడం సరిగాదు
- సీఐటీయూ రాష్ట్ర అధ్యక్షులు చుక్కరాములు
- రాష్ట్ర కార్మిక శాఖ కార్యాలయం ఎదుట కార్మిక సంఘాల నిరసన దీక్ష



నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

రాష్ట్ర ప్రభుత్వం జారీ చేసిన కనీస వేతనాలకు సంబంధించిన జీవో నెంబర్ 21,22,23,24,25లను వెంటనే గెజిట్ చేయాలని సీఐటీయూ రాష్ట్ర అధ్యక్షులు చుక్క రాములు డిమాండ్ చేశారు. లేనిపక్షంలో వచ్చే ఎన్నికల్లో తమ ఓటు ద్వారా కేసీఆర్‌కు తగిన బుద్ధి చెప్పేందుకు కోటి మంది కార్మికులు సిద్ధంగా ఉన్నారని హెచ్చరించారు. కేంద్రంలోని మోడీ సర్కారు కార్మిక వ్యతిరేక విధానాలను వేగంగా అమలు చేస్తున్నదని ప్రశ్నించారు. కేంద్రం మీద కేసీఆర్ నిజంగా కొట్లాడే వాడై అయితే కార్మికులకు న్యాయం చేసే జీవోల విషయంలో ఎందుకు తాత్సారం చేస్తున్నారని ప్రశ్నించారు. సోమవారం హైదరాబాద్‌లోని కార్మిక శాఖ కార్యాలయం(అంజయ్య భవన్) ఎదుట కార్మిక సంఘాల ఆధ్వర్యంలో నిరసన దీక్ష చేపట్టారు. ఈ సందర్భంగా రాములు మాట్లాడుతూ..కేంద్రం విధానాల వల్ల ద్రవ్యోల్బణం పెరిగిపోయిందనీ, నిత్యావసర సరుకుల ధరల పెరుగుదలతో కార్మికుల జీవితాలు దుర్భరంగా మారాయని వాపోయారు. యూరప్, చైనా, తదితర దేశాల్లో ఆర్థిక సంక్షోభాలు వచ్చినప్పుడు దాని నుంచి బయటపడేందుకు కార్మికుల వేతనాలను పెంచిన విషయాన్ని గుర్తుచేశారు. ఏ దేశంలోనైనా ప్రజల చేతుల్లో డబ్బు తిరుగుతూ ఉంటే ఆర్థిక వ్యవస్థ బాగుంటుందనీ, అదే డబ్బు పెట్టుబడిదారుల చేతుల్లో బందీ అయితే ఏం ప్రయోజనం ఉండదని వివరించారు. కర్నాటక, మహారాష్ట్ర, తమిళనాడు, తదితర రాష్ట్రాల్లో కనీస వేతనాలు అమలవుతున్నాయన్నారు.

ఐఎన్‌టీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆర్‌డీ. చంద్రశేఖర్ మాట్లాడుతూ..రాష్ట్రంలో ఉద్యోగులకు రెండు సార్లు జీతాలు పెరిగాయనీ, అదే సమయంలో ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, మంత్రులు, సీఎం తమ వేతనాలనూ పెంచుకున్నారని చెప్పారు. పదేండ్ల కాలంలో కార్మికులు ఏం పాపం చేశారని పెంచలేదని ప్రశ్నించారు. కనీస వేతనాలు సవరించకుండా కార్మికులను కడు పేదరికంలోకి నెట్టివేస్తున్న కేసీఆర్‌కు తగిన బుద్ధి చెప్పాలని పిలుపునిచ్చారు. ఐఎఫ్‌టీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సూర్యం మాట్లాడుతూ..అరకొర వేతనాలిస్తూ ఇతర రాష్ట్రాల కంటే ఎక్కువ ఇస్తున్నామని సీఎం కేసీఆర్ గొప్పలు చెప్పడం సరిగాదన్నారు. ఒక్కో రాష్ట్రంలో ఒక్కోలా జీవన ప్రమాణాలుంటాయనీ, దానికి తగ్గట్టు ఖర్చులుంటాయని పలు రాష్ట్రాల్లో, తెలంగాణలో ఉన్న ధరలను పోల్చుతూ వివరించారు. యజమానులకు అధిక లాభాలు దక్కేలా పాలకులు కొమ్ము కాస్తూ కార్మికుల పొట్ట గొట్టడం సబబు కాదన్నారు. ఐఎఫ్‌టీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎం.శ్రీనివాస్ మాట్లాడుతూ..నిత్యావసరాల ధరలు, ఇంటి అద్దెలు, ఇతరత్రా ఖర్చులు పెరిగిన నేపథ్యంలో వెంటనే కనీస వేతనాల జీవోలను గెజిట్ చేయాలని డిమాండ్ చేశారు. చట్టం ప్రకారం ఐదేండ్లకోసారి వేతనాలు సవరించాల్సి ఉండగా టీఆర్‌ఎస్ ప్రభుత్వం ఒక్కసారి కూడా ఆ పని చేయలేదని విమర్శించారు.

కనీస వేతనాల బోర్డు సభ్యులు, సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షులు జె.మల్లిఖార్జున్ మాట్లాడుతూ..2021 జూన్‌లో ఐదు రంగాలకు ఫైనల్ నోటిఫికేషన్ ఇచ్చారనీ, వాటిలో అన్‌స్కిల్డ్ వర్కర్‌కు మినిమం బేసిక్ రూ. 18,019, వీడీఏ రేటు రూ. 12 నిర్ణయించారని తెలిపారు. ఆ తర్వాత సెమీస్కిల్డ్, స్కిల్డ్, హైలీ స్కిల్డ్ కార్మికులకు వేతనాలు పెంచాలనే తీర్మానం జరిగిందన్నారు. కానీ, గెజిట్ చేయలేదన్నారు. యాజమాన్య సంఘాలు అభ్యంతరం వ్యక్తం చేస్తే ఆ మీటింగ్‌లో అన్ని కార్మిక సంఘాలు ఏకాభిప్రాయంతో ఐదు ఫైనల్ నోటిఫికేషన్లను గెజిట్ చేయాలని కోరిన విషయాన్ని గుర్తు చేశారు. కనీస వేతనాల సలహా మండలి సూచనలను పెడచెవిన పెట్టడం సరిగాదన్నారు. సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షులు భూపాల్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ఏసురత్నం(ఏఐటీయూసీ), రెబ్బారామారావు(హెచ్‌ఎంఎస్), ఎంకే.బోసు(టీఎన్‌టీయూసీ), సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షులు బి. మల్లేశం, జె. చంద్రశేఖర్, రాష్ట్ర కార్యదర్శులు బి. మధు, కూరపాటి రమేష్, రాష్ట్ర కమిటీ సభ్యులు యాటల సోమన్న, రాజన్న తదితరులు పాల్గొన్నారు.

కలిసికట్టుగా ముందుకెళ్తాం

- తెలంగాణలో నిశ్శబ్ద విప్లవం రాబోతున్నది : జి.కిషన్‌రెడ్డి
- బీజేపీలో చేరిన ఢిల్లీ వసంత్‌కుమార్, సురేందర్

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

ఎన్నికలకు బీజేపీ పూర్తిస్థాయిలో సిద్ధంగా ఉందనీ, నాయకులమంతా కలిసికట్టుగా ముందుకెళ్తామని బీజేపీ రాష్ట్ర అధ్యక్షులు, కేంద్ర మంత్రి జి.కిషన్‌రెడ్డి చెప్పారు. సోమవారం హైదరాబాద్‌లోని బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో కిషన్‌రెడ్డి, ఈటల రాజేందర్ సమక్షంలో జహీరాబాద్‌కు చెందిన ఢిల్లీ వసంత్‌కుమార్, ఇల్లందు నియోజకవర్గానికి చెందిన లక్కినేని సురేందర్ బీజేపీలో చేరారు. ఈ సందర్భంగా కిషన్‌రెడ్డి మాట్లాడుతూ..తెలంగాణలో నిశ్శబ్ద విప్లవం ద్వారా బీజేపీ అధికారంలోకి రాబోతున్నదనీ, రెండు, మూడు స్థానాల కోసం బీఆర్‌ఎస్, కాంగ్రెస్ పోటీపడుతున్నాయని చెప్పారు. తెలంగాణలో అవినీతి, కుటుంబ, నియంతృత్వ దుర్మార్గపు కేసీఆర్ కుటుంబ పాలన పోవాలని ప్రజలు మార్పు కోరుకుంటున్నారన్నారు. 30, 40 రోజులు సర్వశక్తులూ ఒడ్డి బీజేపీ జెండా ఎగురవేస్తామని చెప్పారు. ఉద్యమకారులను అణచివేసింది కాంగ్రెస్, బీఆర్‌ఎస్‌నేనన్నారు. ఉద్యమ ద్రోహులు ప్రగతిభవన్, ఫామ్‌హౌజ్‌లో చేరిపోయారన్నారు. డబ్బు, అధికార దుర్వినియోగం జరగకుండా ఎన్నికలు జరగాలని కోరుకుంటున్నానన్నారు. ఎన్నికల షెడ్యూల్ వచ్చాక తొలిసారి మంగళవారం ఆదిలాబాద్‌లోని బహిరంగసభలో అమిత్‌షా పాల్గొంటున్నారనీ, సాయంత్రం సికింద్రాబాద్‌లోని ఇంపీరియల్ గార్డెన్‌లో మేధావులతో భేటీ అవుతారని చెప్పారు. బుధవారం గిరిజన మోర్చా ఆధ్వర్యంలో ములుగు వెళ్తున్నామన్నారు. రాజాసింగ్ సస్పెన్షన్ ఎత్తివేతపై త్వరలో చెబుతామన్నారు. ఈటల రాజేందర్ మాట్లాడుతూ..రాష్ట్రంలో ఎన్నికలు చాలా ఖరీదు అయిపోయాయన్నారు. ఇంత నీచ కల్చర్ కు ఆద్యుడు కేసీఆర్ అనే విమర్శించారు. బీఆర్‌ఎస్ డబ్బులనే నమ్ముకుని పోటీకి దిగుతున్నదనీ, ఇతర పార్టీల నేతలను డబ్బులతో కొనుక్కుని నీచ సంస్కృతికి కేసీఆర్ పూనుకున్నారని ఆరోపించారు. ప్రజలతో మద్యం తాగించడం, ప్రభుత్వ భూములను అమ్మి ఆదాయం రాబట్టడం, ఎన్నికల్లో డబ్బులు పంచడంలో కేసీఆర్ నంబర్ వన్ స్థానంలో ఉన్నారని విమర్శించారు. అడుక్కునే వారిపైనా లక్షన్నర అప్పు పెట్టిన ఘనత కేసీఆర్‌దేనని దెప్పిపొడిచారు. తమ పార్టీకి ఓట్లు వేయకపోతే పింఛన్లు, ప్రభుత్వ పథకాలు అందవని బీఆర్‌ఎస్ పార్టీ వాళ్లు క్షేత్రస్థాయిలో ఓటర్లను బెదిరిస్తున్నారని ఆరోపించారు.

నేడు కేరళలో తొలి 3డి భవనం ప్రారంభోత్సవం

తిరువనంతపురం : కేరళలో తొలి 3డి భవనాన్ని మంగళవారం ప్రారంభించనున్నారు. తిరువనంతపురంలోని పిటిపి నగర్‌లో కేరళ రాష్ట్ర నిర్మితి కేంద్ర (కెస్నిక్) ప్రాంగణంలో 380 చదరపు అడుగుల విస్తీర్ణంలో ఈ 3డి భవానాన్ని నిర్మించారు. ఒక గదితో అమాజ్-28 సమ్మర్‌హౌస్ పేరుతో ఈ భవన నిర్మాణాన్ని కేవలం 28 రోజుల్లో పూర్తి చేశారు. కెస్నిక్‌తో కలిసి ఐఐటి మద్రాస్ పూర్వ విద్యార్థులకు చెందిన త్వస్తా అనే స్టార్టప్ ఈ భవనాన్ని నిర్మించింది. ఈ మేరకు కెస్నిక్-త్వస్తా మధ్య ఒక అవగాహన ఒప్పందం కుదిరింది. ఈ నిర్మాణ కోసం పేటెంట్ కాంక్రీట్ మిశ్రమాన్ని ఉపయోగించారు. ఈ మిశ్రమాన్ని పొరలు పొరలుగా వేయడానికి ఒక రోబోటిక్ చేతిని ఉపయోగించారు. డెమో ప్రాజెక్ట్‌గా నిర్మించిన భవనానికి రూ. 11 లక్షలు ఖర్చయింది. ఇలాంటి 3డి భవనాలు కేరళ నిర్మాణ రంగంలో గొప్ప మార్పులు తీసుకునివస్తాయని భావిస్తున్నారు. ఇప్పటికే కెస్నిక్-త్వస్త చేతిలో అనేక ప్రాజెక్టులు ఉన్నాయి.

కార్మికుల సమస్యలను పరిష్కరించాలి

- జీహెచ్‌ఎంసీ ఉద్యోగ, కార్మిక సంఘాల జేఏసీ డిమాండ్
- కమిషనర్ రోనాల్డ్ రాస్‌కు వినతిపత్రం

నవతెలంగాణ-హిమాయత్ నగర్

జీహెచ్‌ఎంసీలో 25 ఏండ్లుగా పలు కేటగిరిల్లో పని చేస్తున్న కాంట్రాక్టు కార్మికుల దీర్ఘకాలిక సమస్యలు, డిమాండ్లను పరిష్కరించాలని ఉద్యోగ, కార్మిక సంఘాల జేఏసీ ప్రభుత్వాన్ని డిమాండ్ చేసింది. జేఏసీ నేతలు సీఐటీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పాలడుగు భాస్కర్, నేతలు జె.వెంకటేష్, ఇ.అంజయ్య, శ్రావణ్, వాణి, ఏఐటీయూసీ నేతలు ఏసురత్నం, జైపాల్ రెడ్డి, వెంకన్న తదితరులు సోమవారం జీహెచ్‌ఎంసీ ప్రధాన కార్యాలయంలో కమిషనర్ రోనాల్డ్ రోస్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు.

అనంతరం పాలడుగు భాస్కర్ మాట్లాడుతూ.. కనీస వేతనాల పెంపు, ఐఆర్, ప్రమాద బీమా, అన్ని కేటగిరీల ఉద్యోగులకు ఈఎస్ఐ, పీఎఫ్ అమలుకు చర్యలు తీసుకుంటామని జేఏసీ నేతలతో జరిగిన చర్చల్లో కమిషనర్ హామీ ఇచ్చినట్టు తెలిపారు. జీహెచ్‌ఎంసీ పారిశుధ్య, మలేరియా, ట్రాన్స్ పోర్టు ఇతర విభాగాల్లోని కాంట్రాక్టు కార్మికుల కనీస వేతనాలు, పెండింగ్‌లో ఉన్న ఇతర సమస్యలు, డిమాండ్లపై చర్చించినట్టు తెలిపారు. నగరంలో పారిశుధ్యం నిర్వహణలో ఎంతగానో శ్రమిస్తున్న కార్మికులు, కేటగిరీ ఉద్యోగుల సమస్యలు అపరిష్కృతంగా ఉన్నాయన్నారు. హైదరాబాద్‌లో కోటి మందికి పైగా ఉన్న నగర ప్రజానీకానికి మెరుగైన పారిశుధ్య సేవలు అందించడం వల్ల జీహెచ్‌ఎంసీకి దేశంలో అనేక ఉత్తమ అవార్డులు వచ్చాయన్నారు. జీహెచ్‌ఎంసీ కార్మికులు పని భారం, వేధింపులతో నిత్యం సతమతమవుతున్నారని, ఈ నేపథ్యంలో వారి న్యాయమైన సమస్యలు, డిమాండ్లను వెంటనే పరిష్కరించాలని కోరారు.



కొత్తమోనూ ప్రకారం బడ్జెట్ కేటాయించాలి

- అల్పాహారం పథకం పనికి అదనపు వేతనమివ్వాలి
- పెంచిన వేతన డబ్బులను మధ్యాహ్న భోజన కార్మికుల ఖాతాల్లో వేయాలి : మంత్రి సబితా ఇంద్రారెడ్డికి తెలంగాణ మధ్యాహ్న భోజన పథకం కార్మికుల యూనియన్ వినతి



నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

మధ్యాహ్న భోజన కార్మికులకు పెంచిన వేతన డబ్బులను వారి ఖాతాల్లో వేయాలనీ, కొత్తమెనూ ప్రకారం బడ్జెట్ కేటాయించడంతో పాటు అల్పాహారం పథకం పనికి అదనంగా వేతనమివ్వాలని తెలంగాణ మధ్యాహ్న భోజన పథకం కార్మికుల యూనియన్(సీఐటీయూ అనుబంధం) డిమాండ్ చేసింది. ఇదే అంశంపై సోమవారం హైదరాబాద్‌లో విద్యా శాఖామంత్రి సబితా ఇంద్రారెడ్డికి సీఐటీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పాలడుగు భాస్కర్, రాష్ట్ర కార్యదర్శి జె.వెంకటేశ్, మధ్యాహ్న భోజన కార్మికుల యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎస్వీ.రమ, ఉపాధ్యక్షులు వై.స్వప్న వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా వారు మంత్రి దృష్టికి పలు అంశాలను తీసుకెళ్లారు. గుడ్లకు అదనంగా బడ్జెట్ కేటాయించాలని కోరారు. గ్యాస్‌ను సబ్సిడీపై అందజేయాలని విజ్ఞప్తి చేశారు. పెండింగ్ బిల్లులను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. మధ్యాహ్న భోజన నిర్వహణను అక్షయ పాత్ర లాంటి స్వచ్ఛంద సంస్థలకు ఇవ్వొద్దని విన్నవించారు. మధ్యాహ్న భోజన కార్మికులకు గుర్తింపు కార్డులు, కాటన్ శారీలివ్వాలనీ, ప్రమాద బీమా కల్పించాలని విజ్ఞప్తి చేశారు. కార్మికులకు అదనంగా పెంచిన రూ.2 వేలు ఇప్పటి దాకా వారి ఖాతాల్లో పడలేదన్నారు. ఇవే డిమాండ్లపై సెప్టెంబర్ 28న నుంచి రాష్ట్ర వ్యాప్తంగా మధ్యాహ్న భోజన కార్మికులు సమ్మె చేస్తున్నారని మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. ఈ ఏడాది జూలై నుంచే పెరిగిన వేతనం చెల్లిస్తామనీ, పెండింగ్ బిల్లులు మంజూరు చేస్తామని మంత్రి స్వయంగా ప్రెస్‌మీట్ పెట్టి చెప్పిన విషయాన్ని గుర్తుచేశారు. నెలల తరబడి బిల్లులు రాకపోవడంతో అప్పులు చేసి వంట చేసి పెట్టారనీ, ఇప్పుడు వాటిని తీర్చేందుకు ఇబ్బందులు పడుతున్నారని మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. ఇప్పుడున్న మెనూకే కేటాయించిన బడ్జెట్ సరిపోవడం లేదనీ, కొత్తమెనూ పెట్టడం సాధ్యం కాదని తేల్చిచెప్పారు. దానికి అదనపు బడ్జెట్ కేటాయించాలని కోరారు. సమస్యలను సావధానంగా విన్న మంత్రి సబితా ఇంద్రారెడ్డి సమస్యల్ని పరిష్కరించేందుకు కృషి చేస్తానని హామీనిచ్చారని తెలిపారు.

ఎన్నికల నిర్వహణకు సింగరేణి సహకరించలేదు

- హైకోర్టులో కేంద్రం పిటిషన్


నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

హైకోర్టు ఉత్తర్వులకు అనుగుణంగా సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ ఎన్నికల నిర్వహణకు తాము సిద్ధంగానే ఉన్నామని హైకోర్టుకు కేంద్ర ప్రభుత్వం తెలిపింది. అయితే సింగరేణి కంపెనీ లిమిటెడ్ యాజమాన్యం ఎన్నికల నిర్వహణకు సహకరించడంలేదని చెప్పింది. ఫలితంగానే హైకోర్టు ఆదేశించినా ఎన్నికలను నిర్వహించలేకపోయినట్టు వివరించింది. జూన్ 22న హైకోర్టు ఇచ్చిన ఉత్తర్వుల మేరకు ఈనెల 28న ఎన్నికలు నిర్వహించడానికి షెడ్యూల్ కూడా విడుదల చేసినట్టు పేర్కొంది. ఎన్నికలను నిర్వహించేందుకు సింగరేణి యాజమాన్యం సహకరించకపోగా రాష్ట్ర ప్రభుత్వ అధికారులు అసెంబ్లీ ఎన్నికల హడావుడిలో ఉన్నారనే పేరుతో ఎన్నికలను వాయిదా వేయాలని కోరిందని ఈ మేరకు హైకోర్టులో అఫిడవిట్ వేసిందని కేంద్ర ప్రభుత్వం తరఫున కార్మిక శాఖ డిప్యూటీ చీఫ్ కమిషనర్ డి శ్రీనివాసులు మధ్యంతర పిటిషన్ దాఖలు చేశారు. అయితే ఎన్నికల నిర్వహణకు గడువు పొడిగించాలన్న సింగరేణి యాజమాన్యం అప్పీల్ పిటిషన్ దాఖలు చేయడంతో ఈ వివరాలను తెలియజేస్తున్నట్టు చెప్పారు. యాజమాన్యం సహకరించకపోవడంతో ఓటర్ల జాబితా ప్రకటన వెలువడలేదని తెలిపారు. ఎన్నికలను పారదర్శకంగా నిర్వహించాలనే ఉద్దేశంతో గతనెల 22న సమావేశం నిర్వహించాలని కోరితే, ఎన్నికలు వాయిదా వేయాలని సింగరేణి యాజమాన్యం కోరిందని వివరించారు. పోలింగ్ బూత్‌లు, ఓట్ల లెక్కింపు కేంద్రాలను వివిధ ప్రాంతాల్లో ఏర్పాటు చేయడానికి మూడు బృందాలను పంపినట్టు తెలిపారు. ఈ నెలలోగా ఎన్నికలు నిర్వహించాలని కోర్టు ఉత్తర్వులున్నా సింగరేణి యాజమాన్యం సహకరించడంలేదని వివరించారు. ఎన్నికల నిర్వహణకు సహకరించేలా సింగరేణి యాజమాన్యం, రాష్ట్ర ప్రభుత్వం, యూనియన్లకు ఆదేశాలు జారీ చేయాలని కేంద్ర కార్మిక శాఖ హైకోర్టును కోరింది.

హుక్కా సెంటర్లపై తీర్పు రిజర్వు

హైదరాబాద్ నగరంలోని పలు హుక్కా సెంటర్లపై పోలీసులు దాడులు చేయడానికి వ్యతిరేకంగా దాఖలైన పిటిషన్లపై హైకోర్టు విచారణను ముగించింది. సుమారు 68 పిటిషన్లపై ఇరుపక్షాల వాదనలు ఇటీవల పూర్తయ్యాయి. దీంతో తీర్పును రిజర్వులో పెడుతున్నట్టు జస్టిస్ భాస్కర్ రెడ్డి సోమవారం వెల్లడించారు. ప్రభుత్వ ప్రత్యేక న్యాయవాది సంతోష్ కుమార్ వాదిస్తూ చట్టంలో హుక్కా పార్లర్, హుక్కా సెంటర్ అన్నదానికి నిర్వచనమే లేదన్నారు. చట్టంలో లేనప్పుడు హుక్కా కేంద్రాల నిర్వహణకు అధికారమే లేదని చెప్పారు. జీవనోపాధిని దెబ్బతీస్తున్నారని పిటిషనర్లు చెప్పడాన్ని తీవ్రంగా వ్యతిరేకించారు. హుక్కా కేంద్రాలు అందిస్తున్న సేవలు అర్థం కావడం లేదన్నారు. పొగాకు నియంత్రణ చట్టానికి లోబడి హుక్కా సెంటర్లను నిర్వహిస్తున్నట్టు పిటిషనర్ల లాయర్ చెప్పారు. పోలీసులు దాడులు చేయడం వల్ల, హుక్కా కేంద్రాలను మూసేయడం వల్ల ఎంతోమంది జీవనోపాధి దెబ్బతింటుందని వివరించారు. వాదనల తర్వాత హైకోర్టు తీర్పును వాయిదా వేసింది.

మిషన్ భగీరథ వైస్‌చైర్మెన్‌గా ఉప్పల వెంకటేశ్ బాధ్యతల స్వీకరణ



నవతెలంగాణ-హైదరాబాద్

మిషన్‌భగీరథ కార్పొరేషన్ వైస్‌చైర్మెన్‌గా బీఆర్ఎస్ నేత ఉప్పల వెంకటేష్ గుప్తా సోమవారం బాధ్యతలు స్వీకరించారు. హైదరాబాద్‌లోని ఎర్రమంజిల్‌లోని భగీరథ ప్రధాన కార్యాలయంలో జరిగిన ఈ కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర టూరిజం మాజీ కార్పొరేషన్ చైర్మన్ ఉప్పల శ్రీనివాస్ గుప్త , ఆ శాఖ ఇంజినీర్ ఇన్ చీఫ్ ఎం. కపాకర్‌రెడ్డి రాష్ట్ర ఏవీటీపీఏ అధ్యక్షులు మలిపెద్ది శంకర్, ఉప్పల వెంకటేష్ కుటుంబ సభ్యులు, పలువురు ప్రజా ప్రతినిధులు, నాయకులు పాల్గొన్నారు. వెంకటేష్ శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా ఉప్పల వెంకటేష్ మాట్లాడుతూ ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర్‌రావు మానసపుత్రిక అయిన మిషన్ భగీరథకు వైస్ చైర్మన్‌గా నియమితులవడం పట్ల సంతోషంగా ఉందన్నారు. ఇందుకు సీఎం కేసీఆర్‌కు, మంత్రి కేటీఆర్‌కు ప్రత్యేక దన్యవాదాలు తెలిపారు. రాష్ట్రంలోని ప్రతి ఇంటికి తాగునీటి వసతిని అందించడం గొప్ప విషయమని అన్నారు. సీఎం కేసీఆర్ చేపట్టిన ఈపథకం దేశంలోని దాదాపు అన్ని రాష్ట్రాలకు ఆదర్శంగా నిలిచిందని గుర్తు చేశారు. భవిష్యత్తులోనూ పథకాన్ని మరింత పటిష్టంగా అమలుచేస్తామని హామీ ఇచ్చారు.

వికలాంగుల సమస్యలు మ్యానిఫెస్టోల్లో చేర్చాలి

- రాజకీయపార్టీలకు ఎన్పీఆర్డీ విజ్ఞప్తి
- కనీస పెన్షన్ రూ.10 వేలు ఇవ్వాలి
- ధరల సూచితో అనుసంధానించాలి
- డబుల్‌బెడ్‌రూం ఇండ్లివ్వాలి : ఇందిరాపార్కు వద్ద మహాధర్నాలో వక్తలు



నవతెలంగాణ-హైదరాబాద్‌బ్యూరో

వికలాంగుల సమస్యల్ని అన్ని రాజకీయపార్టీలు తమ ఎన్నికల మ్యానిఫెస్టోల్లో పెట్టాలని వికలాంగుల హక్కుల జాతీయ వేదిక (ఎన్పీఆర్డీ) డిమాండ్ చేసింది. అర్హులైన వారందరికీ కనీస పెన్షన్ రూ.10వేలు ఇవ్వాలనీ, దాన్ని ధరల పెరుగుదల సూచీతో అనుసంధానం చేయాలని కోరారు. ఎన్పీఆర్డీ ఆధ్వర్యంలో సోమవారంనాడిక్కడి ఇందిరాపార్కు వద్ద వికలాంగుల మహాధర్నా జరిగింది. ఎన్పీఆర్డీ జాతీయ కార్యనిర్వాహక అధ్యక్షులు నంబురాజన్ ముఖ్య అతిథిగా పాల్గొని, మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం బడ్జెట్‌లో 5 శాతం నిధుల్ని వికలాంగుల కోసం కేటాయించాలని డిమాండ్ చేస్తుంటే, మోడీ ప్రభుత్వం రూ. వెయ్యికి మూడు పైసలు మాత్రమే ఇస్తున్నదని విమర్శించారు. మరోసారి కేంద్రంలో బీజేపీ, నరేంద్రమోడీ అధికారంలోకి వస్తే రేషన్ షాపులు ఎత్తేసే కుట్ర జరుగుతున్నదని చెప్పారు. గ్రామీణ ఉపాధి హామీ పథకం దండగ అని బీజేపీ నేతలు వ్యాఖ్యానిస్తున్నారనీ, కేంద్ర ప్రభుత్వం కూడా ఈ పథకానికి నిధులు కేటాయింపులు కుదిస్తున్నదని వివరించారు. ఈ స్కీం ద్వారా వికలాంగులకు కొన్ని హక్కులు ఉన్నాయనీ, వాటిని కోల్పోయే ప్రమాదం ఉన్నదని హెచ్చరించారు. వికలాంగులకు దేశవ్యాప్తంగా చెల్లుబాటయ్యేలా గుర్తింపుకార్డులు ఇవ్వాలనీ, కేంద్రంలోని దివ్యాంగుల శాఖకు నిధులు కేటాయించాలనీ, ఖాళీగా ఉన్న 13వేల బ్యాక్‌లాగ్ పోస్టుల్ని భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. తెలంగాణ రాష్ట్రంలో 43 లక్షల మంది వికలాంగులు ఉన్నారనీ, ధరల సూచికి అనుసంధానిస్తూ పెన్షన్లు చెల్లించాలని కోరారు. కార్యక్రమంలో పాల్గొన్న సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు టీ జ్యోతి మాట్లాడుతూ పోరాడితేనే హక్కులు సాధించుకోగలమని చెప్పారు. డబుల్ బెడ్‌రూంలు, గృహలక్ష్మి కేటాయింపులు నిజమైన లబ్దిదారులకు చేరట్లేదని ఆందోళన వ్యక్తం చేశారు. రేషన్ షాపుల్లో కేవలం బియ్యం తప్ప ఏమీ ఇవ్వట్లేదనీ, కేరళలో బియ్యంతో పాటు 14 రకాల వస్తువుల్ని ఇస్తున్నారని ఉదహరించారు. ఎన్పీఆర్డీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎమ్ అడివయ్య మాట్లాడుతూ వికలాంగులకు దేశవ్యాప్తంగా ఉచిత రవాణా కల్పించాలనీ, వారి కుటుంబాలకు 250 యూనిట్ల వరకు ఉచిత కరెంటు ఇవ్వాలని కోరారు. ప్రభుత్వం అమలు చేస్తున్న అన్ని సంక్షేమ పథకాల్లో ఐదుశాతం వికలాంగులకు కేటాయించాలనీ, అంత్యోదయ కార్డులు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా 37 డిమాండ్లతో కూడిన తీర్మానాన్ని ఏకగ్రీవంగా ఆమోదించారు. కార్యక్రమానికి ఎన్పీఆర్డీ రాష్ట్ర అధ్యక్షులు కే వెంకట్ అధ్యక్షత వహించారు. ఎన్పీఆర్డీ కర్నాటక రాష్ట్ర కార్యదర్శి రంగప్ప ధర్నాకు సంఘీభావం తెలిపారు. టీడీపీ రాష్ట్ర నాయకులు సాయిబాబా, తెలంగాణ వికలాంగుల సమాఖ్య వర్కింగ్ ప్రెసిడెంట్ మీసాల మోహన్, హిమోఫిలియా హైదరాబాద్ చాప్టర్ కార్యదర్శి శ్రీనివాస్ తెలంగాణ వికలాంగుల హక్కుల పోరాట సంఘం గొల్ల ప్రభాకర్ మహాధర్నాకు సంఘీభావం తెలిపారు. ఎన్పీఆర్డీ కేంద్ర కమిటీ సభ్యులు ఆర్ వెంకటేష్, జే రాజు, రాష్ట్ర ఉపాధ్యక్షులు టీ మధుబాబు, కాశప్ప, గోపాల్, స్వామి, దశరథ్ తదితరులు పాల్గొన్నారు.

అమల్లోకి ఎన్నికల కోడ్

(మొదటిపేజీ తరువాయి)

ఆయన ప్రకటించారు. నవంబరు 30న ఎన్నికలు జరుగుతున్న నేపథ్యంలో... రాష్ట్రంలో ఎన్నికల ప్రవర్తనా నియమావళి వెంటనే అమలులోకి వచ్చిందని తెలిపారు. పార్టీలు, అభ్యర్థులు కచ్చితంగా నిబంధనావళిని పాటించాలని ఆదేశించారు. లేకపోతే మార్గదర్శకాల ప్రకారం కఠినంగా వ్యవహరించాల్సి వస్తుందని హెచ్చరించారు. రాత్రి 10 గంటల నుంచి ఉదయం ఆరు గంటల వరకు లౌడ్ స్పీకర్లకు అనుమతి లేదని స్పష్టం చేశారు. ప్రభుత్వ వెబ్‌సైట్లలో రాజకీయ నేతల ఫొటోలను తొలగించాలని ఆదేశించారు. మహిళలు, యువత కోసం ప్రత్యేకంగా పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేయనున్నట్టు ప్రకటించారు. అన్ని పోలింగ్ కేంద్రాల్లో బెయిలీ బ్యాలెట్ పత్రాలను అందుబాటులో ఉంచనున్నట్టు చెప్పారు. ప్రత్యేక ఓటర్లకు ప్రత్యేక సదుపాయాలతో పాటు రవాణా సౌకర్యం కల్పిస్తామన్నారు.

ప్రజలు ఓటరు గుర్తింపు కార్డుకు ప్రత్యామ్నాయంగా మరో 12 కార్డులను వినియోగించుకోవచ్చని సూచించారు. ఇక అభ్యర్థులు తమ అఫిడవిట్‌లో అన్ని కాలమ్‌లను కచ్చితంగా నింపాలనీ, లేదంటే నామినేషన్ ఫారం తిరస్కరణకు గురయ్యే అవకాశం ఉంటుందని వివరించారు. ఎన్నికల కమిషన్‌కు ఫిర్యాదులు చేయాలంటే 1950 నంబరులో సంప్రదించాలని సూచించారు. రాజకీయ పార్టీలు, అభ్యర్థులు పత్రికలు, ఎలక్ట్రానిక్ మీడియాలో ఇచ్చే ప్రకటనలకు ముందస్తు అనుమతి తప్పనిసరని స్పష్టం చేశారు. బ్యాలెట్ పత్రాలపై గుర్తులతోపాటు అభ్యర్థుల ఫొటోలను సైతం ఏర్పాటు చేయనున్నట్టు చెప్పారు. ఈ నెల 31 వరకు ఓటుహక్కు కోసం దరఖాస్తు చేసుకునేందుకు అవకాశం ఉందని చెప్పారు. అయితే, ఓటర్ల జాబితాలో చిరునామా మార్పునకు సంబంధించిన దరఖాస్తులను వాయిదా వేస్తున్నట్టు ప్రకటించారు. నగదు లావాదేవీలు, మద్యం సరఫరాపై పూర్తి పర్యవేక్షణ చేస్తున్నట్టు తెలిపారు. నగదును తీసుకువెళ్లే సమయంలో పత్రాలు, వివరాలు ఉండాల్సిందేనన్నారు. సమస్యాత్మక, సున్నితమైన పోలింగ్ కేంద్రాల గుర్తింపుపై కసరత్తు జరుగుతున్నదన్నారు. ప్రజలు తమ ఓటు హక్కును స్వేచ్ఛగా భయం లేకుండా వినియోగించుకోవాలని సూచించారు.

119 స్థానాలు..3.17 కోట్ల ఓటర్లు

రాష్ట్ర అసెంబ్లీ గడువు 2024, జనవరి 16తో ముగియనుంది. మొత్తం 119 స్థానాలకుగాను ఎస్సీ 19, ఎస్టీ 12 నియోజకవర్గాలు ఉన్నాయి. 3.17 కోట్ల ఓటర్లు ఉండగా, ఇందులో పురుషులు 1.58 కోట్లు కాగా, మహిళలు సైతం అదే స్థాయిలో 1.58 కోట్ల మంది ఉండటం గమనార్హం. కాగా 2557 మంది ట్రాన్స్‌జెండర్లు నమోదు చేసుకున్నారు. సర్వీసు ఓటర్లు 15,338 వరకు ఉన్నారు. ఓటర్ల నిష్పత్తి 998గా ఉంది. 3.15 లక్షల మంది 18 నుంచి 19 సంవత్సరాల వయస్సున్న వారు కావడం విశేషం.

35,356 పోలింగ్ స్టేషన్లు

అసెంబ్లీ ఎన్నికల నిర్వహణకు 35,356 పోలింగ్ స్టేషన్లు ఏర్పాటు చేశారు. అర్బన్‌లో14,464 పోలింగ్ కేంద్రాలు ఉండగా, గ్రామీణ ప్రాంతాల్లో 20,892 ఏర్పాటయ్యాయి. నగటున ఒక్కో పోలింగ్ స్టేషన్‌కు 897 మంది ఓటర్లు ఉన్నారు. 644 మోడల్ పీఎస్‌లనూ ఏర్పాటు చేశారు. వికలాంగులు, వృద్ధుల కోసం ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. వృద్ధుల వెంట ఒక వ్యక్తి ఓటేయడానికి రావచ్చు. అలాగే వికలాంగులకూ అవకాశం కల్పించారు.

ఈవీఎంలు..

రాష్ట్ర ఎన్నికల నిర్వహణలో కీలకపాత్ర పోషించేవి ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాలు(ఈవీఎంలు). వీటి అవసరం ఎంతో ఉంది, బ్యాలెట్ యూనిట్లు 55,826 అవసరం కాగా, 72,933 ఉన్నాయి. సీయూలు 43,614కుగాను 57,691 , వీటీలు 47,103కుగాను, 56745 అందుబాటులో ఉన్నట్టు అధికారులు చెప్పారు.

కాంగ్రెస్‌లో సీఎంకు గ్యారెంటీ, వారంటీ లేదు

నవతెలంగాణ - భూపాలపల్లి/పరకాల/వరంగల్ ప్రాంతీయ ప్రతినిధి

రాష్ట్రంలో ఆరు గ్యారెంటీ పథకాలు అంటూ ప్రజలను మభ్యపెడుతున్నారని, కాంగ్రెస్ పార్టీలో సీఎంకు గ్యారెంటీ, వారంటీ లేదని, ఓటుకు నోటు.. సీటు కో రేటు.. మాత్రమే ఉందని, మోసపోతే గోసపడతామని ఐటీ, పురపాలకశాఖ మంత్రి కేటీఆర్ అన్నారు. ఎన్నో ఉద్యమాలు చేసి ప్రాణాలను సైతం లెక్కచేయక సాధించుకున్న రాష్ట్రానికి మోసగాళ్లు కావాలా.. మొనగాళ్లు కావాలా.. ప్రజలు తేల్చుకోవాలని తెలిపారు. రాష్ట్రంలో రైతు బంధు, పింఛన్ పెంచనున్నామని, త్వరలో సీఎం కేసీఆరే స్వయంగా ప్రకటిస్తారన్నారు. ఉమ్మడి వరంగల్ జిల్లాలో సోమవారం పర్యటించిన కేటీఆర్.. పలు అభివృద్ధి కార్యక్రమాలను ప్రారంభించారు. జయశంకర్ భూపాలపల్లి జిల్లా కేంద్రంలోని సమీకృత కలెక్టర్ కార్యాలయం, ఎస్పీ కార్యాలయాన్ని సోమవారం ఆయన ప్రారంభించారు. హన్మకొండ జిల్లా పరకాల నియోజకవర్గంలో, జనగామ జిల్లా పాలకుర్తి నియోజకవర్గంలోని తొర్రూరు పట్టణాల్లో నిర్వహించిన ప్రగతి నివేదన సభల్లో స్థానిక ఎమ్మెల్యేలతో కలిసి ఆయన పాల్గొని మాట్లాడారు.

ఎన్నికలు రాగానే సంక్రాంతి గంగిరెద్దుల్లా గ్రామాల్లోకి ఇతర పార్టీ నాయకులు వస్తారని, మాయమాటలు చెప్పి మోసం చేస్తారని విమర్శించారు. తొమ్మిందేండ్లలో జరిగిన అభివృద్ధిని చూసి ఆలోచించి ఓటు వేయాలని ప్రజలను కోరారు. 60 ఏండ్లలో తాగు, సాగునీటితో పాటు కరెంటు కోసం గోసపడ్డామన్నారు. తెలంగాణ వచ్చుడు కేసీఆర్ సచ్చుడో అని ప్రాణాలకు తెగించి ఉద్యమం చేసి రాష్ట్రాన్ని సాధించిన అనంతరం ఈ తొమ్మిదేండ్లలో దేశంలోనే అగ్రగామిగా తెలంగాణను ముఖ్యమంత్రి కేసీఆర్ తీర్చిదిద్దారని తెలిపారు. ఒకవైపు అభివృద్ధి.. మరొకవైపు సంక్షేమ పథకాలతో.. జోడెద్దుల రాష్ట్రాన్ని ముందుకు నడిపిస్తున్నట్టు చెప్పారు. పేదింటి ఆడబిడ్డలకు రూ.1.16 లక్షలు ఇచ్చి ఆదుకుంటున్నామని, రైతు పెట్టుబడి సాయం కింద 70 లక్షల మంది రైతులకు రూ.73వేల కోట్లు వారి ఖాతాల్లో జమ చేస్తున్నామన్నారు. రాష్ట్రంలో ఆడబిడ్డలకు నీళ్లు ఇవ్వకుంటే ఓట్లే అడగనన్న దమ్మున్న నాయకుడు కేసీఆర్ అని తెలిపారు. భూపాలపల్లి లాంటి మారుమూల ప్రాంతంలో మెడికల్ కళాశాల, వంద పడకల ఆస్పత్రి నిర్మించి సర్కార్ దవాఖానాపై నమ్మకాన్ని పెంచిన ఘనత బీఆర్ఎస్ ప్రభుత్వందేనన్నారు. ఆచార్య జయశంకర్ సార్ కలలుగన్న రాష్ట్రంలో జయశంకర్ జిల్లా పేరుమీద జిల్లా సమీకృత కలెక్టరేట్ కార్యాలయాన్ని ప్రారంభించడం అదృష్టంగా భావిస్తున్నానన్నారు. రాష్ట్రంలో జరిగే ఎన్నికల్లో బీఆర్ఎస్ ఎమ్మెల్యేలను భారీ మెజారిటీతో గెలిపించి అసెంబ్లీకి పంపించాలని ఆకాంక్షించారు.

పాలకుర్తి నియోజకవర్గంలోని తొర్రూర్‌లో జరిగే సభలో కేటీఆర్ మాట్లాడుతూ.. ఈ రోజే ఎన్నికల కోడ్ వచ్చిందని నవంబర్ 30వ తేదీన శాసనసభ ఎన్నికలు, ఓట్ల లెక్కింపు డిసెంబర్ 3న జరగనుందన్నారు. ఈ రెండు తేదీల్లో మూడు, మూడు ఉందని, మూడు, మూడు కలిపితే ఆరు అని మనకు అచ్చొచ్చిన సంఖ్య ఆరు అని మూడవ సారి సీఎం అయ్యేది కేసీఆరే అని స్పష్టంచేశారు. ఇప్పుడు వచ్చే ఎన్నికలు.. ఎమ్మెల్యేల ఎన్నికలు కాదని, మన తలరాత మార్చే ఎన్నికలన్న సంగతి గుర్తుంచుకోవాలన్నారు. నిత్యం మీకు అందుబాటులో ఉండే ఎమ్మెల్యే ఎర్రబెల్లి దయాకర్‌రావును లక్ష మెజారిటీతో గెలిపిస్తారన్న నమ్మకం తనకుందన్నారు.

దేశంలో తెలంగాణ జనాభా 2 శాతం మాత్రమేనని, అయినా 30 శాతం అవార్డులను సీఎం కేసీఆర్ మార్గదర్శకత్వంలో పంచాయతీరాజ్ మంత్రి దయాకర్‌రావు గెలుచుకున్నారని తెలిపారు. కాగా, ఎన్నికల కోడ్ వస్తుందని గ్రహించిన మంత్రి దయాకర్‌రావు.. సోమవారం ఉదయమే పాలకుర్తి 50 పడకల ఆస్పత్రి, తొర్రూరు పట్టణంలో పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. ఆయా జిల్లాల్లో జరిగిన సభల్లో పాలకుర్తి ఎమ్మెల్యే, మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు, భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర వెంకట రమణారెడ్డి, పరకాల ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి, ఎమ్మెల్యేలు రెడ్యానాయక్, పెద్ద సుదర్శన్‌రెడ్డి, శాసన మండలి డిప్యూటీ చైర్మెన్ డాక్టర్ బండ ప్రకాష్, ఎమ్మెల్సీ సిరికొండ మధుసూదనా చారి, రాజ్యసభ సభ్యులు వద్దిరాజు రవిచంద్ర, జడ్పీచైర్మెన్లు డాక్టర్ సుధీర్‌కుమార్, గండ్ర జ్యోతి, అంగోతు బిందు, జక్కు శ్రీ హర్షిని, పుట్ట మధు, ఎంపీలు పసునూరి దయాకర్, మాలోతు కవిత తదితరులు పాల్గొన్నారు.

ఫైట్ షురూ...

(మొదటిపేజీ తరువాయి)

కానుంది. వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌తోపాటు ట్రబుల్ షూటర్ హరీశ్‌రావు, ఎమ్మెల్సీ కవిత వివిధ కార్యక్రమాల పేరిట ఇప్పటికే పలు నియోజకవర్గాల్లో పర్యటించి వచ్చారు. ఇప్పుడు షెడ్యూల్ విడుదలైంది కాబట్టి వారు రాష్ట్రవ్యాప్తంగా సుడిగాలి పర్యటనలు చేయనున్నారు. దాంతోపాటు సీఎం కేసీఆర్ ఎన్నికల ప్రచార సభల షెడ్యూల్, నామినేషన్ దాఖలు తేదీ కూడా ఖరారయ్యాయి.

హస్తం జోరు...

కర్నాటక ఎన్నికల ఫలితాలతో జోష్ నింపుకున్న రాష్ట్ర కాంగ్రెస్... బీఆర్ఎస్‌తో ఢీ అంటే ఢీ అనే విధంగా ఇటీవల కార్యక్రమాలను నిర్వహించింది. కొద్ది నెలల క్రితం వరంగల్‌లో రైతు డిక్లరేషన్, ఆ తర్వాత సరూర్‌నగర్‌లో నిరుద్యోగ సభ, సీడబ్ల్యూసీ సమావేశాలను హైదరాబాద్‌లో నిర్వహించి, తుక్కుగూడలో విజయభేరీ సభను ఏర్పాటు చేయటం ద్వారా ఆ పార్టీ తన క్యాడర్‌లో జవసత్వాలను నింపింది. ఇటీవల చేవెళ్లలో ఎస్సీ, ఎస్టీ డిక్లరేషన్ పేరిట బహిరంగ సభను నిర్వహించి, ఆయా సామాజిక తరగతులను తన వైపునకు తిప్పుకునేందుకు ప్రయత్నించి, అందులో సఫలీకృతమైంది. ఇప్పుడు రాష్ట్రవ్యాప్త బస్సు యాత్రలకు రంగం సిద్ధం చేయటం ద్వారా ప్రజల్లోకి వెళ్లనుంది. మరో ఐదారు రోజుల్లో తొలి జాబితాను ప్రకటించి, ఎన్నికల శంఖారావాన్ని పూరించేందుకు కాంగ్రెస్ సిద్ధమవుతోంది.

బీజేపీ డీలా...

బీఆర్ఎస్, కాంగ్రెస్ ఎన్నికల గోదాలోకి దిగగా...కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ మాత్రం రాష్ట్రంలో డీలా పడింది. కర్నాటక అసెంబ్లీ ఫలితాలు ఆ పార్టీపై పెను ప్రభావాన్ని చూపాయి. దానికితోడు నేతల మధ్య సఖ్యత లేకపోవటం, అంతర్గత కుమ్ములాటలతో ఆ పార్టీ సతమతమవుతోంది. బీజేపీలోని పాత కాపులు, కొత్త నేతల మధ్య ఆధిపత్య పోరు తారాస్థాయికి చేరటంతో ఇటీవల పలువురు సీనియర్లు కమలాన్ని వీడారు. ఈ కారణాలన్నింటితో బీజేపీ పరిస్థితి మరింతగా దిగజారింది. ఈనెల 15,16 తేదీల్లో తొలి జాబితాను ప్రకటిస్తామంటూ ఆ పార్టీ నేతలు చెబుతున్నా.. అది కూడా కమలంలో జోష్ నింపుతుందన్న గ్యారెంటీ లేదు.

ఇక తెలంగాణ జన సమితి, వైఎస్సార్ టీపీ, కేఏ పాల్ ప్రజాశాంతి పార్టీల పరిస్థితి అయోమయంగానే ఉంది. ఆయా పార్టీలు ఎన్ని స్థానాల్లో పోటీ చేస్తాయనే విషయమై ఇప్పటికీ స్పష్టత లేదు. పోటీ చేయని స్థానాల్లో ఎవరికి మద్దతిస్తారనే దానిపైనా క్లారిటీ లేదు. మొన్నటి వరకూ కాంగ్రెస్‌లో వైఎస్సార్ టీపీ విలీనం గురించి చర్చలు, మంతనాలు జరిగినా పలు సమీకరణాల రీత్యా అది వాయిదా పడుతూ వస్తోంది. బీఎస్పీ, బీఎల్ఎఫ్‌లు ఇప్పటికే తొలి జాబితాను ప్రకటించిన సంగతి విదితమే. సీపీఐ (ఎం), సీపీఐలు తమ రాజకీయ వైఖరిని స్పష్టం చేశాయి. దేశానికి బీజేపీ మతోన్మాద ప్రమాదాన్ని నివారించటమే లక్ష్యంగా సాగుతున్న వామపక్షాలు పోటీ చేయబోయే స్థానాలపై త్వరలోనే స్పష్టత రానుందని సమాచారం.

15న ఎమ్మెల్యే అభ్యర్థులతో కేసీఆర్ సమావేశం..

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

బీఆర్ఎస్ అధినేత ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర్ రావు ఈనెల 15వ తేదీన పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థులతో తెలంగాణభవన్‌లో సమావేశం కానున్నారు. ఈ సమావేశంలోనే అభ్యర్థులకు బీఫారాలను సీఎం కేసీఆర్ అందజేయనున్నారు. ఈ సందర్భంగా ఎన్నికల్లో పాటించాల్సిన నియమ నిబంధనలు తదితర అంశాలపై అభ్యర్థులకు ఆయన వివరిస్తారు. అదే సందర్భంలో బీఆర్ఎస్ మ్యానిఫెస్టోను విడుదల చేయనున్నారు. అనంతరం అదే రోజున హైదరాబాద్ నుంచి బయలుదేరి, హుస్నా బాద్ నియోజకవర్గ కేంద్రంలో ఏర్పాటు చేసిన బహిరంగ సభలో సాయంత్రం 4 గంటలకు సీఎం కేసీఆర్ పాల్గొంటారు.

సీఎం కేసీఆర్ జిల్లాల పర్యటనలు

అక్టోబర్ 16 నాడు జనగామ, భువనగిరి నియోజకవర్గాల కేంద్రాల్లో బహిరంగ సభలో సీఎం కేసీఆర్ పాల్గొంటారు.17న సిద్దిపేట, సిరిసిల్ల నియోజకవర్గ కేంద్రాల్లో నిర్వహించే బహిరంగ సభలో సీఎం కేసీఆర్ పాల్గొంటారు.అక్టోబర్ 18న మధ్యాహ్నం 2 గంటలకు జడ్చర్ల నియోజకవర్గ కేంద్రంలో, అదే రోజు సాయంత్రం 4 గంటలకు మేడ్చల్ నియోజకవర్గ కేంద్రంలో నిర్వహించే బహిరంగ సభల్లో సీఎం పాల్గొంటారు.

సీఎం కేసీఆర్ నామినేషన్లు

నవంబర్ 9వ తేదీన గజ్వేల్, కామారెడ్డి రెండు నియోజకవర్గాల నుంచి కేసీఆర్ బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థిగా నామినేషన్ వేయనున్నారు. ఇందులో భాగంగా 9వ తేదీ ఉదయం సిద్దిపేట నియోజకవ ర్గంలోని కోనాయపల్లి వెంకటేశ్వర స్వామి దేవాలయా నికి వెళ్లి ప్రత్యేక పూజలు నిర్వహిస్తారు. అనంతరం గజ్వేల్‌లో సీఎం కేసీఆర్ మొదటి నామినేషన్ వేస్తారు.మధ్యాహ్నం రెండు గంటలకు కామారెడ్డిలో రెండవ నామినేషన్ వేస్తారు. అనంతరం మూడు గంటల నుంచి ప్రారంభమయ్యే కామారెడ్డి బహిరంగ సభలో సీఎం కేసీఆర్ పాల్గొంటారు.

డీఎస్సీ వాయిదా?

(మొదటిపేజీ తరువాయి)

ఈ పరీక్షా కేంద్రాలకు ఇబ్బంది ఉండదు. కానీ అటు ఎన్నికలు, ఇటు డీఎస్సీ రాతపరీక్షల నిర్వహణ ఇబ్బందికరంగా మారనుంది. అందుకే వాయిదా వేసేందుకే అవకాశాలు మెండుగా ఉన్నాయి. పోలింగ్ తేదీని ప్రకటించిన విషయాన్ని, డీఎస్సీ రాతపరీక్షలకు వస్తున్న ఇబ్బందులను నివేదిక రూపంలో రాష్ట్ర ప్రభుత్వానికి పాఠశాల విద్యాశాఖ అధికారులు సోమవారమే పంపించినట్టు తెలిసింది. దీనిపై మంగళవారం నిర్ణయం వెలువడే అవకాశమున్నది.

దరఖాస్తులు నామమాత్రమే...

ఉపాధ్యాయ పోస్టులకు నామమాత్రంగా దరఖాస్తులొస్తున్నాయి. ఎక్కువ మంది దరఖాస్తు చేసేందుకు ఆసక్తి కనబరచడం లేదు. ఇప్పటి వరకు 59 వేల దరఖాస్తులు వచ్చినట్టు సమాచారం. వాటి సమర్పణకు ఈనెల 21 వరకు తుదిగడువు ఉన్నది. 5,089 ఉపాధ్యాయ పోస్టుల భర్తీకి జిల్లాస్థాయి నియామక కమిటీ (డీఎస్సీ) నోటిఫికేషన్‌ను పాఠశాల విద్యాశాఖ అక్టోబర్ ఎనిమిదో తేదీన విడుదల చేసిన విషయం తెలిసిందే. నవంబర్ 20,21 తేదీల్లో స్కూల్ అసిస్టెంట్ అన్ని సబ్జెక్టుల రాతపరీక్షలు జరుగుతాయని ప్రకటించింది. అదేనెల 22న స్కూల్ అసిస్టెంట్ అన్ని లాంగ్వేజ్ సబ్జెక్టుల పరీక్షలుంటాయి. 23న ఫిజికల్ ఎడ్యుకేషన్ టీచర్ (పీఈటీ) అభ్యర్థులకు ఒకే విడతలో పరీక్షను నిర్వహిస్తుంది. 24న లాంగ్వేజ్ పండితులకు పరీక్ష ఉంటుంది. 25 నుంచి 30 వరకు ఆరు రోజులపాటు సెకండరీ గ్రేడ్ టీచర్ (ఎస్జీటీ) అభ్యర్థులకు రాతపరీక్షలను రోజూ రెండు విడతల్లో నిర్వహిస్తామని విద్యాశాఖ ప్రకటించింది. ఎన్నికల పోలింగ్ నవంబర్ 30న ఉండడంతో డీఎస్సీ రాతపరీక్షలు సజావుగా జరిగే అవకాశం లేదని తెలుస్తున్నది. వాయిదా పడతాయని సమాచారం.

చైనా నుంచి ఒక్క పైసా రాలేదు

(మొదటిపేజీ తరువాయి)

వాదిస్తూ, అరెస్టు సమయంలో కారణాలను పేర్కొనలేదని, ట్రయల్ కోర్టు స్వయంచాలకంగా రిమాండ్ ఉత్తర్వులు జారీ చేసిందని తెలిపారు. న్యూస్‌క్లిక్, పుర్కాయస్థ చైనా నుంచి ఒక్క రూపాయి కూడా పొందలేదని సిబల్ అన్నారు. 'అడవిలో కాల్పుల ఘటనపై ఢిల్లీ పోలీసులు ఎఫ్ఐఆర్ నమోదు చేశారు. చైనా ఫోన్ తయారీదారులు, సమ్మెలో ఉన్న రైతులపై ఎఫ్ఐఆర్‌లో ఆరోపణలు వచ్చాయి. అరెస్టుకు ముందు సరైన కారణాలను స్పష్టం చేయలేదు. ట్రయల్ కోర్టు న్యాయమూర్తి ఈ ఆదేశాలను పరిగణనలోకి తీసుకోలేదు' అని కపిల్ సిబల్ ఎత్తి చూపారు. ఢిల్లీ పోలీస్ స్పెషల్ సెల్ తరఫున సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా వాదనలు వినిపించారు. యూఏపీఏ ఎఫ్ఐఆర్‌ను రద్దు చేయాలన్న ప్రబీర్ పుర్కయస్థ డిమాండ్‌పై ఢిల్లీ పోలీసులతో సహా ప్రతివాదులందరికీ నోటీసు జారీ చేయాలా వద్దా? అనే విషయాన్ని హైకోర్టు తర్వాత నిర్ణయిస్తుంది. ట్రయల్ కోర్టు గతంలో ప్రబీర్ పుర్కాయస్తా, అమిత్ చక్రవర్తిలను ఏడు రోజుల కస్టడీకి విడుదల చేసింది. మంగళవారంతో కస్టడీ గడువు ముగియడంతో వారిద్దరినీ మళ్లీ కోర్టులో హాజరుపరచనున్నారు.

చంద్రబాబుకు దక్కని ఊరట

విజయవాడ,న్యూఢిల్లీ : టీడీపీ అధినేత చంద్రబాబుకు ఆంధ్రప్రదేశ్‌లోని విజయవాడ ఏసీబీ కోర్టులో నిరాశ ఎదురయింది. స్కిల్ డెవలప్ మెంట్ కేసులో ఆయన పెట్టుకున్న బెయిల్ పిటిషన్‌ను కోర్టు కొట్టేసింది. అదేవిధంగా సీఐడీ దాఖలు చేసిన కస్టడీ పొడిగింపు పిటిషన్‌ను కూడా కోర్టు డిస్మిస్ చేసింది. ప్రస్తుతం చంద్రబాబుపై దాఖలైన పీటీ వారెంట్లపై ఏసీబీ కోర్టులో విచారణ ప్రారంభమైంది. మరోవైపు స్కిల్ కేసులో చంద్రబాబు దాఖలు చేసిన క్వాష్ పిటిషన్‌పై సుప్రీంకోర్టులో విచారణ జరుగుతోంది. ఈ కేసులో ఎలాంటి తీర్పు వెలువడనుందో అనే ఉత్కంఠ నెలకొంది.

చంద్రబాబు క్వాష్ పిటిషన్ నేటీకి వాయిదా

టీడీపీ అధినేత ఎన్. చంద్రబాబు నాయుడు దాఖలు చేసిన క్వాష్ పిటిషన్ విచారణను సుప్రీంకోర్టు నేటీ(మంగళవారం)కి వాయిదా వేసింది. స్కిల్ డెవలప్‌మెంట్ కుంభకోణంలో తనపై నమోదు చేసిన కేసులను కొట్టి వేయాలని కోరుతూ చంద్రబాబు దాఖలు చేసిన క్వాష్ పిటిషన్‌ను ఏపీ హైకోర్టు కొట్టివేయడంతో, చంద్రబాబు సుప్రీంకోర్టును ఆశ్రయించారు. హైకోర్టు తీర్పును సవాల్ చేస్తూ పిటిషన్ దాఖలు చేశారు. ఈ పిటిషన్ ను సోమవారం సుప్రీంకోర్టు న్యాయమూర్తులు జస్టిస్ అనిరుద్ బోస్, జస్టిస్ బేలా ఎం.త్రివేది నేతృత్వంలో ద్విసభ్య ధర్మాసనం విచారించింది. చంద్రబాబు తరఫున సీనియర్ న్యాయవాదులు హరీష్ సాల్వే, సిద్దార్థ లూత్రా, అభిషేక్ సింగ్ మను వాదనలు వినిపించారు. 2021 సెప్టెంబర్ 7లో ఎఫ్ఐఆర్ నమోదు అయిందని, అందువల్ల 17ఏ వర్తిస్తుందని, గవర్నర్ అనుమతి తీసుకోవాలని అన్నారు. కానీ గవర్నర్ అనుమతి తీసుకోకుండా అరెస్టు చేశారని పేర్కొన్నారు. సీఐడీ తరఫున సీనియర్ న్యాయవాదులు ముకుల్ రోహత్గీ, నిరంజన్ రెడ్డి వాదనలు వినిపిస్తూ ఈ కేసు దర్యాప్తు 2018కి ముందే ప్రారంభం అయిందని, కనుక 17ఏ వర్తించదని అన్నారు. సుదీర్ఘ వాదనల తరువాత విచారణను నేటీ (మంగళవారం)కి వాయిదా వేసింది.

బాణాసంచా పరిశ్రమలో అగ్నిప్రమాదం

- పది మంది మృతి

చెన్నై : తమిళనాడులోని అరియలూర్ జిల్లా వి.విరగలూర్ గ్రామంలోని దీపం ఫైర్ వర్క్స్‌లో సోమవారం జరిగిన అగ్ని ప్రమాదం లో ముగ్గురు మహిళలతోసహా పది మంది ప్రాణాలు కోల్పోయారు. మరో 13 మంది తీవ్రంగా గాయపడ్డారు. ఈ ప్రమాదంలో పరిశ్రమ ఆవరణలో ఉన్న రెండు ద్విచక్ర వాహనాలు, ఒక ట్రాక్టర్, ఒక వ్యాన్ కూడా అగ్నికి ఆహుతయ్యాయి. సోమవారం ఉదయం పనిలోకి వచ్చిన కార్మికుల బృందం పరిశ్రమలో చిక్కుకుపోయింది. అగ్నిమాపక సిబ్బంది సంఘటనా స్థలానికి చేరుకున్నా.. బాణాసంచా పేలుళ్ల కారణంగా సహాయక కార్యక్రమాలు నిర్వహించలేకపోయారు. పేలుళ్ల కారణంగా పరిశ్రమ చుట్టుపక్కల ఉన్న కొన్ని ఇళ్లు కూడా ధ్వంసమయ్యాయి. పేలుళ్ల కారణంగా మృతదేహాలు ఛిద్రమయ్యాయి. మృతుల కుటుంబాలకు ముఖ్యమంత్రి ఎంకె స్టాలిన్ సంతాపం ప్రకటించారు. మృతుల కుటుంబాల కు రూ.3 లక్షల చొప్పున, తీవ్ర గాయాలైన వారికి రూ.2 లక్షలు చొప్పున పరిహారం ప్రకటించారు.

ఇజ్రాయిల్ ఘర్షణలపై చీలిన పశ్చిమ, మధ్య ప్రాచ్య దేశాలు

జెరూసలేం : ఇజ్రాయిల్-పాలస్తీనా ఘర్షణపై పశ్చిమ దేశాలు, మధ్య ప్రాచ్యం చీలిపోయాయి. అమెరికా జర్మనీ, ఫ్రాన్స్ తదితర పశ్చిమ దేశాలు ఇజ్రాయిల్‌ను సమర్థిస్తుండగా, మధ్య ప్రాచ్య దేశాలు పాలస్తీనా పోరాటానికి మద్దతు ప్రకటించాయి. ప్రస్తుత ఘర్షణలు కొనసాగుతుండడం పట్ల ఈజిప్ట్ అధ్యక్షుడు అబ్దుల్ ఫత్తా అల్ సిసి, పాలస్తీనా అధ్యక్షుడు మహ్మద్ అబ్బాస్‌లు తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. ఆదివారం ఇరువురు నేతలు ఫోన్లో మాట్లాడుకుంటూ భద్రతా, మానవతా పరిస్థితులు క్షీణిస్తుండడం పట్ల విచారం వ్యక్తం చేశారు. ప్రజల జీవితాలు, ఈ ప్రాంత భద్రత, సుస్థిరత ప్రమాదంలో పడే అవకాశాలను ఇరువురు నేతలు చర్చించారు.

చేసిన అభివృద్ధే ప్రతిపక్షాలపై పాశుపతాస్త్రం

- ఇచ్చిన హామీలు నెరవేర్చడమే మా విశ్వసనీయత : కేటీఆర్

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

పదేండ్ల కాలంలో బీఆర్ఎస్ ప్రభుత్వం ప్రజలకు అందించిన అభివృద్ధిని పాశుపతాస్త్రంగా మార్చుకొని ప్రతిపక్షాలపై విజయం సాధిస్తామని ఆ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తెలిపారు. ఎన్నికల షెడ్యూల్ విడుదలయిన నేపథ్యంలో ఆయన సోమవారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఇచ్చిన హామీలను నెరవేర్చిన మా విశ్వసనీయతనే ఈ ఎన్నికల్లో తమ విజయ మంత్రంగా మారుతుందని చెప్పారు. దక్షిణ భారతదేశంలో తొలిసారిగా హ్యాట్రిక్ సీఎంగా కేసీఆర్ రికార్డు సృష్టించబోతున్నారని ఆశాభావం వ్యక్తం చేశారు. ముఖ్యమంత్రి అభ్యర్థి ఎవరో చెప్పాలని ప్రతిపక్షాలను ప్రశ్నించారు. రాష్ట్రంలో గాంధీ సిద్ధాంతమే తప్ప గాడ్సే సిద్ధాంతాలు నడవవని స్పష్టం చేశారు. ఈసారి వంద ఎమ్మెల్యే స్థానాలు గెలిచి పాత రికార్డును బీఆర్ఎస్ పార్టీ తిరగరాస్తుందని ధీమా వ్యక్తం చేశారు.

డీఎస్సీ పరీక్షలను వాయిదా వేయాలి

- డీఎడ్, బీఎడ్ అభ్యర్థుల సంఘం డిమాండ్

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రాష్ట్రంలో అసెంబ్లీ ఎన్నికల దృష్ట్యా డీఎస్సీ రాతపరీక్షలను వాయిదా వేయాలని తెలంగాణ రాష్ట్ర డీఎడ్, బీఎడ్ అభ్యర్థుల సంఘం రాష్ట్ర అధ్యక్షులు రావుల రామ్మోహన్‌రెడ్డి డిమాండ్ చేశారు. నవంబర్ 30న పోలింగ్ ఉన్నందున అదే రోజు డీఎస్సీ ఎస్జీటీ పరీక్ష ఉందని సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు.

సీడీఎంఏతో మున్సిపల్ కార్మికుల చర్చలు సఫలం

- తెలంగాణ మున్సిపల్ వర్కర్స్, ఎంప్లాయీస్ యూనియన్



నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

అధికారులతో తెలంగాణ మున్సిపల్ వర్కర్స్, ఎంప్లాయీస్ యూనియన్ జరిపిన చర్చలు సఫలమయ్యాయనీ, మంగళవారం నుంచి తలపెట్టిన సమ్మెను తాత్కాలికంగా వాయిదా వేస్తున్నట్టు ఆ యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు పాలడుగు భాస్కర్, ప్రధాన కార్యదర్శి జనగాం రాజమల్లు తెలిపారు. సోమవారం హైదరాబాద్‌లోని మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ కార్యాలయంలో జాయింట్ డైరెక్టర్ శ్రీధర్ ఆధ్వర్యంలో అధికారులు, యూనియన్ నాయకుల మధ్య చర్చలు జరిగాయి. చర్చల్లో యూనియన్ ప్రతిపాదించిన డిమాండ్లపై సీడీఎంఏ అధికారులు సానుకూలంగా స్పందించారని వారు తెలిపారు. మున్సిపల్ కార్మికులకు ఆంధ్రప్రదేశ్‌లో మాదిరిగా నెలకు రూ.21 వేల జీతం చెల్లించాలనీ, కొత్తగా నియమించిన కార్మికులకు కనీస వేతనాలు అమలు చేయాలని కోరామని తెలిపారు. జీఓ నెం.60 ప్రకారం కేటగిరీల వారీగా వేతనాలివ్వడం, రెండో పీఆర్సీ సూచించిన ఐఆర్ (మధ్యంతర భృతి)ని అమలు చేయడం, ఇన్సూరెన్స్ కల్పన, కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ కార్మికులను పర్మినెంట్, తదితర అంశాలను ప్రధానంగా చర్చకు పెట్టామన్నారు. సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామనీ, ఆర్థికపరమైన అంశాలను ప్రభుత్వంతో చర్చించి పరిష్కరిస్తామని శ్రీధర్ హామీనిచ్చారని చెప్పారు. చర్చల్లో సీఐటీయూ రాష్ట్ర కార్యదర్శి జె. వెంకటేష్, మున్సిపల్ వర్కర్స్, ఎంప్లాయీస్ యూనియన్ వర్కింగ్ ప్రెసిడెంట్ ఎర్రా నర్సింహులు, రాష్ట్ర ఉపాధ్యక్షులు టి. ఉప్పలయ్య, డి. కిషన్, సాయిలు, రాష్ట్ర కార్యదర్శి పి. సుధాకర్, టీఎస్ ఎంఆర్‌పీఎస్ రాష్ట్ర వ్యవస్థాపక అధ్యక్షులు బొట్ల భిక్షపతి, సీఐటీయూ నాయకులు మహేష్, రఘు తదితరులు పాల్గొన్నారు.

టీఎస్‌పీఎస్సీ వైఫల్యంపై 14న రాస్తారోకో

- అఖిలపక్ష పార్టీల పిలుపు



నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

టీఎస్‌పీఎస్సీ వైఫల్యం, ప్రభుత్వ నిర్లక్ష్యం వల్ల రాష్ట్రంలో విద్యార్థి, యువజనులు, నిరుద్యోగులు తీవ్ర నిరాశలో కూరుకుపోయారని ఆందోళన వ్యక్తం చేశాయి. ఈ నేపథ్యంలో విద్యార్థులు, నిరుద్యోగుల అసంతృప్తిని వ్యక్తం చేయడానికి, ప్రభుత్వ నిర్లక్ష్యాన్ని ఎండగట్టడానికి, టీఎస్‌పీఎస్సీ వైఫల్యంపై చర్యలు తీసుకోవాలనీ, ఖాళీ పోస్టులన్నీ భర్తీ చేయాలని డిమాండ్ చేస్తూ ఈనెల 14న ఉదయం 10.30 నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు రాష్ట్రంలో నాలుగు రహదారులపై రాస్తారోకో నిర్వహించాలని అఖిలపక్ష రాజకీయ పార్టీలు, ప్రజా సంఘాల ఉమ్మడి వేదికలు పిలుపునిచ్చాయి. సోమవారం హైదరాబాద్‌లోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో టీజేఎస్ అధినేత కోదండరాం అధ్యక్షతన అఖిలపక్ష పార్టీల సమావేశాన్ని నిర్వహించారు. మల్లు రవి (కాంగ్రెస్), టి సాగర్ (సీపీఐఎం), విశ్వేశ్వరరావు (టీజేఎస్), యూసఫ్ (సీపీఐ), ఎం హన్మేశ్ (సీపీఐ(ఎంఎల్) ప్రజాపంథా), జెవి చలపతిరావు (సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ), సాదినేని వెంకటేశ్వరరావు (సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ), కన్నెగంటి రవి (తెలంగాణ పీపుల్స్ జాయింట్ యాక్షన్ కమిటీ), కిరణ్ (ఎస్ఎఫ్ఐ), అనిల్ (పీడీఎస్‌యూ), మహేష్ (పీడీఎస్‌యూ), రియాజ్, శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు. ఈ రాస్తారోకో కార్యక్రమంలో ప్రజలందరూ విద్యార్థులు, యువతకు మద్దతుగా పాల్గొనాలని కోరారు.

రాస్తారోకో కార్యక్రమ వివరాలు :

- మహబూబ్ నగర్ నుంచి హైదరాబాద్ రహదారిలో మహబూబ్ నగర్, జడ్చర్ల, షాద్ నగర్, శంషాబాద్ వరంగల్ నుంచి
- హైదరాబాద్ రహదారిపై వరంగల్, స్టేషన్ ఘనపూర్, జనగామ, ఆలేరు, భువనగిరి, ఘట్‌కేసర్ రామగుండం నుంచి
- హైదరాబాద్ రహదారిపై రామగుండం, పెద్దపల్లి, కరీంనగర్, సిద్ధిపేట, గజ్వేల్, శామీర్‌పేట, తూంకుంట ఖమ్మం నుంచి
- హైదరాబాద్ రహదారిలో ఖమ్మం, కూసుమంచి, సూర్యాపేట, నకిరేకల్, నార్కట్‌పల్లి, చిట్యాల, చౌటుప్పల్, హయత్ నగర్

రాస్తారోకో డిమాండ్లు :3.

- టీఎస్‌పీఎస్సీ ప్రస్తుత బోర్డు చైర్మెన్‌తో సహా సభ్యులను తొలగించి, చట్టంలో పేర్కొన్న నిబంధనల ప్రకారం కొత్త సభ్యులను నియమించాలి.
- టీఎస్‌పీఎస్సీని సంపూర్ణంగా ప్రక్షాళన చేయాలి.
- డీఎస్సీ పోస్టుల సంఖ్యను ముఖ్యమంత్రి అసెంబ్లీలో ప్రకటించిన విధంగా 13,086కు పెంచాలి. (బ్యాక్‌లాగ్ పోస్టులు కాకుండా అదనంగా)
- పరీక్షల రద్దుకు పబ్లిక్ సర్వీస్ కమిషన్ బాధ్యత వహించి పరీక్షలు రాసిన అభ్యర్థులకు రూ.మూడు లక్షల పరిహారం చెల్లించాలి.

పాత డిమాండ్లు నెరవేర్చాలి

- లేకపోతే మండి వ్యవస్థను పునరుద్ధరించడానికి పెద్ద ఎత్తున ఆందోళనలు : బీహార్ సర్కారును హెచ్చరించిన రాకేశ్ టికాయత్ టికైత్

పాట్నా: నితీష్ కుమార్ నేతృత్వంలోని మహాఘట్‌బంధన్ ప్రభుత్వాన్ని భారతీయ కిసాన్ యయూనియన్ (బీకేయూ) నాయకుడు రాకేశ్ టికాయత్ హెచ్చరించారు. పాత డిమాండ్లను నెరవేర్చడంలో విఫలమైతే 2024 లోక్‌సభ ఎన్నికలకు ముందు మండి వ్యవస్థను పునరుద్ధరించాలని బీహార్‌లో కష్టాల్లో ఉన్న రైతులు పెద్ద ఆందోళనకు దిగుతారని వెల్లడించారు. 2006లో నితీశ్ కుమార్ నేతత్వంలోని ఎన్డీయే సర్కారు వ్యవసాయ సంస్కరణల పేరుతో అగ్రికల్చర్ ప్రొడ్యూస్ మార్కెటింగ్ కమిటీ (ఏపీఎంసీ) చట్టాన్ని రద్దు చేసింది. దీని ఫలితంగా వ్యవసాయ ఉత్పత్తుల కోసం నియంత్రిత హోల్‌సేల్ మార్కెట్ మూసివేయబడింది. సాధారణంగా వీటిని మండీ లు అని పిలుస్తారు. ప్రభుత్వం మండీలను నియంత్రిస్తుంది. ఇది ప్రయివేటు సంస్థలు రైతుల నుంచి నేరుగా వ్యవసాయ వస్తువులను కొనుగోలు చేసేలా చేసింది. కైమూర్ జిల్లాలోని భబువాలోని కిసాన్ మహాపంచాయత్‌లో రైతులను ఉద్దేశించి టికాయత్ మాట్లాడుతూ.. రైతులకు నేరుగా ప్రయోజనం చేకూర్చేందుకు మండి వ్యవస్థ పునరుద్ధరణ కోసం రైతులు ఆందోళనలు చేపడతారని బీహార్ ప్రభుత్వాన్ని హెచ్చరించారు. "ప్రభుత్వం రైతులను నిర్లక్ష్యం చేస్తూ, మండీలను పునరుద్ధరించాలనే వారి డిమాండ్‌ను విస్మరిస్తే, రైతులు ఆందోళనకు దిగవలసి వస్తుంది. ఇందులో దేశవ్యాప్తంగా ఉన్న రైతు నాయకులు పాల్గొంటారు" అని రాకేశ్ టికాయత్ అన్నారు. నితీశ్ ప్రతిపక్ష కూటమి ప్రధాన మంత్రి అభ్యర్థి కావాలనుకుంటే, అతను మండీలు, బజార్ సమితుల పునరుద్ధరణకు వెళ్లాలని తెలిపారు.

పేదల గుడిసెలపై వాలిన సర్కారు గద్దలు

- నివాస గూడును నేలమట్టం చేసిన మున్సిపల్, పోలీసు అధికారులు
- జేసీబీని అడ్డుకున్న బాధిత గుడిసె వాసులు
- సొమ్మసిల్లి పడిపోయిన బాధిత మహిళలు



మెదక్‌లో నిరుపేదల గుడిసెలను ధ్వంసం చేస్తున్న దృశ్యం



సొమ్మసిల్లి పడిపోయిన బాధితురాలు

నవతెలంగాణ-మెదక్

రెక్కాడితేగాని డొక్కాడని నిరుపేదల గూళ్ళపై సర్కారు గద్దలు వాలాయి. అండగా నిలిచిన ఎర్ర జెండాను అధికార బలంతో అణగదొక్కే ప్రయత్నం చేస్తున్నాయి. పొద్దంతా కష్టం చేసి చెమటోడ్చినా మూడు పూటలా కడుపు నిండని పేదలపై మున్సిపల్, పోలీసు అధికారులు జులూం ప్రదర్శించారు. అద్దెలు చెల్లించలేని దయనీయ పరిస్థితుల్లో జానెడు పొట్ట చేత పట్టుకొని ప్రభుత్వ స్థలాల్లో అభాగ్యులు వేసుకున్న గుడిసెలను నేలకూల్చారు. అడ్డొచ్చిన బాధితులపై అధికారులు అత్యుత్సాహం ప్రదర్శించారు. ఇదే క్రమంలో ఓ మహిళ సొమ్మసిల్లి పడిపోయింది. ఈ ఘటన మెదక్ జిల్లా కేంద్రంలో సోమవారం చోటు చేసుకుంది. మెదక్ పట్టణంలోని రైల్వే స్టేషన్ సమీపంలో గల హమాలీ కాలనీ 248/1 సర్వే నంబర్‌లో సుమారు మూడు ఎకరాల ప్రభుత్వ స్థలంలో కొంత కాలం నుంచి ఇల్లు లేని నిరుపేదలు 53 మంది గుడిసెలు వేసుకొని జీవనం కొనసాగిస్తున్నారు. 2005లో ఇందిరా గాంధీ హయాంలో పట్టాలను సైతం అందజేసినట్టు బాధితులు తెలిపారు. మెదక్ నగరం నడిబొడ్డునున్న ఈ స్థలంపై కొందరి కన్ను పడిందనే ఆరోపణలు ఉన్నాయి.

రెవెన్యూ పరిధిలో ఉన్న ప్రభుత్వ స్థలాన్ని కబ్జా చేశారనే విషయంలో గతంలో రెండు సార్లు స్థానిక తహసీల్దార్, ఆర్డీవో గుడిసెలను తొలగించే ప్రయత్నం చేశారన్నారు. మరోసారి పలువురు ప్రయివేటు వ్యక్తులు గుడిసెలకు నిప్పు పెట్టారు. అయితే బాధితులు సీపీఐ(ఎం) అండతో తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా చేపట్టి కలెక్టర్, ఎమ్మెల్యేకు వినతిపత్రాలు అందజేశారు. ఆ తరువాత రెవెన్యూ అధికారులు సర్వే చేశారు. దాదాపు నాలుగైదు నెలల తరువాత నిరుపేదలు కబ్జా చేసింది ప్రభుత్వ స్థలం కాదని, మున్సిపల్ లే అవుట్ పార్క్ స్థలం అంటూ మున్సిపల్ అధికారులు సోమవారం రంగప్రవేశం చేశారు. బాధిత గుడిసెవాసులకు ఎలాంటి సమాచారం లేకుండా, నోటీసులు ఇవ్వకుండా అధికార బలంతో పోలీసుల అండదండలతో మున్సిపల్ కమిషనర్ అధ్వర్యంలో పేదల గుడిసెలను నేలమట్టం చేశారు. ఈ సందర్భంగా గుడిసెలను కూల్చేస్తున్న జేసీబీని పలువురు మహిళలు అడ్డుకునే ప్రయత్నం చేయగా, పోలీసులు పక్కకు తోసేశారు. ఈ క్రమంలో ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. బాధిత మహిళలు ఇండ్ల కూల్చివేతను అడ్డుకునే ప్రయత్నం చేసే క్రమంలో మట్టిలో, బురదలో కిందపడి గాయపడగా, ఓ మహిళ సొమ్మసిల్లి పడిపోయింది. అడ్డుకున్న బాధితులపై అధికారులు కర్కశంగా ప్రవర్తించారని, అడ్డొస్తే కేసులు పెడతామని భయ భ్రాంతులకు గురిచేశారని గుడిసెవాసులు తెలిపారు. సంపన్నుల అక్రమాలను అడ్డుకునే చేతగాని అధికారులు కడుపులో పేగులు లేని నిరుపేదల జీవితాలపై దెబ్బ కొడుతున్నారని ఆవేదన వ్యక్తం చేస్తూ నాశనం అవుతారని అధికారులకు, ప్రజాప్రతినిధులకు, ప్రభుత్వానికి శాపనార్థాలు పెట్టారు.

పేదలకు అండగా నిలిచిన ఎర్రజెండా

ప్రజా సమస్యలపై నిత్యం పోరాడే కమ్యూనిస్టు పార్టీ నేతలు ప్రభుత్వ స్థలంలో గుడిసెలు వేసుకున్న నిరుపేదలకు అండగా నిలిచి మద్దతు ఇచ్చారు. మెదక్ పట్టణంలో పేదలు వేసుకున్న గుడిసెల తొలగింపు దుర్మార్గమైన చర్య అని సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి ఎ.మల్లేశం, సీఐటీయూ జిల్లా కార్యదర్శి బి.బస్వరాజ్ తెలిపారు. పది నెలలుగా రెవెన్యూ పరిధిలోని ప్రభుత్వ స్థలం అని చెప్పి సర్వేలు చేసిన అధికారులు, ఇప్పుడు మున్సిపల్ పరిధిలోని లే అవుట్ పార్క్‌కు సంబంధించిన స్థలం అని చెప్పడం వెనుక ఆంతర్యం ఏమిటో తెలియజేయాలన్నారు. పేదల కడుపు కొట్టి పెద్దలకు పెట్టే విధంగా అధికారుల చర్యలు చేపడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. పేదల గుడిసెల తొలగింపులో కీలక పాత్ర ఎవరిదనే అంశం త్వరలో తెరమీదికి వస్తదని, ఎన్నికల్లో తగిన బుద్ధి చెప్తామని హెచ్చరించారు. ఎవరు ఎన్ని అడ్డంకులు సృష్టించినా పేదలకు అండగా ఎర్ర జెండా నిలబడుతుందని స్పష్టం చేశారు.

ఖమ్మం కలెక్టరేట్ ఎదుట గీత కార్మికుల ధర్నా

- కల్లుగీత కార్మికులకు ఇచ్చిన హామీలు అమలు చేయాలి : కల్లు గీత కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బెల్లకొండ వెంకటేశ్వర్లు



నవతెలంగాణ-ఖమ్మం

రాష్ట్ర ప్రభుత్వం కల్లుగీత కార్మికులకు ఇచ్చిన హామీలు అమలు చేయాలని కల్లు గీత కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బెల్లకొండ వెంకటేశ్వర్లు డిమాండ్ చేశారు. సోమవారం ఖమ్మం కలెక్టరేట్ ఎదుట గీత కార్మికులు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాటా డుతూ.. ఖమ్మం జిల్లాలో వేలాది కుటుంబాలు కల్లుగీత వృత్తిపై ఆధారపడి జీవిస్తున్నారని, తాళ్లు ఎక్కే క్రమంలో ప్రమాదం జరిగి కాళ్ళు, చేతులు విరుగుతున్నాయని, నడుములు పడిపోయి మంచాన పడిపోతున్నారని, పదుల సంఖ్యలో చనిపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.

బతుకుదెరువు కోసం వృత్తి ప్రమాదమైనప్పటికీ చేస్తున్నామని, ఇంత ప్రమాదం ఏ వృత్తిలో లేదని, గీత కార్మికులను ప్రమాదాల బారి నుంచి కాపాడాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందని చెప్పారు. వీరికి ప్రమాద నివారణా చర్యలు తీసుకోవాలని, సేఫ్టీ మోకును ఇవ్వాలని, 2023-24 బడ్జెట్‌లో గీత కార్మికుల సంక్షేమానికి కేటాయించిన రూ.30 కోట్లు వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. కులస్తులందరికీ ద్విచక్ర వాహనాలు ఇవ్వాలని, మునుగోడు ఉపఎన్నికల సందర్భంగా బీఆర్ఎస్ పార్టీ నిర్వహించిన గౌడ ఆత్మీయ సమ్మేళనంలో కేటీఆర్ ఇచ్చిన హామీలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఇటీవల జరిగిన లిక్కర్ షాపు టెండర్లలో సొసైటీలకు రిజర్వేషన్ కల్పించకుండా పాత పద్ధతినే కొనసాగించారని ఆరోపించారు. ప్రస్తుతం ఇస్తున్న ఎక్స్‌గ్రేషియా యథావిధిగా కొనసాగిస్తూనే ముఖ్యమంత్రి కేసీఆర్ ఇటీవల ప్రకటించిన గీతన్న బీమా అమలు చేయాలని కోరారు. ఇటీవల బీసీ కులవృత్తిదారులకు ఇచ్చిన జీవో నెంబర్ 5 ప్రకారం కల్లుగీత వృత్తి చేస్తున్న వారందరికీ రూ.లక్ష నగదు ఆర్థిక సహకారాన్ని అందించాలని డిమాండ్ చేశారు. సొసైటీలకు భూమి ఇవ్వాలని, కల్లుకు మార్కెట్ సౌకర్యం కల్పించాలని, నీరా తాటి, ఈత ఉత్పత్తుల పరిశ్రమల అభివృద్ధికి కృషిచేయాలని కోరారు.

కార్యక్రమంలో సంఘం జిల్లా అధ్యక్ష కార్యదర్శులు బోడపట్ల సుదర్శన్, గాలి అంజయ్య, చేతి వృత్తిదారుల కమిటీ కన్వీనర్ ఎర్ర శ్రీకాంత్, వ్యవసాయ కార్మిక సంఘం అధ్యక్షులు మెరుగు సత్యనారాయణ, నాయకులు నాగేశ్వరరావు, కొండ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

మోకాళ్లపై నిలబడి మిడ్‌డే మీల్స్ కార్మికుల నిరసన

- బిల్లులు విడుదల చేయాలని డిమాండ్



నవతెలంగాణ- విలేకరులు

అప్పులు తెచ్చిన వంట చేసి పాఠశాలల్లో పిల్లల కడుపు నింపిన తమ కడుపు కొట్టొద్దని, బిల్లులు విడుదల చేసి అప్పుల్లో నుంచి గట్టెక్కించాలంటూ మధ్యాహ్న భోజన పథకం కార్మికులు డిమాండ్ చేశారు. సమ్మెలో భాగంగా సోమవారం రంగారెడ్డి జిల్లా కడ్తాల్‌లో చేపట్టిన ప్రజాసంఘాల నాయకులు మద్దతు తెలిపి మాట్లాడారు. వికారాబాద్ జిల్లా కొడంగల్‌లో మోకాళ్లపై కూర్చొని కార్మికులు నిరసన తెలిపారు. నల్లగొండ జిల్లా కేంద్రంలోని జిల్లా విద్యాశాఖాధికారి కార్యాలయం ముందు సమ్మె కొనసాగింది. యాదాద్రి భువనగిరి జిల్లా కేంద్రంలో కలెక్టరేట్ ఎదుట మధ్యాహ్న భోజన కార్మికులు ధర్నా చేశారు. సంస్థాన్ నారాయణపురంలో కార్మికులు కండ్లకు నల్ల రిబ్బన్లు కట్టుకొని రాస్తారోకో నిర్వహించారు.సమ్మెలో భాగంగా మధ్యాహ్నం భోజన కార్మికులు ఆదిలాబాద్ కలెక్టరేట్‌ను ముట్టడించారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా కార్యదర్శి అన్నమొల్ల కిరణ్ మాట్లాడారు. 2022 అసెంబ్లీ బడ్జెట్ సమావేశాల సందర్భంగా సీఎం కేసీఆర్ ఇచ్చిన హామీ మధ్యాహ్న భోజనం పథకం కార్మికులకు రూ.2000 వేతనాన్ని అమలు చేయాలని డిమాండ్ చేశారు.

గిరిజనుల అభివృద్ధి కోసం ఏం చేస్తారు?

- పార్టీ ప్రణాళికల్లో ప్రకటించాలి : చర్చావేదికలో వక్తల డిమాండ్



నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

గిరిజనుల అభివృద్ధికి తోడ్పడే విధంగా ఆయా పార్టీల ఎన్నికల ప్రణాళికలో ప్రకటించాలని గిరిజన సంఘాల నేతలు డిమాండ్ చేశారు. సోమవారం హైదరాబాద్‌లోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో తెలంగాణ గిరిజన సంఘం,తెలంగాణ గిరిజన సమాఖ్య ఆధ్వర్యంలో 'గిరిజన డిక్లరేషన్'పై తెలంగాణ గిరిజన సమాఖ్య అధ్యక్షులు ఆర్ అంజయ్య నాయక్, తెలంగాణ గిరిజన సంఘం రాష్ట్ర అధ్యక్షులు ఎం ధర్మానాయక్ అధ్యక్షతన చర్చావేదిక నిర్వహించారు. 'డిక్లరేషన్ ముసాయిదా'ను తెలంగాణ గిరిజన సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆర్ శ్రీరాం నాయక్ చర్చకు పెట్టారు. గిరిజన మేధావుల ఫోరం రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ ధనంజయ నాయక్, సేవాలాల్ సేన రాష్ట్ర అధ్యక్షులు ఆంగోత్ రాంబాబు నాయక్, ఆల్ ఇండియా బంజారా సేవా సంఘం ఖమ్మం జిల్లా నాయకులు బస్కీ నాయక్, ప్రదేశ్ ఎరుకల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బి రఘు, ఆల్ ఇండియా ట్రైబల్ జేఏసీ అధ్యక్షులు రవీందర్ నాయక్, ఎల్‌హెచ్‌పీఎస్ రాష్ట్ర నాయకులు సుమన్, గిరిజన ఉద్యోగుల సంఘం రాష్ట్ర నాయకులు అమర్ సింగ్, గిరిజన సంఘం నాయకులు ఎం బాలు, రామ్ కుమార్, రఘు, తిరుపతి, గౌరీనాయక్, గిరిజన సమాఖ్య నాయకులు దేవీలాల్, శత్రు ,నారాయణ, అంజయ్య తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్రంలో నవంబర్ 30 న జరుగనున్న అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో ప్రధాన రాజకీయ పార్టీలు తమ ఎన్నికల ప్రణాళికలను ప్రకటిస్తాయని చెప్పారు. వీటిల్లో గిరిజనుల ప్రధాన డిమాండ్లను ఆయా పార్టీల ప్రణాళికల్లో చేర్చాలని డిమాండ్ చేశారు. గిరిజనులను విస్మరిస్తే తగిన బుద్ధి చెబుతామని ఈ సందర్భంగా హెచ్చరించారు. ఓట్ల సమయంలో హామీలిచ్చి, అధికారంలోకి వచ్చిన తరువాత వాటిని అమలు చేయకుండా మోసం చేస్తున్నాయని విమర్శించారు. అటువంటి మోసపూరిత వాగ్దానాలను నమ్మొద్దని విజ్ఞప్తి చేశారు. గిరిజనులకు నేరుగా లబ్ది జరిగే విధంగా అభివద్ధి, సంక్షేమం, ఆత్మగౌరవం, సమానత్వంతో కూడిన ప్రధాన అంశాలను పరిగణలోకి తీసుకోవాలని డిమాండ్ చేశారు. బీఆర్ఎస్ అధికారంలోకి వచ్చిన ఆరునెల్లకే గిరిజనులకు 12శాతం రిజర్వేషన్ పెంచుతామని చెప్పి, తొమ్మిదేండ్ల తర్వాత 10 శాతానికి పెంచినట్టు ప్రకటించినా..అవి అమలు కాలేదని విమర్శించారు. దీంతో విద్యా,ఉద్యోగ రంగాల్లో తీవ్రంగా నష్టపోయారని ఆవేదన వ్యక్తం చేశారు. తండాలను గ్రామ పంచాయతీలుగా చేసినా ప్రత్యేక నిధులు ఇవ్వకపోవడంతో సర్పంచ్‌లు అప్పుల పాలై ఇప్పటి వరకు 15 మంది ఆత్మహత్యలు చేసుకున్నారని తెలి పారు. 11 లక్షల ఎకరాలకు పోడుభూములకు హక్కుపత్రాలు ఇస్తామన్న బీఆర్ఎస్ ప్రభుత్వం 4 లక్షల ఎకరాలకు మాత్రమే హక్కుపత్రాలిచ్చి చేతులు దులుపుకుందని విమర్శించారు. కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం గిరిజన వ్యతిరేక విధానాలు అవలం భించినా ఆ పార్టీకి మద్దతు ఇచ్చి రాష్ట్రంలో గిరిజనులకు ద్రోహం చేసిందని ఆరోపించారు. విభజన చట్టంలో గిరిజన యూనివర్సిటీ ఏర్పాటు చేయాలని ఉన్నా కేంద్రంతో కొట్లాడి సాధించడంలో కాలయాపన చేసిందన్నారు.

30 శాతం సీట్లు గిరిజన విద్యార్థులకే కేటాయించాలి

- మంత్రి సత్యవతి రాథోడ్ డిమాండ్

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

ములుగులో నూతనంగా మంజూరైన సమ్మక్క సారలమ్మ సెంట్రల్ ట్రైబల్ యూనివర్సిటీలో 30 శాతం సీట్లు గిరిజన విద్యార్థులకే కేటాయించాలని కేంద్ర గిరిజన వ్యవహారాల శాఖ మంత్రి అర్జున ముండాకు రాష్ట్ర మంత్రి సత్యవతి రాథోడ్ విజ్ఞప్తి చేశారు. సోమవారం హైదరాబాద్‌లోని డీఎస్ఎస్ భవన్‌లో రాంజీ మెమోరియల్ ట్రైబల్ ఫ్రీడమ్ ఫైటర్ మ్యూజియంతో పాటు ట్రైబల్ రీసెర్చ్ ఇనిస్టిట్యూట్ భవనాన్ని సత్యవతి రాథోడ్‌తో కలిసి అర్జున్ ముండా వర్చువల్‌గా ప్రారంభించారు. ఈ సందర్భంగా రాష్ట్ర మంత్రి సత్యవతి రాథోడ్ మాట్లాడుతూ సమ్మక్క సారలమ్మ జాతరకు జాతీయ పండుగగా గుర్తించి, నిధులను కేటాయించాలన్నారు. రాష్ట్రానికి అదనంగా మరో 22 ఎకలవ్య మోడల్ రెసిడెన్షియల్ స్కూల్స్ ను మంజూరు ఇవ్వాలని డిమాండ్ చేశారు.రాష్ట్ర ప్రభుత్వం పెంచిన 10 శాతం గిరిజన రిజర్వేషన్ ను పార్లమెంట్ లో వెంటనే అమోదించి చట్టం చేయాలని కోరారు. జీవో నెంబర్ 3 ని చట్టబద్ధం చేయాలన్నారు.

కల్వకుంట్ల స్కామిలీకి కౌంట్ డౌన్

- నియంత సర్కారుకు రాస్తున్న మరణశాసనం : రేవంత్ రెడ్డి ట్వీట్

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

ఎన్నికల షెడ్యూల్ విడుదలైన నేపథ్యంలో టీపీసీసీ అధ్యక్షులు ఎ.రేవంత్ రెడ్డి కల్వకుంట్ల స్కామిలీకి కౌంట్‌డౌన్ పేరుతో ట్వీట్ చేశారు. "ఇది.. దగాపడిన యువత, ఆగమైన అన్నదాత కన్నెర చేస్తూ చెప్తున్న కౌంట్ డౌన్. ఇది.. మోసపోయిన దళితుడు, రక్షణ లేని ఆడకూతురు చెప్తున్న కౌంట్ డౌన్. ఇది.. కన్నీళ్లు పెట్టిన సర్కారు బడి చిన్నారి, పింఛన్ కోసం కాళ్లరిగేలా తిరిగిన పెద్ద మనిషి చేస్తున్న కౌంట్ డౌన్. ఇది.. నిలువ నీడ లేని పేద కుటుంబం, మాట్లాడే స్వేచ్ఛలేని మేధావి వర్గం నినదిస్తున్న కౌంట్ డౌన్. ఈ 52 రోజుల కౌంట్ డౌన్.. నాలుగు కోట్ల ప్రజలు మీ నియంత సర్కారుకు రాస్తున్న మరణశాసనం.. " అని రేవంత్ పేర్కొన్నారు.

ఓటర్ల జాబితాలో చాలా తప్పులు

- నిరంజన్

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

ఓటర్ల జాబితాలో చాలా తప్పులున్నాయని టీపీసీసీ సీనియర్ ఉపాధ్యక్షులు నిరంజన్ తెలిపారు. స్పెషల్ సమ్మరీ ఓటర్ల పరిశీలన అంటే ఇంటింటికి తిరిగి పరిశీలించాలని కోరారు. సోమవారం గాంధీభవన్‌లో ఆయన మీడియాతో మాట్లాడారు. రాజీవ్‌గాంధీ సద్భావన కమిటీ ఆధ్వర్యంలో ఈ నెల 19న చార్మినార్ వద్ద సద్భావన కార్యక్రమాలు చేపట్టడం జరుగుతుందన్నారు. ఎన్నికల కోడ్ అమల్లోకి వచ్చిన నేపథ్యంలో ప్రభుత్వ ఖర్చులతో ఏర్పాటు చేసిన ప్రచార హోర్డింగ్స్, ఇతర ప్రచారాలు అన్ని వెంటనే తొలగించాలని డిమాండ్ చేశారు.

పలు అంశాలపై మ్యానిఫెస్టో కమిటీ చర్చలు

కాంగ్రెస్ మ్యానిఫెస్టో కమిటీ చైర్మెన్ శ్రీధర్‌బాబు అధ్యక్షతన సోమవారం గాంధీభవన్‌లో సమావేశమై పలు అంశాలపై చర్చించింది. ఉద్యోగులకు ఓల్డ్ పెన్షన్ పథకం ప్రతిపాదనతో పాటు ఇండ్లలో పని చేసేవారు, గార్బేజ్ వర్కర్స్, ట్రాన్స్ జెండర్ యూనియన్, గిగ్ వర్కర్స్, తెలంగాణ ఉద్యమకారులు, టూర్స్ అండ్ ట్రావెల్స్ డ్రైవర్స్ యూనియన్, తెలంగాణ క్యాబ్ డ్రైవర్స్ యూనియన్, స్ట్రీట్ వెండర్స్, రిటైర్డ్ స్కూల్ ఎంప్లాయీస్ సమావేశంలో పాల్గొని చర్చించారు.

ఎల్ఐసీ ఏజెంట్ల రక్షణ కోసం దేశవ్యాప్త ఉద్యమం

సీఐటీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పాలడుగు భాస్కర్



నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

ఎల్ఐసీ ఏజెంట్ల రక్షణ కోసం దేశవ్యాప్త ఉద్యమం చేపట్టనున్నట్టు సీఐటీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పాలడుగు భాస్కర్ తెలిపారు. ఎల్ఐసీ ఏజెంట్స్ ఆర్గనైజేషన్ ఆఫ్ ఇండియా జాతీయ కమిటీ పిలుపులో భాగంగా సోమవారం హైదరాబాద్‌లోని సచివాలయం ఎదుట ఉన్న ఎల్ఐసీ జోనల్ కార్యాలయంలో ఏజెంట్లు మహాధర్నా నిర్వహించారు. ఎల్ఐసీ ఏఓఐ జాతీయ నాయకులు సూర్జిత్, సౌత్ సెంట్రల్ జోన్ నాయకులు ఎల్.మంజునాథ్, పిఎల్. నర్సింహారావు, వర్కింగ్ ప్రెసిడెంట్ సిఎల్ జోసఫ్, సీఐటీయూ రాష్ట్ర కార్యదర్శి జె.వెంకటేశ్, తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా భాస్కర్ మాట్లాడుతూ.. ఎల్ఐసీ ఏజెంట్లకు రక్షణ కల్పిస్తూ పార్లమెంట్‌లో బిల్లు ప్రవేశపెట్టాలని కేంద్రాన్ని కోరారు. బీమా సుగమ్ ఎక్ఛేంజ్ అమలు చేయొద్దని డిమాండ్ చేశారు. గ్రాట్యూటీ పెంచి ఏజెంట్స్ మెడీక్లయిమ్ సమస్యలను పరిష్కరించాలనీ, వెల్ఫేర్ ఫండ్ ఏర్పాటు చేయాలని కోరారు. బీమా రంగం ప్రభుత్వ ఆధీనంలో ఉండటం వల్ల ప్రజలకు ప్రయోజనం చేకూరడమే కాకుండా అనేక అభివృద్ధి కార్యక్రమాలకు ఎల్ఐసీ ఏజెంట్లు సమకూర్చే నిధులు ఎంతగానో ఉపయోగపడుతాయన్నారు. ఆర్థిక వ్యవస్థను ప్రభావితం చేసే బీమా రంగాన్ని మరింత బలోపేతం చేయకుండా బహుళ జాతి, విదేశీ ప్రయివేటు ఇన్సూరెన్స్ ప్రయోజనాల కోసం ఎల్ఐసీని నిర్వీర్యం చేయడం అన్యాయమన్నారు. బీమా రంగ పరిరక్షణ కోసం ఎల్ఐసీ ఏజెంట్లు ప్రజలను జాగృతం చేయాలనీ, ఆ పోరాటానికి సీఐటీయూ అండగా ఉంటుందని హామీనిచ్చారు.

నయా సరళీకరణతో దేశానికి ప్రమాదం

విదేశీ పెట్టుబడులపై ఆధారపడడం మంచిది కాదు

- కీలక రంగాలకు ప్రభుత్వ మద్దతు అవసరం : ఆర్థికవేత్త ప్రభాత్ పట్నాయక్



కొల్‌కతా : నయా సరళీకరణ వ్యూహం కొనసాగితే దేశం ప్రమాదంలో పడుతుందని, ఆహారోత్పత్తి, విద్య, ఆరోగ్య రంగాలు దెబ్బతింటాయని ప్రముఖ ఆర్థికవేత్త ప్రొఫెసర్ ప్రభాత్ పట్నాయక్ హెచ్చరించారు. 'ప్రస్తుత పరిస్థితులలో దేశ స్వావలంబన' అనే అంశంపై కలకత్తా యూనివర్సిటీ ఇన్‌స్టిట్యూట్ హాలులో జరిగిన చర్చా కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం విదేశీ పెట్టుబడిదారుల ప్రయోజనాల కంటే దేశ పౌరుల అవసరాలను పరిశీలించాలని సూచించారు. సంపన్నులపై భారీగా పన్నులు విధించకపోతే దేశంలోని పేద ప్రజల పరిస్థితులు మారబోవని చెప్పారు. ఇదే సందేశాన్ని దేశంలోని వామపక్షవాదులు పదే పదే ఇస్తూనే ఉన్నారని గుర్తు చేశారు. పశ్చిమబెంగాల్ సైన్స్ ఫోరమ్, శాస్త్రవేత్తలు, ఇంజినీర్లు, సాంకేతిక నిపుణులతో కూడిన వేదిక (ఎఫ్‌ఓఎస్‌ఈటీ) సంయుక్తంగా ఈ కార్యక్రమాన్ని ఏర్పాటు చేశాయి.

'ఉత్పత్తి, దేశీయ వనరులను దేశ ప్రజల కోసమే పూర్తిగా వినియోగించాలి. విదేశాల నుండి డబ్బు వస్తే దేశంలో ఆదాయం ఉండదు. సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించి దేశం మరింత వ్యవసాయ, పారిశ్రామిక ఉత్పత్తిని సాధించాల్సిన అవసరం ఉంది. దేశాన్ని నడిపేందుకు మనం విదేశీ పెట్టుబడులపై ఆధారపడితే, ఆ సొమ్ము దేశాన్ని విడిచి వెళితే అప్పుడు ప్రజలు రోడ్ల మీద కూర్చోవాల్సి వస్తుంది. ప్రస్తుత పరిస్థితి దీనినే సూచిస్తోంది' అని ప్రభాత్ పట్నాయక్ తెలిపారు. దేశ ఆర్థిక వ్యవస్థపై ఆయన మాట్లాడుతూ ఎగుమతులు తగ్గిపోయాయని, రూపాయి విలువ పడిపోతోందని చెప్పారు. 'ప్రపంచంలోనే ఆర్థిక పురోగతికి అవరోధాలు ఎదురవుతున్నాయి. దేశానికి ఆహార స్వయంసమృద్ధి అవసరం. అయితే ఆహారోత్పత్తిలో దేశం వెనుకబడుతోంది. దేశంలోని చాలా భూమి, వనరులు వృథాగా పడి ఉన్నాయి. అవి ఉపయోగంలో లేవు. మరోవైపు ప్రభుత్వమేమో సబ్సిడీలను ఉపసంహరిస్తోంది. దీంతో రైతుల ఆత్మహత్యలు పెరుగుతున్నాయి' అని వివరించారు. విదేశీ మారక లావాదేవీల ద్వారా ప్రభుత్వం ఖరీదైన ఉత్పత్తులపై దృష్టి పెడితే ప్రజల ముందు పెను ప్రమాదం కన్పిస్తుందని ప్రభాత్ అన్నారు. 'ఎందుకంటే ప్రజల కొనుగోలు శక్తి తగ్గుతుంది. రైతులకు కొనుగోలు శక్తి ఉండదు. దీనివల్ల దేశం స్వావలంబన సాధించడం సాధ్యం కాదు. పరిశ్రమ, వ్యవసాయం వంటి కీలక రంగాలకు ప్రభుత్వ మద్దతు అవసరం' అని చెప్పారు.

విద్యను ప్రైవేటీకరించడం ప్రమాదకరమని ప్రభాత్ హెచ్చరించారు. విద్యాసంస్థలు, యూనివర్సిటీలలో దేశ చరిత్ర, సంస్కృతికి ప్రాధాన్యత కల్పించాల్సిన అవసరం ఉన్నదని, ఇందుకు ప్రభుత్వం తోడ్పాటు అందించాలని ఆయన కోరారు. 'విదేశాలను అనుసరించ కూడదు. అలా చేస్తే ఉన్నత విద్యలో మనం వెనుకబడిపోతాము. నయా సరళీకరణ విధానాలతో సమస్య ఉంటే అది దేశ ప్రజలపై తీవ్రమైన ప్రభావం చూపుతుంది. ఆహార స్వావలంబన, ఉపాధి, ప్రభుత్వ సాయంతో నడుస్తున్న విద్య, ఆరోగ్య రంగం మెరుగుదల, వృద్ధాప్య పెన్షన్లు వంటి వాటిపై ప్రభుత్వం దృష్టి సారించాలి' అని ప్రభాత్ సూచించారు. 'బ్యాంక్ బచావో దేశ్ బచావో' కన్వీనర్ సౌమ్య దత్తా మాట్లాడుతూ విలీనాలు లేదా ప్రైవేటీకరణ ద్వారా ప్రభుత్వ రంగ బ్యాంకింగ్ వ్యవస్థను బలహీనపరిచే ప్రయత్నాలు జరుగుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. దీనివల్ల సామాన్యులు దోపిడీకి గురవుతారని చెప్పారు. దేశంలో శాస్త్ర, సాంకేతిక పరిశోధనలను సరిగా వినియోగించుకోవడం లేదని జాదవ్‌పూర్ యూనివర్సిటీ మాజీ వైస్ ఛాన్సలర్ సిద్ధార్థ దత్తా అభిప్రాయపడ్డారు. చర్చా వేదికలో బెఫీ, బీఎస్ఎన్ఎల్‌యూ, డబ్ల్యూబీఎంఎస్ఆర్‌యూ వంటి సంస్థలతో పాటు యూనివర్సిటీ ప్రొఫెసర్లు పాల్గొన్నారు.

మొబైల్ ఇంటర్నెట్‌ను పునరుద్ధరించండి

- మణిపూర్ సర్కారును కోరిన నాగా విద్యార్థి సంఘాలు

ఇంఫాల్ : మణిపూర్‌లోని ఉఖ్రుల్, ఛండేల్ జిల్లాలలో వెంటనే మొబైల్ ఇంటర్నెట్‌ను పునరుద్ధరించాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని విద్యార్థి సంఘాలు కోరాయి. రఫేల్ కాటమ్నావ్ లాంగ్, నాగా విద్యార్థి సంఘంలు ఈ అభ్యర్థనను చేశాయి. ఉఖ్రుల్‌లో నాగాలు అధికంగా ఉంటారు. ఛండేల్‌లోనూ నాగాలు గణనీయమైన సంఖ్యలో వీరి జనాభాను కలిగి ఉంటారు. మణిపూర్‌లో జాతి హింస చెలరేగిన తర్వాత గతనెల 23న రాష్ట్ర ప్రభుత్వం మొబైల్ ఇంటర్నెట్‌పై నిషేధాన్ని ఎత్తేసింది. అయితే, మూడ్రోజుల తర్వాత ఇద్దరు మెయిటీ విద్యార్థుల హత్యపై ఇంఫాల్‌లో వేలాది మంది ప్రజలు తమ నిరసనను వ్యక్తం చేయటంతో అధికార యంత్రాంగం మొబైల్ ఇంటర్నెట్‌పై మళ్లీ నిషేధాన్ని విధించింది. ఈ నిషేధాని ఈనెల 11 వరకు పొడిగించారు. ఉఖ్రుల్, ఛండేల్‌లలో మొబైల్ ఇంటర్నెట్ బ్యాన్ కారణంగా తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొంటున్నట్టు విద్యార్థి సంఘాలు ఆందోళనను వ్యక్తం చేశాయి. శాంతియుతమైన ఈ ప్రాంతాల్లో మొబైల్ ఇంటర్నెట్ బ్యాన్‌ను తప్పుబట్టాయి.

కానిస్టేబుల్ మెయిన్స్ పేపర్‌లో 4 మార్కులు కలపండి

- ఆ తర్వాతే ఉద్యోగాల జాబితా ప్రకటించండి
- టీఎస్ఎల్‌పీఆర్‌బీకి హైకోర్టు ఆదేశం

నవతెలంగాణ-ప్రత్యేక ప్రతినిధి : కానిస్టేబుల్ తుది రాత పరీక్షల్లో తప్పుగా వచ్చిన నాలుగు ప్రశ్నలకు గాను నాలుగు మార్కులు కలపాలంటూ హైకోర్టు తీర్పునిచ్చింది. అంతేగాక, మెయిన్స్ పేపర్‌లో నాలుగు మార్కులు కలిపాకే కానిస్టేబుల్ పోస్టులకు ఎంపికైన అభ్యర్థుల జాబితాను ప్రకటించాలని కూడా కోర్టు బోర్డును ఆదేశించింది. దీంతో తాజాగా ఇచ్చిన కోర్టు ఆదేశాల మేరకు పోలీసు రిక్రూట్‌మెంట్ బోర్డు కానిస్టేబుల్ పోస్టులకు ఎంపికైన అభ్యర్థుల జాబితాలో మార్పులు చేసి ప్రకటించే అవకాశం ఉన్నదని తెలుస్తున్నది. ఇటీవలనే టీఎస్ఎల్‌పీఆర్‌బీ 15 వేలకు పైగా కానిస్టేబుల్ తత్సమాన పోస్టులకు ఎంపికైన అభ్యర్థుల జాబితాను వారికి కేటాయించిన కటాఫ్ మార్కులతో పాటు వెల్లడించటం జరిగింది. అంతేగాక, ఎంపికైన కానిస్టేబుళ్ల అటెస్టేషన్ ఫారమ్‌లను అధికారిక వెబ్‌సైట్‌లో అప్‌లోడ్ చేసే ప్రక్రియను కూడా ప్రారంభించింది. అంతేగాక, ఈ అభ్యర్థుల మెడికల్ టెస్టులు, ఎస్‌బీ ఎంక్వైరీ ప్రక్రియను కూడా చేపట్టింది. కాగా, తాజాగా హైకోర్టు ఇచ్చిన తీర్పుతో ఈ ప్రక్రియకు బ్రేకు పడే అవకాశం ఉన్నదని తెలుస్తున్నది. అలాగే, కొందరు ఎంపికైన అభ్యర్థుల తుది ఫలితాలపై ప్రభావం పడనున్నదనీ, మరోవైపు మరికొందరు కొద్దిపాటిలో ఉద్యోగాలు దక్కకుండా పోయిన అభ్యర్థులకు ఉద్యోగాలు దక్కే అవకాశం ఉన్నదని కూడా అంచనా వేస్తున్నారు.

సామ్‌సంగ్ నుంచి 4టిబి ఎస్ఎస్‌డి టి9

గూర్‌గావ్ : ప్రముఖ ఎలక్ట్రానిక్స్ ఉత్పత్తుల కంపెనీ సామ్‌సంగ్ కొత్తగా ఎక్స్‌టర్నల్ స్టోరేజ్ డివైజ్ అయినా పోర్టబుల్ సాలిడ్ స్టేట్ డ్రైవ్ (ఎస్ఎస్‌డి) టి9ను విడుదల చేసింది. ఇది 4టిబి స్టోరేజ్ వరకు ఆప్షన్‌తో, వేగవంతమైన డేటా ట్రాన్స్‌ఫర్ వేగాన్ని కలిగి ఉంటుందని తెలిపింది. 1టిబి వేరియంట్ ధరను రూ.12,799కి, 4టిబి వేరియంట్‌ను రూ.33,599గా నిర్ణయించింది. 5ఏళ్ల పరిమిత వారంటీతో లభిస్తుందని పేర్కొంది.

కులాలే కీలకం

- ఓబీసీలు, మధ్యతరగతి ఓట్లపై బీజేపీ కన్ను
- 2019 ఫలితాల పునరావృతం కోసం ఆరాటం
- నిలువరించేందుకు ప్రతిపక్షాల వ్యూహరచన



న్యూఢిల్లీ : మన దేశం స్వేచ్ఛా వాయువులు పీల్చి ఏడు దశాబ్దాలు దాటినా, మండల్ కమిషన్ నివేదికను అమలు చేసి మూడు దశాబ్దాలు దాటినా ఇప్పటికీ రాజకీయాలలో కుల ప్రభావం అధికంగానే ఉంటోంది. బీహార్‌లో కులగణన జరిగిన తర్వాత దేశవ్యాప్తంగా కులాల వారీగా జనాభా సంఖ్యను తేల్చాలన్న డిమాండ్ పెరుగుతోంది. స్వాతంత్ర్యానంతరం కేంద్రంలో అధికారంలోకి వచ్చిన ప్రభుత్వాలు ఎస్సీ, ఎస్టీల సంఖ్యను తేల్చాయే తప్ప ఇతర కులాల వాస్తవ జనాభా ఎంతో నేటి వరకూ తెలుసుకోలేకపోయాయి. అసలు అందుకు ప్రయత్నం కూడా జరగలేదు. ఇప్పుడు బీహార్‌లో జరిగిన కులగణన దేశ రాజకీయాలలో సునామీ సృష్టించిందని చెప్పాలి. కులాలు, కోటాలపై దేశవ్యాప్తంగా చర్చోపచర్చలు సాగుతున్నాయి. బీహార్ తరహాలోనే దేశవ్యాప్తంగా కులగణన చేపట్టాలని ప్రతిపక్షాలు పట్టుబడుతున్నాయి. అయితే ఎలా, ఎప్పుడు అనే విషయం పార్టీల వైఖరి, రాజకీయ పథంపై ఆధారపడి ఉంది. అయినప్పటికీ ఈ సంవత్సరం చివరలో ఐదు రాష్ట్రాల శాసనసభలకు, వచ్చే సంవత్సరం ఏప్రిల్-మేలో లోక్‌సభకు ఎన్నికలు జరిగే వరకూ కులగణనపై చర్చలు సాగుతూనే ఉంటాయి. కోటా కోసం ఒక్క వెనుకబడిన తరగతులే పట్టుపట్టడం లేదు. ఆయా రాష్ట్రాలలో ఆర్థికంగా బలంగా ఉన్న మరాఠాలు, పటీదార్‌లు, జాట్లు, కాపులు కూడా ఇటీవలి కాలంలో తమకూ కోటా కావాలని కోరుతున్నారు.

బీహార్‌లో జరిగిన సామాజిక న్యాయ ఉద్యమం కారణంగా 1990లో ఆ రాష్ట్రంలో రాజకీయ అధికారం అట్టడుగు వర్గాల చేతిలోకి వచ్చింది. అయితే ఆ ఉద్యమం అనంతర కాలంలో ఆర్థిక సాధికారత దిశగా, ప్రజలకు విస్తృత అవకాశాలు కల్పించి వారి జీవితాలను మెరుగుపరచే దిశగా ముందడుగు వేయలేదు. బీహార్‌లో విజయవంతమైన సామాజిక న్యాయ ఉద్యమం రేపు దేశవ్యాప్తంగా మళ్లీ ఊపందుకుంటే అది బీజేపీకి రాజకీయంగా నష్టదాయకమే అవుతుందనడంలో ఎలాంటి సందేహం లేదు. బీజేపీకి వ్యతిరేకంగా వెనుకబడిన తరగతులు, సబ్బండ వర్గాలు ఏకమైతే మోడీ విజయావకాశాలు దెబ్బతింటాయి. బీహార్‌లో 40 లోక్‌సభ స్థానాలు ఉండగా 2019 ఎన్నికలలో బీజేపీకి 17 సీట్లు మాత్రమే వచ్చాయి. అయితే బీహార్‌లో జరిగిందే దేశమంతా జరుగుతుందని అంచనా వేయడం సరికాదు. ఉత్తరప్రదేశ్, మధ్యప్రదేశ్, రాజస్థాన్, గుజరాత్, మహారాష్ట్ర, హర్యానా, ఉత్తరాఖండ్ రాష్ట్రాలలో కూడా వెనుకబడిన, అట్టడుగు వర్గాల ప్రజలు ఏకమైనప్పుడే బీజేపీకి పరాజయం, పరాభవం ఎదురవుతాయి. ఎందుకంటే ఆయా రాష్ట్రాలలో కులాల ఆధిపత్యం ఇప్పటికీ కొనసాగుతోంది. కులాల వారీగా పార్టీలకు గంపగుత్తగా ఓట్లు పడుతున్నాయి. కొన్ని కులాలు సాంప్రదాయకంగా పార్టీలకు విధేయత ప్రకటిస్తున్నాయి. కాబట్టే ఇప్పుడు దేశ రాజకీయాలు కులాల చుట్టూ తిరుగుతున్నాయి. 2019లో తనకు అండగా నిలిచిన ఓబీసీలను, మధ్య తరగతి ప్రజలను మళ్లీ ప్రసన్నం చేసుకునేందుకు బీజేపీ ప్రయత్నిస్తోంది. బీజేపీ ఎత్తుగడను చిత్తు చేసి, పూర్వ వైభవం సాధించాలని ప్రతిపక్షాలు వ్యూహరచన చేస్తున్నాయి.

ఈ రాష్ట్రాల పైనే బీజేపీ ఆశలు

దామాషా ప్రకారం ప్రాతినిధ్యం ఉండాలన్న బీఎస్పీ వ్యవస్థాపకుడు కాన్షీరాం అభిప్రాయంతో కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ ఏకీభవిస్తున్నారు. ఈ నేపథ్యంలో 2019 ఎన్నికల ఫలితాలను విశ్లేషించాల్సిన అవసరం ఉంది. ఆ ఎన్నికలలో 224 లోక్‌సభ స్థానాలలో బీజేపీ యాభై శాతం కంటే ఎక్కువ ఓట్లు సాధించింది. దీనినిబట్టి స్పష్టమైన మెజారిటీకి ఆ పార్టీ కేవలం 49 స్థానాలు మాత్రమే దూరంగా ఉంది. రాష్ట్రాల వారీగా చూస్తే ఉత్తరప్రదేశ్‌లోని సగానికి పైగా స్థానాలలో బీజేపీకి 50% పైగా ఓట్లు వచ్చాయి. ఈ రాష్ట్రంలో కులాల వారీ విభజన, అవకాశాలు, ముస్లింల శాతం దాదాపుగా బీహార్‌తో సమానంగా ఉంటాయి. అయినా యూపీలోని 80 లోక్‌సభ స్థానాలలో 40 స్థానాలలో బీజేపీకి యాభై శాతానికి మించి ఓట్లు పడడం గమనార్హం. మోడీ ఎక్కువగా ఆధారపడుతున్న రాజస్థాన్‌లోని 23 స్థానాలు, మధ్యప్రదేశ్‌లోని 25, గుజరాత్‌లోని 26, కర్నాటకలోని 22 స్థానాలలో పోలైన ఓట్లలో బీజేపీకి సగానికి పైగా వచ్చాయి. ఇలాంటి పరిస్థితుల్లో బీజేపీని ఓడించాలంటే అన్ని వర్గాల ప్రజలు ఒక్కటవ్వాల్సిన అవసరం ఉంది.



బీజేపీని ఓడించాలంటే...

దేశ రాజకీయాలలో ఓబీసీల భాగస్వామ్యం తక్కువేమీ కాదు. దేశానికి ఓబీసీ నేత ప్రధానిగా, గిరిజన నేత రాష్ట్రపతిగా పని చేస్తున్నారు. కాంగ్రెస్‌కు ప్రాతినిధ్యం వహిస్తున్న నలుగురు ముఖ్యమంత్రులలో ముగ్గురు ఓబీసీలే. అగ్ర కులాలు బీజేపీకి మద్దతు ఇస్తున్న విషయం తెలిసిందే. అయితే బీహార్ కులగణనతో దేశ జనాభాలో వీరి సంఖ్య స్వల్పమేనని తేలిపోయింది. అయితే ఇక్కడ ఓ విషయాన్ని గమనించాల్సిన అవసరం ఉంది. 2019 సార్వత్రిక ఎన్నికలలో బీజేపీకి అత్యధిక స్థానాలు లభించినప్పటికీ ఆ పార్టీకి వచ్చిన ఓట్లు కేవలం 37 శాతమే. మధ్య తరగతి ప్రజలు, అట్టడుగు వర్గాలు సైతం బీజేపీకి ఓటు వేయడం వల్లనే ఆ పార్టీకి మంచి ఫలితాలు దక్కాయి. ఆయా వర్గాల ప్రజల మద్దతును ప్రతిపక్షాలు పొందగలిగితే బీజేపీని ఓడించడం పెద్ద కష్టమేమీ కాదు.

వెనుబడిన ముస్లింలకు రిజర్వేషన్లా?

- బీజేపీ ఆక్రోశం
- మైనారిటీలను బుజ్జగించేందుకేనని వితండవాదం



పాట్నా : బీహార్‌లో నివసిస్తున్న ముస్లింలలో సుమారు 73% మందిని 'వెనుకబడిన తరగతి'గా కులగణన వర్గీకరించింది. ముస్లింలలో బాగా వెనుకబడిన వారిని పస్మందాలు అంటారు. ఈ వర్గీకరణతో వారికి రిజర్వేషన్ ప్రయోజనాలు లభిస్తాయి. అయితే దీనిపై బీజేపీ పెద్ద రాద్ధాంతమే చేస్తోంది. బీహార్‌లో ఉన్నత విద్యలో, ఉద్యోగాలలో ఈబీసీలకు లభిస్తున్న రిజర్వేషన్ల ప్రయోజనాలు ఇప్పుడు ముస్లింలు కూడా పొందుతారని ఆ పార్టీ అక్కసు వెళ్లగక్కుతోంది. రాష్ట్రంలోని ఆర్జేడీ, ఐక్య జనతాదళ్ సంకీర్ణ ప్రభుత్వం మైనారిటీలను బుజ్జగించేందుకే ఈ పని చేస్తోందని ఆక్రోశిస్తోంది. మరింతమంది ముస్లింలకు రిజర్వేషన్ ప్రయోజనాలు కల్పిస్తే హిందూ వెనుకబడిన కులాల వారికి అవి దక్కకుండా పోతాయని బీజేపీ ఓబీసీ మోర్చా అధ్యక్షుడు కె.లక్ష్మణ్ ఆరోపించారు.

బీహార్ జనాభాలో ముస్లింలు 17.7% మంది ఉన్నారు. వీరిలో ఈబీసీ, అగ్ర కుల ముస్లింలు కూడా ఉంటారు. బీహార్‌లో ప్రస్తుతం అమలు చేస్తున్న రిజర్వేషన్ల ప్రకారం ఈబీసీలకు 18%, ఓబీసీలకు 12%, ఎస్సీలకు 6%, ఎస్టీలకు 1%, ఓబీసీ మహిళలకు 3% కోటా వర్తిస్తోంది. ముస్లింలలో అత్యంత వెనుకబడిన వర్గాల సామాజిక, ఆర్థిక పరిస్థితుల వాస్తవ సమాచారం వెల్లడైనప్పుడే రిజర్వేషన్ విధానాలు వారి జీవితాలపై ప్రభావం చూపుతాయా లేదా అనేది తెలుస్తుందని ఢిల్లీ యూనివర్సిటీ అసోసియేట్ ప్రొఫెసర్ తన్వీర్ ఐజాజ్ చెప్పారు. ఈ సమాచారం బీహార్ కులగణన రెండో భాగంలో ఉంది. దానిని ఇంకా విడుదల చేయలేదు. ఈ సర్వే నివేదిక వస్తే రాష్ట్రంలో ముస్లిం రాజకీయాలు మరోసారి ఊపందుకుంటాయని, ఇప్పటికైతే ప్రభుత్వ ప్రయోజనాలను అగ్రకులాలే సొంతం చేసుకుంటున్నాయని, అవి వెనుకబడిన తరగతులకు చెందిన చివరి వ్యక్తి వరకూ చేరడం లేదని ఐజాజ్ తెలిపారు.

'కేంద్ర ప్రభుత్వ ఓబీసీల జాబితాలో కొన్ని ముస్లిం గ్రూపులు కూడా ఉన్నాయి. అయితే ఈ జాబితాలో ప్రాబల్యం కలిగిన యాదవులు, కుర్మీలు వంటి వారు కూడా ఉన్నారు. వారితో వెనుకబడిన ముస్లింలు పోటీ పడలేరు. అయితే బీహార్‌లో బాగా వెనుకబడిన ముస్లింలు ఈ ఓబీసీ గ్రూపులతో పోటీ పడడం లేదు. ఎందుకంటే వారు వేరే ఈబీసీ జాబితాలో ఉన్నారు' పస్మందా ముస్లిం మహజ్ అధినేత అన్వర్ చెప్పారు. ఈ సంస్థ వెనుకబడిన ముస్లింలకు ప్రాతినిధ్యం వహిస్తోంది. స్థానిక సంస్థల ఎన్నికలలో ఈబీసీలకు రిజర్వేషన్లు ఉండడంతో రాజకీయాలలో వారి ప్రాధాన్యం కూడా పెరిగిందని తెలిపారు. దేశవ్యాప్తంగా ఈబీసీలకు రిజర్వేషన్లు వర్తింపజేయాలన్నదే తమ డిమాండ్ అని ఆయన అన్నారు.

ముస్లింలలో బాగా వెనుకబడిన వారిని దువ్వేందుకు ప్రధాని మోడీ ఇటీవల అనేక ప్రయత్నాలు చేశారు. ముఖ్యంగా ఉత్తరప్రదేశ్‌లో వారిపై అపార సానుభూతి కురిపించారు. పస్మందాలు అనేక కష్టాలు అనుభవిస్తున్నారని చెప్పారు. సంక్షేమ పథకాల పరిధిలోకి వెనుకబడిన ముస్లింలను తీసుకొచ్చేందుకు బీజేపీ చేస్తున్న ప్రయత్నాలకు మోడీ వ్యాఖ్యలను సూచికగా భావించవచ్చు. మోడీ వ్యాఖ్యలపై అన్వర్ మండిపడుతూ 'ఇస్లాంలో అస్పృశ్యత, కుల ఆధారిత విభజన లేవని ఇదే బీజేపీ సుప్రీంకోర్టుకు తెలిపింది. ఇప్పుడేమో ఇలా మాట్లాడుతోంది. ఇది రెండు నాల్కల ధోరణి కాదా?' అని ప్రశ్నించారు.

కార్గిల్‌లో బీజేపీకి పరాభవం

- కాశ్మీర్ విభజనను తిరస్కరించిన లధక్ ఓటర్లు

లధక్ : కార్గిల్ జిల్లాలోని హిల్ కౌన్సిల్‌కు జరిగిన ఎన్నికల్లో నేషనల్ కాన్ఫరెన్స్ (ఎన్సీ), కాంగ్రెస్ కూటమి ఘన విజయం సాధించింది. ఎన్నికలు జరిగిన 26 స్థానాల్లో ఈ కూటమికి 22 స్థానాలు లభించాయి. కూటమి సాధించిన విజయం ఊహించిందే. ఆర్టికల్ 370 కింద జమ్మూకాశ్మీర్‌కు ప్రత్యేక ప్రతిపత్తిని రద్దు చేయడంపై కార్గిల్‌లో పెద్ద ఎత్తున వ్యతిరేకత వ్యక్తమైంది. ఆ వ్యతిరేకతే ఎన్నికల ఫలితాల్లో ప్రతిబింబించింది. అయితే ఎన్సీ-కాంగ్రెస్ కూటమికి ఇంతటి భారీ ఆధిక్యత లభిస్తుందని రాజకీయ విశ్లేషకులు సైతం భావించలేదు. కూటమిలో ఎన్సీకి 12 స్థానాలు, కాంగ్రెస్‌కు 10 స్థానాలు లభించాయి. లధక్ అటానమస్ హిల్ డెవలప్‌మెంట్ కౌన్సిల్‌ను హస్తగతం చేసుకోవడానికి 16 స్థానాలు చాలు. ఇక ఈ ఎన్నికల్లో బీజేపీకి కేవలం రెండు స్థానాలు మాత్రమే దక్కాయి. గతంలో ఆ పార్టీకి ఒకే ఒక్క స్థానం ఉండేది. స్వతంత్రులకు కూడా రెండు సీట్లు దక్కాయి. 30 మంది సభ్యులుండే హిల్ కౌన్సిల్‌లో నాలుగు స్థానాలను మహిళలు, మైనారిటీలకు రిజర్వ్ చేశారు. వీరిని ప్రభుత్వం నామినేట్ చేస్తుంది. మిగిలిన 26 స్థానాలకు ఎన్నికలు జరిగాయి. 2019 ఆగస్టులో జమ్మూకాశ్మీర్ నుండి లధక్‌ను వేరుచేసి, కేంద్ర పాలిత ప్రాంతంగా ప్రకటించిన తర్వాత కార్గిల్‌లో ఎన్నికలు జరగడం ఇదే మొదటిసారి. 2019 ఆగస్ట్ 5 నాటి నిర్ణయాన్ని అంగీకరిస్తారా లేక తిరస్కరిస్తారా అనే విషయంపై ప్రజాభిప్రాయాన్ని ఈ ఎన్నికల ఫలితాలు ప్రతిబింబించాయి. ఎన్నికలకు ముందే ఎన్సీ-కాంగ్రెస్ పొత్తు కుదుర్చుకున్నాయి. కార్గిల్ రాజకీయాలలో బీజేపీకి పెద్దగా చోటు లేదు. ఎన్సీ, కాంగ్రెస్ పార్టీలు రెండూ జాతీయ స్థాయిలో ఏర్పడిన ఇండియా కూటమిలో భాగస్వాములే. ప్రజల మద్దతు లేకుండా రాష్ట్రాన్ని అప్రజాస్వామికంగా, రాజ్యాంగ విరుద్ధంగా విభజించిన అన్ని పార్టీలు, శక్తులకు ఈ ఫలితాలు చెంపపెట్టు లాంటివని జమ్మూకాశ్మీర్ మాజీ ముఖ్యమంత్రి, ఎన్సీ ఉపాధ్యక్షుడు ఒమర్ అబ్దులా చెప్పారు. 2019 వరకూ హిల్ కౌన్సిల్ ఎన్నికలపై జాతీయ స్థాయిలో పెద్దగా ఆసక్తి ఉండేది కాదు. ఎందుకంటే అవి లెహ్, లధక్ స్థానిక వ్యవహారాలకే పరిమితమయ్యేవి. లధక్‌ను కేంద్ర పాలిత ప్రాంతంగా ప్రకటించిన తర్వాత మొదటిసారిగా జరిగిన ఎన్నికలు ప్రాధాన్యత సంతరించుకున్నాయి. ప్రస్తుతం తమకు శాసనసభ అంటూ ఏదీ లేనందున తామే గళం విప్పాల్సి వస్తోందని హిల్ కౌన్సిల్ సభ్యులు చెబుతున్నారు. ఏదేమైనా జమ్మూకాశ్మీర్ విభజనపై ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత వ్యక్తమవుతోందని ఈ ఎన్నికల ఫలితాలు నిరూపించాయి. ఎన్సీ అభ్యర్థుల్లో 70% మంది, కాంగ్రెస్ అభ్యర్థుల్లో 45% మంది గెలుపొందారు.

వర్సిటీలలో పెరుగుతున్న 'హిందూ' కోర్సులు

కర్మకాండలు, జ్యోతిష్యంపై విద్యా బోధన



న్యూఢిల్లీ : బీజేపీ పాలనలో గత కొన్ని నెలలుగా భారతీయ విశ్వవిద్యాలయాలలో హిందూ మతం, హిందూ అధ్యయనాలకు సంబంధించిన కోర్సులు, వాటికి అనుబంధంగా రూపొందించిన సబ్జెక్టుల సంఖ్య పెరిగిపోతోంది. ఉదాహరణకు కాన్పూర్‌లోని ఛత్రపతి సాహూజీ మహరాజ్ యూనివర్సిటీ మూడు కోర్సులను ప్రవేశపెట్టింది. 'కర్మకాండ'పై సర్టిఫికెట్, డిప్లొమా కోర్సులతో పాటు 'జ్యోతిష్య విజ్ఞానం'పై మాస్టర్ డిగ్రీ కోర్సులో ప్రవేశాలను ఆ యూనివర్సిటీ ప్రారంభించింది.



కర్మకాండ ఆచారాలకు సంబంధించినది. ఇది వేదాలలో కన్పిస్తుంది. చనిపోయిన తల్లిదండ్రులు, ఇతర బంధువుల ఆత్మశాంతి కోసం కర్మకాండలు నిర్వహిస్తారు. ఇవి బ్రాహ్మణుల ఆధ్వర్యంలో జరుగుతాయి. కర్మకాండలు జరిపించినందుకు ప్రతిఫలంగా వారికి దక్షిణ రూపంలో నగదు, ఇతర రకాల దానాలు ఇస్తారు. ప్రారంభంలో ఈ కోర్సులో కేవలం 29 మంది విద్యార్థులు మాత్రమే చేరినప్పటికీ దానికి వచ్చిన ఆదరణ కారణంగా వారి సంఖ్య పెరిగింది. 'విద్యా సంవత్సరం మధ్యలో ఈ కోర్సులో సీట్ల సంఖ్యను పెంచాల్సి వచ్చింది. రాబోయే సీజన్లలో సీట్ల సంఖ్యను మరింతగా పెంచే విషయంపై అధికారులు చర్చలు జరుపుతున్నారు' అని యూనివర్సిటీ మీడియా ఇన్‌ఛార్జ్, అధ్యాపకుడు విశాల్ శర్మ తెలిపారు. తమ తరగతి గది విద్యార్థులతో నిండిపోయిందని, ఈ సబ్జెక్టును చదివేందుకు తామంతా ఎంతో ఉత్సాహం చూపుతున్నామని పునిత్ తివారీ అనే విద్యార్థి చెప్పారు. ఆయన కాన్పూర్‌లో సీసీటీవీ ఔట్‌సోర్సింగ్ వ్యాపారం చేస్తున్నారు. కోర్సును అభ్యసిస్తున్న విద్యార్థులలో ఓబీసీలు, రిటైర్డ్ ఉద్యోగులు సహా వివిధ నేపథ్యాలు కలిగిన వారు ఉన్నారు. అనేక మంది విద్యార్థులు ఉద్యోగం కోసం కాకుండా వ్యక్తిగత ఇష్టంతోనే ఈ కోర్సును చదువుతున్నారని తివారీ తెలిపారు. నూతన విద్యా విధానం-2020లో భాగంగా యూనివర్సిటీలలో హిందూ కోర్సులను ప్రవేశపెట్టారు. 'పురాతనమైన, శాశ్వతమైన భారతీయ విజ్ఞానాన్ని ముందుకు తీసికెళ్లే పేరుతో ఈ కోర్సులను ప్రవేశపెట్టామని వర్సిటీల అధికారులు చెబుతున్నారు. సంస్కృత విద్యా పండితుల సహకారంతో ఈ కోర్సులను రూపొందించారు. ప్రార్థనలు, పంచాగ రచనా పద్ధతులు వంటి సబ్జెక్టులను సర్టిఫికెట్ కోర్సులో బోధిస్తారు. పురాతన వైదిక జ్యోతిష్యం, ఆ శాస్త్రానికి సంబంధించిన విజ్ఞానంలో ఆధునిక, శాస్త్రీయ కోణాలను మాస్టర్ డిగ్రీలో అభ్యసించవచ్చు. గోరఖ్‌పూర్-లక్నో యూనివర్సిటీలో కూడా ఇలాంటి కర్మకాండ కోర్సులనే ప్రవేశపెట్టారు. మరికొన్ని విశ్వవిద్యాలయాలు కూడా ఈ తరహా కోర్సులను ప్రారంభించే యోచనలో ఉన్నాయి. అదే విధంగా ఢిల్లీ యూనివర్సిటీ కొత్తగా 'హిందూ అధ్యయనాలు' పేరిట ఓ కోర్సును మొదలు పెట్టింది. నూతనంగా ఏర్పాటు చేసిన హిందూ అధ్యయనాల కేంద్రం పరిధిలో దీనిని ప్రారంభించింది. రాబోయే విద్యా సంవత్సరం నుండి పోస్ట్ గ్రాడ్యుయేట్, డాక్టరల్ స్థాయి కోర్సులు కూడా ప్రారంభం కాబోతున్నాయి. ఇలాంటి కోర్సులనే బనారస్ హిందూ యూనివర్సిటీ కూడా అందిస్తోంది.

బిజినెస్

పవన్ ముంజల్‌పై ఫోర్జరీ కేసు

- దాదాపు రూ.6 కోట్ల తప్పుడు బిల్లుల సృష్టి
- అక్రమంగా రూ.55 లక్షల పన్ను రాయితీలు
- హీరో మోటో షేర్ల పతనం



న్యూఢిల్లీ : దేశంలోనే అతిపెద్ద ద్విచక్ర వాహన కంపెనీ హీరో మోటో కార్ప్ ఛైర్మన్ పవన్ ముంజల్ ఫోర్జరీకి పాల్పడ్డారని ఆరోపణలు వచ్చాయి. తప్పుడు బిల్లులతో ప్రభుత్వ రాయితీలు పొందడంతో ముంజల్‌పై ఢిల్లీ పోలీసులు కేసు నమోదు చేశారు. సంస్థ ఖాతాల్లో రూ.5.96 కోట్ల లావాదేవీలపై తప్పుడు లెక్కలు రాయడం, మోసపూరితంగా వ్యవహరించినందుకు ఫోర్జరీ కింద ఎఫ్ఐఆర్‌ను నమోదు చేశారు. అబద్ధపు బిల్లులు సృష్టించి రూ.55.5 లక్షల పన్ను రాయితీలను పొందారని ప్రధాన ఆరోపణ. 2000-2010 మధ్య పవన్ ముంజాల్ నెలవారీగా రూ.5,94,52,525 విలువైన తప్పుడు బిల్లులు సృష్టించారు. ఈ బిల్లుల పేరుతో ఇంతే మొత్తం నగదు బ్యాంకు ఖాతాల నుంచి ఉపసంహరించుకున్నారు. దీంతో రూ.55,51,777 పన్ను రాయితీని పొందడం ద్వారా ఐటీ శాఖను మోసగించారని పోలీసులు ఎఫ్ఐఆర్‌లో పేర్కొన్నారు. పవన్ ముంజల్‌పై ఎఫ్ఐఆర్ నమోదు కావడంతో సోమవారం బీఎస్ఈలో హీరో మోటో కార్ప్ షేర్లు 2.50 శాతం పతనమై రూ.2,960 వద్ద ముగిసింది. ఇంట్రాడేలో రూ.2,925కు పడిపోయింది. పవన్ ముంజల్ మనీలాండరింగ్‌కు పాల్పడ్డారన్న ఆరోపణలతో గత ఆగస్టులో ఆయన నివాసాలు, కార్యాలయాల్లో ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) తనిఖీలు చేసింది. 2018లోనూ లండన్‌లో పవన్ ముంజాల్ వ్యాపార పర్యటన కోసం థర్డ్ పార్టీ సేవల సంస్థ అధికారిని నియమించుకుంది. ఆ థర్డ్ పార్టీ సంస్థ అధికారి లండన్ బయలుదేరి వెళుతుండగా, సదరు అధికారి బ్యాగ్‌లో రూ.81 లక్షలకు పైగా విదేశీ కరెన్సీ ఉందని కస్టమ్స్ అధికారుల తనిఖీల్లో గుర్తించారు. దీంతో విదేశీ మారకపు నిర్వహణ చట్టం కింద ఈ కరెన్సీని కస్టమ్స్ అధికారులు జప్తు చేసి, కేసు నమోదు చేశారు. దీని ఆధారంగానే ఈడీ తనిఖీలు నిర్వహించింది. ఇంతక్రితం కూడా పన్ను ఎగవేత కేసులో గతేడాది మార్చిలో పవన్ ముంజాల్ నివాసాలు, ఆఫీసుల్లో ఆదాయం పన్ను అధికారులు తనిఖీలు జరిపారు.

నిశ్శబ్దంగా హెచ్‌డిఎఫ్‌సి బ్యాంక్ వడ్డీ రేట్ల పెంపు



న్యూఢిల్లీ : దిగ్గజ ప్రయివేటు రంగ విత్త సంస్థ హెచ్‌డిఎఫ్‌సి బ్యాంకు నిశబ్దంగా వడ్డీ రేట్లను పెంచి.. రుణగ్రహీతలపై భారం మోపింది. రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఇటీవలి ఎంపిసి భేటీలో రెపోరేటును యథాతథంగా ప్రకటించినప్పటికీ.. హెచ్‌డిఎఫ్‌సి బ్యాంక్ రుణాలపై బేస్ రేటును పెంచడం గమనార్హం. అక్టోబర్ 7నుంచి మార్జినల్ కాస్ట్ ఆఫ్ ఫండ్స్ బేస్డ్ లెండింగ్ రేట్స్ (ఎంసిఎల్‌ఆర్)ను పది బేసిస్ పాయింట్లు లేదా 0.10 శాతం పెంచేసింది. దీంతో గృహ, రిటైల్, వ్యక్తిగత, వాహన రుణాల ఇఎంఐలు భారం కానున్నాయి. ఈ క్రమంలో ఆ బ్యాంక్ జారీ చేసిన వివిధ రుణాలపై వడ్డీ రేట్లు 8.55 ఉంచి 9.25 మధ్య పెరుగుతాయి. ఇంతక్రితం జూన్ 16న బేస్ రేట్‌ను గరిష్టంగా 9.20 శాతానికి చేర్చింది.

అంతర్జాతీయ మార్కెట్లోకి అథెర్ ఎనర్జీ

న్యూఢిల్లీ : విద్యుత్ ద్విచక్ర వాహనాల తయారీదారు అథెర్ ఎనర్జీ అంతర్జాతీయ మార్కెట్లోకి ప్రవేశించినట్లు ప్రకటించింది. తాజాగా నేపాల్‌లో తమ ఫ్లాగ్‌షిప్ మోడల్ 450ఎక్స్‌ను విడుదల చేసినట్లు వెల్లడించింది. ఈ వాహనాలను భారత్ నుంచి ఎగుమతి చేయనున్నట్లు తెలిపింది. కొత్త మార్కెట్లపై తమ సంస్థ దృష్టి పెడుతుందని అథెర్ ఎనర్జీ చీఫ్ బిజినెస్ ఆఫీసర్ రవ్‌నీత్ పోకెల తెలిపారు. నేపాల్‌కు విస్తరించడం ద్వారా తొలిసారి అంతర్జాతీయ మార్కెట్లోకి ప్రవేశించామని.. ఇక బహుళ మార్కెట్లపై దృష్టి కేంద్రీకరిస్తామన్నారు.

అమెజాన్‌లో మళ్లీ తొలగింపులు..

న్యూయార్క్ : ఇ-కామర్స్ సంస్థ అమెజాన్ మరోమారు ఉద్యోగులకు ఉద్వాసన పలికింది. ఈ దఫా కమ్యూనికేషన్ విభాగాల్లోని సిబ్బందిపై వేటు వేయాలని నిర్ణయించడంతో అమెజాన్ స్టూడియోస్, అమెజాన్ ప్రైమ్ వీడియో, అమెరికా మ్యూజిక్ డివిజన్స్ ఉద్యోగులను ఇంటికి పంపించనుంది. ఈ కమ్యూనికేషన్ విభాగాల్లో 5 శాతం ఉద్యోగులను ఇంటికి పంపించనుంది డెడ్‌లైన్ రిపోర్ట్ చేసింది. ఉద్యోగాలు కోల్పోయిన వారు 60 రోజుల పాటు రెగ్యులర్ పే, ఇతర బెనిఫిట్స్‌ను పొందుతారని కంపెనీ పేర్కొంది. జాబ్ ప్లేస్‌మెంట్ అసిస్టెన్స్‌తో పాటు లేఆఫ్స్ బాధితులు పరిహార ప్యాకేజ్‌కు అర్హులని వెల్లడించింది. 2022 నవంబర్ నుంచి 2023 జనవరి వరకూ అమెజాన్ ఏకంగా 18వేల మంది ఉద్యోగులను తొలగించింది.

నవతెలంగాణ
నమ్మకమైన తెలుగు దినపత్రిక
ఎల్బీనగర్ - మహేశ్వరం - చార్మినార్
మంగళవారం | అక్టోబర్ 10, 2023 | www.navatelangana.com

ఇండ్లు కోల్పోతున్న ప్రజలకు న్యాయం జరగాలి

- కార్పొరేటర్ కళ్లెం నవజీవన్ రెడ్డి



నవతెలంగాణ-హాయత్ నగర్

హయత్ నగర్ డివిజన్ లోని విజయవాడ జాతీయ రహదారికి ఇరువైపులా రహదారి విస్తరణలో ఖాళీ స్థలాలు, ఇల్లు, షాపులు కోల్పోతున్న ప్రజలకు నష్ట పరిహారం అందకముందే రోడ్డు పనులు జరుగుతున్నాయని బాధితులు వాపోయారు. విషయం తెలుసుకున్న స్థానిక కార్పొరేటర్ కళ్లెం నవజీవన్ రెడ్డి బాధితులతో కలిసి సోమవారం హయత్ నగర్ లోని తహసీల్దార్ ఆఫీస్‌లో బాధితులకు న్యాయం జరగాలని తహసీల్దార్ కి వినతిపత్రం అందజేసారు.

కర్రే సాయిలు మృతి పట్ల మేయర్ విచారం



నవతెలంగాణ-బడంగ్‌పేట్

కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు కర్రే సాయిలు మతికి బడంగ్ పేట్ మున్సిపల్ కార్పొరేషన్ మేయర్ పారిజాత నర్సింహారెడ్డి సంతాపం వ్యక్తం చేశారు. సోమవారం కర్రే సాయిలు మత దేహంపై పుష్ప గుచ్ఛం ఉంచి నివాళ్లర్పించారు. కార్పొరేటర్ పెద్దబావి సుదర్శన్ రెడ్డి, యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు బోయపల్లి రాఘవేందర్ రెడ్డి, కాంగ్రెస్ బడంగ్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్ అధ్యక్షులు బోయపల్లి గోవర్ధన్ రెడ్డి, నాయకులు నవారు మల్లారెడ్డి, రామిడి శ్రీనివాస్ రెడ్డి, సామ భాస్కర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

దుర్వాసనతో పొంగిపొర్లుతున్న డ్రయినేజీ



నవతెలంగాణ-సంతోష్‌నగర్

చంపాపేట్ డివిజన్ పరిధిలోని కర్మన్ ఘాట్ రోడ్ గ్రీన్ పార్క్ కాలనీ ఎదురుగా పవన్ పూరి కాలనీ మెగా ఫంక్షన్ హాల్ వద్ద వెనుక భాగం కాలనీలో రోడ్డు మీదకు మురుగునీరు రావడంతో ఎక్కడికక్కడ దుర్వాసన వస్తోంది. దాంతో చిన్నచిన్న వాణిజ్య వ్యాపారస్తులు, ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. 25 రోజుల తరబడి డ్రయినేజీ నీరు పొంగి పొర్లుతున్నా అధికారులు పట్టించుకోవడం లేదనే విమర్శలు సర్వత్రా వినిపిస్తున్నాయి. అనేక సార్లు ఫిర్యాదు చేసినా పట్టించుకునే దాఖలాలు లేవని బస్తీ వాసులు ఆరోపిస్తున్నారు.

మహాత్మా గాంధీ బస్ స్టేషన్ ప్రతిరోజు ప్రయాణికులు వేల సంఖ్యలో ప్రయాణిస్తుంటారు. ఫిర్యాదు చేసి రోజులు గడుస్తున్నా ఇక్కడి అధికారులు సిబ్బంది పట్టించుకోవడం లేదని ఆయా ప్రాంతాల వాసులు పేర్కొంటున్నారు. ఎప్పుడు చూసినా అధికారులు సిబ్బంది అందుబాటులో ఉండటం లేదని చెబుతున్నారని ప్రజలు అంటున్నారు. ప్రమాదాలు జరిగినప్పుడు స్పందించి తూతూమంత్రంగా చర్యలు చేపడుతున్నారన్నారని ఆరోపిస్తున్నారు. ప్రస్తుతం ఈ మార్గంలో రోడ్డు నిర్మాణ పనులు జరుగుతున్నాయి. అయితే డ్రయినేజీ పొంగి పొర్లుతుండడంతో పనులు నిలిచిపోయాయి. వెంటనే సమస్యలు పరిష్కరించకపోతే పెద్ద ఎత్తున ఆందోళన చేపడతామని స్థానికులు హెచ్చరిస్తున్నారు. ఇప్పటికైనా వాటర్ వర్కర్స్ అధికారులు ప్రత్యేక చొరవ తీసుకొని సమస్య పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని ఆయా ప్రాంతాల వాసులు కోరుతున్నారు.



ప్రజా సంక్షేమమే లక్ష్యం

- ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్ రెడ్డి

నవతెలంగాణ-ఎల్‌బీనగర్

దోమలపై యుద్ధంలో భాగంగా సోమవారం ఎల్.బి.నగర్ నియోజకవర్గ పరిధిలోని పలు డివిజన్ల మాజీ కార్పొరేటర్లు, పలు డివిజన్ల అధ్యక్షులచే వారి కార్యాలయంలో వారి స్వంత నిధులతో వారి,వారి డివిజన్ల అవసరాల కోసం ఫాగింగ్ మిషిన్లు కొనుగోలు చేశారు. అందులో భాగంగా ఎమ్మెల్యే దేవిరెడ్డి సుదీర్ రెడ్డి డివిజన్ల వారికి ఒక్కొక్కటి ఫాగింగ్ మిషన్ ఇప్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ దోమల కారణంగా ప్రాణసంకటమైన జ్వరాలు వస్తున్నాయి అన్నారు. వైద్యం కోసం లక్షల రూపాయల్లో ఖర్చవుతున్నదన్నారు.దోమలను నివారించగలిగితే ఇంటిల్లిపాది ఆనందంగా ఉంటారని తెలిపారు. అందుకే దోమలను నివారించేందుకు అన్ని వర్గాల ప్రజలు ముందుకు రావాలని కోరారు. ప్రతీ ఒక్కరు వారి వారి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని కోరారు. ఇంటి పరిసరాల్లో, ముఖ్యంగా పూలా కుండీల్లో,పాత టైర్లు,ఇతర వస్తువుల్లో నీరు నిలువ ఉండకుండా చూసుకోవాలని ఎమ్మెల్సీలు ఎగ్గే మల్లేశం,దయనంద్ గుప్తా, సీనియర్ నాయకులు గజ్జల మధుసూధనరెడ్డి,మాజీ కార్పొరేటర్లు ముద్రబోయిన శ్రీనివాసరావు,సాగర్ రెడ్డి,జిన్నారం విఠల్ రెడ్డి,జిట్టా రాజశేఖర్ రెడ్డి,చెరుకు ప్రశాంత్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

సీసీ కెమెరా 100 మంది పోలీసులతో సమానం



- రాచకొండ సీపీ డి.ఎస్.చౌహాన్, ఎమ్మెల్యే సుధీర్ రెడ్డి

నవతెలంగాణ-సంతోష్‌నగర్

ఒక సీసీ కెమెరా 100 మంది పోలీసులతో సమానమని రాచకొండ పోలీస్ కమిషనర్ డి.ఎస్.చౌహాన్, ఎమ్మెల్యే దేవీ రెడ్డి సుధీర్ రెడ్డి, ఎమ్మెల్సీ ఎగ్గే మల్లేశం, దయానంద్ గుప్త అన్నారు. ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్ రెడ్డి వారి ఎమ్మెల్యే నిధుల నుంచి సుమారు రూ. 5 కోట్లు, మరో ఇద్దరూ ఎమ్మెల్సీలు ఎగ్గే మల్లేశం,దయనంద్ గుప్త నిధులు కలుపుకొని అదనంగా రూ.2 కోట్ల, మొత్తం రూ.7 కోట్లతో నియోజకవర్గ పరిధిలో 104 కాలనీల నందు సుమారు 1080 కెమెరాలతో పకడ్బందీ వ్యవస్థ స్థాపించే విధంగా ముందుకు వెళ్తున్నారు. సోమవారం చంపాపేట్ డివిజన్ కర్మన్ ఘాట్ క్రాంతి క్లబ్ గ్రౌండ్ నందు సీ.సీ.కెమెరాల ప్రారంభోత్సవ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా సీపీ డీఎస్ చౌహాన్,ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్ రెడ్డి,ఎమ్మెల్సీలు ఎగ్గే మల్లేశం,దయనంద్ గుప్త పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తప్పు చేయాలంటే దొంగలు భయపడే రోజులు వచ్చాయన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఏర్పడ్డాక పోలీస్ వ్యవస్థ ఎంతో మెరుగుపడిందని పేర్కొన్నారు. కమాండ్ కంట్రోల్ భవనం దేశానికి తలమానికం అని తెలిపారు. శాంతి భద్రతలు ఎక్కడైతే పటిష్టంగా ఉంటాయో,ఆ ప్రాంతం బాగుపడుతుంది అని భావించిన సీఎం కేసీఆర్ పోలీస్ శాఖలో ఎన్నో సంస్కరణలు చేశారన్నారు. పోలీసులు కఠినంగా వ్యవహరిస్తారనే అపవాదును తొలగించేందుకు 'ఫ్రెండ్లీ పోలీసింగ్'కు శ్రీకారం చుట్టారని తెలిపారు. ఎల్.బి.నగర్ జోన్ డి.సి.పి. సాయి శ్రీ, ఏ.సి.పి. జానకి రెడ్డి,సీనియర్ నాయకులు గజ్జల మధుసూధనరెడ్డి, మాజీ కార్పొరేటర్లు ముద్రబోయిన శ్రీనివాసరావు,సాగర్ రెడ్డి, జిన్నారం విఠల్ రెడ్డి, చైర్మెన్ నల్ల.రఘుమారెడ్డి,కష్ణమాచారి, ఓరుగంటి వెంకటేష్ పాల్గొన్నారు.

సాధారణ సమావేశంలో పొడసూపిన విభేధాలు

నవతెలంగాణ-తుర్కయంజాల్

తుర్కయంజాల్ మున్సిపాలిటీ సాధారణ సమావేశం చైర్ పర్సన్ మల్ రెడ్డి అనురాధ రాంరెడ్డి అధ్యక్షత న సోమవారం రగన్నగూడా వార్డు కార్యాలయంలో నిర్వహించారు.దాదాపు రూ 10కోట్ల 20 లక్షల అభివృద్ధి పనులకు తీర్మానం చేసినట్లు తెలిపారు.ఈ సందర్భంగా చైర్ పర్సన్ మాట్లాడుతూ బీఆర్ఎస్ కౌన్సిలర్లు కావాలనే సమావేశాన్ని వాయిదా వేయాలని చూశారని ఆవేదన వ్యక్తం చేశారు. కొంతమంది కౌన్సిలర్లు మినిట్స్ బుక్ ను చించివేశారని ఆందోళన వ్యక్తం చేశారు. ఏజెండా చదువుతుండగా కౌన్సిలర్లు తమ చేతిలోనుండి గుంజుకోవడం ఎంత వరకు సమంజసమని ప్రశ్నించారు. ఎమ్మెల్యే కావాలనే అధికారులను సమావేశానికి రాకుండా అడ్డుకున్నారని ఆగ్రహం వ్యక్తంచేశారు. అభివృద్ధి పై రాజీపడే ప్రసక్తే లేదని ఆమె ధీమా వ్యక్తంచేశారు.

ఈ సాధారణ సమావేశంలో కాంగ్రెస్, బిఆరెస్ కౌన్సిలర్ ల మధ్య నెలకొన్న విభేదాలు భగ్గుమన్నాయి. తమకు ఏజెండా పంపించకుండా సాధారణ సమావేశం ఎలా నిర్వహిస్తారని బీఆర్ఎస్ కౌన్సిలర్లు ఆగ్రహం వ్యక్తం చేశారు.అభివృద్ధి నిధుల కేటాయింపు పై ప్రశ్నిస్తే సమాధానం చెప్పకుండ సమావేశం నుండి వెళ్లిపోవడం కౌన్సిలర్లపై అమెకున్న వైఖరికి నిదర్శనమన్నారు. ఎన్నికల కోడ్ వస్తున్న రోజు హడావుడిగా సమావేశం ఏర్పాటు చేయడం పై వారి చిత్తశుద్ధి బయట పడుతోంది అన్నారు. చైర్ పర్సన్ ఒంటెద్దు పోకడపై కలెక్టర్ కు ఫిర్యాదు చేస్తామని పేర్కొన్నారు.



అభివృద్ధి పనులకు శంకుస్థాపన.

మున్సిపాలిటీ పరిధిలో ప్రతీ వార్డు అభివృద్ధికి తనవంతు సహకారం అందిస్తానని తుర్కయంజాల్ మున్సిపాలిటీ చైర్ పర్సన్ మల్ రెడ్డి అనురాధ రాం రెడ్డి అన్నారు. సోమవారం తుర్కయంజాల్ మున్సిపాలిటీ పరిధి కమ్మగూడ 22వ వార్డు పరిధిలో రూ. 1 కోటి 20 లక్షల 75 వేల అభివద్ధి పనులకు మున్సిపాలిటీ కాంగ్రెస్ పార్టీ ఫ్లోర్ లీడర్ స్థానిక కౌన్సిలర్ కోశికే ఐలయ్య, కౌన్సిలర్ కొత్తకుర్మ మంగమ్మ శివకుమార్‌లతో కలిసి శంకుస్థాపన, ప్రారంభోత్సవాలు చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మున్సిపాలిటీ పరిధిలోని ప్రతి కాలనీ అభివద్ధికి తనవంతు సహకారం ఉంటుందని అన్నారు. ప్రతి కాలనీ మౌలిక వసతుల కల్పనకు ప్రత్యేకంగా నిధులను అందిస్తున్నామని తెలిపారు. ప్రగతి నగర్ కాలనీలో రూ.20 లక్షలతో సీసీ రోడ్డు, న్యూ ప్రగతి నగర్ కాలనీలో రూ.10లక్షలతో సీసీ రోడ్డు, ఏపీఏటి కాలనీలో రూ.6 లక్షలతో సీసీ రోడ్డు,నవ భారత్ కాలనీలో రూ.22.50 లక్షలతో సీసీ రోడ్డు, రూ.7.50 లక్షలతో అండర్ గ్రౌండ్ డ్రయినేజీ పనులు, రాజ్ రంజిత్ కాలనీలో రూ. 10 లక్షలతో బీటి రోడ్డు, రూ.8.75 లక్షలతో పార్కు అభివద్ధి పనులు, ఇందిరమ్మ కాలనీలో రూ.20లక్షలతో సీసీ రోడ్డు, లక్ష్మి నగర్ కాలనీలో రూ.16లక్షలతో సీసీ రోడ్డు పనులను చేపట్టడానికి శంకుస్థాపన చేశామని తెలిపారు. రాబోయే రోజులలో మరిన్ని నిధులతో మున్సిపాలిటీలో అభివద్ధి కార్యక్రమాలు చేపడుతామని అన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, కాలనీ అధ్యక్ష, కార్యదర్శులు, కాలనీ వాసులు తదితరులు పాల్గొన్నారు.





రోడ్డు సమస్యను పరిష్కరించాలని వినతి

నవతెలంగాణ-తుర్కయంజాల్

తుర్కయంజాల్ మున్సిపాలిటీ శ్రీరంగాపురం, సాయినాథ్, సుందరయ్య నగర్, ఆపిల్ అవెన్యూ, శ్రీ శ్రీ నివాస్, లక్ష్మీ నగర్ కాలనీ సాగర హైవే ఆంజనేయ స్వామి గుడి నుంచి శ్రీరంగాపురం పద్మశాలి భవన్ వరకు రోడ్డు పోయకుండా అడ్డుపడుతున్న హరిద్వార్ హెూటల్ యాజమాన్యంతో మాట్లాడి రోడ్డు వేయించాలని తుర్కయంజాల్ మున్సిపాలిటీ చైర్ పర్సన్ అనురాధ రామిరెడ్డికి సోమవారం వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా చైర్ పర్సన్ మాట్లాడుతూ తమ మున్సిపల్ సమావేశంలో చర్చించి సమస్య పరిష్కరిస్తానని హామీనిచ్చారు. ఈ కార్యక్రమంలో సీపీఐ(ఎం) తుర్కయంజాల్ కమిటీ కార్యదర్శి డి కిషన్, మండల సత్యనారాయణ, ఇల్లూరి భాస్కర్, సాయినాథ్ కాలనీ అధ్యక్ష కార్యదర్శులు మల్లారెడ్డి, పరమేష్ నేత, శ్రీరంగాపురం అధ్యక్ష కార్యదర్శులు కార్యవర్గ సభ్యులు నాగుల కోటి, పి శ్రీనివాస్ రెడ్డి, కమిటీ సభ్యులు తుక్కుడాల శివ, ఎల్ రవీందర్ రెడ్డి, ఎల్ వెంకటరెడ్డి, ఇసురు కామరాజు, బొజ్జ అఖిల్ రెడ్డి, సుందరయ్య నగర్ కాలనీ నాయకులు పి శ్రీను, ఐతరాజు కృష్ణ, సాయిరాం తదితరులు పాల్గొన్నారు.

అధికారులు ప్రజాప్రతినిధులతో సమన్వయం చేసుకోవాలి

- మేయర్ దుర్గా దీప్ లాల్ చౌహాన్



నవతెలంగాణ-మీర్‌పేట్

అభివృద్ధి పనుల్లో అధికారులు ప్రజాప్రతినిధులతో సమన్వయం చేసుకొని పని చేయాలని మీర్‌పేట్ మున్సిపల్ కార్పోరేషన్ మేయర్ దుర్గా దీప్ లాల్ చౌహన్ అన్నారు. సోమవారం మునిసిపల్ కార్యాలయంలో మేయర్ అధ్యక్షతన కౌన్సిల్ సమావేశం జరిగింది. సమావేశంలో కార్పోరేటర్లు అభివృద్ధి పనులకు చేపట్టాలని లేఖలు అందించారు. అనంతరం కార్పోరేటర్ల ప్రశ్నలకు నివత్తి చేసి సలహాలు సూచనలు స్వీకరించి పనులు తొందరగా చేయాలని అధికారులను ఆదేశించారు. డిప్యూటీ మేయర్ తీగల విక్రమ్ రెడ్డి, ఫ్లోర్ లీడర్లు కీసర గోవర్ధనరెడ్డి, కార్పొరేటర్లు, కో-ఆప్షన్ సభ్యులు, కమీషనర్ ఎ.వాణి రెడ్డి, ఎస్ఈ ఆంజనేయ ప్రసాద్, డిఈఈ గోపీ నాథ్, ఏఈఈ శ్రీనివాసులు, మేనేజర్ యస్ వెంకట్ రెడ్డి, ఆర్ఓ అంజన్ రెడ్డి, టీపీఓ దేవానంద్, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.



విజేతలకు బహుమతులు ప్రదానం

నవతెలంగాణ-సంతోష్‌నగర్

సైదాబాద్ డివిజన్ పరిధిలోని శంకేశ్వర బజార్ హనాఫియా మసీదులో మహ్మద్ ప్రవక్త జీవిత చరిత్రపై నిర్వహించిన క్విజ్ పోటీల్లో ప్రతిభ కనబర్చిన వారికి ఆదివారం నగదు బహుమతులు, సర్టిఫికేట్స్, మెమెంటోలను అందజేశారు. ఈ క్విజ్ పోటీల్లో 150 మంది హాజరుకాగా, వారిలో అత్యధిక మార్కులు సాధించిన ముగ్గురిని ఎంపిక చేశారు. 12 ఏండ్ల వయస్సు కలిగిన బాల, బాలికల నుంచి 80 ఏండ్ల వయస్సు కలిగిన వారు క్విజ్‌లో పాల్గొన్నారు. ప్రతి విభాగం నుంచి ముగ్గురు చొప్పున ఎంపిక చేశారు. మహ్మద్ ప్రవక్త జీవిత చరిత్ర, మత విశ్వాసాలపై అబ్జెక్టివ్ టైపులో నిర్వహించిన క్విజ్‌లో అత్యధిక మార్కులు సాధించిన ఆరుగురిని ఎంపిక చేశారు. విజేతలకు నగదు బహుమతులతోపాటు సర్టిఫికెట్స్ ప్రశంసాపత్రాలను హనాఫియా మసీదు కమిటీ అధ్యక్షులు అబ్దుల్ అజీజ్ అందజేశారు. ఈ కార్యక్రమంలో హనాఫియా మసీదు కమిటీ అధ్యక్షులు అబ్దుల్ అజీజ్, ప్రధాన కార్యదర్శి ఫైసల్, కోశాధికారి అయాజ్, ఇమ్రాన్ వహీద్ వూ జమా, ఉపాధ్యక్షులు హసన్ బీ సల్లే. తదితరులు పాల్గొన్నారు.

'ఐఎస్ సదన్'ను ఆదర్శంగా తీర్చిదిద్దుతా



నవతెలంగాణ-సంతోష్‌నగర్

ఐఎస్ సదన్ డివిజన్‌ను రాష్ట్రంలోనే ఆదర్శంగా తీర్చిదిద్దుతానని కార్పొరేటర్ జంగం శ్వేతా మధుకర్ రెడ్డి అన్నారు. సోమవారం డివిజన్ పరిధిలోని సింగరేణి ఆఫీసర్స్ కాలనీ పార్క్ నుంచి జే ఎస్ రెడ్డి స్విమ్మింగ్ పూల్ వరకు బాక్స్ డ్రైన్ నిర్మాణం పనులు రెండవ దశ పనులను కార్పొరేటర్ శ్వేత మధుకర్ రెడ్డి ప్రారంభించారు. రూ.6 కోట్ల వ్యయంతో నిర్మించే బాక్స్ డ్రైన్ పని సింగరేణి ఆఫీసర్స్ కాలనీ గుండా ఆదర్శ్ నగర్, కష్టా నగర్ ఫేజ్ 1 అండ్2, శ్రీ బాలాజీ నగర్ మీదుగా పూర్తి చేస్తే ఇక డివిజన్ లో ముంపు బాధ నుంచి కాలనీ వాసులకు ఉపశమనం లభిస్తుందన్నారు. ఎన్నికల సమయంలో చేసిన వాగ్దానాలను ఒక్కొకటిగా నెరవేర్చడం బీజేపీ పనితీరుకు నిదర్శనం అని కాలనీ వాసులకు తెలియచేశారు. డీఈ కార్తిక్ మాట్లాడుతూ ఈ పనిలో భాగంగా కొన్ని సాంకేతిక సమస్యలు తలెత్తితే స్థానిక కాలనీ వాసులతో సమన్వయం చేస్తూ పూర్తి చేస్తున్నాం అన్నారు. కార్యక్రమంలో పలు కాలనీ సింగరేణి ఆఫీసర్స్ కాలనీ, అదుర్స్ నగర్, కృష్ణానగర్, శ్రీ బాలాజీ నగర్ కమిటీ సభ్యులతో పాటు బీజేపీ భాగ్యనగర్ జిల్లా ఉపాధ్యక్షులు జంగం మధుకర్ రెడ్డి, బీజేపీ సీనియర్ నాయకులు రమాదేవి, తోట అమర్నాథ్ రెడ్డి, ఐఎస్ సదన్ డివిజన్ అధ్యక్షులు గిరిధర్ రెడ్డి, కాలనీ వాసులు రాజశేఖర రెడ్డి, జి వి రమణ, కే ఎస్ ఎన్ రెడ్డి, కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

మెయిన్ రోడ్డుపై వ్యాపారం.. దీక్షకు కూర్చున్న కార్పొరేటర్



నవతెలంగాణ -చైతన్యపురి

చైతన్యపురి ప్రభాత్ నగర్ మెయిన్ రోడ్ పైన పండ్ల వ్యాపారులు రోడ్డుపై పెట్టి వ్యాపారం చేయడం వల్ల కాలనీవాసులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని చైతన్యపురి కార్పొరేటర్ రంగా నరసింహ గుప్తా అన్నారు. సోమవారం చైతన్యపురి ప్రధాన రహదారిపై కార్పొరేటర్ నిరాహార దీక్షకు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పండ్ల వ్యాపారులు రోడ్లపై, ఇంటిముందు, అపార్ట్మెంట్ ముందు ఉదయం పూట విక్రయించడంతో కాలనీవాసులు వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అన్నారు.జీహెచ్ఎంసీ అధికారులకు పోలీసులకు ఎన్నిసార్లు చెప్పినా ఫలితం లేకపోవడంతో దీక్షకు కుర్చోవలసి వచ్చిందని అన్నారు. ప్రభాత్ నగర్ కాలనీలో రెండు కళాశాలలు ఉండడంతో విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. ఈ దీక్షకు కొత్తపేట కార్పొరేటర్ పవన్ కుమార్, కాలనీవాసులు మద్దతు తెలిపారు.

బీఆర్ఎస్ పార్టీలో చేరికలు



నవతెలంగాణ-బడంగ్‌పేట్

రాష్ట్ర ప్రభుత్వం సీఎం కేసీఆర్ నాయకత్వంలో పేద ప్రజల సంక్షేమం అమలు చేస్తున్న అభివద్ధి సంక్షేమ పథకాలకు ఆకర్షితులై ఎంతో మంది యువకులు బీఆర్ ఎస్ పార్టీలో చేరుతున్నారని బీఆర్ఎస్ పార్టీ రాష్ట్ర నాయకులు పట్లోళ్ళ కార్తిక్ రెడ్డి అన్నారు. సోమవారం జల్ పల్లి మున్సిపల్ పరిధిలో ఉన్న 8వ వార్డు షాహిన్ నగర్ కాలనీలో మున్సిపల్ వైస్ చైర్మెన్ యూసుఫ్ పటేల్,పార్టీ అధ్యక్షులు ఎక్బాల్ ఖలిఫాల ఆధ్వర్యంలో వివిధ పార్టీలకు చెందిన దాదాపు 5 వందల మంది నాయకులు కార్యకర్తలు అభిమానులు మహిళలు కార్తిక్ రెడ్డి సమక్షంలో బీఆర్ ఎస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా వారికి పార్టీ కండువాలను వేసి సాదరంగా ఆహ్వానించారు. అనంతరం వారు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం పేద ప్రజల సంక్షేమానికి పెద్దపీట వేసినట్లు తెలిపారు. మైనార్టీల అభివృద్ధికి ఎంతో కృషి చేస్తున్నారని తెలిపారు.జల్ పల్లి మున్సిపల్ పరిధిలో నివాసం ఉన్న మైనార్టీల కాలనీలలో కోట్లాది రూపాయల ప్రత్యేక నిధులతో అనేక అభివద్ధి సంక్షేమ కార్యక్రమాలను అమలు చేస్తున్నారని తెలిపారు. ముఖ్యంగా రోడ్ల డ్రయినేజీలు విద్యుత్ దీపాలు మిషన్ భగీరథ పథకంలో ఇంటింటికీ తాగినిటి సౌకర్యం ఇలా అనేక అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలను అమలు చేస్తున్నట్లు తెలిపారు.రానున్న అసెంబ్లీ ఎన్నికల్లో మంత్రి పి. సబితా ఇంద్రారెడ్డి విజయం కోసం నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, మహిళలు తదితరులు సహకరించాలని కోరారు.ఈ కార్యక్రమంలో 21వ వార్డు కౌన్సిలర్ పమీద అఫ్జల్, కాలనీ వాసులు తదితరులు పాల్గొన్నారు.

నాసిరకం బతుకమ్మ చీరలు పంపిణీ చేస్తున్నారని ఆగ్రహం



నవతెలంగాణ-హాయత్ నగర్

రాష్ట్ర సర్కారు ఆడపడుచులకు నాసిరకం బతుకమ్మ చీరలు పంపిణీ చేస్తున్నారని జీహెచ్ఎంసీ డిప్యూటీ ఫ్లోర్ లీడర్, కార్పొరేటర్ కొప్పుల నర్సింహ్మా రెడ్డి గులాబీ సర్కార్ పై మండిపడ్డారు. సోమవారం మన్సూరాబాద్ డివిజన్ పరిధిలోని భవాని నగర్ సంక్షేమ భవనం లో బతుకమ్మ చీరలను మహిళలకు పంపిణీ చేశారు. తదనంతరం ఆయన మాట్లాడుతూ రంజాన్, క్రిస్మస్ పండుగలకు ఎటువంటి ఆంక్షలు పెట్టకుండా వారివారి మతాలకు చెందిన వాళ్లందరికీ కిట్లను పంపిణీ చేస్తారని, హిందువుల పండుగలకు మాత్రం రేషన్ కార్డులో పేరు ఉంటేనే ఇవ్వడం సరికాదని అన్నారు. ఒక్కో మతానికి ఒక్కో రకంగా వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. డివిజన్‌లో దాదాపు 10వేల చీరలు పంపిణీ చేయాల్సి ఉంటే కేవలం 2వేల చీరలు మాత్రమే వచ్చాయని అందరికీ ఇచ్చినట్టుగా బిల్లులు మాత్రం పూర్తిగా తీసుకుంటారని ఈ స్కామ్ పై ఎటువంటి విచారణ ఎందుకు ఉండదని ప్రశ్నించారు.

బతుకమ్మ చీరల నిధులను లబ్దిదారుల బ్యాంకు ఖాతాలో వేయాలి : కార్పొరేటర్ కళ్లెం నవ జీవన్ రెడ్డి

హయత్‌నగర్ డివిజన్ కార్పొరేటర్ కళ్లెం నవ జీవన్ రెడ్డి హయత్ నగర్ వార్డ్ కార్యాలయంలో అధికారులతో కలసి బతుకమ్మ చీరలను పంపిణి చేసారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం హిందూ పండుగల పట్ల పక్షపాత ధోరణి వ్యవహరిస్తున్నదని, కేవలం తెల్ల రేషన్ కార్డు ఉన్న వారికే కాకుండా రాష్టం లోని మహిళలందరికీ చీరలు పంపిణీ చేయాలని సూచించారు. అంతేకాకుండా ప్రతి ఏటా బతుకమ్మల చీరల పేరిట రాష్ట్ర ప్రభుత్వం ప్రజాధనాన్ని, ప్రజల సమయాన్ని వధా చేస్తున్నదని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం ఏటా బతుకమ్మ చీరల నిధులను నేరుగా లబ్దిదారుల బ్యాంకు ఖాతాలో వేస్తే బాగుంటుందని అభిప్రాయపడ్డారు.



నాదర్‌గుల్‌లో బతుకమ్మ చీరల పంపిణీ

నవతెలంగాణ-బడంగ్‌పేట్

బడంగ్ పేట్ మున్సిపల్ కార్పొరేషన్‌లోని నాదర్ గుల్ గ్రామంలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మహిళలకు మేయర్ పారిజాత నర్సింహారెడ్డి స్థానిక కార్పొరేటర్లతో కలిసి బతుకమ్మ చీరలను పంపిణీ చేశారు. కార్పొరేటర్లు నిమ్మల సునీత శ్రీకాంత్ గౌడ్, తోట శ్రీధర్ రెడ్డి, గూడెపు ఇంద్రసేన, కో ఆప్షన్ సభ్యుడు మర్రి జగన్మోహన్ రెడ్డి, నాయకులు శ్రీశైలం చారి, బోయపల్లి రాఘవేందర్ రెడ్డి, సుబాన్ యాదవ్, సామ భాస్కర్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

నియోజకవర్గంలో ప్రాచీన గుడులకు మహర్దశ



- మంత్రి సబితా ఇంద్రారెడ్డి
- ఖిల్లా ఆలయ అభివృద్ధి పనులకు శంకుస్థాపన

నవతెలంగాణ- చైతన్యపురి

మహేశ్వరం నియోజకవర్గంలో ప్రాచీన గుడులకు మహర్దశ సంతరించుకుందని విద్యా శాఖ మంత్రి సబితా ఇంద్రారెడ్డి అన్నారు. సోమవారం ఆర్‌కే పురం డివిజన్ లోని ఖిల్లా మైసమ్మ దేవాలయానికి కోటి రూపాయల నిధులతో చేపట్టనున్న ఆలయ అభివృద్ధి పనులకు కార్పొరేటర్ రాద ధీరజ్ రెడ్డితో కలిసి మంత్రి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ రాష్ట్రంలోని అన్ని దేవాలయాల్లో ధూప,దీప,నైవేద్యాలు జరిగేలా ప్రభుత్వం కృషి చేస్తున్నదని పేర్కొన్నారు. సీఎం కేసీఆర్ నాయకత్వంలో రాష్ట్ర వ్యాప్తంగా దేవాలయాల అభివద్ధికి శ్రీకారం చుట్టినట్టు తెలిపారు. మహేశ్వరం నియోజకవర్గములో పురాతన దేవాలయాలకు రెండు విడతలుగా మంజూరు అయిన సుమారు రూ. 8 కోట్ల నిధులతో అభివద్ధి చేస్తున్నట్టు తెలిపారు.దేశంలోనే ఎక్కడా లేనివిధంగా యాదాద్రి టెంపుల్ ను పునర్నిర్మాణం చేసి భక్తులకు అందుబాటులోకి తెచ్చిన ఘనత ముఖ్యమంత్రి కేసీఆర్‌కే దక్కుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ దయానంద్ గుప్తా, శ్రీధర్, నియోజకవర్గం బీఆర్ఎస్ ప్రధాన కార్యదర్శి అరవింద్ శర్మ డివిజన్ అధ్యక్షుడు పెండ్యాల నగేష్, న్యాల కొండ శ్రీనివాస్ రెడ్డి, రామాచారి, లింగస్వామి గౌడ్, కొంద్ర శ్రీనివాస్, ఎస్కే మహమ్మద్, శ్యామ్ గుప్తా, జగన్, వెంకటేష్ గౌడ్, రమేష్,డివిజన్ మహిళా అధ్యక్షురాలు లిక్కి ఊర్మిళ రెడ్డి,నియోజకవర్గ మహిళా వర్కింగ్ ప్రెసిడెంట్ పటేల్ సునీత రెడ్డి, సుజాత రెడ్డి, మాధవి, అనురాధ, స్వప్న, పుష్పాలత పాల్గొన్నారు.



కొలువుదీరిన ఆలయం నూతన కమిటీ

నవతెలంగాణ-వనస్థలిపురం

ఎల్బీనగర్ నియోజకవర్గం సాహెబ్ నగర్ గ్రామం త్రినేత్ర ఆంజనేయ స్వామి ఆలయం పాలకవర్గాన్ని ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్ రెడ్డి ధ్రువీకరిస్తూ సోమవారం ప్రకటించారు. ఈ కమిటీలో సాహెబ్ నగర్ గ్రామ వాస్తవ్యులు పెండ్యాల శ్రీనివాస్ గౌడ్, బి జంగారెడ్డి, ఈ బాలా చారి, పథ్వీరాజ్, ఎం పరమేష్ గౌడ్, బి లక్ష్మి, ఎస్ క్రిష్ణా సభ్యులుగా నియమితులయ్యారు. నూతనంగా ఎన్నికైన కమిటీ సభ్యులు ఎమ్మెల్యే కలిసి కతజ్ఞతలు తెలియజేసి త్రినేత్ర ఆంజనేయ స్వామి సన్నిధిలో ప్రమాణ స్వీకారం చేశారు.

నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
మేడ్చల్-ఉప్పల్
మంగళవారం | అక్టోబర్ 10. 2023 | www.navatelangana.com



మల్లాపూర్ డివిజన్ పరిధిలోని గ్రీన్ హిల్స్‌కాలనీలో జరుగుతున్న బీటీ రోడ్డు పనుల నాణ్యతా ప్రమాణాలను స్థానిక కార్పొరేటర్ పన్నాల దేవేందర్‌రెడ్డి సోమవారం పరిశీలించారు. ఆయన వెంట జీహెచ్ఎంసీ డీఈ రూప, ఏఈ శ్రవంతి, వర్క్ ఇన్‌స్పెక్టర్ భిక్షపతి, స్థానిక కాలనీ వాసులు తదితరలున్నారు. నవ తెలంగాణ- కాప్రా

మధుర చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో వైద్య శిబిరం



నవతెలంగాణ-కాప్రా

మధుర చారిటబుల్ ట్రస్ట్ ఫౌండర్ చైర్మెన్ రాగిడి లక్ష్మారెడ్డి సహకారంతో చక్రిపురం చౌరస్తా శ్రీ చక్రి విద్యానికేతన్ హై స్కూల్ లో సోమవారం మెగా మెడికల్ క్యాంపు నిర్వహించారు. కంటి పరీక్ష అవసరమైన వారికి వెంటనే ఆస్పత్రికి పంపించి ఆపరేషన్లు చేయించారు. ట్రస్టు సభ్యుడు పలకల నరసింహారెడ్డి ఆపరేషన్ పండ్లు, పంపిణీ చేశారు. బాధితులు చారిటబుల్ ట్రస్ట్ చైర్మెన్ రాగిడి లక్ష్మారెడ్డి కి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.

మెడిసిటీ ఆస్పత్రి ఆధ్వర్యంలో వైద్య శిబిరం



నవతెలంగాణ-మేడ్చల్

మేడ్చల్ మండల పరిధిలోని పూడూరులో సోమవారం మెడిసిటీ ఆస్పత్రి ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ శిబిరంలో బీపీ, షుగర్, కంటి పరీక్షలు, మానసిక సమస్యలు, చెవి, ముక్కు, గొంతు,వరిబీజము, బీజకుట్టు, గడ్డలు, కనతులు, థైరాయిడ్ గడ్డలు, గర్భ సంచికి సమస్యలు, కుటుంబ నియంత్రణ ఆపరేషన్‌లు, చర్మ వ్యాధులు, మోకాళ్ల నొప్పులు, నడుము నొప్పులు, ఊపిరితిత్తులకు ఉచితంగా మందులు పంపిణీ చేసినట్లు నిర్వాహకులు తెలిపారు. గ్రామంలో వైద్య శిబిరం ఏర్పాటు చేసిన నిర్వాహకులకు సర్పంచ్ బాబు యాదవ్ అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో వార్డు సభ్యుడు పి.శ్రీకాంత్ ముదిరాజ్, బీఆర్ఎస్ గ్రామ ఉపాధ్యక్షుడు ప్రభాకర్, డాక్టర్‌లు గౌరిశంకర్, విజయశ్రీ, మాలిక్, మార్కెటింగ్ ఇన్‌చార్జి కుమారస్వామి, మమత, అరుణ, శ్రావణి పాల్గొన్నారు.

ఘనంగా చెగువేరా 56వ వర్ధంతి



నవతెలంగాణ-కాప్రా

భారత కమ్యూనిస్టు పార్టీ మార్క్సిస్టు మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా ఆధ్వర్యంలో కామ్రేడ్ చెగువేరా 56వ వర్ధంతిని కమలానగర్ ఆఫీసులో సోమవారం నిర్వహించారు. పార్టీ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు కోమటి రవి చెగువేరా చిత్రప టానికి పూలమాలవేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ప్రపంచంలో యువకులకు ఐకాన్‌గా పేరుపొందిన గొప్ప నేత అని అన్నారు. డాక్టర్‌గా సేవలు అందించి క్యూబా దేశం విప్లవం సాధనలో ఫెడరల్ కాస్ట్రోతో కలిసి విజయం సాధించారని చెప్పారు. నాటి ప్రభుత్వంలో మంత్రిగా పని చేశారని చెప్పారు. అంతటితో సంతృప్తి చెందని చెగువేరా లాటిన్ అమెరికా దేశాల విముక్తి కోసం పోరాడారని చెప్పారు. బొలీబియా విముక్తి పోరాటంలో సామ్రాజ్యవాదుల కుట్రలకు హత్యకు గురయ్యాడని పేర్కొన్నారు. సామాజిక ఉద్యమ నేత జయరాజు మాట్లాడుతూ. మహెూన్నత ఆశయాలతో ముందుకు నడిచి పోరాటయోధుడిగా జీవనం సాగించిన గొప్ప యోధుడని అన్నారు. ఈ కార్యక్రమానికి గొడుగు యాదగిరిరావు అధ్యక్షత వహించారు. కార్యక్రమంలో శ్రీనివాసరావు, ఉనికిష్టన్, ప్రసాద్‌బాబు, పి.బి చారి వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలలో టీచర్ల కొరత

- ఔషాపూర్ సర్పంచ్ కావేరి మచ్చేందర్‌రెడ్డి
- విద్యార్థులకు సరైన బోధన అందడం లేదని ఆగ్రహం

నవతెలంగాణ-ఘట్కేసర్

ఘట్కేసర్ మండలం ఔషాపూర్ ప్రభుత్వ పాఠశాలలో 200 మందికిపైగా విద్యార్థుల ఉన్నా ప్రభుత్వ టీచర్ల కొరత తీరడం లేదంటూ సర్పంచ్ కావేరి మచ్చే ందర్‌రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. గ్రామంలో ఉపాధ్యాయుల కొరత ఉందని మంత్రి మల్లారెడ్డికి అధికారులకు ఎన్నోసార్లు వినతిపత్రం అందజేసినా ఎవరూ స్పందించలేదని వాపోతున్నారు. మధ్యాహ్న భోజనానికి నిధులు లేక వంట చేసే నిర్వాహకులు రోడ్లపై ధర్నాలు నిర్వహిస్తుంటే ఇప్పుడేమో సీఎం కేసీఆర్ ఉదయం అల్పాహారం పెడతామనడం హాస్యాస్పదమని విమర్శించారు. రాష్ట్రంలో ఏ రంగంలోని ఉద్యోగులు సంతోషంగా లేరని చెప్పారు. ప్రతి ఒక్కరినీ ఇబ్బంది పెట్టేలా ప్రభుత్వం పాలన నడుస్తుందన్నారు. వచ్చే ఎన్నికల్లో తగిన బుద్ధి చెప్పి ఇంటికి సాగనంపాలని కోరారు.



చర్లపల్లి డివిజన్ డి మార్ట్ రోడ్డులో జరుగుతున్న మాన్‌సూన్ ఎమర్జెన్సీ టీమ్ చేస్తున్న పనులను స్థానిక కార్పొరేటర్ బొంతు శ్రీదేవి యాదవ్ పరిశీలించారు. గుంతలను సరిగా పుడ్చాలని సూచించారు. నవతెలంగాణ-కాప్రా



చర్లపల్లి డివిజన్ బీఆర్ఎస్ సీనియర్ నాయకులు చిందం నర్సింహ వంశరాజ్ వైరల్ ఫీవర్ తో బాధపడుతుండడంతో స్థానిక కార్పొరేటర్ బొంతు శ్రీదేవి యాదవ్ వారి ఇంటికి వెళ్లి పరామర్శించారు. ఆమె వెంట బాల్‌రెడ్డి, శ్రీకాంత్ యాదవ్, ప్రభు గౌడ్, వెంకట్ రెడ్డి పాల్గొన్నారు. నవతెలంగాణ-కాప్రా

వి. కిరణ్‌కుమార్‌కు కెమికల్ ఇంజనీరింగ్‌లో పీహెచ్‌డీ



నవతెలంగాణ-కాప్రా

చర్లపల్లి సెంట్రల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ పెట్రో కెమికల్స్ ఇంజనీరింగ్ అండ్ టెక్నాలజీ సిపెట్ చీఫ్ మేనేజర్ వి.కిరణ్ కుమార్‌కు ఉస్మానియా యూని వర్సిటీ నుంచి కెమికల్ ఇంజినీరింగ్ విభాగంలో పీహెచ్‌డీ లభించింది. ఉస్మానియా విశ్వవిద్యాలయం కెమికల్ ఇంజనీరింగ్ విభాగం నుండి వి.కిరణ్ కుమార్‌కు డాక్టరేట్ పొందినట్లు కాలేజ్ ఆఫ్ టెక్నాలజీ, ఉస్మానియా యూనివర్శిటీ ప్రిన్సిపల్ చింత సాయిలు, కెమికల్ ఇంజినీరింగ్ అధిపతి శ్రీను నాయక్ సోమవారం ప్రకటించారు. ఉస్మానియా విశ్వవిద్యాలయంలోని కెమికల్ ఇంజినీరింగ్ విభాగపు విశ్రాంత ఆచార్యులు ఈటకుల నాగ భూషన్ మార్గ దర్శకత్వంలో "పాలీప్రొపైలిన్ కో-పాలిమర్ యొక్క మెకానికల్, థర్మల్ లక్షణాలపై ఎండబ్ల్యూసీఎన్‌టీ వివిధ రకాల ఉమ్మడి ప్రభావం" అనే అంశం పై సిద్ధాంత గ్రంథాన్ని వర్సిటీకి సమర్పించినట్లు తెలిపారు.

విద్యారంగ

సమస్యల పరిష్కారంలో ప్రభుత్వం విఫలం

- ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి రాథోడ్ సంతోష్
- సమస్యలపై ధర్నా



నవతెలంగాణ-ఘట్కేసర్

విద్యారంగ సమస్యలను పరిష్కరించడంలో రాష్ట్ర ప్రభుత్వం విఫలమైందని ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి రాథోడ్ సంతోష్ డిమాండ్ చేశారు. సోమవారం ఘట్కేసర్‌లోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయం ఎదుట ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో ధర్నా చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... రాష్ట్ర ప్రభుత్వ విధానాలతో సంక్షేమ వసతి గృహలు, గురుకుల, కేజీబీవీ, విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని మండిపడ్డారు. హాస్టల్స్‌కు సొంత భవనాలు కేటాయించాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం మెస్ చార్జీలు పెంచామని చెబుతున్నా అది ప్రకటనకే పరిమిత మైందన్నారు. ఏడాది నుంచి హాస్టల్స్‌కు మెస్ బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయని చెప్పారు. హాస్టల్ వార్డెన్లు అప్పుచేసి మెస్ బిల్లు కడుతున్నారని పేర్కొన్నారు. మెస్ బిల్లులను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. నాలుగేండ్ల నుంచి సుమారు రూ.5,177 కోట్లు స్కాలర్ షిప్స్, ఫీజు రీయంబర్స్‌మెంట్స్ విడుదల చేయాలని ఎన్నో సార్లు విద్యార్థులతో కలిసి ఆందోళన చేసినా రాష్ట్ర ప్రభుత్వం పట్టించుకోలేదన్నారు. హస్టల్స్ విద్యార్థు లకు కాస్మోటిక్ బిల్లుల ఉసే లేకుండా చేసిందని తెలిపారు. మేడ్చల్ నియోజకవర్గంలో ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చిన మంత్రి మల్లారెడ్డి ఇప్పటికైనా ప్రభుత్వ డిగ్రీ కళాశా ల ఏర్పాటు అయ్యేలా చర్యలు తీసుకోవాలన్నారు. లేని పక్షంలో రాబోయే ఎన్నికల్లో బీఆర్ఎస్ నుంచి పోటీ చేసే ఎమ్మెల్యేలను ఓడించేలా ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో ప్రచారం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా సహాయ కార్యదర్శి అరుణ్, జిల్లా కమిటీ సభ్యులు శ్యామ్, ఎస్ఎఫ్ఐ నాయకులు రవి, అనిల్, మనీష్, శివ, నిఖిల్, రాకేష్, శివ, భూపతి, విద్యార్థులు పాల్గొన్నారు. అంతకముందు ఎస్ఎఫ్ఐ విద్యార్థులను పోలీసులు అరెస్టు చేసి పోలీస్ స్టేషన్‌కి తరలించారు.

డిమాండ్స్:

1. పెండింగ్ లో ఉన్న 5,177 కోట్ల స్కాలర్ షిప్స్ ఫీజు రీయంబర్స్ మెంట్స్ విడుదల చేయాలి.
2. పెంచిన మెస్ ఛార్జీలు అమలు చేయాలి.
3. మెస్, కాస్మోటిక్ ఛార్జీలు పెంచి ఇవ్వాలి.
4. రాష్ట్రంలో అద్దె భవనాల్లో నడుస్తున్న గురుకులాలు, కేజీబీవీ, సంక్షేమ వసతి గృహాలకు సొంత భవనాలు నిర్మించాలి.
5. గత సంవత్సర కాలంగా పెండింగ్ ఉన్న హస్టల్స్ మెస్ బిల్లులు, కాస్మోటిక్ బిల్లులు విడుదల చేయాలి, దుప్పట్లు, యూనిఫామ్స్, ట్రంక్ పెట్టెలు, ప్లేట్లు, గ్లాసులు అందించాలి.
6. రిపేర్లలో ఉన్న బాత్రూమ్, మరుగుదొడ్లు, కరెంటు మరమ్మతులు తక్షణమే పూర్తి చేయాలి.

శ్రీ బాలాజీ వెంకటేశ్వర స్వామి ఆలయ చైర్మెన్‌గా వేణుగోపాల్



నవతెలంగాణ-ఘట్కేసర్

వెంకటాపూర్ శ్రీబాలాజీ వెంకటేశ్వర స్వామి దేవస్థానం చైర్మెన్‌గా ఉదారి వేణుగోపాల్ ముదిరాజ్ సోమవారం ప్రమాణ స్వీకారం చేశారు. దేవాదాయ శాఖ అధికారులు చైర్మెన్‌ను ట్రస్టు బోర్డు మెంబర్లు నవీన్, శంకర్, లింగం, రామకృష్ణారెడ్డి, శేఖర్, కళావతి సన్మానించారు. అనంతరం ఆలయ అధికారులు చైర్మెన్‌తో పాటు సభ్యులను శాలువాతో సన్మానించారు. కార్యక్రమంలో సర్పంచ్ గీత శ్రీనివాస్ ముదిరాజ్, ఈవో భాగ్యలక్ష్మి తదితరులున్నారు.

కుల వృత్తులకు పూర్వ వైభవం



నవతెలంగాణ-శామీర్‌పేట

తెలంగాణ ప్రభుత్వం కులవృత్తులకు పెద్దపీట వేస్తుందని శామీర్ పేట ఎంపీపీ ఎల్లుభాయిబాబు అన్నారు. శామీర్‌పేట్ గ్రామంలో సోమవారం ప్రభుత్వం తరపున మంజూరైన 12 యూనిట్లు గొర్రెల ను సంబంధిత శాఖ అధికారుల ఆధ్వర్యంలో లబ్దిదారులకు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎంపీపీ హాజరై మాట్లా డుతూ.. కేసీఆర్ కులవృత్తులకు పూర్వ వైభవం తీసుకువచ్చేందుకు అనేక సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నారని పేర్కొన్నారు. కార్యక్రమంలో వెటర్నరీ జిల్లా అధికారి, పశు వైద్యులు డాక్టర్ పవన్, భిక్షు నాయక్, సిబ్బంది, యాదవులు పాల్గొన్నారు.

దమ్మాయిగూడలో పైప్‌లైన్ పనులు ప్రారంభం



నవతెలంగాణ-కీసర

దమ్మాయిగూడలో నాసిన్ చెరువు నుంచి కోమటివాని కుంట వరకు సివరేజ్ పైప్‌లైన్ పనులను మున్సిపల్ ఛైర్‌పర్సన్ వసూపతి ప్రణీతాశ్రీకాంత్‌గౌడ్ సోమవారం ప్రారంభించారు. ఎస్. ఎన్.డీ.పీ రూ. 1571.90 లక్షలతో పైప్‌లైన్ నిర్మాణ పనులు ప్రారంభించారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ రాజమల్లయ్య, వైస్ చైర్ పర్సన్ మాదిరెడ్డి నరేందర్ రెడ్డి, 8 వ వార్డు కౌన్సిలర్ సంపనబోల్ స్వప్న , 9 వ వార్డు కౌన్సిలర్ గోగుల సరిత , బీఆర్ఎస్ నాయకులు రామారం కార్తీక్ గౌడ్,రాములు పాల్గొన్నారు.

మల్లారెడ్డి ఓటమికి కౌంట్‌డౌన్ స్టార్ట్

- ఎన్ని జిమ్మిక్కులు చేసినా కాంగ్రెస్‌దే గెలుపు
- నాగారం మున్సిపల్ కార్యకర్తల సమావేశంలో తోటకూర వజ్రేష్ యాదవ్



నవతెలంగాణ-కీసర

రాబోయే ఎన్నికలల్లో మంత్రి మల్లారెడ్డి ఓడిపోవడానికి కౌంట్‌డౌన్ మొదలైందని టీపీసీసీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు తోటకూర వజ్రేష్ యాదవ్ అన్నారు. సోమవారం రాంపల్లిలో ఏర్పాటు చేసిన నాగారం మున్సిపల్ కార్యకర్తల సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడుతూ.. ఎన్నికలలో లబ్ధి పొందడానికి బీఆర్ఎస్ నేతలు ఎన్ని జిమ్మిక్కులు చేసినా వచ్చే ఎన్నికల్లో గెలిచేది కాంగ్రెస్ పార్టీనే అన్నారు. బీఆర్ఎస్ రెండు దఫాలుగా అధికారంలో ఉండి అన్ని వర్గాలను నయవంచనకు గురి చేసిన ఘనత బీఆర్ఎస్ నేతలకే దక్కుతుందని తెలిపారు. ఎన్నికల కోడ్ రావడంతో ప్రజలకు పదేండ్లుగా పట్టిన పీడ వదిలిందన్నారు. మంత్రి మల్లారెడ్డి అన్ని వర్గాల ప్రజలను నయవంచనకు గురి చేశారని ఆగ్రహం వ్యక్తం చేశారు. స్థానికులకు చెందాల్సిన డబుల్ ఇండ్లను ఎక్కడో ఉండే వాళ్లకు పంపిణీ చేసి నమ్ముకున్న వాళ్లను ముంచిన ఘనత మల్లారెడ్డికే దక్కుతుందన్నారు. ఆచరణకు సాధ్యం కానీ అనేక హామీలను గుప్పించి మరోసారి ప్రజలను మోసం చేయాలని మల్లారెడ్డి చేస్తున్న అబద్ధపు ప్రచారాన్ని ప్రజలు నమ్మే స్థితిలో లేరన్నారు. కార్యకర్తలందరూ సైనికుల్లాగా యాభై రోజులు పనిచేసి కాంగ్రెస్ పార్టీని అధికారంలోకి తీసుకువచ్చేందుకు కృషి చేయాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ కాంగ్రెస్ అధ్యక్షుడు శ్రీనివాస్‌రెడ్డి ,వర్కిం గ్ ప్రెసిడెంట్ కుమార్, కీసర మండల అధ్యక్షుడు కృష్ణ , కౌన్సిలర్ సరితా రమేష్ , హరిబాబు , సరితా ,మాజీ సర్పంచ్ గూడూరు అశోక్ గౌడ్ పొట్ట శ్రీశైలం ,పొట్ట విగ్నేష్ ,ఓం ప్రకాష్ గౌడ్ ,ఎలాసాని భూమయ్య , ఎలాసాని బాలరాజ్ యాదవ్, శివారాంరెడ్డి పాల్గొన్నారు.

మానసిక ఆరోగ్యంతోనే ఉల్లాసమైన జీవితం

- డాక్టర్ చరణ్ తేజ కోగంటి, కన్సల్టెంట్ సైకియాట్రిస్ట్, కిమ్స్ హాస్పిటల్స్, కొండాపూర్



నవతెలంగాణ-సిటీబ్యూరో

ప్రతి ఏడాదీ అక్టోబర్ 10వ తేదీన ప్రపంచ మానసిక ఆరోగ్య దినోత్సవాన్ని నిర్వహిస్తారు అని డాక్టర్ చరణ్ తేజ కోగంటి, కన్సల్టెంట్ సైకియాట్రిస్ట్, కిమ్స్ హాస్పిటల్స్, కొండాపూర్ వారు తెలిపారు. ప్రపంచ వ్యాప్తంగా 26.4 కోట్ల మంది డిప్రెషన్‌తో బాధపడు తున్నారు. ఇక యాం గ్జయిటీ డిజార్డర్ల గురించయితే చెప్పనక్కర్లే దు. మానసిక సమస్యలు రోజు రోజుకూ పెరుగుతున్నా యి. అయితే ఇప్పటికీ మన సమాజంలో శారీరక అనారోగ్యాల పట్ల ఉన్నంత అవగాహన, శ్రద్ధ మానసిక అనారోగ్యాల పట్ల ఉండటం లేదు. మెంటల్ హెల్త్ విషయంలో ఎన్నో రకాల అపోహలు మన చుట్టూ ఉన్నాయి. అలాంటి కొన్ని అపోహలను, వాటి వెనక ఉన్న వాస్తవాలను గురించి తెలుసుకుందాం.

చాలామంది... మానసిక సమస్యలు మానసికంగా బలహీనంగా ఉన్నవారికే వస్తాయని అనుకుంటారు. కానీ అది నిజం కాదు. మానసిక శక్తికి మానసిక అనారోగ్యాలకు సంబంధం లేదు. జన్యుపరమైన కారణాలు, పుట్టిపెరిగిన వాతావరణం, జీవితంలో ఎదుర్కొన్న చేదు అనుభవాలు... ఇలా పలురకాల అంశాలు మానసిక సమస్యలకు దారి తీస్తాయి. చిన్నపిల్లల్లో, యువతలో మానసిక సమస్యలు ఉండవనే అభిప్రాయం కూడా చాలా మందిలో ఉంటుంది. కానీ ఇది కూడా అపోహే ... నిజం కాదు. వయసుతో సంబం ధం లేకుండా ఎవరిలోనైనా మానసిక సమస్యలు వచ్చే అవకాశం వస్తుం టాయని కొంతమంది అనుకుంటా రు. కానీ ఇది నిజం కాదు. మానసిక సమస్యలకు ఆధ్యాత్మిక నమ్మకాలకు సంబంధం లేదు. అలాగే విల్ పవర్ లేకపోవటం వల్ల మానసిక అనారోగ్యాలు వస్తాయనటంలో కూడా నిజం లేదు. పలురకాల వైద్యపరమైన సంక్లిష్టమైన అంశాలు మానసిక సమస్యలకు కారణమవుతుంటాయి.

అసలు మానసిక అనారోగ్యాలకు చికిత్సే లేదని, వాటికి గురైనవారు జీవితాంతం వాటిని భరిస్తూనే ఉండాలనే అపోహ కూడా చాలా మందిలో ఉంటోంది. కానీ ఇది నిజం కాదు. మానసిక సమస్యలకు తప్పకుండా చక్కని చికిత్సలున్నాయి. సరైన చికిత్స, శ్రద్ధ, అండదండలు ఉంటే మానసిక అనారోగ్యాల నుంచి బయటపడటం లేదా వాటిని నియంత్రణలో ఉంచుకుంటూ సాధారణ జీవితాన్ని గడపటం సాధ్యమవుతుంది.

సీఎం కేసీఆర్, మంత్రి హరీశ్‌రావుకు కృతజ్ఞతలు

- టీఎన్‌జీవో మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా అధ్యక్షులు బి.రవిప్రకాశ్



నవతెలంగాణ-సిటీబ్యూరో

రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన నూతన ఉద్యోగుల ఆరోగ్య పథకం అమలుకు ఉత్తర్వులు జారీ చేసినందుకు ఉద్యోగుల జేఏసీ చైర్మెన్, తెలంగాణ నాన్ గెజిటెడ్ అధికారుల సంఘం మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా అధ్యక్షుడు బి.రవిప్రకాష్ సీఎం కేసీఆర్, మంత్రి హరీశ్‌రావు కు తెలంగాణ నాన్ గెజిటెడ్ అధికారుల సంఘం రాష్ట్ర అధ్యక్షులు మామిళ్ల రాజేందర్‌కు కతజ్ఞతలు తెలిపారు. ఈ మేరకు సోమవారం ఒక ప్రకటన విడుదల చేశారు. రాష్ట్ర ప్రభుత్వ పెన్షనర్లు, ఉద్యోగుల కోసం ఎంప్లాయీ హెల్త్ కేర్ ట్రస్ట్ చాలా కాలంగా పెండింగ్‌లో ఉన్న ఉద్యోగులు, ఉపాధ్యాయులు, పెన్షనర్లకు నగదు రహిత వైద్య విధానాన్ని ప్రవేశపెట్టాలని డిమాండ్ చేశారని తెలిపారు. కోవిడ్ -19 కాలంలో ప్రతి ఒక్కరూ ఎదుర్కొన్న పరిస్థితులు, అలాంటి పరిస్థితులను అరికట్టడానికి ప్రభుత్వం తీసుకున్న ఈ చర్య 6.50 లక్షల మంది ఉద్యోగులు, పెన్షనర్ కుటుంబాలకు ఆరోగ్య భద్రత కల్పించి వైద్య, అత్యవసర పరిస్థితుల ఆర్థిక స్వేచ్ఛ కల్పిస్తుందన్నారు. రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులు, పెన్షనర్లు, వారిపై ఆధారపడిన కుటుంబ సభ్యులకు నగదు రహిత, గుణాత్మక చికిత్స అందించడానికి రాష్ట్ర ప్రభుత్వం సమగ్ర మార్గదర్శకాలను విడుద ల చేసింద ని, ఎంప్లాయిస్ హెల్త్ స్కీమ్‌ని సమర్థవంతంగా అమలు చేయడం కోసం ఆరోగ్యశ్రీ హెల్త్ కేర్ ట్రస్ట్‌లో (15) పోస్టులను మంజూరు చేసినట్టు తెలిపారు. ఇందులో చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్, తెలంగాణ నాన్ గెజిటెడ్ ఆఫీసర్స్ యూనియన్ ఆరుగురు ప్రతినిధులు తమ ప్రతిపాదనలను సమర్పిస్తారని తెలిపారు. సిఫార్సు ప్రకారం కొత్త ఉద్యోగుల ఆరోగ్య పథకాల అమలు చెల్లింపు సవరణ కమిషన్ ఒక ప్రత్యేక ట్రస్ట్‌ను ఏర్పాటు చేయడం ద్వారా, రాష్ట్ర ప్రభుత్వం సహకారంతో ఉద్యోగులు / పెన్షనర్ల నుంచి వచ్చే విరాళాలతో అమలు చేయడానికి, విషయాన్ని పరిశీలించి ప్రభుత్వానికి నివేదికను సమర్పిస్తుందని తెలిపారు.

చిల్కానగర్‌ను అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తా



- కార్పొరేటర్ బన్నాల గీత
- రూ.3కోట్ల 33లక్షలతో అభివృద్ధి పనులకు శంకుస్థాపన

నవతెలంగాణ-ఉప్పల్

చిల్కానగర్ డివిజన్‌ను అన్ని రంగాల్లో అభివృద్ధి చేసి రోల్ మోడల్ గా అభివృద్ధి చేసి చూపిస్తున్నామని కార్పొరేటర్ బన్నాల గీత అన్నారు. సొమవారం రూ.3 కోట్ల 33 లక్షలతో అభివృద్ధి పనులకు శంకుస్థా పన చేశా రు. అనంతరం ఆమె మాట్లాడుతూ..చిల్కానగర్ డివిజన్‌లోని వివిధ కాలనీల్లోని బస్తీల్లో దశలవారీగా అభివృద్ధి పనులు చేపడుతూ ప్రజలకు మౌలిక వసతులు కల్పించడమే లక్ష్యంగా పనిచేస్తున్నట్లు తెలిపారు. రూ.59 లక్షల 22వేలతో జలమండలి నిధుల ద్వారా మల్లికార్జున్‌నగర్, చిల్కానగర్ బొడ్రాయి వద్ద పంతుల మ్మ గల్లీలో, పోచమ్మ టెంపుల్ వద్ద, సాయిరాం నగర్ కాలనీలలో సీవరేజ్ లైన్స్ పనులకు శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో బన్నాల ప్రవీణ్ ముదిరాజ్, కొండల్‌రెడ్డి, నరసింహ, ప్రధాన కార్యదర్శి కోకొండ జగన్, కిషన్, నారాయణరెడ్డి, శ్రీనివాస్, అశోక్ చారి, రవీందర్ గౌడ్, మహేందర్, యాదిరెడ్డి, తాహెర్, యాదగిరి, షఫీ, హనీఫ్ గౌస్, ఫోటో బాలు,ఉపేందర్, సంతోష్,శ్రీకాంత్ తదితరులున్నారు.

'ప్రజలకు మౌలిక సదుపాయాలు కల్పిస్తాం'



నవతెలంగాణ-కీసర

ప్రజలకు మౌళిక సదుపాయాలు కల్పిస్తామని నాగారం మున్సిపల్ చైర్మెన్ కౌకుంట్ల చంద్రారెడ్డి అన్నారు. సోమవారం నాగారం మున్సిపాలిటీ 9వ వార్డు ఎస్వీ నగర్ కాలనీ రోడ్ నెంబర్ 3లో స్థానిక కౌన్సిలర్ అనిత సుధాకర్‌రెడ్డి ఆధ్వర్యంలో రూ.28 లక్షలతో సీసీరోడ్డు పనులకు చైర్మెన్ శంకుస్థాపన చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. నాగారం మున్సిపాలిటీ పరిధిలోని అన్ని కాలనీలలో దశలవారీగా అభివృద్ధి పనులు చేస్తున్నామని చెప్పారు. కార్యక్రమంలో 12వ వార్డు కౌన్సిలర్ రేణుకజగన్ మోహన్ రెడ్డి, మల్లారెడ్డి, గోపాల్ రెడ్డి, నవీన్‌రెడ్డి, బాల్‌రాజ్, నర్సింహా గౌడ్, బీమానాయక్, కిషన్ నాయక్, జగదీష్, రాజేష్, చిట్టీ బాబూ, రామకృష్ణరెడ్డి, వెంకట్ చారీ,శ్రీనుగౌడ్, నర్సింగ్‌రావు, భాస్కర్, శివ, వెంకటేష్, రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

అక్రమంగా మద్యం విక్రయిస్తున్న నిందితుడి అరెస్ట్



నవతెలంగాణ-జవహర్‌నగర్

అక్రమంగా మద్యం విక్రయిస్తున్న నిందితుడిని జవహర్ నగర్ పోలీసులు అరెస్ట్ చేశారు. ఈ సంఘటన జవహర్ నగర్ పోలీస్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. సబ్ ఇన్‌స్పెక్టర్ ఇంద్రీస్ ఆలీ తెలిపిన వివరాల ప్రకారం..కార్పొరేషన్‌లోని బాలాజీనగర్ మార్కెట్ లైన్ రోడ్డులో అక్రమంగా మద్యం విక్రయిస్తున్నట్లు విశ్వసనీయ సమాచారం మేరకు పెట్రోలింగ్ పోలీసులు రావల్కోల్ నందుగౌడ్ రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకుని మద్యం స్వాధీనం చేసుకున్నారు. ఎంసీ డోవెల్స్ 3, ఇపీరియల్ బ్లూ 2, మాన్షన్ హౌస్ 1, ఆఫీసర్ ఛాయిస్ 15, మొత్తం 2.81లీటర్ల మద్యాన్ని స్వాధీనం చేసుకున్నట్లు పోలీసులు తెలిపారు. ఎక్సైజ్ చట్టం ప్రకారం నిందితుడిపై కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

నవతెలంగాణ
11
కూకట్‌పల్లి - కుత్బుల్లాపూర్ - మల్కాజిగిరి
మంగళవారం | అక్టోబర్ 10, 2023 | www.navatelangana.com

కాంగ్రెస్‌లో చేరిన టీడీపీ నాయకుడు చిట్టి బాబు



నవతెలంగాణ-నేరేడ్‌మెట్

అల్వాల్ టీడీపీ మాజీ అధ్యక్షుడు చిట్టి బాబు సోమవారం మైనంపల్లి హనుమంతరావు సమక్షంలో తన అనుచర గణంతో కలిసి కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా ఆయనకు ,మైనంపల్లి కాంగ్రెస్ కండువా కప్పి, ఆయనను పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ... కాంగ్రెస్ పార్టీ ప్రకటించిన ఆరు గ్యారెంటీ పథకాలను చూసి అందరూ కాంగ్రెస్ లో చేరుతునట్టు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన, చిట్టిబాబును అభినందించారు. ఈ కార్యక్రమంలో నాయకులు మల్లెల శివ, బి.ఎస్ రమేష్ , రఘు, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

అబ్దుల్లాపూర్ మెట్‌లో వాహనాల తనిఖీ



నవతెలంగాణ-అబ్దుల్లాపూర్ మెట్

తెలంగాణలో ఎన్నికలు కోడ్ అమలులోకి రావడంతో అబ్దుల్లాపూర్ మెట్ పోలీస్ స్టేషన్ పరిధిలోని రామోజీ ఫిల్మ్ సిటీ వద్ద జాతీయ రహదారిపై సోమవారం సీఐ మన్మోహన్ ఆధ్వర్యంలో వాహనాల తనిఖీ నిర్వహించారు. ఈ సందర్భంగా సి.ఐ మన్మోహన్ మాట్లాడుతూ ఎన్నికల నియమావళి అమల్లోకి రావడం తో శాంతిభద్రతల పరిరక్షణ, చట్టవిరుద్ధ కార్యక్రమాలు నివారించేందుకు ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు వాహనాల తనిఖీలు చేపట్టడం జరిగిందని తెలిపారు. రోజువారీగా వివిధ సమయాలలో తనిఖీలు చేపట్టడం జరుగుతుందన్నారు. వాహనా దారులు పోలీసులకు సహకరించాలని విజ్ఞప్తి చేశారు.

ఎన్నికలను పకడ్బందీగా నిర్వహించాలి

- ఎన్నికల ప్రవర్తనా నియమావళి పక్కాగా అమలు చేయాలి
- మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా కలెక్టర్ అమోయ్ కుమార్



నవతెలంగాణ-సిటీబ్యూరో

జిల్లా వ్యాప్తంగా శాసనసభ ఎన్నికలను ప్రశాంత వాతావరణంలో నిర్వహించాలని, ఈ విషయంలో ఎన్నికల అధికారులు బాధ్యతాయుతంగా వ్యవహరిస్తూ, ఎన్నికలను పకడ్బందీగా నిర్వహించాలని మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ అమోయ్ కుమార్ తెలిపారు. సోమవారం ఎన్నికల ప్రవర్తనా నియమావళి (ఎన్నికల కోడ్) వెలువడిన నేపథ్యంలో కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో నోడల్ అధికారులతో ప్రత్యేకంగా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ సోమవారం నుంచి జిల్లా వ్యాప్తంగా ఎన్నికల కోడ్ అమల్లోకి వచ్చినందున ఎన్నికల కమిషన్ నియమ నిబంధనల ప్రకారం అధికారులు వ్యవహరించాల్సి ఉంటుందని, ఈ విషయంలో ఎలాంటి పొరపాట్లు జరగకుండా జాగ్రత్తగా వ్యవహరించాలన్నారు. ఎన్నికల కమిషన్ నిబంధనలు ఉల్లంఘించే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. జిల్లాలో అన్ని అసెంబ్లీ నియోజకవర్గాల్లో ప్రత్యేక నిఘా ఏర్పాటు చేయాలని, ఎన్నికలు ముగిసే వరకు అధికారులు బాధ్యతాయుతంగా తమ విధులు నిర్వహించాలని ఆదేశించారు. ఈ సందర్భంగా సమస్యాత్మక, అతి సమస్యాత్మక ప్రాంతాలను గుర్తించడం వంటి తదితర పనులను క్షేత్రస్థాయిలో పరిశీలించి అందుకు అవసరమైన ఏర్పాట్లను ఇప్పటి నుంచే ఏర్పాటు చేయాలని కలెక్టర్ పేర్కొన్నారు. అనంతరం నోడల్ అధికారులకు కలెక్టర్ పలు సూచనలు, సలహాలు చేశారు. ఈ సమావేశంలో జిల్లా అదనపు కలెక్టర్ విజయేందర్‌రెడ్డి, జిల్లా రెవెన్యూ అధికారిణి హరిప్రియ, నోడల్ అధికారులు, ఎన్నికల అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

కలెక్టరేట్‌లో మీడియా సెంటర్ ప్రారంభం

రాష్ట్ర శాసనసభ ఎన్నికల నేపథ్యంలో మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా కలెక్టరేట్ కార్యాలయ ప్రాంగణంలోని జే-36లో ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియా వారికి ప్రత్యేకంగా మీడియా సెంటర్‌ను ప్రారంభించినట్టు జిల్లా కలెక్టర్ అమోయ్ కుమార్ తెలిపారు. సోమవారం ఎన్నికల షెడ్యూల్ వెలువడిన నేపథ్యంలో కలెక్టరేట్‌లో ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన మీడియా సెంటర్‌ను జిల్లా రెవెన్యూ అధికారిణి హరిప్రియతో రిబ్బన్ కట్ చేసి కలెక్టర్, అదనపు కలెక్టర్ విజయేందర్‌రెడ్డి దగ్గరుండి ప్రారంభింపజేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పాత్రికేయులు ఎన్నికల సమయంలో ఇబ్బందులు ఎదుర్కోకుండా ఎప్పటికప్పుడు ఎన్నికల సమాచారం తెలుసుకునేందుకు అందుబాటులో ఉండేలా ఈ సెంటర్‌ను ప్రత్యేకంగా ఏర్పాటు చేసినట్టు పేర్కొన్నారు. ఈ మీడియా సెంటర్‌లో అన్ని రకాల సమాచారాలు తెలుసుకునేందుకు వీలుగా అన్ని రకాల సౌకర్యాలు సమకూర్చినట్టు కలెక్టర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో నోడల్ అధికారులు, ఎన్నికల అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



కాంగ్రెస్ బూత్ స్థాయి కమిటీ సమావేశం



నవతెలంగాణ-దుండిగల్

కుత్బుల్లాపూర్ నియోజకవర్గంలోని బాచుపల్లి కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో బూత్ స్థాయి కమిటీ సన్నాహక సమావేశం సోమవారం నిర్వహించారు. నియోజకవర్గ సీనియర్ కాంగ్రెస్ నాయకులూ టీపీసీసీ ప్రతినిధి కొలన్ హన్మంత్ రెడ్డి ఆధ్వర్యంలో జరిగింది. ఈ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ...రానున్న ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అనుసరించిన వ్యూహాలు, అధికార పార్టీ వైఫల్యాలను ప్రజల్లో ఎండగట్టడం, పార్టీ ప్రకటించిన 6 గ్యారెంటీలు ఇతర హామీలను ప్రజల్లోకి తీసుకెళ్లడంపై ప్రధానంగా చర్చించారు. నవంబర్ 30న జరగనున్న అసెంబ్లీ ఎన్నికలకు క్షేత్రస్థాయిలో సిద్ధం కావాలని పార్టీ శ్రేణులకు సూచించారు. కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో జరిగే అన్ని కార్యక్రమాలు, ప్రచార సమావేశాలు వంటివి సోషల్ మీడియాలో వెంటనే అప్లోడ్ చేసేలా ప్రతి ఒక్కరు అలెర్ట్‌గా ఉండాలన్నారు. బూత్‌ల వారీగా కాంగ్రెస్ ఇన్‌చార్జ్‌లు కాంగ్రెస్ హామీలు, పథకాల గురించి ప్రజలకు వివరిస్తూ.. కాంగ్రెస్ గెలుపుకు శాయశక్తులా శ్రమించాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సీనియర్ కాంగ్రెస్ నాయకులు, మైనారిటీ నాయకులు, ఎన్ఎస్‌యుఐ నాయకులు, యువజన కాంగ్రెస్ నాయకులు, ఐఎన్‌యూఐ నాయకులు, మహిళా కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

సీసీ రోడ్డును ప్రారంభించిన డిప్యూటీ మేయర్



నవతెలంగాణ-దుండిగల్

కుత్బుల్లాపూర్ నియోజకవర్గం నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో 2వ డివిజన్ బాచుపల్లి జీపీఆర్ కాలనీ రోడ్డు నుండి బౌరంపేట్ వెళ్ళే దారిలో రూ.1 కోటి వ్యయంతో నూతనంగ నిర్మిస్తున్న సి.సి.రోడ్డును సోమవారం డిప్యూటీ మేయర్ ధనరాజ్ యాదవ్, స్థానిక కార్పొరేటర్ ప్రారంభించారు. చిట్ల దివాకర్, కుత్బుల్లాపూర్ నియోజకవర్గ బీఆర్ఎస్ నేత, కౌన్సిలర్ శంబీపూర్ క్రిష్ణ పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అభివృద్ధికి ఎల్లవేలలా కృషి చేస్తానన్నారు. మంజూరైన అభివృధి పనులను త్వరగా పూర్తి చేసి నాణ్యతతో త్వరగా పూర్తిచేయాలని కాంట్రాక్టర్‌ను ఆదేశించారు. ప్రజలకు అందుబాటులోకి తీసుకువస్తానని, ప్రజలకు మెరుగైన మౌలిక సదుపాయా లు కల్పించే దిశగా పనిచేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్లు అనంతస్వామి, రమేష్, మురళి యాదవ్, బుచ్చి రెడ్డి, పార్టీ శ్రేణులు, స్థానికులు, కాలనీ సభ్యులు పాల్గొన్నారు.

మహిళా సంక్షేమానికి బీఆర్ఎస్ ప్రభుత్వం కృషి



ఎమ్మెల్యే కేపీ వివేకానంద్

నవతెలంగాణ-జగద్గిరిగుట్ట

రాష్ట్రంలోని మహిళా సంక్షేమానికి బీఆర్ఎస్ ప్రభుత్వం కృషి చేస్తుందని కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే కె.పి. వివేకానంద్ అన్నారు. జగద్గిరిగుట్ట డివిజన్ ప్రాంతానికి చెందిన బీజేపీ ఎస్సీ మహిళా విభాగం అధ్యక్షురాలు సునీత వారి బృందం లలిత, పుష్ప, సంపూర్ణ, మీనా, భాస్కర్, కిరణ్ బాబు, వినోద్, ప్రభుత్వ అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలకు ఆకర్షితులై సోమవారం ఎమ్మెల్యే సమక్షంలో నివాస కార్యాలయం వద్ద కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ముఖ్యమంత్రి కేసీఆర్ నాయకత్వమే ఈ రాష్ట్రానికి, దేశానికి దిక్సూచి అన్నారు. అందుకే పార్టీలో చేరుతున్నామన్నారు. పార్టీలో చేరిన ప్రతీ ఒక్కరికి బీఆర్ఎ స్ పార్టీ అండగా ఉంటుందని అన్నారు. ప్రభుత్వం అంది స్తున్న సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని చైతన్య వంతులను చేయాలని తెలిపారు. అన్ని వర్గాల ప్రజల అభ్యున్నతి కోసం కట్టుబడి పని చేస్తానని హామీ ఇచ్చారు.

దోభీ ఘాట్ నిర్మాణం రజకులకు ఉపయోగం



- ప్రభుత్వ విప్ గాంధీ

నవతెలంగాణ-కూకట్‌పల్లి

ఆల్విన్ కాలనీ డివిజన్ పరిధిలోని ఎల్లమ్మ బండలో రూ.10 లక్షల అంచనావ్యయంతో, ఎమ్మెల్యే సీడీపీ ఫండ్స్ (ఎస్‌డీ ఫండ్స్) ప్రత్యేక నిధులతో, నూతనంగా చేపట్టబోయే దోభీ ఘాట్ నిర్మాణం పనులకు కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్ గౌడ్‌తో కలిసి, ముఖ్య అతిథిగా ప్రభుత్వ విప్ అరికెపూడి గాంధీ పాల్గొని శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ప్రభుత్వ విప్ గాంధీ మాట్లాడుతూ రూ. 10 లక్షల అంచనావ్యయంతో, ఎమ్మెల్యే సీడీపీ ఫండ్స్ (ఎస్‌డీ ఫండ్స్) ప్రత్యేక నిధులతో, నూతనంగా చేపట్టబోయే దోభీ ఘాట్ నిర్మాణ పనులకు శంకుస్థాపన చేసుకోవడం చాలా సంతోషంగా ఉందని ప్రభుత్వ విప్ గాంధీ అన్నారు. ఈ నిర్మాణం వలన ఇక్కడి ప్రాంత రజక వాసులకు చాలా ఉపయోగపడుతుందనీ, దీనిని సద్వినియోగం చేసుకోవాలని ప్రభుత్వ విప్ గాంధీ తెలియచేసారు. నిర్మాణం పనులు త్వరితగతిన పూర్తి చేయాలని, నాణ్యత ప్రమాణాలతో చేపట్టాలని, నాణ్యత విషయంలో ఎక్కడ రాజీ పడకూడదని, పనులు త్వరితగతిన పూర్తి చేసి అందుబాటులోకి తీసుకురావాలని ప్రభుత్వ విప్ గాంధీ సూచించారు. అన్ని హంగులతో ,సకల సౌకర్యాలతో దోబీ ఘాట్ నిర్మాణం చేపట్టడం జరుగుతుందని, ఇక్కడ బట్టలు ఉతికేందుకు అన్ని రకాల మౌలిక వసతులు కల్పిస్తామని ,చక్కటి ఆహ్లాదకరమైన వాతావరణం కల్పిస్తామని, అన్ని విధాలుగా అండగా ఉంటానని ప్రభుత్వ విప్ గాంధీ తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయా డైరెక్టర్ గణేష్ ముదిరాజ్, ఆల్విన్ కాలనీ డివిజన్ అధ్యక్షులు సమ్మారెడ్డి, ఉపాధ్యక్షులు కాశినాథ్ యాదవ్, శివరాజ్ గౌడ్, బోయకిషన్, ప్రసాద్, వర్క్ ఇన్స్పెక్టర్ రవి కుమార్, బీఆర్ఎస్ నాయకులు, మహిళా నాయకురాళ్లు తదితరులు పాల్గొన్నారు.

అన్ని వర్గాల ప్రజలను ఆదరించేది బీఆర్ఎస్



- ఎమ్మెల్యే వివేకానంద్
- చింతల్ మలయాళీ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు

నవతెలంగాణ-జగద్గిరిగుట్ట

దేశంలోని అన్ని వర్గాల ప్రజలను ఆదరించి సముచిత న్యాయం కల్పించేది బీఆర్ఎస్ ప్రభుత్వమేనని ఎమ్మెల్యే కేపీ వివేకానంద్ అన్నారు. కుత్బుల్లాపూర్ నియోజకవర్గం చింతల్ డివిజన్ పరిధిలోని వైఎమ్ఎస్ ఫంక్షన్ హాల్‌లో ఆదివారం సాయంత్రం కుత్బుల్లాపూర్ సర్కిల్ చింతల్ మలయాళీ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు ఏర్పాటు చేసిన 10వ ఫ్యామిలీ గెట్ టూ గెదర్ (ఓనం) కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా వారిని ఉద్దేశించి మాట్లాడుతూ ముఖ్యమంత్రి కేసీఆర్ నాయకత్వంలో తెలంగాణ రాష్ట్రంలో అన్ని రాష్ట్రాల ప్రజల సంక్షేమానికి కృషి చేస్తుందని తెలిపారు. కుత్బుల్లాపూర్ నియోజకవర్గం లోని మలయాళీల అభ్యున్నతికి తనవంతు కృషి చేస్తానని తెలిపారు. అనంతరం మలయాళీ ప్రతినిధులు మాట్లాడుతూ గత రెండు పర్యాయాలు వెన్నుదన్నుగా ఉండి గెలిపించుకున్నామని ఈసారి కూడా సంపూర్ణ మద్దతు తెలిపి హ్యాట్రిక్ ఎమ్మెల్యేగా గెలిపించుకుంటామని తీర్మానం చేశారు. అనంతరం మలయాళీ మహిళలు ఓనమ్ నృత్యాలతో సందడి చేశారు.

రిజర్వాయర్‌ను ప్రారంభించిన ఎమ్మెల్యే



నవతెలంగాణ-దుండిగల్

కుత్బుల్లాపూర్ నియోజకవర్గం కొంపల్లి మున్సిపాల్టీలో పరిధిలోని అపర్ణ ఫాంగ్రూవ్ కాలనీలో రూ.20 లక్షల నీటి నిల్వ సామర్థ్యం గల రిజర్వాయర్‌ను సోమవారం ఎమ్మెల్యే కేపీ వివేకానంద్ ముఖ్య అతిథిగా హాజరై, చైర్మెన్ సన్న శ్రీశైలం యాదవ్, వైస్ చైర్మెన్ గంగయ్య నాయక్‌తో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ భవిష్యత్తులో నీటి సమస్య తలెత్తకుండా జలమండలి అధికారులు చేపట్టిన రిజర్వాయర్ రూ.20 లక్షల నీటి నిల్వ సామర్థ్యం గల రిజర్వాయర్ నిర్మాణం చేపట్టారు. పెరిగిన జనాభా అవసరాలను దృష్టిలో దీనిని నిర్మించారురూ. 10.5 కోట్లతో రిజర్వాయతో పాటు 45 కిలోమీటర్ల మేర గోదావరి పైపు లైన్లు, నీటి సరఫరాకు అంతర్గత పైపులైన్లు వేశారు. ఈ కార్యక్రమంలో అధికారులు హెచ్ఎండబ్ల్యూ ఎస్ఎస్‌బీ జనరల్ మేనేజర్ అశోక్ కుమార్, డీజీఎం డీ.వీ త్రినాథ్ రావు, మేనేజర్ రవీందర్, బూర్గుబావి హనుమంత్ రావు, బూర్గుబావి సత్యనారాయణ, మాజీ ఎంపీపీ కవిత, కాలనీ వాసులు పాల్గొన్నారు.

భట్రాజు సంఘం రాష్ట్ర అధికార ప్రతినిధిగా బొల్లెపల్లి సీతారామరాజు



నవతెలంగాణ-జగద్గిరిగుట్ట

భట్రాజు సంఘం తెలంగాణ రాష్ట్ర అధికార ప్రతినిధిగా కుత్బుల్లాపూర్ నియోజకవర్గం నిజాంపేట ప్రాంతానికి చెందిన (బిజెపి మేడ్చల్ జిల్లా అధికార ప్రతినిధి)బొల్లేపల్లి సీతారామరాజు నియమితులయ్యారు. ఈ మేరకు కూకట్‌పల్లి సమీపంలోని ఆల్విన్ కాలనీలో గల శ్రీ సాయి ఫంక్షన్ హాల్‌లో ఏర్పాటు చేసిన రాష్ట్ర రెండవ మహాసభతో పాటు భట్రాజు సంఘం ఆత్మీయ సమ్మేళన కార్యక్రమంలో రాష్ట్ర అధ్యక్షులు దేవరాజు విష్ణువర్ధన్ రాజు, ప్రధాన కార్యదర్శి ప్రతికంతం పూర్ణచందర్ రాజుల అధ్యక్షతన జరిగిన రెండవ కార్యవర్గ సమావేశంలో కార్యవర్గం ఏకగ్రీవ ఆమోదంతో సీతారామరాజును ఎన్నుకుంటున్నట్లు ఆయన ప్రకటించారు. సందర్భంగా వారు మాట్లాడుతూ తమ సంఘ అభ్యున్నతి కోసం నిరంత రం పాటుపడుతున్న సీతారామరాజు భవిష్యత్తులో రాజకీయంగా, సామాజికంగా, సంఘపరంగా ఎంతో ఎదిగి ఉన్నత పదవులు పొందాలని ఆకాంక్షిం చారు. బొల్లెపల్లి సీతారామరాజు మాట్లాడుతూ గత కొన్నేండ్లుగా సంఘానికి సైనికుడిలా పనిచేస్తున్నందుకు తన సేవలను గుర్తించినందుకు కృతజ్ఞతలు తెలిపారు.

"తోప్ ఫుడ్ బండి" ని ప్రారంభించిన చెరుకుపల్లి భరత సింహారెడ్డి



నవతెలంగాణ-కుత్బుల్లాపూర్

కుత్బుల్లాపూర్ నియోజకవర్గం , 132 జీడిమెట్ల డివిజన్ పరిధిలో పైప్ లైన్ రోడ్డులో కె. పెద్ది రాజు నూతనంగా ఏర్పాటు చేసిన "తోప్ ఫుడ్ బండి" ని బీజేపీ మేడ్చల్ అర్బన్ జిల్లా కార్యదర్శి చెరుకుపల్లి భరత్ సింహ రెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొని ప్రారంభించారు. శుచి, శుభ్రత, నాణ్యత పాటిస్తూ వినియోగదారులకు మంచి సేవలు అందిస్తూ వారి మన్ననలు పొందాలని, వినియోగదారుల అభిరుచికి తగ్గట్టు నడుచుకోవాలని తెలిపారు. యువత ఉద్యోగుల మీదనే ఆధారపడకుండా తమ మనసుకు నచ్చిన రంగాన్ని ఎంచుకొని వాటిలో ప్రావీణ్యం సాధించి, స్వయం కృషితో ఎదగాలని మంచి భవిష్యత్తును నిర్మించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఫణి, సాయి కుమార్, శరత్ కుమార్, చక్రి, నార్లకంటి నరసింహ, సందీప్ గౌడ్, మహేష్ పాల్గొన్నారు.

బీఆర్ఎస్‌తోనే అభివృద్ధి సాధ్యం



- ఎమ్మెల్యే కేపీ వివేకానంద్

నవతెలంగాణ-కుత్బుల్లాపూర్

కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే కేపీ వివేకానంద్ శనివారం ముఖ్య అతిథిగా పాల్గొని పలు అభివృద్ధి కార్యక్రమాలకు నిర్మాణ పనులకు, ప్రారంభోత్సవాలు, శంకుస్థాపనలు చేశారు. 130 సుభాష్ నగర్ డివిజన్, పరిధిలోని వెంకట సాయి అవెన్యూ లో రూ. 9.5 లక్షలతో చేపట్టనున్న సి.సి. రోడ్డు నిర్మాణ పనులకు, వేంకటాద్రి నగర్‌లో రూ.20 లక్షలతో సి.సి. రోడ్డు నిర్మాణ పనులకు, 132 జీడిమెట్ల డివిజన్ పరిధిలోని మీనాక్షి ఎస్టేట్‌లో రూ. 70 లక్షలతో ఇండోర్ స్టేడియం, జైరాం నగర్‌లో రూ.96 లక్షలతో భూగర్భ డ్రయినేజీ, సి.సి. రోడ్డు నిర్మాణ పనులకు, వినాయక్ నగర్ కాలనీలో రూ. 35 లక్షలతో చేపట్టనున్న భూగర్భ డ్రయినేజీ నిర్మాణ పనులకు ఎమ్మెల్యే శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రజా సమస్యలను శాశ్వతంగా అధిగమించడమే లక్ష్యంగా పనిచేస్తున్నామన్నారు. గత ప్రభుత్వాల హయాంలో పట్టించుకోని అనేక బస్తీలు, కాలనీలలో అభివృద్ధి కార్యక్రమాలను ప్రత్యేక దృష్టి వహించి కోట్ల రూపాయల నిధులను వెచ్చిస్తూ ప్రజలకు ఇచ్చిన హామీ మేరకు పూర్తి చేస్తున్నామని చెప్పారు. బీఆర్ఎస్ హయాంలో ప్రతి కాలనీ, బస్తీ రూపురేఖలు మారుతున్నాయన్నారు. ఈ కార్యక్రమ ంలో ప్రజా ప్రతినిధులు, మాజీ ప్రజా ప్రతినిధులు, బీఆర్ఎ స్ పార్టీ సీనియర్ నాయకులు, డివిజన్ అధ్యక్షులు, కాలనీ సంక్షేమ సంఘ నాయకులు, కాలనీ వాసులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులకు కార్పొరేటర్ శంకుస్థాపన



నవతెలంగాణ-కుత్బుల్లాపూర్

కుత్బుల్లాపూర్ నియోజక వర్గం, జీడిమెట్ల 132 డివిజన్ లో రూ.2.30 కోట్ల అంచనా వ్యయంతో భూగర్భ డ్రయినేజీ, పార్క్, బ్యాడ్మింటన్ కోర్ట్ నిర్మాణ పనులకు సోమవారం కార్పొరేటర్ చెరుకుపల్లి తార చంద్ర రెడ్డి శంకుస్థాపన చేశారు.అందులో భాగంగా డివిజన్ పరిధిలోని జైరాం నగర్‌లో రూ.80 లక్షలతో చేపట్టనున్న భూగర్భ డ్రయినేజీ నిర్మాణ పనులకు మరియు రూ.16 లక్షలతో సీసీ రోడ్డు పనులకు, వినాయక్ నగర్‌లో రూ.35 లక్షలతో భూగర్భ డ్రయినేజీ నిర్మాణ పనులకు, మీనాక్షి ఎస్టేట్స్‌లో రూ.70 లక్షలతో బ్యాడ్మింటన్ కోర్ట్ పనులకు, వెన్నెలగడ్డలో రూ.20 లక్షలతో భూగర్భ డ్రయినేజీ పనులకు పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. అనంతరం రుక్మిని ఎస్టేట్స్‌లో రూ.9 లక్షలతో డెవలప్మెంట్ చేసిన పార్క్‌ని రిబ్బన్ కట్ చేసి కార్పొరేటర్ తార చంద్రా రెడ్డి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ మేడ్చల్ అర్బన్ జిల్లా కార్యదర్శి చెరుకుపల్లి భరత్ సింహ రెడ్డి, మేడ్చల్ అర్బన్ జిల్లా కిసాన్ మోర్చా ఉపాధ్యక్షులు కోర్మిల్లా సంజీవ్ రెడ్డి, జ్ఞానేశ్వర్,ఝాన్సీ, నార్లకంటి నరసింహ, శంకర్ , లక్ష్మణ్ గౌడ్, మల్లేష్ యాదవ్ శ్రీనివాస్ రెడ్డి,నందు గౌడ్, స్థానికులు తదితరులు పాల్గొన్నారు.



ఖైరతాబాద్ నియోజకవర్గం వెంకటేశ్వర కాలనీ డివిజన్ రోడ్ నెంబర్ 3 లేబర్ అడ్డా దగ్గర మన్యవర్ కాన్షీరాం 17వర్ధంతి కార్యక్రమాన్ని దోరపల్లి రమేష్ ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించారు. కార్యక్రమంలో డివిజన్ ప్రధానకార్యదర్శి ప్రవీణ్ కుమార్, బంజారాహిల్స్ డివిజన్ ఉపాధ్యక్షులు విష్ణుమూర్తి, అరిఫ్ భాయ్, మనోజ్ శేకర్, బీఎస్పీ నాయకులు, కార్యకర్తలు నివాళులు అర్పించి వారి త్యాగలను కొనియాడారు. నవతెలంగాణ-బంజారాహిల్స్

గుర్తు తెలియని వ్యక్తి మృతి



నవతెలంగాణ -సుల్తాన్‌బజార్

గుర్తు తెలియని మృతదేహాన్ని నాంపల్లి రైల్వే పోలీసులు సోమవారం గుర్తించారు. నాంపల్లి రైల్వే పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... ఆదివారం ఉదయం హుస్సేన్ సాగర్ జంక్షన్- బేగంపేట్ రైల్వే స్టేషన్ల మధ్య రైలు పట్టాలపై గుర్తుతెలియని యువకుడు మృతి చెంది పడి ఉండటంతో రైల్వే పోలీసులు గుర్తించారు. అయితే మృతుడి వివరాలు తెలియరాలేదు. రైలు తగలడంతోనే గాయాలై మృతిచెంది ఉంటాడని భావిస్తున్నారు. మృతదేహాన్ని ఉస్మానియా మార్చురీకి తరలించారు. వయసు 30- 35 ఏళ్ల మధ్య ఉంటుంది.

డబుల్ బెడ్ రూమ్ ఇండ్ల కేటాయింపు అవకతవకలపై న్యాయ విచారణ జరిపించాలి



- లంచం ఇచ్చిన వారికే ఇండ్లు
- ఎన్.వీ.ఎస్.ఎస్ ప్రభాకర్

నవతెలంగాణ-ఉప్పల్

ఉప్పల్ నియోజకవర్గంలోని డబల్ బెడ్ రూమ్ ఇండ్ల కేటాయింపులలో అకతవకలు జరిగాయని దానిపై న్యాయ విచారణ జరిపించాలని డిమాండ్ చేస్తూ బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షులు మాజీ ఎమ్మెల్యే ఎన్.వీ.ఎస్.ఎస్ ప్రభాకర్ ఆధ్వర్యంలో సోమవారం రామంతాపూర్ ప్రధాన రహదారిపై రాస్తారోకో నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రభాకర్ మాట్లాడుతూ.. ఉప్పల్ నియోజకవర్గంలో డబల్ బెడ్ రూమ్ కేటాయింపులు లంచాలు ఇచ్చిన వారికి మాత్రమే డబల్ బెడ్ రూమ్ ఇండ్లు కేటాయించారని పేర్కొన్నారు. బీఆర్ఎస్ నాయకులు పెద్ద మొత్తంలో లంచాలు తీసుకుని తమ నచ్చిన వారికి కేటాయింపులు జరిగేలా అధికారులపై ఒత్తిడి తీసుకొచ్చి డబుల్ బెడ్ రూమ్ కేటాయించారని ఆరోపించారు. బీజేపీ ఆధ్వర్యంలో బీఆర్ఎస్ అవినీతిపై ఇంటింటికి తిరుగుతూ వివరిస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో రామంతాపూర్ కార్పొరేటర్ బండారు శ్రీవాణి, హబ్సిగూడ కార్పొరేటర్ చేతన, బీజేపీ నాయకులు పాల్గొన్నారు.

ఆత్మీయ సమ్మేళనాలు రోగికి ఆత్మస్థైర్యాన్ని పెంచుతాయి



- కేర్ గ్రూప్ ఆఫ్ హాస్పిటల్స్

నవతెలంగాణ-బంజారాహిల్స్

కేర్ ఆసుపత్రి హైటెక్ సిటీలో వైద్య చికిత్స పొందిన రోగులతో ఆత్మీయ సమ్మేళనం (కేర్ కనెక్ట్) కార్యక్రమాన్ని కేర్ గ్రూప్ ఆఫ్ హాస్పిటల్స్ మల్టీ స్పెషాలిటీ ఆసుపత్రి లో వైద్య చికిత్స పొందిన రోగుల కోసం 'కేర్ కనెక్ట్' పేరిట వినూత్న కార్యక్రమం చేపట్టింది.ఇందులో భాగంగా వైద్యులు,రోగుల మధ్య స్నేహపూరిత,అనుబంధ వాతావరణం పెంపొందించడంతోపాటు వారిలో మనోధైర్యాన్ని కల్పించే లక్ష్యంతో ఏర్పాటు చేశామని కృషి చేస్తుందనీ కేర్ ఆస్పత్రి విభాగధిపతి హెచ్ సి ఓ ఓ సుమిత్ అగర్వాల్ అన్నారు. సోమవారం వైద్య చికిత్స పొందిన రోగుల ఆత్మీయ సమ్మేళనన్ని హైటెక్ సిటీలో మూత్రపిండాలు,ఆర్థోపెడిక్, కాన్సర్,ఇతర వ్యాధి గ్రస్తుల చికిత్స పొందిన రోగులు, వారి కుటుంబ సభ్యులు,వారికి వైద్యం అందించిన వైద్యులు,వైద్య సిబ్బంది పాల్గొనీ ఫ్లాకార్డ్ ప్రదర్శిస్తూ మీకు ఎల్లవేళలా అండగా ఉంటూ మెరుగైన వైద్య సేవలు అందించేందుకు కృషి చేస్తామని మద్దతు తెలిపారు. తొలుత కేర్ ఆస్పత్రి ఆతిథ్య రోగుల సంరక్షణ విభాగం గ్రూప్ ఉపాధ్యక్షులు విజయ్ సేథి మాట్లాడుతూ... రోగుల్లో మనోనిబ్బరం,శరీర ఆరోగ్యం మానసిక దృఢత్వం మెరుగుదలే ముఖ్య లక్ష్యంగా కేర్ కనెక్ట్ కార్యక్రమం చేపట్టామన్నారు. వివిధ రకాల వైద్య చికిత్సలు పొందిన రోగుల చికిత్సల అనంతర జీవన ప్రయాణంలో రోగి ఆరోగ్యంలో మెరుగుదల, కుటుంబ సభ్యుల సహకారం,సమాజంలో జీవనశైలి విధానాలను వివరించారు.వైద్యులు, వైద్య సిబ్బందితో రోగుల సమ్మేళనం వల్ల వారిలో మరింత ఉత్సాహం కలుగుతుందని,ఆరోగ్యంలో ఎదురయ్యే సవాళ్లను అధిగమించవచ్చని అభిప్రాయపడ్డారు. అసిపత్రి సి ఓ ఓ,సుమిత్ అగర్వాల్ మాట్లాడుతూ...ఈ కార్యక్రమం యొక్క ఉద్దేశం రోగి వెంట ఉండే సంరక్షకులు,వైద్యుల మధ్య అవగాహన కల్పించడం కోసం చేస్తున్న కృషి అన్నారు. రోగి ఆరోగ్యం విషయంలో నిరంతర సంరక్షణ అందించేందుకు దోహదం చేస్తుందని అభిప్రాయన్ని తెలిపారు. ఈ సందర్భంగా పలువురు వైద్య చికిత్సలు చేయించుకున్న రోగులు మాట్లాడుతూ... తమ అనుభవాలను వివరించారు.ఆశావాహ సానుకూల దృక్పథంతో ఎలా జీవనం సాగిస్తున్నారో తెలియజేస్తూ జీవితం పట్ల ఏర్పరచుకున్న నూతన అనుభూతిని వెల్లడించారు. ఈ కార్యక్రమంలో కేర్ ఆస్పత్రి మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ నవీన్ చాంద్,డాక్టర్ రంగనాథ్,నెఫ్రోలోజిస్ట్,డాక్టర్ జూనం మోహన్,డాక్టర్ రత్నాకర్ రావు,ఆర్థోపెడిక్ సర్జన్,డాక్టర్ కీర్తి కర్థం, సైకియాట్రిస్టు,డాక్టర్ గీత నాగశ్రీ ,సర్జికల్ అంకాలజిస్ట్, డాక్టర్ అపర్ణ శర్మ ,వైద్యులు,వైద్య సిబ్బంది, వైద్యఅం పొందిన రోగులు పాల్గొన్నారు.

ఎన్నికల ప్రవర్తనా నియమావళిని కట్టుదిట్టంగా అమలు చేయాలి



- రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి వికాస్ రాజ్

నవతెలంగాణ-సిటీబ్యూరో

ఎన్నికల కార్యాచరణ విడుదలైనందున ఎన్నికల నియామవళిని ఖచ్చితంగా అమలు చేయాలని రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి వికాస్రాజ్ అన్నారు. సోమవారం హైదరాబాద్ నుంచి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ఇతర ఎన్నికల ఉన్నతాధికారులతో అన్ని జిల్లాల కలెక్టర్లు, అదనపు కలెక్టర్లు, పోలీసు శాఖ అధికారులు, శాసనసభ రిటర్నింగ్ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి మాట్లాడుతూ సోమవారం భారత ఎన్నికల సంఘం ఎన్నికల కార్యచరణ విడుదల చేసిన కారణంగా ఎన్నికల నియమావలళిని ఖచ్చితంగా పాటించేలా అధికారులు చర్యలు చేపట్టాలని ఆదేశించారు. ఈ వీడియో సమావేశంలో జిల్లా కలెక్టర్ అమోయ్‌కుమార్, జిల్లా అదనపు కలెక్టర్లు విజయేందర్‌రెడ్డి, అభిషేక్ అగస్త్య, జిల్లా రెవెన్యూ అధికారిణి హరిప్రియ, నోడల్ అధికారులు, ఎన్నికల అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

మెస్ రెన్యూవల్స్ కోసం విద్యార్థుల రాస్తారోకో



నవతెలంగాణ-ఓయూ

హాస్టల్ మెస్ బకాయిలు మరియు స్కాలర్‌షిప్‌ల కోసం పీజీ సోమవారం పీజీ రెండవ సంవత్సరం విద్యార్థులు ఓయూ లేడీస్ హాస్టల్ ఎదుట ప్రధాన రహదారిపై రాస్తారోకో నిర్వహించారు.విద్యార్థులకు స్కాలర్‌షిప్ మంజూరు చేయబడలేదు, అయితే గ్రామీణ నేపథ్యం నుండి చాలా మంది విద్యార్థులు ఓయూకి రావడం ఓయూలో ఉన్నత చదువులు చదివే మొదటి తరం ఉన్నందున విద్యార్థులకు చెల్లించాల్సిన భారం అయిన పూర్తి ఫీజు చెల్లించాలని అధికారులు మమ్మల్ని అడుగుతున్నారని, ఈ అధిక బకాయిలు తమ విద్యను ప్రభావితం చేస్తుంది ప్రతి ఒక్క విద్యార్థి కి 3 వేల రూపాయల తో రెన్యువల్ ఇవ్వాలని, ఆలూమినాక్ ప్రకారం అన్ని నెలల స్కాలర్షిప్ విడుదల చేయాలని, పెండింగ్లో ఉన్న స్కాలర్షిప్ లను వెంటనే విడుదల చెయ్యాలని కోరారు. మైనారిటీ విద్యార్థుల స్కాలర్షిప్ సమస్య పరిష్కారం చేయాలని, విద్యార్థులకు రెగ్యులర్ విద్యార్థులాగ సమాన రుసుము తీసుకోవాలని, ట్యూషన్ ఫీజులు అన్ని కోర్సుల్లో చివర్లో కట్టించుకోవాలని విద్యార్థులు డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా రాస్తారోకో చేస్తున్న విద్యార్థులను ఓయూ పోలీసులు అరెస్ట్ చేసి పోలీసు స్టేషన్‌కి తరలించారు. కార్యక్రమంలో ఓయూ పీజీ ద్వితీయ సంవత్సరం విద్యార్థులు పాల్గొన్నారు.

బీసీని సీఎం చేయడమే కాన్షీరాంకు నిజమైన నివాళి



- తెలంగాణ బీసీ ముఖ్యమంత్రి సాధన సమితి చైర్మెన్ గాలి వినోద్ కుమార్

నవతెలంగాణ-ఓయూ

ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ తెలంగాణలోనూ 52శాతం ఉన్న బీసీలు ఇంతవరకు ముఖ్యమంత్రి పదవి పొందలేదని 2023లో బీసీని ముఖ్యమంత్రి చేయడమే కాన్షీరామ్ కు మనమందించే నిజమైన నివాళి అని తెలంగాణ బీసీ ముఖ్యమంత్రి సాధన సమితి చైర్మన్ ప్రొ. గాలి వినోద్ కుమార్ అన్నారు. సోమవారం తన కార్యాలయంలో మాన్యశ్రీ కాన్షిరాం 17వ వర్ధంతి సందర్భంగా ప్రొఫెసర్ అన్వర్ ఖాన్ తెలంగాణ హైకోర్టు న్యాయవాది పోలేపాక చంద్రకళ, ఓయూ ఉర్దూ పరిశోధక విద్యార్థి డాక్టర్ రఫీ తదితరులతో కలిసి కాన్సిరాం చిత్రపటానికి నివాళి అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ. అన్ని పార్టీలు బీసీలకు ముఖ్యమంత్రితో పాటు కనీసం 40 సీట్లు ఇవ్వాలని అందులో 20 సీట్లు మహిళలకు ఇవ్వాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా తెలంగాణ బీసీ ముఖ్యమంత్రి సాధన సమితి కో కన్వీనర్ ప్రొ. అన్వర్ ఖాన్ మాట్లాడుతూ. ఎవరి జనాభా ఎంతో వారికి అంత వాటా అన్ని రంగాల్లో దక్కాలని కన్షీరామ్ కోరుకున్నారని ఆయన ఆశయం తెలంగాణలోని నెరవేరాలంటే సామాజిక న్యాయం పునాదిగా అన్ని రాజకీయ పార్టీలు అన్ని రంగాల్లో వారి జనాభా ఆధారంగా అవకాశాలు కల్పించాలని కోరారు. కోకన్వీనర్ పోలేపాక చంద్రకళ మాట్లాడుతూ. మహిళలకు పురుషులతో సమానంగా అన్ని రంగాల్లో సమాన అవకాశాలు రావాలని ముఖ్యంగా రాజకీయ రంగంలో దాన్ని సాధించడమే కాన్సిరాం మాయావతిని ముఖ్యమంత్రి చేయడం ద్వారా నిరూపిం చారని ఆయన స్ఫూర్తితో మహిళలు రాజకీయ రంగంలో రాణించాలని ఆమె పిలుపు ఇచ్చారు. ఈ కార్యక్రమంలో పరిశోధ క విద్యార్థులు డాక్టర్ రఫీ డాక్టర్ శివ పాల్గొన్నారు.

కాన్షీరామ్ భారతదేశ రాజనీతి పితామహుడు

భారతదేశ రాజనీతి పితామహులు బహుజన్ సమాజ్ పార్టీ వ్యవస్థాపకులు మాన్యశ్రీ కాన్షీరాం అని బీఎస్ఎఫ్ రాష్ట్ర కన్వీనర్ బోరెల్లి సురేష్ అన్నారు. అణగారిన వర్గాలకు రాజ్యాధికార రుచి చూపిన మహోన్నతమైన వ్యక్తిని గుర్తు చేసుకోవడం సంతోషకరమైన విషయమని అన్నారు. సోమవారం ఓయూ ఆర్ట్స్ కాలేజ్ ఎదుట ఓయూ ఇన్‌చార్జి కల్వకుర్తి శ్రీశైలం ఆధ్వర్యం లో నిర్వహించిన కాన్షీరామ్ వర్ధంతి కార్యక్ర మానికి ముఖ్య అతిథులుగా విచ్చేసిన బోరెల్లి సురేష్ మాట్లాడుతూ. ఈ దేశంలోని 90 శాతం ఉన్న ఎస్సీ ,ఎస్టీ బీసీ, మైనారిటీ, అగ్రవర్ణంలోని పేదలకు రాజ్యాధికార రుచి చూపించి, వారిని ఆత్మగౌరవంతో చట్టసభల కు పంపిన మహోన్నతమైన వ్యక్తి మాన్యశ్రీ కాన్షీరామ్ అని అన్నారు. భావితరాలకు మాన్యశ్రీ కాన్షిరాం ఒక మార్గ నిర్దేశకులు అని అన్నారు. కేంద్ర ప్రభుత్వం మాన్యశ్రీ కాన్సిరాం కి భారతరత్న ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఓయూ జేఏసీ నాయకులు సొంపంగి అఖిల్, బీఎస్ ఎఫ్ ఓయూ నాయకులు శ్రీకాంత్, ప్రసాద్ , బాలస్వామి, సైదులు, మూర్తి, మధు, సాయి యాదవ్ , ప్రభాకర్, వెంకటేష్ శరత్ ,రేవంత్ పాల్గొన్నారు.



అన్నిరంగాలతోనే పరిపూర్ణ సమాజం



- హర్యానా గవర్నర్ బండారు దత్తాత్రేయ

నవతెలంగాణ-బంజారాహిల్స్

రాజకీయం అంటే కేవలం పరిపాలన మాత్రమే అని మిగతా అన్ని రంగాలు కలిస్తేనే పరిపూర్ణ సమాజంగా పరిగణించబడుతుందని హర్యానా గవర్నర్ బండారు దత్తాత్రేయ తెలిపారు. ఈ మేరకు సోమవారం సోమాజిగూడ ప్రెస్ క్లబ్లో జరిగిన ప్రజా డైరీ 23 వ వార్షికోత్సవ కార్యక్రమనికి హజరైన ఆయన సమాజంలో పలు రంగాలలో ప్రముఖ పాత్ర పోషిస్తున్న వారికి అవార్డులను ప్రధానం చేస్తూ బ్రోచర్ విడుదల చేసి మాట్లాడారు... ప్రజల నుండి వసూలు చేసిన పన్నులతోనే పరిపాలన సాగిస్తున్నామని పాలకులు తెలుసుకోవాలి అన్నారు. ప్రధాని నూతన విద్యావిధానం అమలులోకి తేవడం వలన మాతృ భాష ప్రాముఖ్యత పెరిగిందని, తాను ఒకసారి అంతర్జాతీయ వేదికపై ప్రసంగించాల్సి వచ్చినప్పుడు హిందీలోనే మాట్లాడిన విషయాన్ని గుర్తు చేశారు.ప్రజాహితం కోరే వారిని, సమాజ అభివృద్ధికి పాటుపడే వారిని ప్రజాడైరీ పత్రిక సన్మానించడం సంతోషకరం అన్నారు. ఈ సందర్భంగా ఆయన ప్రజా డైరీ సంపాదకుడు వి. సురేష్తో కలిసి ఎంటర్ టైన్ రంగంలో ప్రముఖుడిగా పేరు పొందిన రాజు ఎంటర్ టైన్మెంట్ ఈవెంట్స్ డేవిడ్ రాజు, సినీ నటుడు శివాజీ రాజా, చంద్రకాంత్, ఉప్పల శ్రీనివాస్ గుప్తా, సోలార్ సైంటిస్ట్ రమేష్ తదితరులను ఘనంగా సన్మానించారు.

ఆర్ట్స్ కళాశాలకు ర్యాంపులు ఏర్పాటు చేయండి

- ఇబ్బందులు ఎదుర్కొంటున్న వికలాంగులు

నవతెలంగాణ-ఓయూ

"వికలాంగుల హక్కుల చట్టం 2016" ప్రకారం విశ్వవిద్యాలయాల ఆర్ట్స్ కళాశాల తరగతులకు వెళ్లటానికి వికలాంగులకు అనుకూలంగా ర్యాంపులు, లిఫ్టు ఏర్పాటు చేయాలని ఓయూ ఆర్ట్స్ కళాశాల వికలాంగులు కోరుతున్నారు. చట్టం అమలులోకి వచ్చి ఏడు ఏండ్లు గడిచినా ప్రభుత్వం, ఓయూ అధికారులు దృష్టి సారించక పోవడంతో ఎంతో మంది వికలంగ విద్యార్థులు చదువుకు దూరం అవుతున్నారు. తరగతులకు వెళ్లాలంటే అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఓయూలో వికలాంగులు క్లాస్ రూమ్‌లోకి వెళ్లడానికి అవస్థలు పడాల్సి వస్తుందంటే ప్రభుత్వం ఎలాంటి సౌకర్యాలు కల్పిస్తుందో అర్థమవుతుందని విద్యార్థులు ఆవేదన వ్యక్తం చేశారు. ఉస్మానియా యూనివర్సిలో జి.పిహెచ్ఐ విద్యార్థులు ఆర్ట్స్ కళాశాలలోని క్లాస్ రూమ్‌కు వెళ్లడానికి ఎన్నో అవస్థలు పడాల్సి వస్తుంది. లిఫ్ట్ ఏర్పాటు చేయమని విద్యార్థులు అధికారులకు తమ బాధలు విన్నవించుకున్న పట్టించుకోకుండా ఆర్ట్స్ కళాశాల హెరిటేజ్ బిల్డింగ్ లిఫ్ట్ ఏర్పాటు చేయడం కుదరదు అని చెప్తున్నారే తప్ప విద్యార్థుల సమస్యలను పరిష్కరించటం లేదు. ప్రపంచ వింతల్లో ఒకటైన తాజ్మహాల్ లాంటి హెరిటేజ్ బిల్డింగ్ దివ్యాంగులకు అనుకూలంగా లిఫ్ట్ ఏర్పాటు చేసినప్పుడు యూనివర్సిటిలోని పలు బిల్డింగ్స్ లిఫ్ట్ ఏర్పాటు చేయలేదా, నూతన టెక్నాలజీని ఉపయోగించి ఆర్ట్స్ కళాశాలకు లిఫ్ట్ ఏర్పాటు చేయవచ్చు కాని దివ్యాంగుల పట్ల చిన్న చూపుతో అధికారులు పట్టించుకోవడం లేదు. దీంతో ఎంతో మంది దివ్యాంగ విద్యార్థులు ఉన్నత విద్యకు దూరం అవుతున్నారు. ఇకనైన యూనివర్సిటి అధికారులు మేల్కొని ఉస్మానియా యూనివర్సిటిలోని అన్ని కళాశాలలకు లిఫ్ట్ ఏర్పాటు చేయాలని దివ్యాంగ విద్యార్థులు అభ్యర్థిస్తున్నారు.

టీఎస్ సెట్‌ను వాయిదా వేయాలని ఓయూ రిజిస్ట్రార్‌కు వినతిపత్రం అందజేత



నవతెలంగాణ-ఓయూ

విద్యార్థులు ఎన్నో ఏళ్లుగా ప్రిపేర్ అవుతున్న గ్రూప్ 2 పరీక్ష నవంబర్ మొదటి వారం లో జరగబోతుంది, టీఎస్ సెట్ ఇటీవల విడుదల చేసిన ప్రకటనలో పరీక్షలను అక్టోబర్ చివరి వారం లో నిర్వహిస్తామని ప్రకటించింది, చాలా మంది ఆశావాహులకి ఇది ఇబ్బందిని కలుగచేస్తుందని సుదీర్ఘ కాలం నుండి పోటీ పరీక్షల కోసం సిద్ధం అవుతున్న విద్యార్థులకు ఒకే సమయంలో సెట్ కి సన్నద్ధం అవడం కష్టతరమైన పని అని సెట్ వాయిదా కై సోమవారం ఓయూ రిజిస్ట్రార్ ప్రో.లక్ష్మీ నారాయణ కు వినతిపత్రం అందజేశారు. విద్యార్థుల సమస్యలను దృష్టిలో పెట్టుకొని వారు కూడా సానుకూలంగా స్పందించడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో రవి నాయక్, ఆంజనే యులు, శ్రీను, సత్యనెల్లి, అఖిల్, మెడ శ్రీను,వికాస్ విద్యార్థులు జయప్రకాష్, రాములు పాల్గొన్నారు.

విద్యార్థుల హాస్టల్ సమస్యలు పరిష్కరించండి



- ఎస్సీ స్టూడెంట్స్ హాస్టల్ ఆర్గనైజేషన్

నవతెలంగాణ-బంజారాహిల్స్

ఎస్సీ హాస్టళ్లలో పేరుకుపోయిన సమస్యలపై ప్రభుత్వం దృష్టి సారించట్లేదని ఎస్సీ స్టూడెంట్స్ హాస్టల్ ఆర్గనైజేషన్ రాష్ట్ర అధ్యక్షుడు ఎం.కుమార్ తెలిపారు.ఈ మేరకు సోమాజిగూడ ప్రెస్ క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ...కనీసం డైట్ చార్జీలకు సంబంధించిన జి ఒ ను కూడా ప్రభుత్వం ఇప్పటికి విడుదల చేయలేదని, కాచిగూడలో హాస్టల్ ఓపెన్ చేయాలని, ఒక సొంత భవనం కేటాయించాలని డిమాండ్ చేశారు. ఎన్నికలు సమీపిస్తున్నందున కనీసం రానున్న ప్రభుత్వం అయినా తమ సమస్యలు పరిష్కరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఆయన తో పాటు మల్లేష్, లక్ష్మయ్య తదితరులు పాల్గొన్నారు.

పేద ప్రజల కోసం ఏసీ ఫంక్షన్ హాల్



నవతెలంగాణ - జూబ్లీహిల్స్

పెదల కోసం ఏసీ ఫంక్షన్ హాల్ ను కట్టించామని ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్ అన్నారు. రత్నత నగర్ డివిజన్ ,హెచ్ఎఫ్ నగర్‌లో రూ.3 కోట్ల 25 లక్షలతో అధునాతన ఏసీ కన్వెన్షన్ హాల్‌ను సోమవారం జూబ్లీహిల్స్ ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్ ప్రారంభించారు. అనంతరం మాట్లాడుతూ. పేదల కోసం ఏసీ ఫంక్షన్ హాల్ ను కట్టించామన్నారు. ఫంక్షన్‌హాల్‌ను అన్నీ రకాల శుభకార్యముల కు ఉచితంగా అహ్మత్ నగర్ డివిజన్ ప్రజలు వాడుకోవచ్చని తెలిపారు. హైదరాబాద్ సిటీలో ఇంత పెద్ద ఫంక్షన్ హాల్స్ ఏ ప్రభుత్వమూ పేదల కోసం కట్టించలేదన్నారు. వచ్చే ఎలక్షన్స్‌లో కేసీఆర్ ను దీవించి హ్యాట్రిక్ విజయ డంక మొగించాలని కోరారు. కార్యక్రమంలో స్థానిక కార్పొరేటర్ సిఎన్.రెడ్డి ,డివిజన్ నాయకులు నజీర్, ఫయాజ్, జాఫర్, నాగరాజు,రాకేష్, అహ్మద్, అరుణ్, సురేందర్, బషీర్ రాజు,చోటూ, సింగరి శ్రీనివాస్, మన్సూర్, లింగం, విలియమ్స్, గోపీచంద్,జబ్బార్, హైదర్ అలీ, ఖాజా అలీ, ఘనీ, వాజీద్, రాకేష్, నవీన్, ధనుజ, తధితరులు పాల్గొన్నారు.

'ఎలాంటి జాప్యం చేయకుండా పంట రుణమాఫీ చేయాలి'



- తెలంగాణ రాష్ట్ర రైతు సంఘం ప్రధాన కార్యదర్శి పశ్య పద్మ
- బషీర్‌బాగ్‌లోని వ్యవసాయ శాఖ కమిషనర్ కార్యాలయం ఎదుట ధర్నా
- అడ్డుకున్న పోలీసులు, తీవ్ర వాగ్వాదం

నవతెలంగాణ-హిమాయత్ నగర్

ఎలాంటి జాప్యం చేయకుండా రైతులకు పంట రుణమాఫీ అమలు చేయాలని తెలంగాణ రాష్ట్ర రైతు సంఘం ప్రధాన కార్యదర్శి పశ్య పద్మ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.ఈ మేరకు సోమవారం బషీర్ బాగ్ లోని వ్యవసాయ శాఖ కమీషనర్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు.దీంతో సంఘం నాయకులను పోలీసులు అడ్డుకుని అరెస్టు చేయడానికి ప్రయత్నించగా, తీవ్ర వాగ్వాదం జరిగింది.శాంతియుతంగా ధర్నా చేసి వినతి పత్రం అందజేసి వెళ్లిపోతామని రైతు సంఘం నేతలు చెప్పగా పోలీసులు శాంతించారు.ఈ సందర్భంగా పశ్య పద్మ మాట్లాడుతూ 2018 డిసెంబర్ 11 నాటికి బ్యాంకుల్లో పంట రుణాలు తీసుకున్న రైతులకు రుణమాఫీ చేస్తామని రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసి, నాలుగు విడతల్లో అమలు చేస్తామని ప్రకటించినా, కానీ ప్రభుత్వం నాలుగు విడతల్లో రుణమాఫీ చేయలేదని, నాలుగున్నర సంవత్సరాలలో రుణమాఫీ చేయడంలో రాష్ట్ర ప్రభుత్వం ఘోరంగా వైఫల్యం చెందిందని ఆమె ఆరోపించారు.రాష్ట్ర వ్యాప్తంగా రైతులు బ్యాంకుల చుట్టూ తిరుగుతున్న, ధర్నాలు చేస్తున్న ప్రభుత్వం రుణమాఫీ 45 రోజులలో చేస్తామని ప్రకటించి అమలు చేయలేదని, ప్రకటించిన గడువు పూర్తి కావడంతో రైతులు ఆందోళనకు గురవుతున్నారని చెప్పారు.సాంకేతిక కారణాల వల్ల రుణమాఫీ చేయలేకపోతున్నామని బ్యాంకు అధికారులు చెప్పడం విడ్డూరంగా ఉందన్నారు.రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఈ విషయంలో వెంటనే స్పందించి సాంకేతిక శాఖ కారణాలను తొలగించడానికి చర్యలు తీసుకుని, నిర్దిష్ట కాల వ్యవధిలో రుణమాఫీ చేయాలని డిమాండ్ చేశారు.నాలుగున్నర సంవత్సరాల కాలంలో చేసిన వాగ్దానం ప్రకారం రుణమాఫీ అమలు చేయకపోవడం వల్ల రైతులకు వడ్డీ భారం విపరీతంగా పెరిగిందన్నారు.నిర్దిష్ట కాలంలో రుణమాఫీని అమలు చేయాలని, లేని పక్షంలో ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని ఆమె హెచ్చరించారు.అనంతరం వ్యవసాయ శాఖ డిప్యూటీ కమిషనర్ విజయ్ కుమార్ కు రైతు సంఘం ప్రతినిధి బృందం వినతి పత్రం అందజేశారు.ఈ కార్యక్రమంలో రైతు సంఘం నాయకులు ముత్యాల విశ్వనాథం, గడ్డం మురళీరెడ్డి, సంధ్య, అరుణ, మాచర్ల కనకయ్య, రాజు, శనిగరపు శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

గ్లోబల్ పి.ఎస్.ఐకి ఆదిల్ షరీఫ్‌కు ఆహ్వానం..



నవతెలంగాణ-సుల్తాన్ బజార్

స్విట్జర్లాండ్ జెనీవాలో జరిగే గ్లోబల్ పబ్లిక్ సర్వీసెస్ ఇంటర్నేషనల్ సమావేశానికి మున్సిపల్ సహకార మజ్దూర్ యూనియన్ వర్కింగ్ ప్రెసిడెంట్ ఆదిల్ షరీఫ్ కు ఆహ్వానం అందిందని తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అక్టోబర్ 12 నుంచి 18 వరకు జెనీవాలో నిర్వహించే సమావేశంలో పాల్గొనాలని ఆహ్వానం అందిందని తెలిపారు. 11న బయలుదేరి వెళ్తున్నట్టు ఆయన తెలిపారు. తనకు సహకరించిన ఆల్ ఇండియా ఐఎన్టియుసి అధ్యక్షుడు మాజీ ఎంపీ డాక్టర్ జి.సంజీవ రెడ్డికి ఆయన కృతజ్ఞతలు తెలిపారు.



బీజేవైఎం గ్రేటర్ అధ్యక్షులు హైదరాబాద్ జిల్లా అధ్యక్షులు పోలే నిరంజన్ ఆధ్వర్యంలో ఎమ్మెల్యే కాలేరు వెంకటేశ్ కు మద్దతుగా ఆటో పోస్టర్ అతికించే కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ డివిజన్ అధ్యక్షులు చంద్రమోహన్ తదితర నాయకులు పాల్గొన్నారు.
నవతెలంగాణ-అంబర్‌పేట



శ్రీశైలం దేవస్థానం కార్యనిర్వాహణ అధికారిగా నూతనంగా బాధ్యతలు స్వీకరించిన శ్రీ డి. పెద్దిరాజు ను కలిసి పూల బొకే అందజేసి శుభాకాంక్షలు తెలుపుతున్న శ్రీశైలం ట్రస్ట్ బోర్డ్ మెంబర్ మల్లుగారి విజయలక్ష్మి సుబ్బారాయుడు తదితరులు పాల్గొన్నారు.
నవతెలంగాణ -సుల్తాన్ బజార్

విద్యార్థులకు రక్తహీనత పరీక్షలు



నవతెలంగాణ -సుల్తాన్ బజార్

రోహిణి ఫౌండేషన్ చైర్మెన్ డాక్టర్ సీహెచ్ సంపత్ కుమార్ రెడ్డి ఆధ్వర్యంలో ఎనేమియా ముక్త్ భారత్ కార్యక్రమంలో భాగంగా విద్యార్థుల్లో రక్తహీనత సమస్యలు తలెత్తకుండా వైద్య పరీక్షలు నిర్వహిస్తున్నామని డాక్టర్ రమేష్ చెప్పారు. సోమవారం చాదర్‌ఘాట్ భాగ్యరెడ్డి వర్మ బాలికల పాఠశాలలో విద్యార్థులకు ఉచితంగా వైద్య పరీక్షలు నిర్వహించారు ఈ సందర్భంగా విద్యార్థులకు మందులు, డెంటల్ కిట్ లు అందజేశారు ఈ కార్యక్రమంలో డాక్టర్ రమేష్, రోహిణి ఫౌండేషన్ సభ్యురాలు డాక్టర్ విమల, డాక్టర్ నిష్య, ఫార్మసి స్ట్ అలేఖ్య, కృష్ణవేణి, యు.సుధాకర్, ఉపాధ్యాయులు విద్యార్థులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్ మూడోసారి విజయం సాధించడం ఖాయం

- ధాత్రిక్ నాగేందర్ బాబ్జి



నవతెలంగాణ-అంబర్‌పేట

బీఆర్ఎస్ మూడోసారి విజయం సాధించి హ్యాట్రిక్ కొట్టడం ఖాయమని బీఆర్ఎస్ సీనియర్ నాయకులు దాత్రిక్ నాగేందర్ బాబ్జి అన్నారు. సోమవారం కాచిగూడలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ సీఎం కేసీఆర్ ఆధ్వర్యంలో రాష్ట్ర ప్రభుత్వం దేశంలో ఏ రాష్ట్రంలో లేని అనేక సంక్షేమ పథకాలు అమలు చేసిందన్నారు. దేశానికి ఆదర్శంగా నిలిచిన నాయకుడు కేసీఆర్ అని తెలిపారు.అంబర్‌పేట నియోజకవర్గంలో మరోసారి ఎమ్మెల్యే కాలేరు వెంకటేశ్ విజయం సాధించడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు.

అమల్లోకి ఎన్నికల ప్రవర్తన నియమావళి

- జిల్లా ఎన్నికల అధికారి రోనాల్డ్ రోస్
- ఎన్నికల ఏర్పాట్లపై విలేకరుల సమావేశం



నవతెలంగాణ-సిటీబ్యూరో

ఎన్నికల ప్రవర్తన నియమావళి సోమవారం నుంచి అమల్లోకి వచ్చిందని హైదరాబాద్ ఎన్నికల అధికారి, జీహెచ్ఎంసీ కమిషనర్ రోనాల్డ్ రోస్ వెల్లడించారు. ఎన్నికల షెడ్యూల్ విడుదలైన నేపథ్యంలో సోమవారం జీహెచ్ఎంసీ ప్రధాన కార్యాలయంలో హైదరాబాద్ జిల్లాలో చేసిన ఎన్నికల ఏర్పాట్లపై పోలీస్ కమిషనర్ సి.వి. ఆనంద్‌తో కలిసి ఎన్నికల అధికారి విలేకరుల సమావేశం నిర్వహించారు.

ఈ సందర్భంగా హైదరాబాద్ జిల్లా ఎన్నికల అధికారి మాట్లాడుతూ కేంద్ర ఎన్నికల సంఘం ఎన్నికల షెడ్యూల్ విడుదల చేసిన నేపథ్యంలో నవంబర్ 3వ తేదీ నుంచి సంబంధిత నియోజకవర్గాల ఆర్.ఓ లు నామినేషన్లు స్వీకరిస్తారని తెలిపారు. నామినేషన్ చివరి తేదీ నవంబర్ 10వ తేదీ, నామినేషన్ల పరిశీలన నవంబర్ 13, నామినేషన్ విత్ డ్రా నవంబర్ 15వ తేదీ, నవంబర్ 30వ తేదీన పోలింగ్ జరుగుతుందని, డిసెంబర్ 3 ఎన్నికల కౌంటింగ్, డిసెంబర్ 5వ తేదీన ఎన్నికల ప్రక్రియ ముగుస్తుందని తెలిపారు. ఈ సందర్భంగా జిల్లాలోని 15 నియోజకవర్గాల్లో సికింద్రాబాద్ కంటోన్మెంట్ ఒకటి ఎస్సీ రిజర్వ్ ఉండగా మిగతా జనరల్ ఉన్నాయని తెలిపారు.

జిల్లాలో అక్టోబర్ 4న ప్రచురించిన తుది ఓటరు జాబితా ప్రకారం మొత్తం 44,42,458 ఓటర్లు ఉండగా అందులో పురుషులు 22,79,617 ఉండగా మహిళలు 21,62,541, ఇతరులు 300 ఓటర్లు ఉన్నారని తెలిపారు. ఇందులో సర్వీస్ ఓటర్లు 404, ఎన్నారై ఓటర్లు 847, దివ్యాంగులు 24,163, వృద్ధులు 80 సం. పైబడిన ఓటర్లు 83,588 ఉన్నారు.

ఎన్నికల్లో వినియోగించే ఈ.వి.ఎం ల ఫస్ట్ లెవల్ చెకప్ పూర్తి చేసి భద్రపరచడం జరిగిందని తెలిపారు. ఈ.వి.ఎం, వీవీ ప్యాట్ పై అవగాహన కల్పించడం జరుగుతున్నది. అందుకోసం 16 నియోజకవర్గ పరిధిలో ఆయా ప్రదేశాల్లో ఈ.వి.ఎం, వి.వి ప్యాట్ ల పై ఇప్పటి వరకు 15,158 మందికి అవగాహన కల్పించామన్నారు. 15 మొబైల్ క్యాంప్ ల ద్వారా ఈ.వి.ఎం, వి.వి. ప్యాట్ లపై 28,106 మందికి విస్తృతంగా అవగాహన కార్యక్రమాలను నిర్వహించడం జరిగిందన్నారు. హైదరాబాద్ జిల్లా వ్యాప్తంగా 1,688 లొకేషన్లలో 3,986 పోలింగ్ స్టేషన్లను ఏర్పాటు చేయడం జరిగిందని తెలిపారు.

ఓటర్లకు సందేహాలు నివృత్తి చేయడానికి జీహెచ్ఎంసీ ప్రధాన కార్యాలయంలో కంట్రోల్ రూం ను ఏర్పాటు చేయడం జరిగిందని తెలిపారు. ఇందులో భారత ఎన్నికల సంఘం 1950 టోల్ ఫ్రీ నెంబర్, 1800-599-2999 నెంబర్లు 24 గంటల పాటు పనిచేస్తుందని తెలిపారు. సి-విజిల్ యాప్ ద్వారా మోడల్ కోడ్ లో ఉల్లంఘన జరిగిన సందర్భంలో ఈ సివిజిల్ ద్వారా ఫిర్యాదు వినియోగించుకోవచ్చు. సి-విజిల్ ద్వారా వచ్చిన ఫిర్యాదులను 100 నిమిషాలలో పు పరిష్కరించి అదే యాప్ లో ఉంచుతామని తెలిపారు. పొలిటికల్ పార్టీలు, పోటీలో ఉన్న అభ్యర్థులకు సువిధా సెంటర్ ద్వారా సింగిల్ విండో పర్మిషన్ ను అతి త్వరగా ఇచ్చేందుకు జీహెచ్ఎంసి ప్రధాన కార్యాలయంలో ఏర్పాటు చేసినట్టు వివరించారు. ఇందులో అన్ కంట్రోల్ ఎయిర్ ఫోర్స్, హెలీ ప్యాడ్స్, కమర్షియల్, ర్యాలీలు, లౌడ్ స్పీకర్స్, పబ్లిక్ మీటింగ్ అనుమతి తప్పనిసరి అని తెలిపారు.

ప్రింట్ అండ్ ఎలక్ట్రానిక్ మీడియా, సోషల్ మీడియా అడ్వర్టైజ్మెంట్ సర్టిఫికెట్ ముందస్తుగా ఎం.సి.ఎం.సి కమిటీ అనుమతి తీసుకోవాలని, అదేవిధంగా ప్రింటింగ్ ప్రెస్ వారు కూడా ప్రింటింగ్ చేసిన పోస్టర్లు కానీ, కరపత్రాలు కానీ ప్రచురణ కర్త, ప్రచురణ చేసిన మొత్తం, దాని బిల్లును ఎం.సి.ఎం.సి కమిటీ కి అందజేయాలని కోరారు. వీటిని ఉల్లంఘించిన వారిపై ఎన్నికల ప్రవర్తన నియమావళి అనుసరించి చర్యలు తీసుకుంటామన్నారు.

ఎన్నికల ప్రవర్తన నియమావళిని అనుసరించి డబ్బు, మద్యం, అక్రమ రవాణా నిరోధించడానికి 90 ఫ్లయింగ్ స్క్వాడ్ లను ఏర్పాటు చేశామని తెలిపారు. పొలిటికల్ పార్టీలు చేసే ర్యాలీలు, మీటింగ్ లను వీడియో గ్రఫీ చేయడానికి 15 నియోజకవర్గాలలో ఒకొక్క నియోజకవర్గానికి ఒకొక్క వీడియో సర్వైలెన్స్ టీమ్ లను ఏర్పాటు చేశామన్నారు. ఎన్నికల సందర్భంగా ఎన్నికల ప్రవర్తన నియమావళి ప్రొసీజర్‌ను అనుసరించి నడుచుకోవాలన్నారు.

పోలీస్ కమీషనర్ సి.వి.ఆనంద్ మాట్లాడుతూ... హైదరాబాద్ నగరంలో 1587 సమస్యాత్మక పోలింగ్ స్టేషన్లు గా గుర్తించడం జరిగిందని తెలిపారు. ఎన్నికల సందర్భంగా హైదరాబాద్ నగరంలో ఏర్పాటు చేసే ఇంటిగ్రేటెడ్ చెక్ పోస్టులలో జి.ఎస్.టి. కమర్షియాల్ ట్యాక్స్, జీహెచ్ఎంసీ, ఆర్టీఏ, ఎక్సైజ్, నార్కోటిక్స్ సంబంధిత అధికారులు 24 గంటల పాటు ఉంటారని అన్నారు. మద్యాన్ని అరికట్టడానికి మద్యం షాపుల వద్ద సీసీ కెమెరాలను ఏర్పాటు చేస్తామన్నారు. మనీ ట్రాన్సఫర్ వాహనాలను జి.పి.ఎస్ సిస్టమ్ అమరుస్తామని తెలిపారు. ఎక్కువ మొత్తంలో డబ్బులు తరలించేవారు సంబంధిత ధ్రువపత్రాలు చూపించాలని, అట్టి డబ్బులు దేనికి వినియోగిస్తున్నారు పూర్తి వివరాలు చూపించాలని తెలిపారు. పరిమితి మించి ఎక్కువ మొత్తంలో డబ్బులు ట్రాన్సఫర్ అయిన అకౌంట్ల ను పరిశీలించడం జరుగుతుందన్నారు. అందుకోసం ఆర్.బి.ఐ ఆయా బ్యాంకర్లతో సమావేశం ఏర్పాటు చేయడం జరుగుతుందని తెలిపారు. మరోసారి వారితో సమావేశం జరిపి ద్రవ్య నియంత్రణకు చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఓటర్లకు ఫ్రీ బిస్ ఇవ్వడం పై ప్రత్యేక దృష్టి పెడుతామని తెలిపారు. పోలీసు బందోబస్తు కోసం 32 కంపెనీల కేంద్ర బలగాలను అడిగినట్లు సి.వి ఆనంద్ తెలిపారు. ఈ సమావేశంలో హైదరాబాద్ కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి, ఈ.వి.డి.ఎం ప్రకాష్ రెడ్డి, జోనల్ కమిషనర్ వెంకటేష్ దొత్రె, అడిషనల్ కమిషనర్ శంకరయ్య, కంటోన్మెంట్ సీ.ఇ.ఓ మధుకర్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

జాప్యం చేయకుండా పంట రుణమాఫీ చేయాలి

- రాష్ట్ర రైతు సంఘం ప్రధాన కార్యదర్శి పశ్య పద్మ
- వ్యవసాయ శాఖ కమిషనర్ కార్యాలయం ఎదుట ధర్నా
- అడ్డుకున్న పోలీసులు, తీవ్ర వాగ్వాదం



నవతెలంగాణ-హిమాయత్ నగర్

ఎలాంటి జాప్యం చేయకుండా రైతులకు పంట రుణమాఫీ అమలు చేయాలని రాష్ట్ర రైతు సంఘం ప్రధాన కార్యదర్శి పశ్య పద్మ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సోమవారం బషీర్ బాగ్ లోని వ్యవసాయ శాఖ కమీషనర్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. దీంతో సంఘం నాయకులను పోలీసులు అడ్డుకుని అరెస్టు చేయడానికి ప్రయత్నించగా, తీవ్ర వాగ్వాదం జరిగింది. శాంతియుతంగా ధర్నా చేసి వినతి పత్రం అందజేసి వెళ్లిపోతామని రైతు సంఘం నేతలు చెప్పగా పోలీసులు శాంతించారు. ఈ సందర్భంగా పశ్య పద్మ మాట్లాడుతూ 2018 డిసెంబర్ 11 నాటికి బ్యాంకుల్లో పంట రుణాలు తీసుకున్న రైతులకు రుణమాఫీ చేస్తామని రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసి, నాలుగు విడతల్లో అమలు చేస్తామని ప్రకటించిందని, కానీ ప్రభుత్వం నాలుగు విడతల్లో రుణమాఫీ చేయలేదని, నాలుగున్నర సంవత్సరాలలో రుణమాఫీ చేయడంలో రాష్ట్ర ప్రభుత్వం ఘోరంగా వైఫల్యం చెందిందని ఆరోపించారు.రాష్ట్ర వ్యాప్తంగా రైతులు బ్యాంకుల చుట్టూ తిరుగుతున్నా, ధర్నాలు చేస్తున్నా ప్రభుత్వం రుణమాఫీ 45 రోజులలో చేస్తామని ప్రకటించి అమలు చేయలేదని, ప్రకటించిన గడువు పూర్తి కావడంతో రైతులు ఆందోళనకు గురవుతున్నారని చెప్పారు. సాంకేతిక కారణాల వల్ల రుణమాఫీ చేయలేక పోతున్నామని బ్యాంకు అధికారులు చెప్పడం విడ్డూరంగా ఉందన్నారు. రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఈ విషయంలో వెంటనే స్పందించి సాంకేతిక శాఖ కారణాలను తొలగించడానికి చర్యలు తీసుకుని, నిర్దిష్ట కాల వ్యవధిలో రుణమాఫీ చేయాలని డిమాండ్ చేశారు. నాలుగున్నర సంవత్సరాల కాలంలో చేసిన వాగ్దానం ప్రకారం రుణమాఫీ అమలు చేయకపోవడం వల్ల రైతులకు వడ్డీ భారం విపరీతంగా పెరిగిందన్నారు.నిర్దిష్ట కాలంలో రుణమాఫీని అమలు చేయాలని, లేని పక్షంలో ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని ఆమె హెచ్చరించారు. అనంతరం వ్యవసాయ శాఖ డిప్యూటీ కమిషనర్ విజయ్ కుమార్ కు రైతు సంఘం ప్రతినిధి బృందం వినతి పత్రం అందజేశారు. రైతు సంఘం నాయకులు ముత్యాల విశ్వనాథం, గడ్డం మురళీరెడ్డి, సంధ్య, అరుణ, మాచర్ల కనకయ్య, రాజు, శనిగరపు శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

అక్రమ అరెస్టులు సిగ్గు చేటు

- ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షుడు నాగేందర్
- అంబర్‌పేట ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం ముట్టడి



నవతెలంగాణ-అంబర్‌పేట

సంక్షేమ వసతి గృహ విద్యార్థుల సమస్యలు పరిష్కరించకుండా హైదరాబాద్ జిల్లాలో ఎస్ఎఫ్ఐ నాయకులను అక్రమంగా అరెస్ట్ లు చేయడం సిగ్గు చేటని ఎస్ఎఫ్ఐ హైదరాబాద్ జిల్లా ఉపాధ్యక్షుడు నాగేందర్ అన్నారు. ఎస్ఎఫ్ఐ రాష్ట్ర కమిటీ పిలుపులో భాగంగా సోమవారం అంబర్‌పేట ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయాన్ని ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో ముట్టడించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సంక్షేమ వసతి గృహ విద్యార్థులు అనేక రకాల సమస్యలతో బాధపడుతున్నారని వారి సమస్య లు పరిష్కారించడంలో ప్రభుత్వం పూర్తిగా విఫలమైందన్నారు. మెస్ కాస్మోటిక్ చార్జీలను పెంచామని చెప్పిన ప్రభుత్వం కాగితాలకు పరిమితం చేసిందన్నారు. నిత్యావసర ధరలకు అనుగుణంగా మెస్ చార్జీలను పెంచాలని వారి డిమాండ్ చేశారు. వసతి గృహాలకు గురుకులాలకు పక్కా భవనాలను నిర్మించాలన్నారు. మహిళా కళాశాల విద్యార్థినిలకు మెడికల్ కిట్లు అందించాలన్నారు. సమస్యలు పరిష్కారం చేయమంటే అక్రమ అరెస్టులు కేసులు నమోదు చేయడం ప్రభుత్వ పతనానికి సంకేతం అన్నారు. సమస్యలు పరిష్కారం అయ్యేంతవరకు ఎస్ఎఫ్ఐ ఉద్యమిస్తుందని వారు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో వేమన,శివ,గణేష్ దాసు, శ్రీధర్,ధనరాజ్ తదితరులు పాల్గొన్నారు.

ఏఎన్ఎంల సమ్మె విరమణ

- సమస్యల పరిష్కారం అయ్యేంతవరకు పోరాటం ఆగదు
- ఏఐటీయూసీ రాష్ట్ర ఉప ప్రధాన కార్యదర్శి ఎం నరసింహ

నవతెలంగాణ -సుల్తాన్ బజార్

ఈనెల 5వ తారీఖు నుంచి కోఠి లోని డి.హెచ్ కార్యాల యం వద్ద జరుగుతున్న రెండవ ఏఎన్ఎం ల నిరవధిక పోరాటాన్ని విరమణ చేస్తున్నట్టు ఏఐటీయూసీ రాష్ట్ర ఉప ప్రధాన కార్యదర్శి ఎం నరసింహ తెలియజేశారు. సమ్మె విరమణ సందర్భంగా కోఠీలోని డిహెచ్ కార్యాలయం వద్ద జరిగిన రెండవ ఏఎన్ఎం లో సదస్సులో ఆయన మాట్లాడుతూ... నాలుగు రోజులుగా రెండో ఏఎన్ఎంలు అలుపెరగని పోరాటాన్ని నిర్వహిస్తున్నారని కొనియాడారు. ఆర్టీసీ కార్మికుల సమ్మె తరువాత అటువంటి పోరాటం మళ్లీ రెండవ ఏఎన్ఎంల దేనన్నారు. ఆగస్టు 4వ తేదీ చలో అసెంబ్లీ సందర్భంగా 4000 మంది అరెస్టయ్యారని ఆరోజు నుండి ఆగస్టు 14వ తేదీ వరకు రాష్ట్రవ్యాప్తంగా అన్ని జిల్లాలలో నిరసన తెలియజేశారన్నారు. ఆగస్టు 16వ తేదీ నుండి సెప్టెంబర్ 4వ తేదీ వరకు నిరవధిక సమ్మె నిర్వహించారని చర్చల ద్వారానే సమ్మెను తాత్కాలిక విరమణ చేశారన్నారు. సెప్టెంబర్ ఒకటో తేదీ నాడు జరిగిన చర్చల సందర్భంగా గ్రాస్ శాలరీ అమలను పరిశీలించడానికి కమిటీ వేయడంతో పాటు 15 రోజుల్లో పి.ఆర్.సి బకాయిలతో పాటు సమ్మె కాలానికి వేతనం ఇస్తామని ప్రభుత్వం హామీ ఇచ్చి మాట తప్పటంవలనే మరలా అక్టోబర్ 4వ తేదీ నుండి హైదరాబాదులోని కుటుంబా ఆరోగ్య సంక్షేమ శాఖ కార్యాలయం వద్ద నిరవధిక సమ్మెను నిర్వహించడం జరిగిందన్నారు. సెప్టెంబర్ 2న కమిటీ వేయగా అక్టోబర్ 6న సమ్మె కాలపు వేతనాన్ని చెల్లించారని, పిఆర్సి బకాయిలు మాత్రం ఇంకా చెల్లించలేదన్నారు. సోమవారం జరిగిన చర్చల ఫలితంగా రెండు రోజుల్లో పిఆర్సి బకాయిలను చెల్లిస్తామని, ఈనెల 17వ తేదీన 100% గ్రాస్ శాలరీ పరిశీలించడానికి కమిటీ సమావేశం అవుతుందని, మిగిలిన సమస్యలను కూడా పరిష్కరిస్తామని డైరెక్టర్ ఆఫ్ హెల్త్ గడల శ్రీనివాసరావు హామీ ఇవ్వడంతో సమ్మెను విరమణ చేస్తున్నట్టు ఆయన ఈ సందర్భంగా తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ రాష్ట్ర కార్యదర్శి పల్లా దేవేందర్ రెడ్డి, రాష్ట్ర నాయకులు తోట రామాంజనేయులు, తెలంగాణ రాష్ట్ర రెండో ఏఎన్ఎం ల యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బోయిని శ్యామల,ఉపాధ్యక్షులు ఎస్. మంజుల, పి. రత్న కుమారి,పి జయమ్మ, డి. జ్యోతి, ఎం. రజిత, సహాయ కార్యదర్శులు కే పద్మ, పి. జయమ్మ, ఎండీ. పర్వీన్, జి. సంతోషిని, తన్వీర్ సుల్తానా, కోశాధికారి జె పద్మ, కార్యవర్గ సభ్యులు ఏ కృష్ణ వేణి, ఎం. రాని, ఎస్ వజ్రమ్మ, సుజాత, ఎన్. మంజుల, వజ్ర, కే.గుణవతి, కే.లత పాల్గొన్నారు.



అధ్యాపకుల రిటైర్మెంట్ వయస్సు 61 ఏండ్లకు పెంచాలి

- టీ-జేఏసీ చైర్మెన్, ప్రొఫెసర్ ఇటికాల పురుషోత్తం



నవతెలంగాణ-హిమాయత్ నగర్

విశ్వవిద్యాలయాల్లో పని చేస్తున్న అధ్యాపకుల రిటైర్మెంట్ వయస్సును 58 ఏండ్ల నుంచి 61 ఏండ్లకు పెంచాలని టీ-జేఏసీ చైర్మెన్, ప్రొఫెసర్ ఇటికాల పురుషోత్తం సోమవారం ఒక ప్రకటనలో ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో విశ్వ విద్యాలయాల పరిస్థితి అధ్వాన్నంగా తయారైందని, ఉన్నత విద్యను ప్రభుత్వం పూర్తిగా నిర్లక్ష్యం చేస్తూ విద్యా రంగాన్ని గాలికొదిలేసిందని విమర్శించారు.విశ్వ విద్యాలయాల అధ్యాపకులు సమస్యల పరిష్కారం కోసం అనేక విధాలుగా ప్రభుత్వానికి విజ్ఞప్తి చేసినా పట్టించుకోవడం లేదన్నారు.అధ్యాపకుల రిటైర్మెంట్ వయస్సు పెంపు విషయంలో నేటి వరకు ఎలాంటి నిర్ణయం తీసుకోకపోవడం బాధాకరమన్నారు. వారికి ఈహెచ్ఎస్ సౌకర్యం కల్పించకపోవడం దారుణమన్నారు. ప్రభుత్వం వెంటనే అధ్యాపకుల రిటైర్మెంట్ వయస్సును పెంచాలని, టీచింగ్, నాన్ టీచింగ్ ఉద్యోగులకు ఈహెచ్ఎస్ సౌకర్యం కల్పించాలని, ఖాళీగా ఉన్న టీచింగ్, నాన్ టీచింగ్ పోస్టులను భర్తీ చేయాలని, విశ్వ విద్యాలయాలకు తగినంత బడ్జెట్ కేటాయించాలని ఆయన డిమాండ్ చేశారు.



ల్యాబ్ టెక్నీషియన్లను రెగ్యులర్ చేయాలి

- కవ్వం లక్ష్మారెడ్డి

నవతెలంగాణ -సుల్తాన్ బజార్

ఎన్‌హెచ్ఎం విభాగంలో పని చేసే ల్యాబ్ టెక్నీషియన్లు సోమవారం కోఠి డి.హెచ్ ఆవరణలో ధర్నా నిర్వహించారు. ఈ ధర్నాలో ఎన్‌హెచ్ఎం ల్యాబ్ టెక్నీషియన్ రాష్ట్ర అధ్యక్షుడు కవ్వం లక్ష్మారెడ్డి మాట్లాడుతూ రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖలో ఎన్‌హెచ్ఎం విభాగంలో 600 మంది డీఎస్‌సీ (డిస్టిక్ సెలక్షన్ కమిటీ)ద్వారా సెలెక్ట్ అయ్యి 25 ఏండ్లుగా సేవలందిస్తున్న అందిస్తున్నామన్నారు. ప్రభుత్వం ఇప్పటివరకూ ఎటువంటి ఉద్యోగ భద్రత కల్పించలేదని వాపోయారు. ప్రభుత్వం వెంటనే ఆరోగ్య భద్రత కల్పించాలన్నారు. ఎన్‌హెచ్ఎం ఉద్యోగుల అందరినీ రెగ్యులర్ చేసి అందరి ఉద్యోగులతో సమానంగా వేతనం ఇవ్వాలని డిమాండ్ చేశారు కోవిడ్-19 మహమ్మారి సమయంలో తాము తమ కుటుంబాలకు దూరంగా ఉంటూ, ఓ దశలో ప్రాణాలు పోతున్నా కూడా 24/7 అందుబాటులో ఉండి పనిచేశామన్నారు. అయినప్పటికీ ప్రభుత్వం వారిని గుర్తించకపోవడంపై మండిపడ్డారు. రానున్న రోజుల్లో ప్రభుత్వానికి ఎన్ హెచ్ ఎం ఉద్యోగులందరం తగిన గుణపాఠం చెప్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో జనరల్ సెక్రెటరీ నరేష్, వైస్ ప్రెసిడెంట్ రంజిత్, తిరుమల్ రెడ్డి, సమీ, సత్య రెడ్డి, కుమార్, శివ, రజిత, శ్రీదేవి, వివిధ జిల్లాల నుంచి దాదాపు 500 మందికిపైగా నిరసన కార్యక్రమంలో పాల్గొన్నారు.

గ్రామీణ ప్రాంతాలల్లో రహదారులలో ఉపయోగించే కొత్త సాంకేతికతలు, రహదారి భద్రతపై అవగాహన



నవతెలంగాణ-సిటీబ్యూరో

గ్రామీణ ప్రాంతాలల్లో నిర్మించే రహదారులలో ఉపయోగించే కొత్త సాంకేతికతలు, రహదారి భద్రతపై అవగాహన కార్యక్రమాలను ఇంజనీరింగ్ స్టాఫ్ కాలేజ్ ఆఫ్ ఇండియా, సివిల్ ట్రాన్స్‌పోర్టేషన్ ఇంజనీరింగ్ డివిజన్ నేతృత్వంలో నిర్వహిస్తున్నారు. గ్రామీణాభివృద్ధి మంత్రిత్వ శాఖ, భారత ప్రభుత్వం, న్యూఢిల్లీ ద్వారా స్పాన్సర్ చేయబడిన "గ్రామీణ రహదారులలో కొత్త సాంకేతిక కార్యక్రమాలు, ఉపాంత పదార్థాల వినియోగంతో సహా" అనే అంశంపై 5-రోజుల శిక్షణా కార్యక్రమం సోమవారం ప్రారంభించారు. అక్టోబరు 9 నుండి 11వ తేదీ వరకు 3రోజుల శిక్షణా కార్యక్రమాన్ని గచ్చిబౌలిలోని ఇఎస్‌సీఐ క్యాంపస్‌లో జరుగుతున్నాయి. ఈ శిక్షణా కార్యక్రమానికి ఇఎస్‌సీఐ డైరెక్టర్ జీ. రామేశ్వర్ రావు అధ్యక్షత వహించారు. మొదటి రోజు తెలంగాణ ప్రభుత్వ రోడ్లు - భవనాల శాఖ ఇంజనీర్ ఇన్ చీఫ్ ఐ గణపతి రెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. గ్రామీణ ప్రాంతాలల్లో రోడ్లలో ఉపయో గించే కొత్త టెక్నాలజీ ఇనిషియేటివ్‌లు, రోడ్ల నిర్మాణంలో కొత్త ఆవిష్కరణల అమలు, రహదారి భద్రతపై అవగాహన మరియు విద్య గురించి వివరించారు. ప్రాధాన్యత గురించి వివరించారు. ప్రారంభ సమావేశంలో డైరెక్టర్ డాక్టర్ జి రామేశ్వర్ రావు మాట్లాడుతూ రహదారి భద్రత, తీసుకోవాల్సిన జాగ్రత్తలపై వివరించారు. ఇఎస్‌సీఐ కాలేజీలో అందిస్తున్న కోర్సులను వివరించారు. ఈ కార్యక్రమంలో 20 రాష్ట్రాల నుండి జూనియర్ ఇంజనీర్ల నుండి చీఫ్ ఇంజనీర్ల వరకు 40 మంది ప్రభుత్వ ఇంజనీర్లు, 9 రాష్ట్రాల నుండి 30 మంది ప్రభుత్వ అధికారులు, పోలీస్ డిపార్ట్‌మెంట్, ట్రాఫిక్ డిపార్ట్‌మెంట్, మోటార్ వెహికల్ డిపార్ట్‌మెంట్, స్టేట్ రోడ్ ట్రాన్స్‌పోర్ట్ కార్పొరేషన్లు, ట్రాన్స్‌పోర్ట్ డిపార్ట్‌మెంట్లు వంటి వివిధ విభాగాలకు ప్రాతినిధ్యం వహించనున్నారు.

విద్యార్థులు రవాణా సౌకర్యాలను వినియోగించుకోవాలి

- మహేశ్వర డిపో మేనేజర్ మోహన్ రెడ్డి



నవతెలంగాణ-ముషీరాబాద్

విద్యార్థులు రవాణా సౌకర్యాలను వినియోగించుకోవాలని మహేశ్వర డిపో మేనేజర్ మోహన్ రెడ్డి అన్నారు. తెలంగాణ హ్యూమన్ రైట్స్ వెల్ఫేర్ అసోసియేషన్ విజ్ఞప్తి మేరకు సోమవారం కందుకూరు మండల కేంద్రం నుంచి హైదరాబాద్ సంతోష్ నగర్ వరకు ప్రతీరోజు రెండు బస్సులు ఉదయం7:40 కి, 8.05 కి నడుపునున్నట్టు తెలిపారు. మండల కేంద్రం నుంచి ప్రతిరోజు నిత్యం కళాశాలకు విద్యార్థులు, వ్యాపార అవసరాల నిమిత్తం హైదరాబాద్‌కు వెళ్ళుటకు సరైన సమయంలో బస్సులు లేక ఇబ్బందులు పడేవారు. ఇట్టి విషయాన్ని తెలంగాణ హ్యూమన్ రైట్స్ సభ్యులు డిపో మేనేజర్ దృష్టికి తీసుకెళ్లారు. వారి అవసరాలను దృష్టిలో ఉంచుకొని ప్రతిరోజు రెండు బస్సులను సమయానుకూలంగా నడపనున్నట్టు మేనేజర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు ఆంజనేయులు, జాయింట్ సెక్రటరీ నిజాముద్దీన్, ఆర్యవైశ్య సంఘం జిల్లా ఉపాధ్యక్షులు వెంకటేశ్వర్ గుప్తా, ఈ డబ్ల్యూబి మెంబర్స్ కిషోర్,ప్రమీల, డిపో సిబ్బంది కాజా పాషా, నారాయణ, వ్యాపారస్తులు సుధాకర్ రెడ్డి, శ్రీని వాస్ రెడ్డి, రామచంద్రయ్య, విద్యార్థులు, ప్రయాణికులు పాల్గొన్నారు.

53 సెకండ్లలో ఫ్లూట్‌పై జాతీయ గీతం అలపించి రికార్డు



నవతెలంగాణ-హిమాయత్ నగర్

ఆజాదీ-కా-అమృత్ మహోత్సవాల్లో భాగంగా బోయిన్ పల్లికి చెందిన 7వ తరగతి విద్యార్థిని డి.టి.అంజన పిల్లనగ్రోవి (ఫ్లూట్)పై 53 సెకన్లలో జాతీయ గీతం "జనగణమన"ను అలపించి "వండర్ బుక్ ఆఫ్ రికార్డ్స్"లో చోటు దక్కించుకుంది. ఈ మేరకు సోమవారం రాష్ట్ర గవర్నర్ తమిళిసై సౌందర్ రాజన్ విద్యార్థిని అంజన, ఆమె తల్లిదండ్రులు ధీరజ్ కుమార్, సాయి మాధురిలను అభినందించి, అవార్డును ప్రదానం చేశారు.ఈ సందర్భంగా గవర్నర్ మాట్లాడుతూ అంజన విద్యతో పాటు ఆమె ఎంచుకున్న కళా రంగంలో రాణించాలని, భవిష్యత్తులో మరిన్ని అవార్డులు, రివార్డులు సాధించి రాష్ట్రానికి మంచి పేరు, ప్రతిష్టలు తీసుకురావాలని సూచించారు. అనంతరం విద్యార్థిని తల్లిదండ్రులు మాట్లాడుతూ కేవలం నాలుగు నెలల్లో ఫ్లూట్ పై ఎలా ఆలపించాలో శిక్షణ తీసుకుని మొదటి సారిగా నగరంలో జరిగిన కార్యక్రమంలో 53 సెకండ్లలో జాతీయ గీతాన్ని ఆలపించి రికార్డు సొంతం చేసుకుందన్నారు. అంజనకు ఈ అవార్డు రావడం తమకు సంతోషంగా, గర్వంగా ఉందన్నారు.

ప్రపంచ స్థాయి విద్యా ప్రయాణానికి సేజ్‌బ్రూక్ అకాడమీ పునాది



నవతెలంగాణ-బంజారా హిల్స్

400 సంవత్సరాల చరిత్ర కలిగిన లండన్ కు చెందిన ప్రతిష్టాత్మక విట్‌గిఫ్ట్ స్కూల్ భాగస్వామ్యంతో హైదరాబాద్ కు చెందిన సింబిక్విస్ట్ ఎడ్యుకేషన్ కలిసి నగరంలో సేజ్‌బ్రూక్ అకాడమిని స్థాపించేందుకు ఒప్పందాన్ని కుదుర్చుకున్నారు.సోమవారం బంజారా హిల్స్ పార్క్ హయత్ హోటల్ లో సింబిక్విస్ట్ ఎడ్యుకేషన్, విట్‌గిఫ్ట్ స్కూల్ అధికారికంగా భాగస్వామ్య ఒప్పందంపై సంతకాలు చేయడంతో పాటు లోగో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సేజ్‌బ్రూక్ అకాడమీ వ్యవస్థాపకుడు-డైరెక్టర్ ప్రవీణ్ రాజు మాట్లాడుతూ సేజ్‌బ్రూక్ అకాడమీ కేవలం పాఠశాల విద్య కంటే నైపుణ్యానికి ఎక్కువ ప్రాతినిధ్యం వహిస్తుందన్నారు. ఇది సమాజంపై సానుకూల ప్రభావాన్ని చూపుతూ విద్యాపరంగా రాణించగల వ్యక్తులను పోషించే నిబద్ధతను కలిగి ఉంటుందన్నారు. (కొల్లూరు)వెలిమెలలో ఈ పాఠశాల ఆగస్టు 2025లో ప్రారంభమవుతుందని ఆయన తెలిపారు.

బ్రిటిష్ డిప్యూటీ హై కమిషనర్ గారెత్ విన్ ఓవెన్, యూకే, భారతదేశం మధ్య విద్యా భాగస్వామ్యానికి తన సంతోషాన్ని వ్యక్తం చేస్తూ, ఈ విశేషమైన ప్రయత్నం వెనుక ఉన్న బృందాల అంకితభావాన్ని ప్రశంసించారు. విట్‌గిఫ్ట్ స్కూల్ ప్రధానోపాధ్యాయుడు క్రిస్ రామ్‌సే, ఇంటర్నేషనల్ బాకలారియాట్ ప్రోగ్రాం ప్రాముఖ్యతను వివరించారు. సంపూర్ణ అభివృద్ధి, ప్రపంచ పౌరసత్వంపై ప్రాధాన్యతనిస్తూ, యువతకు ఉజ్వల భవిష్యత్తుకు తలుపులు తెరిచేందుకు, వారిని ప్రపంచవ్యాప్తంగా తీర్చిదిద్దడంలో సంస్థ పాత్రను తెలిపారు.


అద్భుతమైన విద్యా ప్రయాణానికి పునాది వేసిన ఈ కార్యక్రమంలో సేజ్‌బ్రూక్ అకాడమీ వ్యవస్థాపక-డైరెక్టర్ ప్రవీణ్ రాజు,బ్రిటిష్ డిప్యూటీ హై కమిషనర్ గారెత్ విన్ ఓవెన్, విట్‌గిఫ్ట్ స్కూల్ ముఖ్య సభ్యులు హెడ్‌మాస్టర్ క్రిస్ రామ్‌సే,ఇంటర్నేషనల్ సబ్-కమిటీ చైర్‌పర్సన్ ఆసిఫ్ పటేల్,ఇంటర్నేషనల్ ఎడ్యుకేషన్ డైరెక్టర్ డేవిడ్ బేట్స్ మరియు గ్లిట్ ఎడ్యుకేషన్ ఇంటర్నేషనల్ అడ్వయిజర్ విపుల్ భార్గవ పాల్గొన్నారు.

గాంధీ భవన్ వద్ద కాంగ్రెస్ పార్టీ అభ్యర్థుల ఆందోళన



నవతెలంగాణ -సుల్తాన్ బజార్

నాంపల్లిలోని గాంధీభవన్ వద్ద సోమవారం గోషామహల్ నియోజకవర్గం నుంచి కాంగ్రెస్ పార్టీ టికెట్ కోసం దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులు సంజయ్ కుమార్ యాదవ్, నిర్మల్ కుమార్ యాదవ్ శ్రీధర్ గౌడ్, మధు గుప్తా, కన్నయ్యలాల్, సి కె మూర్తి, కైలాస్ సింగ్ లు సోమవారం ప్ల కార్డులు పట్టుకొని ఆందోళన చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తమలోని ఎవరికైనా కాంగ్రెస్ పార్టీ గోషామహల్ నియోజకవర్గం ఎమ్మెల్యే టికెట్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. గోషామహల్ నియోజకవర్గానికి సంబంధంలేని వ్యక్తులకు కాంగ్రెస్ టికెట్ ఇస్తే సహకరించలేదని తేల్చి చెప్పారు. పిసిసి అధ్యక్షుడు రేవంత్ రెడ్డి తమకు న్యాయం చేయాలని విజ్ఞప్తి చేశారు



మానసిక ఆరోగ్యాన్ని మెరుగుపరుచుకునేందుకు కొన్ని చిట్కాలు పాటించాలి. వీటిని పాటిస్తే మానసికంగా ఆరోగ్యంగా ఉంటారని నిపుణులు చెబుతున్నారు. వీటి వల్ల జీవితంలో ఎలాంటి బాధలు వచ్చినా పాజిటీవ్‌గానే ఉంటారని సూచిస్తున్నారు. దాని కోసం పెద్దగా చేయాల్సింది కూడా ఏమీ లేదు. మన జీవితంలో కొన్ని మార్పులు చేసుకుంటే చాలు.. అవే మనల్ని ఎన్నో బాధల నుంచి దూరం చేస్తాయి. అయితే అలాంటి ఎవరో వచ్చి మనకోసం చేయరు. మనకు మనమే వాటిని చేయాలి. ఈ రోజు మానసిక ఆరోగ్య దినోత్సవం సందర్భంగా ఒత్తిడిని ఎలా దూరం చేసుకోవాలో, మానసిక ఆరోగ్యాన్ని ఎలా కాపాడుకోవాలో తెలుసుకుందాం...



మానసిక ఆరోగ్యం మన చేతుల్లోనే

సాధారణంగా పురుషుల కంటే మహిళలు ఎక్కువగా ఒత్తిడి బారిన పడుతారు. అందులోనూ ఉద్యోగం చేసే వారు సులువుగా ఒత్తిడికి లోన వుతారు. ఒకటి కంటే ఎక్కువ పాత్రలు పోషించాల్సి రావడమే ఇందుకు కారణం. పిల్లలకు తల్లిగా, సీనియర్ సిటిజెన్ల అవసరాలు తీర్చేవారిగా, కుటుంబ పోషకురాలిగా పాత్రలు పోషించాల్సి వస్తోంది. దీనికి తోడు బంధాల్లో ఉండే సమస్యలు, పిల్లలు, ఆఫీసు వ్యవహారాలు.. ఇలా అనేకం ఎదుర్కోవాల్సి వస్తుంది. ఇవన్నీ సరిపోవని.. సమాజంలో వివక్ష ఎదుర్కోవాల్సి వస్తుంది. ముఖ్యంగా సమానత్వం దగ్గరే అసలు సమస్య. మహిళలకు విద్య, ఉపాధి అవకాశాలు, ఆరోగ్యం వంటి వాటిలో సమాన అవకాశాలు చాలా తక్కువ. ఇవన్నీ మహిళల మానసిక ఆరోగ్యాన్ని దెబ్బతీసేవే. ఈ ఒత్తిడిని తగ్గించుకోవడానికి వారికి అవకాశమే లేకుండా పోతుంది. దీంతో అనేక మానసిక, శారీరక ఆరోగ్యాలు ఎదుర్కోవలసి వస్తుంది.



విభిన్న బాధ్యతల వల్ల...

మహిళల మానసిక ఆరోగ్య అవసరాలను కుటుంబ సభ్యులు గుర్తించడంలో విఫలమవుతారు. మహిళలు వారి ఆలోచనలకు ఒక క్రమబద్ధమైన రూపం ఇచ్చేందుకు, వారి ఇష్టపడింది చేయడానికి, సంతృప్తిని ఇచ్చే వాటిపై దృష్టి పెట్టేందుకు వారికి సమయమే దొరకదు. 'దేశంలో మూడింట రెండు వంతుల మంది పెండ్లయిన మహిళలు గృహ హింసను ఎదుర్కొంటున్నారు. ఇక ఆలస్యంగా గర్భధారణ, ప్రసవానంతర సమస్యల్లో ఒత్తిడి సర్వ సాధారణం. కొత్తగా తల్లయిన వారిలో మెజారిటీ (50 నుంచి 80 శాతం) ప్రసవానంతర కష్టాలు ఎదుర్కొంటారు. ఇక వర్కింగ్ వుమెన్ అయితే సగానికంటే ఎక్కువ మంది వర్క్-ఫ్యామిలీ బాలెన్స్ సమస్యలు ఎదుర్కొంటారు. 90 శాతం మంది విభిన్న బాధ్యతల కారణంగా ఒత్తిడి అనుభవిస్తున్నారు. ఇవన్నీ కుటుంబంలో, ఆఫీసులో వ్యక్తుల మధ్య సంబంధాలను దెబ్బతీస్తాయి. మానసిక రుగ్మతలకు దారి తీస్తాయి. ఇక న్యూక్లియర్ ఫ్యామిలీ (చిన్న కుటుంబాలు)కి ప్రాధాన్యం పెరిగిపోవడంతో అవసరమైనప్పుడు ఆపన్నహస్తం అందించేందుకు పెద్దవాళ్లు ఎవరూ లేకుండాపోయారు. అందువల్ల మహిళ తన ఆందోళనలు, కష్టాలను తానే పరిష్కరించుకోవాల్సి వస్తోంది.. అంటున్నారు మానసిక నిపుణులు.

మీ భావాలను రాసుకోండి

ఒత్తిడిని నుంచి ఎప్పటికప్పుడు బయటపడేందుకు తగిన మార్గాలు వెతకాలి. మంచి మార్గాలతో మానసిక ఆరోగ్యం బాగుంటుంది. మహిళలు తమ ఆరోగ్యం బాగుండాలంటే మానసిక ఆరోగ్యంపై కూడా దృష్టి పెట్టాలి. మీ ఆలోచనలను జర్నల్ రూపంలో పెట్టడం ఒక థెరపీలా పనిచేస్తుంది. మీ భావోద్వేగాలను స్పష్టమైన రూపంలో వ్యక్తీకరించడానికి ఇది ఉపయోగ పడుతుంది. ఆశావాద దృక్పథం అలవడుతుంది. ఫలితంగా ఇది వారి మానసిక ఆరోగ్యానికి మేలు చేస్తుంది. మీ భావాలను వ్యక్తపరిచేందుకు రాయడం ఇంకొకరితో మాట్లాడడానికి మంచి ప్రత్యామ్నాయం..

సమయం కేటాయింపు..

మహిళల మానసిక ఆరోగ్యంపై ప్రభావం చూపే కారణాల్లో ప్రధానమైనది వారు తమ పట్ల తాము కేర్ తీసుకోకపోవడం. ఇందుకు కారణం వారికి ఏకాంతంగా ఉండేందుకు తగిన సమయం దొరకకపోవడమే. వారి భావోద్వేగాలను రీసెట్ చేసుకోవడం చాలా ముఖ్యం. తమ జీవితానికి ఏది బాగా మేలు చేస్తుంది? ఏదీ పని చేయదు అని తెల్సుకునేందుకు కూడా ఈ సమయాన్ని వారు ఉపయోగించుకోవచ్చు.

అవసరమైతే సాయం...

మహిళలు తమకు అవసరమని భావించినప్పుడు సహాయం కోరాలి. ఒత్తిడి నుంచి ఉపశమనానికి అవసరమైతే ప్రొఫెషనల్ హెల్ప్ తీసుకోండి. కుటుంబ సభ్యులు, సహోద్యోగుల నుంచి అవసరమైన సందర్భాల్లో సాయం పొందడంలో తప్పులేదు. జీవితాన్ని సానుకూలంగా లీడ్ చేయాలంటే మీకు మీరు సమయం కేటాయించుకోవాలి. మీ మానసిక, శారీరక ఆరోగ్యంపై దృష్టి పెట్టాలి. మానసిక, శారీరక ఆరోగ్యం కోసం ఆశావాద దృక్పథాన్ని పెంచుకోవాలి.

ఇతరులతో మాట్లాడడం

ప్రస్తుత కాలంలో ఇతరులతో ఎవరికీ మంచి సంబంధాలు ఉండడం లేదు. ఇది మంచిది కాదు. కచ్చితంగా ఇతరులతో మంచి సంబంధాలు కలిగి ఉండాలి. ఇవి మీ సెల్ఫ్ కాన్ఫిడెన్స్‌ని పెంచుతాయి. మీ అనుభవాలను పంచుకోవడానికి మేలు చేస్తాయి. కాబట్టి భావోద్వేగంగా దగ్గరయ్యేందుకు ట్రై చేయండి. మంచి రిలేషన్‌షిప్ బిల్డ్ చేసుకోండి. ఇందుకోసం ప్రతి రోజు మీ కుటుంబంతో కలిసి ఉండేందుకు కాస్త సమయాన్ని వెచ్చించండి. రాత్రి భోజనం కలిసి చేసేలా ప్లాన్ చేయండి. మీరు కొన్నిరోజుల పాటు కలవని స్నేహితులను కలిసేందుకు ట్రై చేయండి. మీకు కావాల్సిన వారితో టైమ్ స్పెండ్ చేసేందుకు ట్రై చేయండి. అయితే టచ్‌లో ఉండమన్నాం కదా అని సోషల్ మీడియా, ఫోన్స్, కాల్స్, మెసేజెస్ చేయొద్దు. డైరెక్ట్‌గా వెళ్ళి కలిసే ప్రయత్నం చేయండి.

ఫిజికల్‌గా ఫిట్‌గా..

చురుగ్గా ఉండడం మీ శారీరక ఆరోగ్యానికి, ఫిట్‌నెస్‌కి మాత్రమే కాదు, మానసిక శ్రేయస్సుని కూడా మెరుగుపరుస్తుంది. మనం ఆరోగ్యంగా ఉన్నప్పుడు మన మానసిక స్థితి కూడా ఆరోగ్యంగానే ఉంటుంది. స్విమ్మింగ్, సైక్లింగ్, వర్కౌట్, డ్యాన్స్, యోగా, వాకింగ్ మీకు ఇష్టమైనదాన్ని ఎంచుకుని ఫాలో అవ్వండి. వర్కౌట్ చేయమన్నాం కదా అని ఎక్కువ సేపు చేయొద్దు. వాటిని మీ జీవితంలో భాగం చేసుకుంటే చాలు.

బహుమతులు..

మీకు ఎవరైనా బహుమతి ఇస్తే ఎంత హ్యాపీగా ఫీల్ అవుతారో.. అలానే మీరు ఒకరికి గిఫ్ట్ ఇచ్చి చూడండి. అంతకు మించిన ఆనందం ఉంటుందని చెబుతున్నాయి పరిశోధనలు. ఇది ఇతర వ్యక్తులతో మిమ్మల్ని కనెక్ట్ అయ్యేలా చేస్తుంది. ఎవరైనా మీకోసం ఏదైనా చేస్తే కృతజ్ఞతలు చెప్పండి. హ్యాపీగా ఉండండి.

ప్రజెంట్‌లో ఉండండి..

చాలా మంది అయిపోయినదాని గురించి బాధపడడం, భవిష్యత్ గురించి బెంగగా ఉండడం చేస్తుంటారు. ఇది అస్సలు మంచిది కాదు. అందుకే ప్రస్తుతాన్ని ఎంజాయ్ చేయండి. దీనినే మైండ్ ఫుల్ నెస్ అంటారు. ఇప్పుడున్న దాంతో హ్యాపీగా ఉంటే మీ ఆనందాన్ని ఎవరు దూరం చేయలేరు. మీకు ఇచ్చిన దానినే శ్రద్ధగా ఆహ్వానించి ఆస్వాదించండి. అప్పుడే ఎలాంటి బాధ ఉండదు. బాధ లేనప్పుడు ఆరోగ్య సమస్యలు లేకుండా ఆరోగ్యంగా ఉంటారు. దీంతో మానసికంగా కూడా ఆనందంగా ఉంటారు.



న్యూ స్కిల్స్..

కొత్త స్కిల్స్ నేర్చుకోండి. దీని వల్ల మీ మానసిక ఆరోగ్యం మెరుగ్గా ఉంటుంది. వీటి వల్ల మీ సెల్ఫ్ కాన్ఫిడెన్స్ కూడా పెరుగుతుంది. ఇలా చేయడం వల్ల మీరు ఇతరులతో కనెక్ట్ అవుతారు. మీకు టైమ్ లేనప్పటికీ ట్రై చేయండి. వంటలు కొత్తవి ట్రై చేయడం, జాబ్‌లో కొత్త బాధ్యతలు తీసుకోవడం, ప్రజెంటేషన్ మెరుగు పరుచుకోవడం, ఇంట్లోనే కొత్తగా చిన్నచిన్నవి సృష్టించడం, గార్డెనింగ్, కోర్సులు నేర్చుకోవడం, కొత్త భాషలు నేర్చుకోవడం ఇలా ఏదైనా చేయొచ్చు. అయితే నేర్చుకోవడం ముఖ్యమే కానీ ఇష్టం లేనివి ట్రై చేయొద్దు. దీని వల్ల మీకు నేర్చుకోవాలన్న ఇష్టంపోతుంది.

ఆశాల భారీ ధర్నా

(మొదటిపేజీ తరువాయి)

నుంచి సమ్మె చేస్తున్నప్పటికీ ప్రభుత్వం స్పందించకపోవడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆశా వర్కర్లతో ప్రభుత్వం వెంటనే చర్చలు జరపాలని కోరారు. రాష్ట్రంలో సుమారు 28 వేల మంది ఆశా వర్కర్లు పని చేస్తున్నారన్నారు. ప్రభుత్వం నిర్వహించిన అనేక ట్రైనింగ్‌లు పొందారన్నారు. ఎప్పటికప్పుడూ ప్రజలకు అనేక సేవలందిస్తున్నారని తెలిపారు. అయితే, పనికి తగిన పారితోషికాలు లేక.. కనీస వేతనం ఇవ్వక తీవ్ర అన్యాయానికి గురవుతున్నారని చెప్పారు. డైరెక్టర్ ఆఫ్ హెల్త్ డాక్టర్ శ్రీనివాసరావు చర్చలకు పిలిచి ఆశా వర్కర్ల సమస్యలపై కమిటీ వేశామని, ఆ కమిటీలో ఆశా వర్కర్ల నుంచి ఒకరిని తీసుకుంటామని హామీ ఇచ్చారని చెప్పారు. త్వరలోనే ప్రభుత్వానికి నివేదిక అందజేస్తామని డీహెచ్ హామీ ఇచ్చినట్టు తెలిపారు. ఎన్నికల నోటిఫికేషన్ విడుదల అయినందున తమ సమ్మెను తాత్కాలికంగా వాయిదా వేస్తున్నట్టు జయలక్ష్మి ప్రకటించారు. మంగళవారం నుంచి ఆశా వర్కర్లు విధుల్లో చేరుతున్నారన్నారు. ఈ ఆందోళనలో రాష్ట్ర ఉపాధ్యక్షులు భూపాల్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆర్.నీలాదేవి, కోశాధికారి పి.గంగామణి, సిటీ నాయకులు వెంకటేష్, మీనా, వేలాదిమంది ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

పేదల పక్షమా..వ్యాపారుల పక్షమా..?

(మొదటిపేజీ తరువాయి)

పంపించారని ఆగ్రహం వ్యక్తం చేశారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వం పదేండ్లుగా పేదలకు ఇండ్ల స్థలాలు, డబుల్ బెడ్‌రూమ్ ఇండ్లు ఇస్తామని చెబుతూ మభ్యపెడుతోందని ఆరోపించారు. విసిగి వేశారిన పేదలు ప్రత్యక్ష పోరాటానికి సిద్ధమై పట్టణంలో ఎనిమిది మంది రియల్ ఎస్టేట్ వ్యాపారాలు ఆక్రమించుకున్న భూములను వెలికి తీసి ప్రభుత్వానికి అప్పగించారన్నారు. ఆ భూముల్లో పేదలు గుడిసెలు వేసుకున్నారని తెలిపారు. కాగా, ప్రభుత్వానికి అప్పగించిన భూములను పేదలకు పంచకుండా కుల సంఘాల భవనాల నిర్మాణానికి ఇవ్వడం దారుణమన్నారు. ఇండ్లస్థలాల కోసం పోరాడుతున్న పేదల గుడిసెలపై ఎమ్మెల్యే శంకర్ నాయక్ 14 సార్లు పోలీసు అధికారులతో దాడులు చేయించి కూల్చి వేయించారని, 232 మందిపై కేసులు నమోదు చేయించారని, పదిమంది మహిళలను జైలుకు పంపించారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇప్పటికైనా ప్రభుత్వాలకు చిత్తశుద్ధి ఉంటే భూమి హక్కు పత్రాలు ఇచ్చి డబుల్ బెడ్‌రూమ్ ఇల్లు నిర్మించి ఇవ్వాలని డిమాండ్ చేశారు. లేకుంటే వచ్చే ఎన్నికల్లో ప్రభుత్వాన్ని కూల్చి వేయడం ఖాయమని హెచ్చరించారు. అనంతరం డీజీ నరసింహారావు, జి.రాములు మాట్లాడుతూ.. ప్రజలకిచ్చిన హామీలు అమలుపరిచేందుకు ప్రజాప్రతినిధులు చిత్తశుద్ధితో ముందుకు రావాలని, భూ కబ్జాలకు పాల్పడుతున్న ఎమ్మెల్యేకు గుణపాఠం తప్పదని హెచ్చరించారు. మీ పోరాటానికి ఎర్రజెండా అండగా ఉంటుందని ధైర్యాన్నిచ్చారు. కార్యక్రమంలో సీపీఐ(ఎం) జిల్లా నాయకులు సమ్మెట రాజమౌళి, కుర్ర మహేష్, పట్టణ కమిటీ సభ్యులు చీపిరి యాకయ్య, తోట శ్రీనివాస్, కుమ్మరికుంట్ల నాగన్న, ఎండి తజ్జు, భానోత్ వెంకన్న, మచ్చ వెంకన్న, పీఎస్‌ఎమ్ జిల్లా కన్వీనర్ నక్క సైదులు, మూడవరోజు దీక్షలో బండోజు సునీత, రమ, సుజాత, ఇందిరా, సురేష్, వెంకన్న, భద్రయ్య, విఠల్, వేణు, ఉమా, చరణ్ పాల్గొన్నారు.

ఆర్థిక శాస్త్రంలో ఆమెకే నోబెల్

(మొదటిపేజీ తరువాయి)

నుండీ గోల్డిన్‌తో కలిపి ఇప్పటి వరకూ కేవలం ముగ్గురు మహిళలకు మాత్రమే ఆ బహుమతి దక్కింది. 2009లో ఎలినర్ ఓస్ట్రోమ్, 2019లో ఎస్తర్ డఫ్లో ఈ పురస్కారాలు అందుకున్నారు. కార్మిక మార్కెట్‌లో మహిళల పాత్రపై అవగాహనను పెంచుకునేందుకు గోల్డిన్ పరిశోధన దోహదపడుతుందని, భవిష్యత్తులో ఎదురయ్యే అవరోధాలను అధిగమించేందుకు ఇది దారి చూపుతుందని స్వీడిష్ అకాడమీ అభిప్రాయపడింది. సమస్యకు గోల్డిన్ పరిష్కారాలు చూపకపోయినప్పటికీ ఆమె పరిశోధన అందుకు ఉపయోగపడుతుందని తెలిపింది. నూతన, ఆశ్చర్యకరమైన వాస్తవాలను ఆమె ప్రపంచం ముందు ఉంచిందని కొనియాడింది. కార్మిక మార్కెట్‌లో మహిళల అవకాశాలను ప్రభావితం చేసే అంశాలపై లోతైన అవగాహనకు వచ్చేందుకు గోల్డిన్ పరిశోధన దోహదపడుతుందని తెలిపింది. ఆమె పరిశోధన కారణంగా భూత, భవిష్యత్, వర్తమాన కాలాలకు సంబంధించిన కార్మిక మార్కెట్లను అర్థం చేసుకోగలిగామని వివరించింది. స్వీడన్‌కు చెందిన ఇంజినీర్, శాస్త్రవేత్త, వ్యాపారవేత్త ఆల్‌ఫ్రెడ్ నోబెల్ పేరిట ప్రకటించిన ఆర్థిక పురస్కారంతో ఈ సంవత్సరపు నోబెల్ సీజన్ ముగిసింది.

కుల గణనకు సీడబ్ల్యూసీ ఏకగ్రీవ మద్దతు

(మొదటిపేజీ తరువాయి)

పాటు సుదీర్ఘంగా జరిగిన ఈ సమావేశంలో సోనియా గాంధీ, రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీ వాద్రా, కాంగ్రెస్ పాలిత ముఖ్యమంత్రులు, సీడబ్ల్యూసీ సభ్యులు హాజరయ్యారు. ఈ సమావేశంలో ప్రధానంగా దేశంలో తాజా రాజకీయ పరిణామాలు, పార్టీ బలోపేతం, ఐదు రాష్ట్రాల ఎన్నికలు, సార్వత్రిక ఎన్నికల్లో అనుసరించాల్సిన వ్యూహాలపై చర్చలు జరుపుతున్నట్టు సమాచారం. సమావేశ అనంతరం కాంగ్రెస్ పాలిత ముఖ్యమంత్రులు అశోక్ గెహ్లాట్, సిద్ధ రామయ్య, భూపేష్ భోఘేలా, సుఖ్విందర్ సింగ్ సుఖు, ప్రధాన కార్యదర్శులు కేసీ వేణుగోపాల్, జైరాం రమేష్ తో కలిసి రాహుల్ గాంధీ మీడియాతో మాట్లాడుతూ నాలుగు రాష్ట్రాల్లోని తమ (కాంగ్రెస్) ముఖ్యమంత్రులు కులగణను కీలకంగా తీసుకుని దీనిపై తగు చర్యలు తీసుకుంటారని చెప్పారు.

కులగణనకు సిద్ధంగాలేని మోడీ

దేశవ్యాప్తంగా కులాల వారీ సర్వేను మోడీ నిర్వహించకపోవడాన్ని రాహుల్ తప్పుపట్టారు. తప్పుదారి పట్టించే వ్యూహాలతో కులాల సర్వే నిర్వహణకు మోడీ గండికొడుతున్నారని అన్నారు. 'కులగణనకు ఆయన (మోడీ) సిద్ధంగా లేరు. మాకున్న నలుగురు ముఖ్యమంత్రుల్లో ముగ్గురు ఓబీసీలు. 10 మంది బీజేపీ ముఖ్యమంత్రుల్లో ఒక్కరే ఓబీసీ క్యాటగిరీకి చెందిన వారున్నారు. ఓబీసీల నుంచి బీజేపీ సీఎంలు ఎందరు ఉన్నారు? ఓబీసీలకు మోడీ చేసిందేమీ లేదు. ప్రధానమైన సమస్యల నుంచి వారి దృష్టిని మళ్లించే ప్రయత్నం చేస్తున్నారు' అని రాహుల్ అన్నారు.

కుల గణనకు వంద శాతం మద్దతు: సోనియా గాంధీ

సీడబ్ల్యూసీ సమావేశంలో కాంగ్రెస్ అధినేత్రి సోనియా గాంధీ మాట్లాడుతూ "దేశవ్యాప్త కుల గణనకు మనం 100 శాతం మద్దతు ఇవ్వాలి. ఇది మన పార్టీ అత్యున్నత ప్రాధాన్యత" అని నొక్కిచెప్పారు. కుల గణన పూర్తి చేయాలని అన్నారు. ఈ సందర్భంగా సీడబ్ల్యూసీ తీర్మానం ఆమోదించింది. షెడ్యూల్డ్ కులాలు, షెడ్యూల్డ్ తెగలు, ఇతర వెనుకబడిన తరగతులు (ఓబీసీలు) సహా మహిళలకు తగిన ప్రాతినిధ్యం ఉండేలా, లోక్‌సభ, రాష్ట్ర శాసనసభల్లో మహిళలకు 33 శాతం రిజర్వేషన్‌ను త్వరగా అమలు చేస్తామని పార్టీ హామీ ఇచ్చింది. 'మోడీ ప్రభుత్వం (మహిళల రిజర్వేషన్ బిల్లు అమలుపై) విధించిన జనాభా లెక్కలు, డీలిమిటేషన్ వంటి అనవసరమైన అడ్డంకులు తొలగిస్తాం' అని తీర్మానంలో పేర్కొంది.

ఐదు రాష్ట్రాల్లో విజయానికి ఐక్యతతో పని చేయాలి: ఖర్గే

త్వరలో జరగనున్న ఐదు రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికల్లో విజయం సాధించేందుకు తమ శక్తియుక్తులతో పాటు సమన్వయం, క్రమశిక్షణ, ఐక్యతతో పని చేయాలని కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే పార్టీ కార్యకర్తలకు పిలుపునిచ్చారు. ఎస్సీ, ఎస్టీ, ఓబీసీల సామాజిక న్యాయం, హక్కులను నిర్ధారించడానికి దేశవ్యాప్త కుల గణనను నిర్వహించాలని డిమాండ్ చేశారు. దీనిపై బీజేపీ మౌనంగా ఉందని విమర్శించారు.

సంక్షేమ పథకాల్లో సరైన భాగస్వామ్యం కోసం, సమాజంలోని బలహీన వర్గాల స్థితిగతులపై సామాజిక-ఆర్థిక డేటాను కలిగి ఉండటం, సామాజిక న్యాయాన్ని నిర్ధారించడం చాలా ముఖ్యం అని ఆయన నొక్కి చెప్పారు. 'ద్రవ్యోల్బణం, నిరుద్యోగం కట్టడి, పాత పెన్షన్ పథకాన్ని అమలు చేయడంలో ప్రభుత్వం వైఫల్యాన్ని ఎదుర్కొంది. అధికార పార్టీ విభజన వ్యూహాలు, స్వయం ప్రతిపత్తి సంస్థల దుర్వినియోగం ప్రజాస్వామ్యానికి ముప్పు కలిగిస్తుంది' అని అన్నారు.

మణిపూర్‌కు వెళ్లలేని ప్రధానమంత్రి, ఎన్నికలు జరిగే రాష్ట్రాలకు తరచూ వెళ్లడం దారుణమన్నారు. కాంగ్రెస్ పార్టీపై అబద్ధాలతో కూడిన నిరాధారమైన దాడులు రాబోయే రోజుల్లో మరింత పెరుగుతాయని, ఈ అబద్ధాలను మనం ఎదుర్కోవడం చాలా అవసరమని అన్నారు. 2024లో దేశం ఎదుర్కొంటున్న తీవ్రమైన సవాళ్లను పరిష్కరించి, బడుగు బలహీన వర్గాల, యువత, మహిళలు, రైతులు, కూలీలకు అండగా నిలిచే ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసేందుకు పార్టీ తప్పనిసరిగా కృషి చేయాలని అన్నారు. "కాంగ్రెస్ నేతృత్వంలోని రాష్ట్ర ప్రభుత్వాలు, గత కాంగ్రెస్ ప్రభుత్వాల యొక్క ఆదర్శప్రాయమైన పనిని మనం ప్రచారం చేయాలి. ఈ విజయాలను హైలైట్ చేయడంతో ప్రజలలో విశ్వాసాన్ని నింపగలం. ఉజ్వల భవిష్యత్తుకు హామీ ఇవ్వగలం" అని అన్నారు. హిమాచల్‌ప్రదేశ్, కర్నాటకలో నిర్ణయాత్మక విజయాల తర్వాత కార్యకర్తల్లో నూతనోత్సాహం వచ్చిందని, ఎన్నికలు జరగనున్న ఐదు రాష్ట్రాల్లో 'గెలవడానికి మన శక్తినంతా కూడగట్టుకుని పూనుకోవాల్సిన అవసరం ఉందని' ఖర్గే అన్నారు.

వ్యూహాత్మకంగా ముందుకు..

న్యూఢిల్లీ : అభ్యర్థుల ప్రకటనపై వ్యూహాత్మకంగా ముందుకెళ్తున్నట్టు టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్ రెడ్డి అన్నారు. తెలంగాణను పట్టిపీడిస్తున్న కేసీఆర్ అనే రావణాసురుడి నుంచి విముక్తి కల్పించేలా ఈ విజయ దశమికి రాష్ట్ర ప్రజలు కార్యోన్ముఖులై ముందుకు రావాలన్నారు. తామిచ్చిన ఆరు గ్యారెంటీలే... 119 నియోజక వర్గాల్లో తమ అభ్యర్థులని చెప్పారు. తెలంగాణతో పాటు ఐదు రాష్ట్రాల ఎన్నికల షెడ్యూల్‌ను సీఈసీ ప్రకటించిన నేపథ్యంలో సోమవారం నాడిక్కడ తెలంగాణ భవన్‌లో రేవంత్ రెడ్డి మీడియాతో మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వంలో ఆరు గ్యారంటీలతో ప్రజల జీవితాల్లో వెలుగులు రాబోతున్నాయన్నారు. 'తెలంగాణకు మంచి రోజులు రాబోతున్నాయి. తెలంగాణకు విముక్తి కలిగే తేదీని కేంద్ర ఎన్నికల సంఘం ప్రకటించింది. నవంబర్ 30న తెలంగాణకు పట్టిన పీడ విరగడ కాబోతున్నది. రాబోయే విజయదశమిని తెలంగాణ ప్రజలు ఉత్సాహంగా జరుపుకోవాలి' అని రేవంత్ రెడ్డి వ్యాఖ్యానించారు. 'సంపద పెంచాలి... పేదలకు పంచాలి' అనే నినాదంతో కాంగ్రెస్ ముందుకు వెళ్తుందన్నారు. కానీ బీఆర్‌ఎస్ సర్కార్ మాత్రం... 3 వేల వైన్ షాపులు, 18 వేల బార్లు, 62 వేల బెల్ట్ షాపులతో తెలంగాణను మద్యంలో ముంచిందని విమర్శించారు.

కేసీఆర్‌కు చలిజ్వరం పట్టుకుంది

సోనియా గాంధీ ప్రకటించిన ఆరు గ్యారెంటీలను చూసి కేసీఆర్‌కు చలిజ్వరం పట్టుకుందని ఎద్దేవా చేశారు. అధికారం కోల్పోతున్నామన్న భయం బిల్లా-రంగాలలో మొదలైందని... అందుకే స్థాయి లేకపోయినా సోనియా గాంధీ, రాహుల్ గాంధీని విమర్శిస్తున్నారని ఆగ్రహం వ్యక్తంచేశారు. తెలంగాణలో యూపీఏ, బీఆర్‌ఎస్‌ల పాలనపై చర్చకు రావాలని సవాల్ విసిరారు. కేసీఆర్ కుటుంబం పదివేల ఎకరాలు, లక్ష కోట్లు దోచుకుందని ఆరోపించారు. అమరవీరుల స్థూపం, సచివాలయ నిర్మాణంలోనూ దోపిడీకి పాల్పడ్డారన్నారు. అవినీతి సొమ్ముతో కేసీఆర్ ఎన్నికల్లో గెలవాలని చూస్తున్నారని విమర్శించారు. 'కాంగ్రెస్ ఆరు గ్యారంటీలు ప్రకటించగానే కేసీఆర్‌కు చలి జ్వరం వచ్చింది. కేసీఆర్ విశ్రాంతి తీసుకునే సమయం వచ్చింది... ఆయన ఫాం హౌస్ నుంచి బయటకు రావాల్సిన పనిలేదు. వచ్చే ఎన్నికల్లో ఎవరిని గెలిపించాలో తెలంగాణ ప్రజలు ఎప్పుడో నిర్ణయించుకున్నారు. డిసెంబర్‌లో అద్భుతం జరగబోతుంది... కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పాటు కాబోతున్నది' అని రేవంత్ రెడ్డి అన్నారు. అధికారంలోకి వచ్చిన వెంటనే... ఆరు గ్యారెంటీలపైనే తొలి సంతకం చేస్తామని స్పష్టం చేశారు.

ప్రభుత్వ వ్యతిరేక ఓట్లు చీల్చే కుట్ర

తెలంగాణలో కాంగ్రెస్ అధికారంలోకి రాకుండా బీఆర్‌ఎస్, బీజేపీలు కుట్రలు చేస్తున్నాయని ఆరోపించారు. ప్రభుత్వ వ్యతిరేక ఓటును చీల్చేందుకు బీజేపీ ప్రయత్నిస్తోందన్నారు. 2018లోనూ బీజేపీ ఇలాంటి కుట్రలే చేసి, 105 స్థానాల్లో డిపాజిట్లు కోల్పోయిందని గుర్తు చేశారు. బీజేపీ, బీఆర్‌ఎస్ ఫెవికాల్ బంధం ప్రజలకు అర్థమైందని, ఈ రెండు పార్టీల కుట్రలను తిప్పికొట్టాల్సిన బాధ్యత ప్రతీ తెలంగాణ బిడ్డపై ఉందన్నారు. బీఆర్‌ఎస్, బీజేపీలు ఒకటే అని... అటు మోడీ, ఇటు కేటీఆర్ లు అంగీకరించారన్నారు. తాము బీజేపీ, బీఆరెస్ పై విమర్శలు చేస్తుంటే... అక్బరుద్దీన్, అసదుద్దీన్ ఎందుకు అసహనం వ్యక్తం చేస్తున్నారో అర్థం కావట్లేదన్నారు.

సైరన్ మోగింది

(మొదటిపేజీ తరువాయి)

సేకరించాం. ఐదు రాష్ట్రాల అధికారులు, పార్టీల నేతలతో చర్చలు జరిపాం. ఐదు రాష్ట్రాల్లో మొత్తం 679 అసెంబ్లీ స్థానాలకు ఎన్నికలు జరగనున్నాయి. ఈ ఐదు రాష్ట్రాల్లో 60 లక్షల మంది తొలిసారి ఓటు హక్కు పొందారు. అన్ని రాష్ట్రాల్లో మహిళా ఓటర్ల సంఖ్య పెరిగింది. ఐదు రాష్ట్రాల్లో 1.77 లక్షల పోలింగ్ స్టేషన్లు ఏర్పాటు చేస్తున్నాం. మొత్తం 16.14 కోట్ల మంది ఓటర్లు ఉన్నారు. అందులో 8.2 కోట్ల పురుషులు, 7.8 కోట్ల మహిళలున్నారు. 20,59,539 ఓట్లు తొలగించాం. 57,89,227 కొత్త ఓటర్లను జత చేశాం. ఇందులో 18-19 ఏండ్ల వయస్సు గల ఓటర్లు 18.37 లక్షల మంది. మిజోరాం, ఛత్తీస్‌గఢ్‌లో మహిళా ఓటర్ల సంఖ్య అధికంగా ఉంది. ఈ ఎన్నికల్లో వృద్ధులకు ఇంటి నుంచే ఓటు వేసే అవకాశం కల్పించాం. ఐదు రాష్ట్రాల్లో సోమవారం నుంచే ఎన్నికల కోడ్ అమల్లోకి వస్తుంది' అని రాజీవ్ కుమార్ వెల్లడించారు.

రాజస్థాన్‌లో నవంబర్ 23న ఎన్నికలు

200 సీట్లున్న రాజస్థాన్‌లో అసెంబ్లీ ఎన్నికలు ఒకే దశలో నవంబరు 23న జరగనున్నాయి. రాజస్థాన్‌లో 5,25,38,655 మంది ఓటర్లు ఉన్నారు. 2.73 కోట్ల పురుషులు, 2.52 కోట్ల మహిళలు ఉన్నారు. 4,15,418 మంది ఓటర్లు 18-19 ఏళ్ల వయస్సు గల వారు. 10,57,251 మంది కొత్త ఓటర్లు. 3,95,934 ఓట్లు తొలగించారు. మొత్తం 51,756 పోలింగ్ స్టేషన్లు ఉండగా, అందులో 10,415 పట్టణ ప్రాంతాల్లోనూ, 41,341 పోలింగ్ స్టేషన్లు గ్రామీణ ప్రాంతాల్లో ఉన్నాయి. 200 అసెంబ్లీ స్థానాల్లో 144 జనరల్ కేటగిరీ కాగా, 25 ఎస్సీ, 43 ఎస్టీ రిజర్వుడు స్థానాలు ఉన్నాయి. రాజస్థాన్ అసెంబ్లీ గడువు జనవరి 14తో ముగియనుంది.

నవంబర్ 17న మధ్యప్రదేశ్ ఎన్నికలు

230 సీట్లున్న మధ్యప్రదేశ్ అసెంబ్లీ ఎన్నికలు ఒకే దశలో నవంబరు 17న జరగనున్నాయి. 5,60,60,925 మంది ఓటర్లు ఉన్నారు. 2.88 కోట్ల పురుషులు, 2.72 కోట్ల మహిళలు ఉన్నారు. 7,78,789 మంది ఓటర్లు 18-19 ఏళ్ల వయస్సు గల వారు. 19,89,508 మంది కొత్త ఓటర్లు. 7,45,211 ఓట్లు తొలగించారు. మొత్తం 64,523 పోలింగ్ స్టేషన్లు ఉండగా, అందులో 16,763 పట్టణ ప్రాంతాల్లోనూ, 47,760 పోలింగ్ స్టేషన్లు గ్రామీణ ప్రాంతాల్లో ఉన్నాయి. 230 అసెంబ్లీ స్థానాల్లో 148 జనరల్ కేటగిరీ కాగా, 35 ఎస్సీ, 47 ఎస్టీ రిజర్వుడు స్థానాలు ఉన్నాయి. మధ్యప్రదేశ్ అసెంబ్లీ గడువు జనవరి 6తో ముగియనుంది.

మిజోరంలో...

40 సీట్లున్న మిజోరం అసెంబ్లీ ఎన్నికలు ఒకే దశలో నవంబర్ 7న జరగనున్నాయి. 8,51,895 మంది ఓటర్లు ఉన్నారు. 4.13 లక్షల పురుషులు, 4.39 లక్షల మహిళలు ఉన్నారు. 9,677 మంది ఓటర్లు 18-19 ఏళ్ల వయస్సు గల వారు. 30,682 మంది కొత్త ఓటర్లు. 16,826 ఓట్లు తొలగించారు. మొత్తం 1,276 పోలింగ్ స్టేషన్లు ఉండగా, అందులో 525 పట్టణ ప్రాంతాల్లోనూ, 751 పోలింగ్ స్టేషన్లు గ్రామీణ ప్రాంతాల్లో ఉన్నాయి. 40 అసెంబ్లీ స్థానాల్లో 1 జనరల్ కేటగిరీ కాగా, 39 ఎస్టీ రిజర్వుడు స్థానాలు ఉన్నాయి. మిజోరం అసెంబ్లీ గడువు డిసెంబర్ 17న ముగియనుంది.

రెండు దశల్లో చత్తీస్‌గఢ్ అసెంబ్లీ ఎన్నికలు

90 సీట్లున్న ఛత్తీస్‌గఢ్ అసెంబ్లీ ఎన్నికలు రెండు దశల్లో జరగనున్నాయి. నవంబరు 7న తొలి దశ మిజోరంతోనూ, నవంబరు 17న రెండో దశ ఓటింగ్ మధ్యప్రదేశ్‌తో కలిసి జరగనుంది. 2,03,60,240 మంది ఓటర్లు ఉన్నారు. 1.01 కోట్ల పురుషులు, 1.02 కోట్ల మహిళలు ఉన్నారు. 2,98,073 మంది ఓటర్లు 18-19 ఏళ్ల వయస్సు గల వారు. 10,10,699 మంది కొత్త ఓటర్లు. 2,90,874 ఓట్లు తొలగించారు. మొత్తం 24,109 పోలింగ్ స్టేషన్లు ఉండగా అందులో 4,815 పట్టణ ప్రాంతాల్లోనూ, 19,258 పోలింగ్ స్టేషన్లు గ్రామీణ ప్రాంతాల్లో ఉన్నాయి. 90 అసెంబ్లీ స్థానాల్లో 51 జనరల్ కేటగిరీ కాగా, 10 ఎస్సీ, 29 ఎస్టీ రిజర్వుడు స్థానాలు ఉన్నాయి. ఛత్తీస్‌గఢ్ అసెంబ్లీ గడువు జనవరి 3తో ముగియనుంది.



ఎదురులేని కివీస్

- నెదర్లాండ్స్‌పై 99 రన్స్‌తో ఘన విజయం
- వరల్డ్‌కప్‌లో వరుసగా రెండో గెలుపు

నవతెలంగాణ-హైదరాబాద్

2015, 2019 ఐసీసీ ప్రపంచకప్ రన్నరప్, ఈ ఎడిషన్ టైటిల్ ఫేవరేట్లలో ఒకటైన న్యూజిలాండ్ జోరు కొనసాగుతోంది. ఆరంభ మ్యాచ్‌లో డిఫెండింగ్ చాంపియన్ ఇంగ్లాండ్‌ను చిత్తు చేసిన న్యూజిలాండ్.. తాజాగా నెదర్లాండ్స్‌ను మట్టికరిపించి 2023 ప్రపంచకప్‌లో వరుసగా రెండో విజయం నమోదు చేసింది. సోమవారం హైదరాబాద్‌లోని ఉప్పల్ క్రికెట్ స్టేడియంలో జరిగిన గ్రూప్ దశ మ్యాచ్‌లో బ్లాక్‌క్యాప్స్ బ్లాక్‌బస్టర్ షో చేసింది. తొలుత న్యూజిలాండ్ 50 ఓవర్లలో 7 వికెట్లకు 322 పరుగులు చేయగా.. ఛేదనలో నెదర్లాండ్స్ 223 పరుగులకు కుప్పకూలింది.

సమిష్టిగా మెరిసి.. : తొలుత బ్యాటింగ్ చేసిన న్యూజిలాండ్‌కు నెదర్లాండ్స్ షాక్ ఇచ్చింది. కివీస్ టాప్ ఆర్డర్ ఆశించిన రీతిలో ధనాధన్ షో చేయలేకపోయింది. డచ్ బౌలర్లు కట్టుదిట్టంగా బంతులేసి ఆకట్టుకున్నారు. టాప్-5లో డెవాన్ కాన్వే (32), డార్లీ మిచెల్ (48) అర్థ సెంచరీలు దాటలేదు. విల్ యంగ్ (70, 80 బంతుల్లో 7 ఫోర్లు, 2 సిక్స్), రచిన్ రవీంద్ర (51, 51 బంతుల్లో 3 ఫోర్లు, 1 సిక్స్), డార్లీ మిచెల్ (49, 47 బంతుల్లో 5 ఫోర్లు, 2 సిక్స్‌లు) అర్థ సెంచరీలతో మెరిశారు. గ్లెన్ ఫిలిప్స్ (5), మార్క్ చాప్‌మాన్ (5) విఫలం కావటంతో న్యూజిలాండ్ 300 మార్క్ దాటేలా కనిపించలేదు. చివర్లో మిచెల్ శాంట్నర్ (36 నాటౌట్, 17 బంతుల్లో 3 ఫోర్లు, 2 సిక్స్‌లు), మాట్ హెన్రీ (10 నాటౌట్, 4 బంతుల్లో 1 సిక్స్) ధనాధన్ ముగింపు అందించారు. దీంతో న్యూజిలాండ్ 322 పరుగుల భారీ స్కోరు సాధించింది

భారీ లక్ష్య ఛేదనలో నెదర్లాండ్స్ చతికిల పడింది. క్రమం తప్పకుండా వికెట్లు పడగొట్టిన కివీస్ బౌలర్లు.. డచ్ జట్టును 46.3 ఓవర్లలో 223 పరుగులకే కుప్పకూల్చారు. మిచెల్ శాంట్నర్ (5/59) ఐదు వికెట్ల ప్రదర్శనతో చెలరేగగా.. మాట్ హెన్రీ (3/40) రాణించాడు. నెదర్లాండ్స్ తరఫున కొలిన్ ఆకర్‌మాన్ (69) అర్థ సెంచరీతో మెరువగా.. స్కాట్ ఎడ్వర్డ్స్ (30), సైబ్రాండ్ (29)లు ఫర్వాలేదనిపించారు. విక్రమ్‌జిత్ సింగ్ (12), తేజ (21) విఫలమయ్యారు. నెదర్లాండ్స్‌కు ఇది వరుసగా రెండో పరాజయం.

ఆత్మవిశ్వాసం పెరిగింది!

- క్రీడా దేశంగా ఎదుగుతున్న భారత్
- భారత అథ్లెటిక్ సూపర్‌స్టార్ నీరజ్ చోప్రా

నవతెలంగాణ-హైదరాబాద్

భారతీయ క్రీడాకారులు ఇప్పుడు భయమెరుగని ప్రదర్శన చేయగల్గుతున్నారు. ఆత్మవిశ్వాసంతో ప్రపంచ మేటి అథ్లెట్లను ఎదుర్కొనేందుకు ఏమాత్రం వెనుకాడటం లేదు. భారత్ క్రీడా దేశంగా ఎదుగుతుందని భారత ట్రాక్ అండ్ ఫీల్డ్ సూపర్‌స్టార్..ఒలింపిక్ గోల్డ్ మెడలిస్ట్, ప్రపంచ చాంపియన్ నీరజ్ చోప్రా అన్నాడు. హైదరాబాద్‌లోని ఓ స్పోర్ట్స్‌వేర్ షోరూమ్ ప్రారంభోత్సవంలో పాల్గొన్న నీరజ్ చోప్రా ఈ సందర్భంగా మీడియాతో మాట్లాడాడు.

క్రీడా దేశంగా భారత్ : క్రీడాకారులను ప్రోత్సహించేందుకు స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియా (సాయ్), ప్రభుత్వాలు సహా పలు కార్పోరేట్ సంస్థలు గొప్పగా మద్దతు అందిస్తున్నాయి. మెగా ఈవెంట్లకు ముందు సాయ్ విలువైన క్యాంప్‌లు నిర్వహిస్తూ క్రీడాకారుల్లో నైపుణ్యాలకు సానపడుతుంది. భారత క్రీడాకారులు మునుపటిలా లేరు. ఇప్పుడు ఎంతో ఆత్మవిశ్వాసంతో కనిపిస్తున్నారు. ప్రపంచ శ్రేణి అథ్లెట్లతో పోటీపడేందుకు దూకుడుగా ముందుకొస్తున్నారు. ఆత్మవిశ్వాసంతో పతక వేటలో పోరాట పటిమ కనబరుస్తున్నారు. అతి త్వరలోనే భారత్‌ను క్రీడా దేశంగా చూడబోతున్నామని చోప్రా అన్నాడు.

టార్గెట్ 90మీ : ఒలింపిక్స్ పసిడి, ప్రపంచ చాంపియన్‌షిప్ టైటిల్, డైమండ్ లీగ్ టైటిల్, ఆసియా గేమ్స్ గోల్డ్.. ఇలా జావెలిన్ త్రోలో అత్యుత్తమ విజయాలు అన్నీ సాధించాను. అయినా, మరోసారి ఈ ఘనతలను మరింత మెరుగ్గా సాధించాలనే సంకల్పం నన్ను నడిపిస్తోంది. స్విమ్మర్ మైకల్ ఫెల్ప్స్, స్ప్రింటర్ ఉసేన్ బోల్ట్‌లు ఈ విషయంలో నాకు స్ఫూర్తి. ఒకే మెడల్‌ను మరింత మెరుగైన ప్రదర్శనతో సాధించాలనే తపన నాలో ఉంది. బల్లెంను 90మీటర్ల దూరం విసరాలనే




లక్ష్యం ఉంది. కానీ ఆ విషయంలో తొందర ఏమీ లేదు. ఒక్కో మెట్టు ఎదుగుతూనే ఆ లక్ష్యం చేరుకుంటానని నీరజ్ తెలిపాడు.

అప్పుడే ఫిర్యాదులొద్దు! : నా విజయాలతో స్ఫూర్తి పొంది చిన్నారులు స్పోర్ట్స్‌ను ఎంచుకుంటున్నారనే మాట.. నాకు ఎంతో సంతృప్తి కలిగిస్తోంది. కానీ తల్లిదండ్రులు ఆరంభ దశలోనే వసతులు,సౌకర్యాల లేమీ పట్ల ఫిర్యాదులు చేయకూడదు. కాస్త సహనంగా వ్యవహరించాలి. తొలుత చిన్నారులు ఆటతో అనుబంధం ఏర్పరుచుకునేలా చూడాలి. ఆట పట్ల ఆరాధన భావం వచ్చేంతవరకు వేచి చూడాలి. నేనూ కెరీర్ ఆరంభంలో ఎన్నో సవాళ్లు ఎదుర్కొన్నాను. రిజర్వేషన్ లేకుండా జనరల్ బోగీల్లో రైలు ప్రయాణం చేశాను. ఎంతోమందితో కలిసి రూమ్‌ను పంచుకున్నాను. ఇప్పుడు మన దగ్గర అన్ని నగరాల్లో క్రీడా మౌళిక వసతులు అందుబాటులోకి వచ్చాయని నీరజ్ చోప్రా పేర్కొన్నాడు. హైదరాబాద్ పర్యటనలో భాగంగా గచ్చిబౌలీలోని పుల్లెల గోపీచంద్ బ్యాడ్మింటన్ అకాడమీని నీరజ్ చోప్రా సందర్శించాడు.

ఫ్లాప్ అవుతుంది!! : భారత క్రీడా ముఖచిత్రం నీరజ్ చోప్రా. ప్రస్తుతం భారత సినీ పరిశ్రమలో క్రీడా దిగ్గజాల బయోపిక్‌ల ట్రెండ్ నడుస్తోంది. భారత క్రీడా చరిత్రలో గోల్డెన్ బాయ్, సూపర్‌స్టార్ నీరజ్ చోప్రా. ప్రపంచంలో జావెలిన్ త్రోలో అందుబాటులో ఉన్న అత్యుత్తమ విజయాలు అన్నీ నీరజ్ చోప్రా ఇప్పటికే సొంతం చేసుకున్నాడు. దీంతో నీరజ్ చోప్రా బయోపిక్ తీసేందుకు సినీ వర్గాల్లో ప్రయత్నాలు మొదలయ్యాయి. దీనిపై నీరజ్ చోప్రాను అడుగగా.. ఇలా స్పందించాడు. 'నా జీవితకథతో బయోపిక్‌ను తీసేందుకు ఎవరైనా నిర్మాత నా దగ్గరకు వస్తే.. తొలుత హీరోకు జావెలిన్‌ను ఎలా విసరాలనే అంశంలో శిక్షణ ఇవ్వాల్సి ఉంటుందని చెప్తాను. ఎందుకంటే జావెలిన్‌ను విసరటం అంత తేలిక కాదు. ఒకవేళ సినిమాలో హీరో జావెలిన్‌ను సరిగ్గా విసరలేకపోతే.. మొత్తం మూవీ ఫ్లాప్ అవుతుంది. జనాలు అరే ఎందీ ఈటను ఇలా విసురుతున్నాడని హేళన చేస్తారని..' నవ్వుతూ నీరజ్ చోప్రా సమాధానం ఇచ్చాడు.

అఫ్గాన్‌తో మ్యాచ్‌కు గిల్ దూరం

చెన్నైలో చికిత్స పొందుతున్న యువ బ్యాటర్



చెన్నై : సొంతగడ్డపై ప్రపంచకప్ వేటలో టీమ్ ఇండియాకు మరో ఎదురుదెబ్బ. ఈ ఏడాది వన్డే ఫార్మాట్‌లో అత్యధిక పరుగులతో పాటు శతకాల మోత మోగిస్తున్న యువ బ్యాటర్ శుభమన్ గిల్ వరుసగా రెండో మ్యాచ్‌కు దూరమయ్యాడు. తిరువనంతపురం నుంచి చెన్నైకి చేరుకున్న అనంతరం శుభ్‌మన్ గిల్ హోటల్ గదికే పరిమితం అయ్యాడు. వైద్య పరీక్షల అనంతరం గిల్ డెంగీ బారినపడినట్టు బీసీసీఐ వెల్లడించింది. ఆస్ట్రేలియాతో మ్యాచ్‌కు ముందు (36 గంటలు) గిల్ మెరుగ్గా కోలుకుంటున్నాడని, తొలి మ్యాచ్‌కు అందుబాటులో ఉంటాడని ఆశిస్తున్నామని చీఫ్ కోచ్ రాహుల్ ద్రవిడ్ తెలుపగా.. గిల్ సమయానికి కోలుకోలేదని టాస్ సమయంలో కెప్టెన్ రోహిత్ శర్మ తెలిపాడు. దీంతో భారత్, ఆస్ట్రేలియా తొలి మ్యాచ్‌కు శుభ్‌మన్ గిల్ అందుబాటులో ఉండలేదు. అతడి స్థానంలో మరో యువ బ్యాటర్ ఇషాన్ కిషన్ ఓపెనర్‌గా వచ్చాడు. అక్టోబర్ 11న ఢిల్లీలోని ఫిరోజ్ షా కోట్ల మైదానంలో అఫ్గనిస్థాన్‌తో భారత్ తలపడనుంది. ఈ మ్యాచ్‌కు సైతం గిల్ అందుబాటులో ఉండటం లేదని బీసీసీఐ తాజాగా ఓ ప్రకటనలో తెలిపింది. 'శుభ్‌మన్ గిల్ జట్టుతో పాటు చెన్నై నుంచి న్యూఢిల్లీకి బయల్దేరటం లేదు. బోర్డు వైద్య బృందం పర్యవేక్షణలో చెన్నైలో ఉంటున్నాడు. అక్టోబర్ 11న అఫ్గనిస్థాన్‌తో మ్యాచ్‌కు శుభ్‌మన్ గిల్ అందుబాటులో ఉండటం లేదు' అని బీసీసీఐ ఓ ప్రకటనలో తెలిపింది. అక్టోబర్ 14న అహ్మదాబాద్ వేదికగా భారత్, పాకిస్థాన్ మెగా మ్యాచ్ ఉంది. దీంతో దాయాదితో ధనాధన్‌కు గిల్ పూర్తిగా కోలుకునే అవకాశం కనిపిస్తోంది. గిల్ లేని ఆసీస్‌తో మ్యాచ్‌లో ఛేదనలో భారత్ 2 పరుగులకే 3 వికెట్లు చేజార్చుకుని అభిమానులను భయాందోళనలకు గురి చేసిన సంగతి తెలిసిందే.

'మెన్ ఇన్ ఆరెంజ్'!

పాక్‌తో మ్యాచ్‌కు భారత్ కొత్త జెర్సీ?



ముంబయి : 2023 ఐసీసీ ప్రపంచకప్‌లో టీమ్ ఇండియా అభిమానులకు బీసీసీఐ అనూహ్య 'ట్విస్ట్' ఇవ్వనున్నట్టు వార్తలు వినిపిస్తున్నాయి. ప్రపంచకప్‌కు రోహిత్‌సేన ధరించే అధికారిక జెర్సీని సహజంగానే మెన్ ఇన్ బ్లూగానే ఆవిష్కరించారు. కానీ ప్రాక్టీస్ సెషన్లో టీమ్ ఇండియా క్రికెటర్లు ఆరెంజ్ జెర్సీలు ధరించారు. ఆరెంజ్ జెర్సీలతో విరాట్ కోహ్లి, రోహిత్ శర్మ, హార్దిక్ పాండ్య, కెఎల్ రాహుల్, జశ్‌ప్రీత్ బుమ్రా, మహ్మద్ సిరాజ్‌లు సాధన చేస్తున్న దృశ్యాలు సోషల్ మీడియాలో సైతం వైరల్ అయ్యాయి. 2019 ఐసీసీ ప్రపంచకప్‌లో ఇంగ్లాండ్‌తో మ్యాచ్‌కు భారత్ తన జెర్సీ రంగును కాస్త మార్చివేసింది. ఆతిథ్య ఇంగ్లాండ్ జెర్సీ సైతం బ్లూ కావటంతో మనోళ్లు కాస్త బ్లూకు కాస్త ఆరెంజ్‌ను జోడించారు. కానీ ఇప్పుడు ప్రాక్టీస్ సెషన్లలో పూర్తిగా ఆరెంజ్ జెర్సీలనే వాడుతున్నారు. దీనితో అక్టోబర్ 14న పాకిస్థాన్‌తో మ్యాచ్‌లో టీమ్ ఇండియా ఆరెంజ్ జెర్సీలతో బరిలోకి దిగుతుందనే వార్త హల్‌చల్ చేస్తోంది.

భారతీయ జనతా పార్టీ అగ్రనాయకుడు, హోంశాఖ మంత్రి అమిత్ షా తనయుడు జై షా బీసీసీఐ కార్యదర్శిగా కొనసాగుతున్నారు. ప్రస్తుతం మన దగ్గర ఎన్నికల సమయం వచ్చేసింది. దీంతో టీమ్ ఇండియా జెర్సీని పాకిస్థాన్‌తో మ్యాచ్‌కు ఆరెంజ్ రంగుకు (కాషాయం) మార్చేందుకు బోర్డు సిద్ధమైనట్టు సమాచారం!. ఈ వార్తలపై బీసీసీఐ కోశాధికారి స్పందించారు. పాక్‌తో మ్యాచ్‌కు ఆరెంజ్ జెర్సీల వార్తల్లో నిజం లేదని తెలిపారు. కానీ బీసీసీఐ ఇటీవల బయటకు ఓ మాట చెప్తూ.. లోపల తన పని తాను చేసేస్తోంది. దీంతో పాకిస్థాన్‌తో మ్యాచ్‌కు భారత జట్టు 'మెన్ ఇన్ ఆరెంజ్'గా మారబోతుందని అనుమానం అభిమానులు వ్యక్తపరుస్తున్నారు.

నేడు పాక్‌తో శ్రీలంక పోరు

విజయంపైనే ఇరు జట్ల గురి



నవతెలంగాణ-హైదరాబాద్

ఐసీసీ 2023 ప్రపంచకప్‌లో ఉప్పల్ క్రికెట్ స్టేడియం చివరి మ్యాచ్‌కు ఆతిథ్యం ఇచ్చేందుకు సిద్ధమైంది. వరల్డ్‌కప్ షెడ్యూల్‌లో భాగంగా హైదరాబాద్‌కు ఓవరాల్‌గా ఐదు మ్యాచులు కేటాయించగా... అందులో రెండు వార్మప్, మూడు ప్రధాన మ్యాచ్‌లు ఉన్నాయి. పాకిస్థాన్, నెదర్లాండ్స్.. న్యూజిలాండ్, నెదర్లాండ్స్ మ్యాచ్‌లు ముగియగా నేడు పాకిస్థాన్, శ్రీలంక పోటీపడనున్నాయి. వరల్డ్‌కప్ గ్రూప్ దశను పాకిస్థాన్, శ్రీలంక భిన్నంగా ఆరంభించాయి. బ్యాటర్లు విఫలమైన వేళ బౌలర్లు అంచనాలు అందుకోవటంతో డచ్ జట్టుపై పాకిస్థాన్ అలవోక విజయం సాధించగా.. బ్యాటర్లు ఫర్వాలేదనిపించినా.. బౌలర్లు దారుణంగా తేలిపోవటంతో దక్షిణాఫ్రికా చేతిలో శ్రీలంకకు ఘోర పరాభవం తప్పలేదు. ఇప్పుడు గ్రూప్ దశలో రెండో మ్యాచ్‌లో విజయం సాధించాలని శ్రీలంక భావిస్తుండగా.. వరుసగా రెండో విజయంతో అహ్మదాబాద్‌కు చేరుకోవాలని పాకిస్థాన్ ఉబలాటపడుతోంది. బాబర్ ఆజామ్ సేన ఉప్పల్‌లో ఇప్పటికే మూడు మ్యాచులు ఆడింది. ఈ పిచ్ ఎలా స్పందిస్తుంది, ఈ పిచ్‌పై వికెట్ల వేట, పరుగుల వేట ఎలా ఉండాలనే విషయంలో ఆ జట్టుకు ఓ స్పష్టత ఉంది. కెప్టెన్ బాబర్ ఆజామ్ ఫామ్‌లో లేడు. వార్మప్ నుంచీ అతడు విఫలమవుతున్నాడు. శ్రీలంకతో మ్యాచ్‌లో బాబర్ జోరందుకుంటే పాకిస్థాన్‌కు అదే పండుగ. ఇక శ్రీలంక పరిష్కరించుకోవాల్సిన సమస్యలు చాలానే ఉన్నాయి. పేసర్లు, స్పిన్నర్లు క్రమశిక్షణతో బౌలింగ్ చేయాల్సి ఉంది. నాణ్యమైన పాక్ బౌలింగ్‌ను ఎదుర్కొనేందుకు లంక బ్యాటర్లు మరింత తెగువ చూపించక తప్పదు. ఇటీవల ఆసియా కప్‌లో ఇరు జట్లు ముఖాముఖి తలపడ్డాయి. స్టార్ స్పిన్నర్ మహీశ్ తీక్షణ సెలక్షన్‌కు అందుబాటులో వస్తే శ్రీలంకను అతిపెద్ద సానుకూలత కానుంది. పోరాట స్ఫూర్తి చూపించి ఆఖరు వరకు విజయ వేటలో నిలిచే తత్వం శ్రీలంకను సైతం నేటి మ్యాచ్‌లో ఫేవరేట్‌గా నిలుపుతోంది. పాకిస్థాన్, శ్రీలంక ప్రపంచకప్ పోరు నేడు మధ్యాహ్నం 2 గంటలకు ఆరంభం.

పండగలాంటి సినిమా



బాలకృష్ణ హీరోగా అనిల్ రావిపూడి దర్శకత్వంలో, షైన్ స్క్రీన్స్ బ్యానర్ పై రూపొందుతున్న మూవీ 'భగవంత్ కేసరి'. కాజల్ అగర్వాల్ హీరోయిన్‌గా నటిస్తుండగా, శ్రీలీల కీలక పాత్ర పోషిస్తున్నారు. దసరా కానుకగా ఈనెల 19న ఈ సినిమా విడుదల కానున్న నేపథ్యంలో వరంగల్‌లో ఈ చిత్ర ట్రైలర్ లాంచ్ ఈవెంట్‌ని గ్రాండ్‌గా నిర్వహించారు. దర్శకులు వంశీపైడిపల్లి, గోపీచంద్ మలినేని, బాబీ ఈ వేడుకకు ప్రత్యేక అతిథులుగా హాజరయ్యారు.

ఈ సందర్భంగా బాలకృష్ణ మాట్లాడుతూ,'నేను తొలిసారి ఈ సినిమాలో తెలంగాణ మాండలికంలో మాట్లాడాను. బాలకృష్ణ సినిమా అంటే పంచభక్ష పరమాన్నాలు ఉన్న భోజనంలా అన్నీ ఉండాలి. ఇందులో కూడా అన్నీ ఉంటాయి. టోటల్ గా డిఫరెంట్ సినిమా ఇది. ట్రైలర్‌లో మీరు చూసింది కొంతే. ఇంకా చూడాల్సింది చాలా ఉంది. అదంతా దాచి పెట్టాం. దసరాకి ముందు డబుల్ ధమాకా ఇవ్వబోతున్నాం. దసరాకి ముందు దంచుదాం. కాజల్ వెర్సటైల్ నటి. ఇందులో చాలా చక్కని పాత్రని పోషించారు. శ్రీలీల ఇందులో నన్ను చిచ్చా చిచ్చా అని పిలుస్తుంది. ఇందులో చేసిన పాత్ర ఆమె కెరీర్‌లో గుర్తుండిపోతుంది. ఇందులో అర్జున్ రాంపాల్‌తో నటించడం గొప్ప అనుభూతి. మా ఇద్దరి కాంబినేషన్ అద్భుతంగా ఉంటుంది.

నా సినిమా అంటే తమన్‌కి పూనకం వస్తుంది. బాక్సు బద్దలైపోయేలా కొడతాడు. ఈ సినిమా చూసి మగాళ్ళు సైతం కన్నీళ్ళు పెట్టుకొని బయటికి వస్తారు. అంత అద్భుతంగా మా దర్శకుడు అనిల్ రావిపూడి ఈ సినిమాని తీర్చిదిద్దారు. మంచి పాటలు, ఫైట్లు, డైలాగులు, యాక్షన్ సీన్స్‌తో సినిమా అంతా ఒక పండగలా ఉంటుంది' అని తెలిపారు.

దర్శకుడు అనిల్ రావిపూడి మాట్లాడుతూ, 'షైన్ స్క్రీన్స్ బ్యానర్ నిర్మాతలు హరీష్, సాహుకి థ్యాంక్స్. బడ్జెట్, మేకింగ్ పరంగా నాకు కంప్లీట్ ఫ్రీడమ్ ఇచ్చారు. దాని రిజల్ట్ అవుట్ పుట్ ఈనెల 19న ప్రేక్షకులు చూస్తారు. ఈ సినిమా నా కెరీర్‌లో శానా యేండ్లు యాదుంటుంది. బాలయ్య ఎన్నో గుర్తుండి పోయే పాత్రలు చేశారు. నటన ఆయనకు కొత్త కాదు. కానీ ఓ కొత్త పాత్ర ఆయన దగ్గరికి వచ్చిన తర్వాత ఒక స్టూడెంట్‌లా కష్టపడి పని చేసి, నేను పేపర్ మీద రాసిన దాని కంటే వెయ్యిరెట్లు అద్భుతంగా చేశారు. ఈ సినిమాలో చాలా ఎమోషన్స్ ఉంటాయి. భగవంత్ కేసరి పాత్రతో చాలా జర్నీ చేస్తారు' అని అన్నారు. 'ఈ సినిమాని బాలకృష్ణ అభిమానులతో పాటు ఫ్యామిలీస్ అందరూ ఎంజాయ్ చేస్తారు. ఇది మా ప్రామీస్. ఈ సినిమా మా బ్యానర్‌లో బెస్ట్ బ్లాక్ బస్టర్ అవ్వాలని కోరుకుంటున్నాను' అని నిర్మాత సాహూ గారపాటి చెప్పారు.

> ఇందులో నేను వరంగల్ అమ్మాయిగా కనిపిస్తాను. సోల్ కనెక్ట్ ఉన్న విజ్జి అనే అందమైన పాత్ర ఇచ్చిన అనిల్ రావిపూడికి చాలా థ్యాంక్స్. బాలకృష్ణతో పని చేయడం వండర్‌ఫుల్ ఎక్స్‌పీరియన్స్. ఇందులో చాలా అందమైన సీన్స్ ఉన్నాయి.
>
> \- శ్రీలీల
>
> ఈ సినిమా నాకు చాలా స్పెషల్. బాలయ్యతో,అనిల్ రావిపూడితో వర్క్ చేయడం గౌరవంగా, ఆనందంగా ఉంది.
>
> \- కాజల్

నవచిత్రం

డిసెంబర్ 8న రిలీజ్



నితిన్

నితిన్, శ్రీలీల హీరో, హీరోయిన్లుగా రూపొందుతున్న అవుట్ అండ్ అవుట్ ఎంటర్‌టైనర్ 'ఎక్స్‌ట్రా ఆర్డినరీ మేన్'. రైటర్, డైరెక్టర్ వక్కంతం వంశీ ఈ సినిమాను తెరకెక్కిస్తున్నారు. సినిమా షూటింగ్ శరవేగంగా జరుగుతోంది. వరల్డ్ వైడ్‌గా డిసెంబర్ 8న ఈ సినిమాను భారీ ఎత్తున్న విడుదల చేయబోతున్నట్లు మేకర్స్ సోమవారం ప్రకటించారు.

హారిస్ జైరాజ్ ఈ చిత్రానికి సంగీతాన్ని అందిస్తున్నారు. ఇది వరకే విడులైన 'డేంజర్ పిల్లా..' సాంగ్‌కు ఎక్స్‌ట్రార్డినరీ రెస్పాన్స్ వచ్చింది. అలాగే నితిన్ లుక్స్‌కి కూడా మంచి స్పందన లభించింది. నితిన్ ఇప్పటి వరకు చేయనటువంటి పాత్రలో ఆకట్టుకోబోతున్నారని, కచ్చితంగా ఆయన అభిమానులనే కాదు, ప్రేక్షకులను కూడా నితిన్ తన బ్రిలియంట్ పెర్ఫార్మెన్స్‌తో మెప్పించనున్నారు. క్యారెక్టర్ బేస్డ్ స్క్రిప్ట్‌తో, 'కిక్' తర్వాత ఆ రేంజ్ జోన్‌లో తెరకెక్కుతోంది. ఆడియెన్స్‌కి రోలర్ కోస్టర్‌లాంటి ఎక్స్‌పీరియెన్స్‌నిస్తూ నవ్విస్తూనే సర్‌ప్రైజ్‌లతో సినిమా మెప్పించనుందని డైరెక్టర్ వక్కంతం వంశీ అన్నారు.

శ్రేష్ఠ్ మూవీస్, ఆదిత్యమూవీస్ అండ్ ఎంటర్ టైన్‌మెంట్స్, రుచిర ఎంటర్‌టైన్‌మెంట్స్ బ్యానర్స్‌పై సుధాకర్ రెడ్డి, నికితా రెడ్డి ఈ మూవీని నిర్మిస్తున్నారు.

మెప్పించే సరికొత్త కాన్సెప్ట్




సుహాస్ హీరోగా నటిస్తున్న కొత్త సినిమా 'అంబాజీపేట మ్యారేజి బ్యాండు'. ఈ చిత్రాన్ని జీఏ2 పిక్చర్స్, దర్శకుడు వెంకటేష్ మహా బ్యానర్ మహాయన మోషన్ పిక్చర్స్, ధీరజ్ మొగిలినేని ఎంటర్ టైన్ మెంట్ బ్యానర్స్ సంయుక్తంగా నిర్మిస్తున్నాయి. దుశ్యంత్ కటికినేని దర్శకుడు.

ఈ సినిమా టీజర్‌ను సోమవారం హైదరాబాద్‌లో రిలీజ్ చేశారు. ఈ వేడుకలో డైరెక్టర్స్ మారుతి, హను రాఘవపూడి, శైలేష్ కొలను, సాయి రాజేశ్, సందీప్ రాజ్, ప్రశాంత్, మెహర్, భరత్ కమ్మ నిర్మాత ఎస్కేఎన్, ఛాయ్ బిస్కట్ శరత్ తదితరులు అతిథులుగా పాల్గొన్నారు.

'ఈ సినిమా ఇంత బాగా రూపుదిద్దుకోవడానికి మా ప్రొడ్యూసర్స్ కారణం. అలాగే ఇంత మంచి కథను నా దగ్గరకు తీసుకొచ్చిన దుశ్యంత్‌కు థ్యాంక్స్. లక్ష్మీ క్యారెక్టర్‌లో బాగా నటించింది నా కోస్టార్ శివానీ. సినిమాటోగ్రఫీ, మ్యూజిక్, ఎడిటింగ్ ..ఇలా ప్రతి డిపార్ట్ మెంట్ అవుట్ పుట్ సూపర్బ్‌గా ఇచ్చారు' అని హీరో సుహాస్ చెప్పారు. డైరెక్టర్ దుశ్యంత్ కటికినేని మాట్లాడుతూ, 'నాలాంటి ఒక కొత్త డైరెక్టర్‌కు జీఏ2 పిక్చర్స్‌లో మూవీ అవకాశం రావడం చాలా గొప్ప విషయం. నాతో మూవీ చేసినందుకు సుహాస్‌కు థ్యాంక్స్ చెబుతున్నా' అని తెలిపారు.

ఒక్కటి గుర్తు పెట్టుకోండి..



జీవా, మమ్ముట్టి

వై.ఎస్.ఆర్‌గా మమ్ముట్టి, వై.ఎస్.జగన్ పాత్రలో కోలీవుడ్ నటుడు జీవా నటిస్తున్న చిత్రం 'యాత్ర 2'. మహి వి రాఘవ్ దర్శకత్వంలో త్రీ ఆటమ్ లీవ్స్, వీ సెల్యూలాయిడ్, శివ మేక సంయుక్తంగా నిర్మిస్తున్న చిత్రమిది. ఈ సినిమాకి సంబంధించిన ఫస్ట్ లుక్‌ను చిత్ర యూనిట్ సోమవారం విడుదల చేసింది. ఫస్ట్ లుక్ పోస్టర్‌ను గమనిస్తే, మమ్ముట్టి, జీవా ఇన్‌టెన్స్ లుక్స్‌తో కనిపిస్తున్నారు.

'నేనెవరో ఈ ప్రపంచానికి తెలియకపోవచ్చు. కానీ ఒక్కటి గుర్తు పెట్టుకోండి...నేను వై.ఎస్.రాజశేఖర్ రెడ్డి కొడుకుని' అనే ఎమోషనల్ డైలాగ్ పోస్టర్‌లో ఉండటం, అలాగే పోస్టర్ చాలా ఇన్‌స్పైరింగ్‌గా ఉండటంతో సినిమాపై అంచనాలు పెరిగాయి. ఏపీ దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్ రెడ్డి పాదయాత్ర నేపథ్యంలో 'యాత్ర' చిత్రాన్ని తెరకెక్కించారు. అత్యంత ప్రజాదరణను పొందిన ఈ చిత్రానికి కొనసాగింపుగా, వైఎస్.ఆర్ తనయుడు వైఎస్ జగన్ మోహన్ రెడ్డి ప్రజా నాయకుడిగా ఎదిగిన తీరుని, 2009 నుంచి 2019 వరకు ఆంధ్రప్రదేశ్‌లో జరిగిన రాజకీయ ఘటనల ఆధారంగా ఇప్పుడు 'యాత్ర 2'ని తెరకెక్కిస్తున్నారు. 'యాత్ర' చిత్రాన్ని ఫిబ్రవరి 8, 2019లో విడుదల చేసిన సంగతి తెలిసిందే. అలాగే ఇప్పుడు 'యాత్ర 2'ని కూడా అదే తేదీన ప్రేక్షకుల ముందుకు తీసుకు రానున్నారు, వచ్చే ఏడాది ఫిబ్రవరి 8న ఈ చిత్రం విడుదలకు సిద్ధమవుతుంది. ప్రస్తుతం ఈ సినిమా షూటింగ్ శరవేగంగా జరుగుతోంది.

ప్రయోగాత్మక చిత్రం



అభయ్ నవీన్

అభయ్ నవీన్, అన్వేష్ మైఖేల్, పవన్ రమేష్, దయానంద్‌రెడ్డి, కుశాలిని, రోహిణి ప్రధాన పాత్రల్లో నటించిన సినిమా 'రాక్షస కావ్యం'. ఈ చిత్రాన్ని గరుడ ప్రొడక్షన్స్, పింగో పిక్చర్స్, సినీ వ్యాలీ మూవీస్ బ్యానర్స్‌లో దాము రెడ్డి, శింగన మల కల్యాణ్ నిర్మించారు. శ్రీమాన్ కీర్తి దర్శకత్వం వహించిన ఈ సినిమా ఈ నెల 13న ప్రేక్షకుల ముందుకు రాబోతోంది. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన ప్రెస్‌మీట్‌లో హీరో అభయ్ నవీన్ మాట్లాడుతూ,'నేను ఇప్పటి దాకా చేయని క్యారెక్టర్ ఈ సినిమాలో చేశాను. ఈ సినిమా కంటెంట్ ఎంత కొత్తగా ఉంటుందో మీరు టీజర్, ట్రైలర్, పాటల ద్వారా చూశారు. ఇటీవల ప్రీమియర్స్ చూసిన వాళ్లంతా సినిమా తమకు బాగా నచ్చిందని అప్రిషియేట్ చేశారు' అని తెలిపారు. 'పురాణాల్లోని జయవిజయుల పాత్రల్ని స్ఫూర్తిగా తీసుకుని కలియుగంలో వారు జన్మిస్తే ఎలా ఉంటుందనే ఊహతో రాసుకున్న స్క్రిప్ట్ ఇది. ఇందులో చదువుకోవాలని, ఆల్కహాల్ వద్దనే మెసేజ్ ఉంది' అని డైరెక్టర్ శ్రీమాన్ కీర్తి చెప్పారు. నిర్మాత దామురెడ్డి మాట్లాడుతూ, 'భిన్న ప్రయోగాత్మక సినిమా చేశాం. అందర్నీ తప్పకుండా మెప్పిస్తుంది' అని అన్నారు.

ఊహించని కథ..



రోహిత్ నందా, ఆనంది జంటగా శ్రీకాంత్ రంగనాథన్, శ్రీనాథ్ రంగనాథన్ దర్శక ద్వయం తెరకెక్కించిన చిత్రం 'విధి'. రంజిత్ ఎస్ నిర్మించిన ఈ మూవీ నవంబర్ 3న రిలీజ్ కానుంది.

ఈ నేపథ్యంలో ఈ చిత్ర టీజర్‌ను సోమవారం విడుదల చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన టీజర్ లాంచ్ ఈవెంట్‌లో ముఖ్య అతిథిగా హాజరైన యువ హీరో విశ్వక్ సేన్ మాట్లాడుతూ, 'ఈ సినిమా పెద్ద హిట్ అవ్వాలి. నిర్మాతకు మంచి లాభాలు రావాలి' అని అన్నారు.'మా దర్శకులు, హీరో అద్భుతంగా చేశారు. వారి మొదటి సినిమాలా ఉండదు. సినిమాలోని కథ, కథనాన్ని ఎవ్వరూ ఊహించరు. అద్భుతంగా ఉంటుంది. కథ చాలా ఫ్రెష్‌గా ఉంటుంది' అని నిర్మాత రంజిత్ చెప్పారు. డైరెక్టర్ శ్రీకాంత్ మాట్లాడుతూ, 'మనం మాట్లాడే కంటే.. మనం తీసే కంటెంట్ మాట్లాడాలి. మంచి కంటెంట్‌తో రాబోతోన్నాం' అని తెలిపారు. కెమెరామెన్, డైరెక్టర్ శ్రీనాథ్ మాట్లాడుతూ,'ఈ చిత్రం అంతర్జాతీయ స్థాయిలో ఉంటుంది. అన్ని వర్గాల ప్రేక్షకుల్ని తప్పకుండా అలరిసుంది' అని అన్నారు.

Printed and Published by Nandayala Narsimha Reddy On behalf Of Navatelangna Printers Private Limited, Printed At M.H Bhavan, 1st Floor, Plot No. 21/1, Azamabad Near Rtc Kalyana Mandapam, Baghlingampally, Hyderabad-500020,Telangana State,
Published at Navatelangana Printers Private Limited, M.H Bhavan,1st Floor No.21/1, Azamabad, Near Rtc Kalyana Mandapam, Baghlingampally, Hyderabad-500020, Telangana State, Editor : R.Sudha Bhaskar TELTEL/2014/59462.